
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50 సంపుటి: 17 సంచిక: 154
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రాన్ని, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



హింసల కొలిమిలో పదేళ్లు

తప్పుడు కేసుల కారణంగా పదేళ్లు నాగ్‌పూర్ సెంట్రల్ జైల్లో చిత్ర హింసల కొలిమిలో మగ్గిపోయానని సాయిబాబా తెలిపారు.

- వివరాలు 7లో



న్యాయం జరగకుంటే ధర్నా

విశాఖ ఫార్మా ప్రమాద బాధితులందరికీ న్యాయం చేయాలని మాజీ సీఎం వైఎస్ జగన్ ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

- వివరాలు 15లో

ఈ ఇద్దరిలో ఎవరో?

పీసీసీ చీఫ్‌గా మహేశ్‌కుమార్ గౌడ్, మధుయాష్కీ గౌడ్‌లలో ఒకరికి చాన్స్

- ఏఐసీసీ నుంచి అధికారిక ప్రకటనే తరువాయి
- ఢిల్లీలో ఖర్గే, రాహుల్, కేసీతో సీఎం రేవంత్ సహా రాష్ట్ర ముఖ్యనేతల భేటీ.. సుమారు రెండు గంటలపాటు చర్చలు
- మహేశ్‌కుమార్ గౌడ్, మధుయాష్కీ గౌడ్‌ల ఎంపికపై చర్చ
- తుది నిర్ణయం తమకు వదిలేయాలన్న అధిష్టానం
- పీసీసీ అధ్యక్షుడి ప్రకటన తర్వాతే మంత్రివర్గ విస్తరణ!



మంత్రివర్గ విస్తరణపై అస్పష్టత

రాష్ట్ర కాంగ్రెస్ నేతలంతా ఉత్సుకతతో ఎదురు చూస్తున్న మంత్రివర్గ విస్తరణపై ఏఐసీసీ పెద్దలు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. తాజా భేటీలో మంత్రివర్గ కూర్పుపై అభిప్రాయ సేకరణకు పరిమితమైన అధిష్టానం.. దానిపై మరోమారు చర్చిద్దామంటూ వాయిదా వేసినట్లు తెలిసింది. పీసీసీ అధ్యక్షుడి నియామకమయ్యాక దీనిపై చర్చిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇక బీఆర్ఎస్ నుంచి పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కాలె యాదయ్య, సంజయ్ కుమార్, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలకు సంబంధించి కొన్ని డిమాండ్‌లు ఉన్నాయంటూ.. వీరికి కార్పొరేషన్ పదవులు కట్టబెట్టాలనే ప్రతిపాదనను హైకమాండ్ ముందు రాష్ట్ర నేతలు ఉంచినట్లు తెలిసింది. దీనికి హైకమాండ్ అంగీకరించినట్లు సమాచారం.

సాక్షి, న్యూఢిల్లీ: టీపీసీసీకి కొత్త అధ్యక్షుడి ఎంపిక వ్యవహారంలో కాంగ్రెస్ అధిష్టానం ఓ నిర్ణయానికి వచ్చింది. తెలంగాణ పార్టీ పగ్గాలను బీసీ నేతకు అప్పగించాలనే అభిప్రాయానికి ఢిల్లీ పెద్దలు వచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్ర నేతలు వెలిబుచ్చిన అభిప్రాయాలు, సామాజిక సమీకరణాలు పరిగణనలోకి తీసుకున్న హైకమాండ్.. బీసీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతలైన మహేశ్‌కుమార్ గౌడ్, మధుయాష్కీ గౌడ్‌లలో ఒకరికి పీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. శుక్రవారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ పార్టీ ముఖ్యులతో జరిగిన చర్చల్లో పీసీసీ అధ్యక్షుడి ఎంపిక కసరత్తు ఓ కొలిక్కి వచ్చిందని, ఏ క్షణమైనా ప్రకటన వెలువడే అవకాశం ఉందని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి. పీసీసీ అధ్యక్షుడి నియామక ప్రక్రియ పూర్తయిన తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, జిల్లాల వారీ ప్రాతినిధ్యం, సామాజిక సమీకరణలు, పార్టీలో పనిచేసిన అనుభవం ఆధారంగా కొత్త మంత్రులపై నిర్ణయం ఉంటుందని సమాచారం.

సుదీర్ఘ చర్చలు..: కొత్త పీసీసీ అధ్యక్షుడి ఎంపికతో పాటు ప్రభుత్వంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న కేబినెట్ పదవుల భర్తీపై గత నెల రోజులుగా తీవ్ర కసరత్తు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత

మిగతా 2వ పేజీలో ▶

మీతో సాక్షి

విశ్వనగరంలో ఏరియాకో కథ.. గల్లీగల్లీకో వ్యథ..

మీ హృదయాలను కదిలించే వాస్తవాలు చిన్నవైనా.. పెద్దవైనా.. వార్త మూలాలను మీ ముందుంచుతాం

మీ వేదనను మేం వినిపిస్తాం మీతో నడుస్తూ.. మీ గుండె చప్పుడు.. ప్రతిధ్వనిస్తాం

ఎవరికీ కన్పించని మీ బాధను.. ప్రపంచానికి మేం చాటి చెబుతాం

మీరే సాక్షి - మీతో సాక్షి @ SAT 6.30 PM తిరిగి SUN 11.30 AM సాక్షి టీవీలో..

12 లో


ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ఆత్మీయ ఆలింగనం చేసుకున్న భారత ప్రధాని మోదీ

శాంతి, సుస్థిరతకు చర్చలే మార్గం

ఉక్రెయిన్-రష్యా కలిసి కూర్చొని మాట్లాడుకోవాలి

- సంఘర్షణకు సాధ్యమైనంత త్వరగా తెరదించాలి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తి
- ఉక్రెయిన్‌లో పర్యటన.. అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ
- భారత్–ఉక్రెయిన్ మధ్య సంబంధాలు, ద్వైపాక్షిక అంశాలపై చర్చ.. భారత్ అందించిన మానవతా సాయానికి జెలెన్‌స్కీ కృతజ్ఞతలు

6 లో

ఓపెన్ చాలెంజ్



కొత్త టేపుతో నా ఇంటికి రండి

ప్రధాన ప్రతిపక్షానికి మంత్రి పొంగులేటి సవాల్

- ఎంతమంది వెళతారో వెళ్లి కొలుచుకోండి
- డేట్ ఎప్పుడో చెప్పండి.. ఎన్ని ప్రొక్లెయినర్లు కావాలంటే అన్ని పెట్టుకుని అధికారులు రెడీగా ఉంటారు
- హిమాయత్‌సాగర్ బఫర్ జోన్‌లో ఉన్నా, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నా కూల్చుకోండి
- హైడ్రా అధికారినీ ఆదేశిస్తున్నానన్న మంత్రి

సాక్షి, హైదరాబాద్: 'ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు నా ఇల్లు హిమాయత్‌సాగర్ బఫర్ జోన్‌లో లేదు. నా మీద బురద జల్లాలని, నన్ను బూచిగా చూపి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. నా ఇంటి వద్దకు ఎంత మందైనా, ఎప్పుడైనా వెళ్లవచ్చు.. కొలుచుకోవచ్చు. బఫర్ జోన్‌లో ఉన్నా, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నా కూల్చుకోవచ్చు. దిస్ ఈజ్ మై చాలెంజ్. పొంగులేటి చాలెంజ్. ప్రధాన ప్రతిపక్షానికి

మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఆహారం కల్తీ, నీరు కల్తీ, గాలి కల్తీ! ఇన్ని కల్తీలతో జీవిస్తున్నాం! ఇక మన మీద ఏం ప్రభావం ఉంటుంది!

చేతకాని సన్నాసి సీఎం రేవంత్

ఎక్కడా చారాణా రుణమాఫీ కాలేదు

- రుణమాఫీపై ఏ ఊరికి వెళ్లి అడుగుదామో చెప్పు..
- ప్రజల్లోకి పోయి సమాధానం చెప్పలేని దద్దమ్మ నువ్వు
- సీఎం రేవంత్‌పై ధ్వజమెత్తిన కేటీఆర్


మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో జగదీశ్వర్‌రెడ్డి, దాసోజు

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో ఎక్కడా చారాణా రుణమాఫీ కాలేదు. ఆ తప్పు.. ఈ చేతకాని సన్నాసి సీఎం రేవంత్‌రెడ్డిది. రేవంత్‌రెడ్డీ నీ భాషలోనే చెబుతున్నా.. నువ్వు మగాడివైతే..బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులను అడ్డం పెట్టుకొని కాదు.. పోలీసు సెక్యూరిటీ లేకుండా ఊళ్లలోకి రా..నువ్వు ఏ ఊరికి పోదామో చెప్పు. అక్కడికి వెళ్లి రుణమాఫీ అయ్యిందా అనే విషయాన్ని అడుగుదాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. కాంగ్రెస్ వారు ఊళ్లలోకి వస్తే తరిమికొట్టాలన్న ఆలోచనతో రైతులు ఉన్నారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అయితే రుణమాఫీ విషయంలో పోలీసులు,

మిగతా 2వ పేజీలో ▶

సొంతంగానే 'దక్షిణ రింగు'!

ట్రిపుల్ ఆర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ కీలక నిర్ణయం?

ఢిల్లీ ఔటర్ రింగురోడ్డు తరహాలో సగం కేంద్రం–సగం రాష్ట్రం

ఇప్పటికే దక్షిణభాగం అలైన్‌మెంట్ సిద్ధం.. ఖరారు దశలో ఎన్‌హెచ్‌ఏఐ

ఇక దానికి ఫుల్‌స్టాప్.. మళ్లీ కొత్త అలైన్‌మెంట్‌కు కసరత్తు

కొన్ని కన్సల్టెన్సీ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధుల సంప్రదింపులు



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు (ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగాన్ని సొంతంగా నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అలైన్‌మెంట్ రూపొందించటం సహా భూసేకరణ, రోడ్డు నిర్మాణం అంతా సొంతంగానే చేపట్టే దానిపై కసరత్తు ప్రారంభించింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ ప్రతిపాదనపై చర్చించినట్టు తెలిసింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు మూడు కన్సల్టెన్సీ సంస్థలను సంప్రదించి అలైన్‌మెంట్‌పై చర్చించినట్టు విశ్వసనీయసమాచారం. గత నెలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలిసినప్పుడు మొదటిసారి ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ట్రిపుల్ ఆర్‌లోని 162 కి.మీ. ఉత్తర భాగంలో ఇప్పటికే భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. దీనికి సంబంధించి ఎన్‌హెచ్‌ఏఐ అన్ని గెజిట్లు జారీ చేసి, భూమిని తన అధీనంలోకి తీసుకుంది. అవార్డులు పాస్ చేసి భూ నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం డబ్బులు జమ చేయటమే తరువాయి. ఆ వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తారు. దీంతో ఈ భాగం రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమం అవుతుంది. ఇక దక్షిణ భాగం విషయానికొస్తే.. ఢిల్లీకి చెందిన కన్సల్టెన్సీ సంస్థ మూడు అలైన్‌మెంట్లను గతేడాదే ఎన్‌హెచ్‌ఏఐకి సమర్పించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం–కేంద్రప్రభుత్వం మధ్య సఖ్యత కొరవడటంతో దక్షిణభాగంలో కసరత్తు నిలిచిపోయింది. మరోవైపు పార్లమెంట్ ఎన్నికలు రాగా, అలైన్‌మెంట్‌కు కూడా ఆమోదం లభించలేదు. దీంతో దక్షిణభాగం రోడ్డు కసరత్తు ఇప్పట్లో మొదలు కాదన్న అభిప్రాయం నెలకొంది. ఈ తరుణంలో దక్షిణభాగాన్ని సొంతంగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించుకుంటుందన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది.

ఢిల్లీ తరహాలో...

ఢిల్లీ ఔటర్ రింగురోడ్డులో వెస్ట్రన్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్ వేను హరియాణా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. ఈస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వేను ఎన్‌హెచ్‌ఏఐ నిర్మించింది. ఇప్పుడు ఇదే తీరుగా.. హైదరాబాద్ రీజినల్ రింగురోడ్డులో ఉత్తర భాగాన్ని ఎన్‌హెచ్‌ఏఐ, దక్షిణభాగాన్ని తెలంగాణ చేపట్టాలన్న ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళుతోంది.

ఖర్చు భరించగలదా..?

దాదాపు ఐదేళ్ల క్రితం ట్రిపుల్ ఆర్ ప్రతిపాదన వచ్చినప్పుడు రెండు భాగాలు కలిపి రూ.17 వేల కోట్ల వ్యయంలో పూర్తవుతుందని అంచనా వేశారు. కానీ, గతేడాది జనవరిలో దక్షిణ భాగానికి సంబంధించిన కన్సల్టెన్సీ సంస్థ రూ.12,900 కోట్ల అంచనాతో నివేదిక సమర్పించింది. ఇప్పుడు అది రూ.19 వేల కోట్లకు చేరింది. ఇంతపెద్ద మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించటం అంత సులభం కాదు. అయితే ప్రస్తుతం రోడ్ల నిర్మాణంలో ప్రైవేట్ సంస్థలే కీలకపాత్ర పోషిస్తున్నాయి. బీఓటీ, హెచ్‌ఏఎం పద్ధతులను అవలంబిస్తుండటంతో ప్రభుత్వంపై భారం తక్కువగానే ఉంటుంది. రోడ్డు నిర్మాణం, నిర్వహణ చూసే సంస్థలే ఎక్కువ మొత్తాన్ని భరిస్తాయి. ఈ పద్ధతిలో భారం ఉండకపోవచ్చన్న భావనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని సమాచారం.

అలైన్‌మెంట్ ప్రక్రియే కీలకం..

ట్రిపుల్ ఆర్ ఆలోచన మొగ్గ తొడిగినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఓ ప్రాథమిక అలైన్‌మెంట్ చేశారు. కేవలం గూగుల్ మ్యాప్ ఆధారంగా అది జరిగింది. దక్షిణభాగం పరిధిలో ఆ అలైన్‌మెంట్ మరింత గందరగోళంగా ఉంది. ఆ భాగానికి సంబంధించి తర్వాత ఎన్‌హెచ్‌ఏ ఢిల్లీకి చెందిన ఓ కన్సల్టెన్సీకి బాధ్యత అప్పగించింది. దాని ప్రతినిధులు కొన్ని నెలల పాటు క్షేత్రస్థాయిలో తిరిగి పాత అలైన్‌మెంట్ మొత్తం గందరగోళంగా ఉందని గుర్తించి, జలవన రులు, జనావాసాలకు దూరంగా వంకర టింకర లేని కొత్త అలైన్‌మెంట్ సిద్ధం చేశారు. 2023 జనవరిలో మూడు అలైన్‌మెంట్లను ఎన్‌హెచ్‌ఏఐకి ఆ సంస్థ సమర్పించింది. అందులో 189.205 కి.మీ. నిడివి ఉండే అలైన్‌మెంట్‌ను ఎన్‌హెచ్‌ఏఐ దాదాపు ఖరారు చేసింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపడితే, మళ్లీ కొత్తగా అలైన్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. రాజకీయ నేతల నుంచి వచ్చిన ఒత్తిళ్లను ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలోని కన్సల్టెన్సీ సంస్థ పట్టించుకోకుండా శాస్త్రీయంగా అలైన్‌మెంట్‌ను రూపొందించింది. ప్రస్తుత అలైన్‌మెంట్ మారే అవకాశముందన్న వాదన వినిపిస్తోంది.

రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలి

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

నిర్మల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో రైతుధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎంతమందికి రుణమాఫీ చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరి పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇప్పటి వరకు సగం మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని చెపుతుంటే, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగిందని ఒట్లు వేస్తూ దేవుళ్లను కూడా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ నెలాఖరులోపు రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో నిరవధిక నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

కొర్రీలొద్దు.. కోతలొద్దు: రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు, కోతలు లేకుండా తక్షణమే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ డిమాండ్ చేశారు. రైతు దీక్షలో ఆయన మాట్లాడుతూ, అందరి రుణాలు మాఫీ అయ్యేవరకు రైతుల పక్షాన పోరాడతామన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో ఎంతోమంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు పటేల్ పాల్గొన్నారు.

ఈ ఇద్దరిలో ఎవరో?

▶ మొదటి పేజీ తరువాయి

రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లతో చర్చలు జరిపారు. మరోవైపు అధిష్టానం కూడా ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల అభిప్రాయాన్ని తీసుకుంది. తాజాగా ఆయా అంశాలపై చర్చించేందుకు శుక్రవారం ఢిల్లీ వచ్చిన రేవంత్‌రెడ్డి, భట్టి, ఉత్తమ్‌లు పార్టీ ప్రధాన కార్యాలయంలో ఖర్గే, రాహుల్‌గాంధీ, కేసీలతో మరోమారు భేటీ అయ్యారు. సుమారు రెండు గంటల పాటు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధిష్టానం ముఖ్య నేతలతో విడివిడిగా కూడా సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకుంది.

చర్చకు వచ్చిన ఆరు పేర్లు

పీసీసీ పదవికి ప్రధానంగా ఆరుగురు నేతల పేర్లపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. బీసీ సామాజికవర్గం నుంచి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ఎస్సీ సామాజికవర్గం నుంచి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎస్టీ సామాజికవర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్, ఓసీ సామాజికవర్గం నుంచి మంత్రి శ్రీధర్‌బాబుల పేర్లను పరిశీలించినట్లు సమాచారం. అయితే రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రతిపక్ష పార్టీలను దీటుగా ఎదుర్కోవాల్సిన ఆవశ్యకతతో పాటు సామాజిక సమీకరణాలు దృష్టిలో ఉంచుకుని బీసీ సామాజికవర్గ నేతలకే పదవి కట్టబెట్టాలనే నిర్ణయానికి వచ్చారు. ముఖ్యంగా బీసీ నేతలకు కేంద్ర ప్రభుత్వ, పార్టీ పదవుల్లో బీజేపీ మొదటి ప్రాధాన్యత ఇస్తూ వారిని మచ్చిక చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు పరిగణనలోకి తీసుకుని బీసీ వర్గ నేతలవైపే హైకమాండ్ పెద్దలు మొగ్గు చూపినట్లు తెలిసింది. వారిలో పార్టీ కార్యకలాపాల్లో మొదటినుంచీ చురుగ్గా ఉన్న మహేశ్‌కుమార్ గౌడ్ వైపు మెజార్టీ నేతలు మొగ్గు చూపగా, ఆయన ప్రస్తుతం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండటంతో పాటు ఎమ్మెల్సీగా కొనసాగుతున్న దృష్ట్యా, మధుయాష్కీ పేరును పరిశీలించాలని మరికొందరు నేతలు అభిప్రాయపడినట్లు తెలిసింది. అయితే దీనిపై నిర్ణయాధికారం తమకు అప్పగించాలని, ఎవరి పేరును ప్రకటించినా పార్టీ నేతలంతా కలిసి పనిచేయాలని హైకమాండ్ పెద్దలు సూచించినట్లు తెలిసింది. మరోవైపు ఓసీ, ఎస్టీ, ఎస్సీ సామాజిక వర్గాలకు సైతం ప్రాధాన్యం ఇచ్చేలా ముగ్గురు వైస్ ప్రెసిడెంట్‌లను నియమించాలనే దానిపై భేటీలో ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.

కవితకు హైబీపీ

తీహార్ జైలులో రక్తపోటుతో బాధపడుతున్న ఎమ్మెల్సీ



సాక్షి, న్యూఢిల్లీ: మద్యం విధానం కేసులో ఆరోపణలను ఎదుర్కొంటూ తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవిత హైబీపీతో సతమతం అవుతున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల కిందట ఎ యిమ్స్ ఆసుపత్రిలో ఆమె కు జైలు అధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. గైనిక్ టెస్టులతో పాటు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ టెస్టులను చేశారు. బీపీ పరీక్షించగా, 186/103 ఉన్నట్లు తెలిసింది. జైలులోకి వెళ్లిన రెండు రోజులకే కవిత హైబీపీకి గురి అయినట్లు సమాచారం. జైలు అధికారులు రెండు పూటలా బీపీ ట్యాబ్లెట్లు ఇస్తున్నా రక్తపోటు నియంత్రణలోకి రాకపోవడంపై ఆమె కుటుంబీకుల్లో ఆందోళన నెలకొంది. మరోపక్క జ్వరం కూడా తగ్గకపోవడం, ఒకేసారి పది కేజీల బరువు తగ్గడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జైలులోకి వెళ్లే ముందు కవిత 70 కేజీల బరువు ఉండగా, ఎయిమ్స్ వైద్యులు నిర్వహించిన పరీక్షల సందర్భంలో ఆమె బరువు 59.5 కేజీలు ఉన్నట్లు సమాచారం. వీటికి తోడు దీర్ఘకాలికంగా ఆమెకు ఉన్న గైనిక్ సమస్యలు రోజు రోజుకూ ఎక్కువ అవడం వలన మరింత అనారోగ్యానికి గురవుతున్నట్లు చెబుతున్నారు.

హరీశ్‌రావు పరామర్శ: తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో కలిసి మాజీ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం పరామర్శించారు. ఆ కేసులో దర్యాప్తు సంస్థలు కావాలనే కవితను ఇబ్బంది పెడుతున్నాయని హరీశ్ ఆరోపించారు. బెయిల్ విషయంలో దర్యాప్తు సంస్థలు వ్యవహరిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. తమకు న్యాయస్థానాలపై నమ్మకం ఉందని, వచ్చే మంగళవారం కవితకు బెయిల్ వచ్చే అవకాశం ఉందని హరీశ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

ఎల్వీ ప్రసాద్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.రావుకు స్వర్ణ పతకం



లక్డీకాపూల్ (హైదరాబాద్): ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్వీపీఈఐ) వ్యవస్థాపక అధ్యక్షుడు గుళ్లపల్లి ఎన్.రావును ప్రతిష్టాత్మక ఐసీవో జూల్స్ ఫ్రాంకోయిస్ గోల్డెన్ మెడల్ వరించింది. కెనడాలోని వాంకోవర్‌లో జరిగిన ప్రపంచ ఆప్తమాలజీ కాంగ్రెస్–2024లో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అత్యున్నత వైజ్ఞానిక నాణ్యత గల నేత్ర సంబంధిత కృషికి ప్రతి నాలుగేళ్లకోసారి ఈ పతకాన్ని ప్రదానం చేస్తారు. దేశం నుంచి ఈ స్వర్ణ పతకం పొందిన మొదటి నేత్ర వైద్యుడు రావు కావడం విశేషం. అనేక జర్నల్స్‌లో సంపాదకవర్గ పదవులు నిర్వహించిన రావుకు 300లకుపైగా పరిశోధనా ప్రచురణలు చేసిన ఘనత ఉంది. ప్రస్తుతం ఆయన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్‌నెస్‌కు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

'బ్లిట్జ్' పత్రిక కథనంపై ఏం చర్యలు తీసుకుంటారు?

సోనియా, రాహుల్‌గాంధీలకు రఘునందన్‌రావు డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: ఆంగ్ల పత్రిక 'బ్లిట్జ్'లో రాహుల్‌గాంధీ గురించి వచ్చిన కథనంపై ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. ఆ పత్రికలో వచ్చిన వార్తలో వాస్తవం లేదని భావిస్తే నోటీసులు ఎందుకు పంపడం లేదని ప్రశ్నించారు. 'హిండెన్‌బర్గ్ రాసిన వార్తను రాహుల్‌గాంధీ నమ్ముతున్నారు.. మరి 'బ్లిట్జ్' పత్రికలో వచ్చిన కథనాన్ని ఎందుకు నమ్మడం లేదు' అని నిలదీశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'బ్లిట్జ్' ప్రచురించిన వార్త జిరాక్స్ ప్రతులను ఢిల్లీలోని రాహుల్‌గాంధీ కార్యాలయంలో అందజేశారు. అనంతరం రఘునందన్‌రావు విలేకరులతో మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీని కలసి 'బ్లిట్జ్' ప్రతులు అందజేసేందుకు వచ్చానన్నారు. అయితే.. సమావేశంలో ఉన్న కారణంగా ఆయనను కలవలేదని తెలిపారు. 'బ్లిట్జ్' పత్రికలో రాహుల్‌గాంధీకి వివాహమై పిల్లలు కూడా ఉన్నారంటూ వచ్చిన కథనంపై సోనియా, రాహుల్‌లతో పాటు ఏఐసీసీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు. 'బ్లిట్జ్' రాసిన కథనంపై సిట్ వేద్దామా అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు.

'సూపర్ స్పెషాలిటీ'లకు ప్రపంచ బ్యాంకు నిధులు

మంత్రి దామోదర రాజనర్సింహతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులలో మెరుగైన వైద్య సదుపాయాలను కల్పించడంకోసం అత్యాధునిక పరికరాల కొనుగోలుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు మంత్రి దామోదర రాజనర్సింహకు హామీ ఇచ్చారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు జింకో ఓనిషి, అపర్ణ సోమనాథన్, ఐతుల అమిత్ నాగరాజ్, అజయ్ టాండన్, లక్ష్మీ శ్రీపాద్‌లు శుక్రవారం సచివాలయంలో మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి ప్రోత్సాహం అందించడానికి చేస్తున్న కృషిని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు అభినందించారు. ఆస్పత్రులలో మెడికల్ పరికరాలకు నిధులను అందించడానికి బ్యాంకు ప్రతినిధులు ఆసక్తి చూపారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ట్రామా సెంటర్లు, కేన్సర్ చికిత్స, కిడ్నీ ఇన్ఫెక్షన్లను గుర్తించే ఆధునిక యంత్రపరికరాలను అందించడానికి ప్రతిపాదనలను ఇవ్వాలని వారు కోరారు.

ఓపెన్ చాలెంజ్ కొత్త టేపుతో నా ఇంటికి రండి

▶ మొదటి పేజీ తరువాయి

సవాల్ చేస్తున్నా.. కొలిచిన తర్వాత మీ తల ఎక్కడ పెట్టుకుంటారో మీరే నిర్ణయించుకోండి..' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డిలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు.

బురద జల్లే ప్రయత్నమే..

'అవాకులు, చెవాకులు, అసందర్భ వాదనలతో పాటు మాజీ మంత్రులకు సంబంధించిన వ్యవస్థలు నామీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయి. నేను ఒకటే చాలెంజ్ విసురుతున్నా. మున్సిపల్, ఇరిగేషన్ శాఖలకు చెందిన మాజీ మంత్రులు, వారికి డబ్బాలు కొట్టే సంస్థలు, వ్యవస్థలు, కొత్త టేపు కొనుక్కుని వెళ్లండి. నేను కూడా రాను. మా అధికారులొస్తారు. డేట్ ఎప్పుడో చెప్పండి. ఎన్ని పొక్లెయినర్లు కావాలంటే అన్ని పెట్టుకుని అధికారులు రెడీగా ఉంటారు నా ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నా, బఫర్‌జోన్‌లో ఉన్నా, ఒక్క ఇటుక పెళ్ల ఉన్నా వెంటనే పడగొట్టండి. నా ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే ఇల్లు మొత్తం పడగొట్టండి. ఈ వేదిక మీద నుంచి హైడ్రా అధికారి రంగనాథ్‌ను కూడా ఆదేశిస్తున్నా..' అని మంత్రి అన్నారు.

మళ్లీ చెబుతున్నా..మీకా చాన్స్ ఇవ్వను

'బీఆర్‌ఎస్ నేతల్లాగా నేను ఒకటికి వంద అబద్ధాలు చెప్పను. వాస్తవానికి నేనుండే ఇల్లు నా పేరు మీద లేదు. నా కొడుకు పేరు మీద ఉంది. అయినా ఆ ఇల్లు నాది కాదని చెప్పను. లీజుకు తీసుకున్నానని మీలాగా సొల్లు కబుర్లు చెప్పను. నేను అందరు అన్నట్టు దాంట్లో దూకు.. దీంట్లో దూకు అనను. ఇది పొంగులేటి చాలెంజ్. గతంలో ఖమ్మం అసెంబ్లీ ఎన్నికల గురించి చెప్పా. మళ్లీ ఈరోజు చెపుతున్నా. ఈ రోజు కాదు.. ఏ రోజైనా, నీతో, నీ బావతో, ఆయన మామతో చెప్పించుకునే చాన్స్ ఈ పొంగులేటి ఎప్పుడూ ఇవ్వడు. ఇవ్వబోడు. ప్రతిపక్షానికి దమ్ముంటే నా సవాల్‌ను స్వీకరించాలి.' అని పొంగులేటి అన్నారు.

రూ.31 వేల కోట్ల రుణమాఫీకి కట్టుబడి ఉన్నాం

'గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్‌ఎస్‌కు సీట్లు రాలేదనే అక్కసుతో రైతులను రెచ్చగొట్టాలని చూస్తున్నారు. రూ.31 వేల కోట్ల రుణమాఫీకి మేము కట్టుబడి ఉన్నాం. ఇంకా రూ.12,300 కోట్లు మాఫీ చేయాల్సి ఉంది. బీఆర్‌ఎస్ నేతల్లా మేము శనగలు తిని చేతులు దులుపుకునే రకం కాదు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తాం. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులకు కటాఫ్ తేదీ పెట్టి ఆ తేదీలోపు ఎక్కువగా ఉన్న డబ్బులు కడితే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం..' అని మంత్రి తెలిపారు. 2020 ఆర్‌వోఆర్ చట్టాన్ని మార్చి త్వరలో కొత్త చట్టాన్ని తెస్తామన్నారు. ప్రజల నుంచి, ప్రతిపక్షాల నుంచి వచ్చిన సూచనలను స్వీకరిస్తామని తెలిపారు. చీల్చి చెండాడతానని చెప్పిన కేసీఆర్ మళ్లీ 6–9 నెలలు కనపడడంటూ ఎద్దేవా చేశారు. మహిళా జర్నలిస్టులపై దాడి జరిగి ఉంటే బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సారూ.. మాఫీ అయిందా?



సారూ.. మా రుణమాఫీ అయిందా.. అంటూ రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) డివిజనల్ బ్యాంకులకు బారులు తీరుతున్నారు. శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు రావడంతో బ్యాంక్ కిక్కిరిసిపోయింది.
- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

మహిళా జర్నలిస్టులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

డీజీపీకి టీయూడబ్ల్యూజే ప్రతినిధుల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: మహిళా జర్నలిస్టులు సరిత, విజయారెడ్డిలపై గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి, వెల్దండ గ్రామాల్లో దాడి చేసి కెమెరాలు, సెల్ ఫోన్లు లాక్కొని, వారిపై దాడికి యత్నించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డీజీపీ జితేందర్‌కు టీయూడబ్ల్యూజే ప్రతినిధులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రమణకుమార్, హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి యార నవీన్‌కుమార్, ఐజేయూ సభ్యుడు అవ్వారి భాస్కర్, సరిత, విజయారెడ్డి, పలువురు జర్నలిస్టు సంఘం నాయకులు డీజీపీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఫిర్యాదుపై స్పందించిన డీజీపీ బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అలాగే టీయూడబ్ల్యూజే ప్రతినిధులు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారదను కూడా కలిసి ఫిర్యాదు చేశారు.

నేడు మహిళా కమిషన్ ముందుకు కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం రాష్ట్ర మహిళా కమిషన్ ముందు హాజరు కానున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనకు మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఉదయం 11 గంటలకు ఆయన మహిళా కమిషన్ కార్యాలయానికి వెళ్లనున్నారు. ఈ నెల 15న తెలంగాణ భవన్‌లో జరిగిన స్టేషన్ ఘన్‌పూర్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్, ఉచిత బస్సు ప్రయాణంపై మంత్రి సీతక్క చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఈ నెల 16న కేటీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉండగా కేటీఆర్ తాను చేసిన వ్యాఖ్యలపై ఈ నెల 16వ తేదీనే క్షమాపణ చెప్పారు. 'పార్టీ సమావేశంలో యథాలాపంగా చేసిన వ్యాఖ్యల వల్ల మా మహిళా సోదరీమణులకు మనస్తాపం కలిగితే విచారం వ్యక్తం చేస్తున్నాను. నా అక్క చెల్లెమ్మలను కించపరిచే ఉద్దేశం ఎప్పుడూ లేదు' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. మరుసటి రోజు కూడా తన వ్యాఖ్యలకు బేషరతు బహిరంగ క్షమాపణ చెప్పినట్లు మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. కాగా మహిళా కమిషన్ నోటీసుల మేరకు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇస్తానని ఆయన ప్రకటించారు. అదే సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొల్లాపూర్, షాద్‌నగర్‌తో పాటు రాష్ట్రంలో మహిళలపై జరిగిన అఘాయిత్యాల వివరాలను కూడా మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు అందజేస్తానని ప్రకటించారు.

సబ్ కా సాత్.. సబ్ కా వికాస్‌కు బీజేపీ రాంరాం!

చంద్రబాబుకు ఈ బానిస బతుకు అవసరమా..? రేవంత్ వాగాడంబరం తగ్గిస్తే మంచిది: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న నారాయణ, చిత్రంలో శ్రీనివాసరావు, పల్లా వెంకట్‌రెడ్డి, అజీజ్ పాషా, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సాక్షి ప్రతినిధి, వరంగల్: 'సబ్ కా సాత్...సబ్ కా వికాస్'నినాదానికి బీజేపీ ప్రభుత్వం మంగళం పాడేసిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. ఆ నినాదాన్ని మార్చుకుని 'మాతో ఎవరుంటే..మేము వారితో ఉంటాం..'అనే కొత్త విధానాన్ని మోదీ ప్రభుత్వం ఇప్పుడు అమలు చేస్తుందని విమర్శించారు. హనుమకొండలో జరుగుతున్న సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాల సందర్భంగా శుక్రవారం హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులతో కలసి నారాయణ మాట్లాడారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కోరిన అమరావతికి నిధులు, ప్రత్యేక హోదా ఇవ్వలేదని...అలాంటప్పుడు ఆయనకు అటువంటి బానిస బతుకు ఎందుకని ప్రశ్నించారు. అభివృద్ధి విషయంలో సీఎం రేవంత్ వాగాడంబరం ఎక్కువైతే నష్టం జరుగుతుందని, పరిపాలన సరిగ్గా చేసుకోవాలని హితవు పలికారు. బీజేపీకి వ్యతిరేక పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకుని గవర్నర్లతో పరిపాలిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవడం మంచి పరిణామమన్నారు. ఈ ఘటనకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

చేతకాని సన్నాసి సీఎం రేవంత్

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ అధికారులను తప్పు పట్టాల్సిన పనిలేదని, ఆ తప్పు సీఎం రేవంత్‌దే అన్నారు. తిరుమలగిరిలో బీఆర్‌ఎస్ ధర్నా శిబిరంపై జరిగిన దాడి, బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ శ్రేణుల దాడులు, పోలీసు నిర్లక్ష్య వైఖరిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ నేతలు శుక్రవారం డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఇతర నాయకులతో కలిసి డీజీపీకి వినతిపత్రం ఇచ్చారు. రుణమాఫీ జరిగిన తీరుపై ముఖ్యమంత్రి సొంత ఊరు కొండారెడ్డిపల్లికి పోయిన ఇద్దరు మహిళా జర్నలిస్టుల పైన, ఇతర జర్నలిస్టులపైన దాడి చేసిన తీరుపై కూడా ఫిర్యాదు చేశారు. అనంతరం డీజీపీ కార్యాలయ ఆవరణలో కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలు మీడియాతో మాట్లాడారు. తుంగతుర్తిలో ప్రజాస్వామ్యపద్ధతిలో శాంతియుతంగా చేస్తున్న రైతు నిరసన దీక్షపై కాంగ్రెస్ గూండాలు ఆకస్మికంగా రాళ్లు, సుతిలి బాంబులతో దాడి చేశారని కేటీఆర్ ఆరోపించారు. 'మా వారు తిరగబడి ఉంటే కాంగ్రెస్ నాయకులు ఒక్కరు కూడా మిగలరు. కానీ శాంతియుతంగా నిరసన తెలపాలనే మేం ప్రతిఘటనకు పాల్పడలేదు' అన్నారు. రుణమాఫీపై ప్రజల్లోకి పోయి సమాధానం చెప్పలేని దద్దమ్మ రేవంత్‌రెడ్డిఅని, క్షేత్రంలో తిరగాల్సిన సీఎం ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. కొండారెడ్డిపల్లిలో దాడికి గురైన మహిళా జర్నలిస్టులకు సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



డీజీపీకి వినతిపత్రం అందిస్తున్న కేటీఆర్, జగదీశ్‌రెడ్డి. చిత్రంలో గ్యాదరి కిశోర్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, కోటిరెడ్డి

అధికారం ఒక పార్టీకి శాశ్వతం కాదని, పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించొద్దని కేటీఆర్ సూచించారు. తిరుమలగిరి ఘటనలో దాడి చేసిన వారిపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. డీజీపీని కలిసినవారిలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యేలు డా.గ్యాదరి కిశోర్, ఆర్.రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, ఎస్.భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, నోముల భగవత్ తదితరులు పాల్గొన్నారు.

వాళ్లవి ముందు కూల్చండి

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న అన్ని నిర్మాణాలను కూల్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పొంగులేటి, వివేక్, కేవీపీ, మధుయాష్కీ వంటి నేతల భవనాలను కూల్చేసి.. ఆ తర్వాత సామాన్యుల భవనాలను కూల్చేయండి అని పేర్కొన్నారు.

ఓఆర్‌ఆర్ లీజులో అవకతవకలు జరిగితే రద్దు చేయండి

ఔటర్ రింగ్‌రోడ్డు లీజు విషయంలో మంత్రులు ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టే మాట్లాడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. లీజులో అవకతవకలు జరిగినట్టు భావిస్తే వెంటనే రద్దు చేయాలన్నారు. ఓఆర్‌ఆర్ లీజు అంశంపై రెవెన్యూ మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ ఖండించారు.

'చలో ఢిల్లీ కాదు.. చలో పల్లె' చేపట్టాలి

రుణమాఫీ జరగక లక్షలాది మంది రైతులు రగిలిపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఢిల్లీ యాత్రలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ 'చలో ఢిల్లీ'కి బదులుగా 'చలో పల్లె' చేపట్టాలని సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పేర్కొన్నారు. డెంగీ మరణాలు, పెరుగుతున్న నేరాలు, రైతుల ఆందోళనలు రాష్ట్రంలో పాలన గాడి తప్పడాన్ని సూచిస్తున్నాయన్నారు. విపత్కర పరిస్థితుల్లో సీఎం, మంత్రులు పార్టీ అధి ష్టానం ఆశీస్సుల కోసం పాకులాడకుండా ప్రజల నడు మకు వెళ్లాలని సూచించారు. లేనిపక్షంలో తెలంగాణ సమాజం ఏదో ఒక రోజు సీఎం కుర్చీ లాగేస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.



రాజ్‌భవన్ పాఠశాలను సందర్శించిన గవర్నర్

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. జాతి నిర్మాణంలో విద్యకు ఉన్న ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసే పనిని కొనసాగించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి వారి ఆకాంక్షలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ కలలను సాకారం చేసుకోవడానికి కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. సమాజం పట్ల బాధ్యతను పెంచుకోవాలని కోరారు. గవర్నర్ విద్యార్థులతో సరదాగా మాట్లాడుతూ వారితో కొంత సమయం గడిపారు. తమ చదువుల పట్ల గవర్నర్ చూపుతున్న శ్రద్ధను చూసి విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మంచి విద్యను అందించడానికి పాఠశాల చేస్తున్న కృషిని గవర్నర్ ప్రశంసించారు.

హైదరాబాద్‌లో జెనోమిక్ వెల్‌నెస్ క్లినిక్

భూమి కేటాయించిన అప్పటి సీఎం వైఎస్
- అక్టోబర్ 9న సీఎం రేవంత్‌తో శంకుస్థాపన
- రేవంత్‌తో భేటీ అయిన వైద్యులు, శాస్త్రవేత్తల బృందం

సాక్షి, హైదరాబాద్: నగరంలో 'జెనోమిక్ వెల్‌నెస్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్' ఏర్పాటు కానుంది. డాక్టర్ కేపీసీ గాంధీ నాయకత్వంలో హైదరాబాద్‌లోని జీనోమ్ ఫౌండేషన్ (జీఎఫ్)కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు, వైద్యులు గురువారం సీఎం రేవంత్ రెడ్డితో ఆయన కార్యాలయంలో సమావేశమై జీనోమ్ ఫౌండేషన్ కార్యకలాపాలను వివరించారు. కొత్త భవన సముదాయానికి అక్టోబర్ 9వ తేదీన శంకుస్థాపన చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. గ్రామీణ ప్రాంతాల రోగులకు ఈ క్లినిక్ ఎంతగానో ఉపయోగపడుతుందని వారు సీఎంకు వివరించారు. సీఎం వెంటనే స్పందించి తమ ప్రభుత్వం నుంచి వైద్య బృందానికి పూర్తి సహకారం ఉంటుందని హామీయిచ్చారు. కాగా, జెనోమిక్ వెల్‌నెస్ క్లినిక్ నిమిత్తం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలో 4.13 ఎకరాల భూమిని కేటాయించారు. సీఎం రేవంత్‌ను కలిసిన బృందంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.సోమరాజు, కార్డియోథొరాసిక్ సర్జన్, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ డి.ప్రసాదరావు, బయోఏషియా, ఎఫ్ఏబీపీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పి.రెడ్డన్న, అమెరికాకు చెందిన ప్రముఖ క్లినికల్ ఇమ్యునాలజిస్ట్ డాక్టర్ కొసరాజు ఆర్.రావు, జీనోమ్ ఫౌండేషన్ నిర్వహణలో చురుకుగా పాల్గొంటున్న నేచురోపతి సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కార్తీక్ ఉన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశాలకు నోటిఫికేషన్



ఈనెల 31 వరకు దరఖాస్తుకు అవకాశం

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 2024–25 విద్యా సంవత్సరానికి పలు డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్స్ పొందడానికి ఈనెల 31 చివరి తేదీగా విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం, ఆన్‌లైన్‌లో నమోదు తదితర అంశాల పై సందేహాలు ఉంటే సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని, లేదా విశ్వవిద్యాలయ హెల్ప్‌డెస్క్ నెంబర్లు 73829 29570/580, 040–23680222/333/444/555, టోల్‌ఫ్రీ నెంబర్ 18005990101లలో సంప్రదించవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం www.braouonline.in సందర్శించాలని వెల్లడించారు.

బీపీఈడీ తొలి విడతలో 753 సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీపీఈడీ, యూజీడీపీఈడీ కోర్సులకు సంబంధించిన తొలి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా సీట్ల కేటాయింపు జరిగింది. ఈ కోర్సులకు సంబంధించి కన్వీనర్ కోటా కింద మొత్తం 1,737 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 967 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 753 మందికి సీట్లు కేటాయించారు. విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లోనే జాయినింగ్ లెటర్‌తో పాటు రశీదును డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలంగాణ పీఈసెట్ కన్వీనర్ రమేశ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ తర్వాత అలాట్ అయిన కాలేజీల్లో ఈనెల 23 నుంచి 28 వరకు విద్యార్థులు రిపోర్టు చేయాలని, ఒరిజినల్ ధ్రువపత్రాలతో వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత అలాట్‌మెంట్ ఆర్డర్‌ను సంబంధిత కాలేజీకి పంపుతామని తెలిపారు. ఈనెల 27 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

నేడు ఇంజనీరింగ్ స్లైడింగ్ సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. అంతర్గత స్లైడింగ్‌కు సంబంధించిన సీట్ల కేటాయింపు శనివారం సాంకేతిక విద్య విభాగం వెల్లడించనుంది. దీని తర్వాత అన్ని కాలేజీల్లోనూ స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయి. ఈ నెలాఖరుకు ఇది కూడా ముగుస్తుంది. ఈనెల 31 నుంచి అన్ని ఇంజనీరింగ్ కాలేజీల్లో తరగతులు ప్రారంభం కానున్నాయి. మరోవైపు యాజమాన్య కోటా కింద కాలేజీలు భర్తీ చేసిన సీట్లకు ర్యాటిఫికేషన్ ప్రక్రియను ఉన్నత విద్యా మండలి చేపడుతుంది. నిబంధనల ప్రకారం సీట్లు కేటాయించారా? లేదా? అన్నది మండలి అధికారులు పరిశీలిస్తారు. అయితే ర్యాటిఫికేషన్ చేపడుతుండగానే ఇంజనీరింగ్ క్లాసులూ జరుగుతాయి. ముందుగా ఓరియంటేషన్ క్లాసులు నిర్వహిస్తారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు, మాదక ద్రవ్యాల వినియోగం జోలికెళ్తే వచ్చే సమస్యలపై అవగాహన కల్పించాలని అధికారులు ఆదేశించారు. కాగా, ఈసారి స్లైడింగ్‌కు అత్యధికంగా 10 వేల దరఖాస్తులు అందాయి. విద్యార్థులు తాము సీటు పొందిన కాలేజీల్లోనే ఈ తరహా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. కొందరు ఇతర బ్రాంచీల్లో సీట్లు వచ్చిన వారు చేరకపోవడం, మరికొందరు ఇతర కాలేజీల్లో సీట్లు వస్తే వెళ్లడంతో ఈ సీట్లు ఖాళీ అయ్యాయి. తుది దశలో కేటాయించని 5 వేల సీట్లు కలుపుకుని, సీట్లు వచ్చినా చేరకపోవడంతో ఏర్పడ్డ మొత్తం ఖాళీ సీట్లు 11,836 ఉన్నాయి. అయితే, ర్యాంకుల ప్రకారం సీట్లు కేటాయిస్తే అంతిమంగా 3 వేల సీట్లు భర్తీ అయ్యే వీలుందని అధికారులు చెబుతున్నారు. ఇంకా 8 వేలకుపైగా సీట్లు మిగిలే వీలుంది. వీటికి ఆయా కాలేజీలు స్పాట్ అడ్మిషన్లు చేపడతాయి. రాష్ట్రవ్యాప్తంగా కన్వీనర్ కోటా కింద 86,943 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ప్రజా పాలనలో పాత పింఛన్ ఇవ్వాలి

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి టీఎస్‌సీపీఎస్ఈయూ నివేదిక



సాక్షి, హైదరాబాద్: ప్రజా పాలనలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పింఛన్ పథకాన్ని వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) కోరింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజాభవన్‌లో ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. తెలంగాణలో సీపీఎస్ అమల్లోకి రావడానికి గల కారణాలను వివరిస్తూ పాత పింఛన్‌ను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతపై నివేదిక సమర్పించింది. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలతో చర్చించకుండానే 2014, ఆగస్టు 23న తెచ్చిన జీవోనెం 28 ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ఉరితాడు బిగించారని, కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానం అమల్లోకి వచ్చిన ఆ రోజును బ్లాక్‌డేగా భావిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చిన్నారెడ్డిని కోరినట్లు వెల్లడించారు. పాత పింఛన్ పునరుద్ధరణ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా చిన్నారెడ్డి హామీ ఇచ్చినట్లు స్థితప్రజ్ఞ తెలిపారు.

ఆ 19 ప్రాజెక్టులు.. ఇక స్పీడ్‌గా!



నిర్ణీత వ్యవధిలో పూర్తయ్యేలా సీఎం ప్రత్యేక చొరవ ● ప్రతినెలా సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా భావిస్తున్న 19 ప్రాజెక్టులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు సీఎం రేవంత్ ఇకపై ప్రతీనెలా ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించనున్నారు. 'స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ'(స్పీడ్) పేరుతో సరికొత్త కార్యాచరణను చేపట్టినట్టు సీఎంవో వర్గాలు వెల్లడించాయి. స్పీడ్ కార్యాచరణలో భాగంగా ఆ 19 ప్రాజెక్టులపై సంబంధిత విభాగాల అధికారులతో సీఎం నెలకోసారి సమావేశమవుతారు. ప్రాజెక్టుల పనుల్లో భాగంగా వివిధ విభాగాల మధ్య ఉన్న అడ్డంకులు, అవరోధాలన్నింటినీ అధిగమించేందుకు 'స్పీడ్' ప్రత్యేక చొరవ తీసుకుంటుంది. పనుల్లో ఎక్కడా ఆలస్యం లేకుండా నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి స్థాయిలోనే అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఈ 'స్పీడ్' దోహదపడుతుందని భావిస్తున్నారు.

అన్ని చోట్లా 'స్పీడ్'

పట్టణాలు, నగరాలకే పరిమితం కాకుండా... అన్ని ప్రాంతాల్లోని అభివృద్ధి పనులపై 'స్పీడ్' దృష్టి కేంద్రీకరిస్తుంది. 'స్పీడ్' కార్యక్రమంలో భాగంగా తమ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులు, పనులపై సంబంధిత విభాగాలు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తాయి. ఏ గడువులోగా ఎంత పని జరుగుతుందనే నిర్ణీత కాల వ్యవధిని ఇందులో పొందుపరుస్తారు. ఎప్పటివరకు ఏయే పనులు పూర్తవుతాయనే పనుల అంచనాలను అందులో ప్రస్తావిస్తారు. 'స్పీడ్' ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వీలుగా ప్రణాళిక విభాగం ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను నిర్వహించనుంది. ఏ రోజుకు ఎంత పని జరిగిందనే అప్ డేట్ డేటాను ఇందులో పొందుపరుస్తారు.

ఆ 19 ప్రాజెక్టులు ఏవంటే..

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, శాటిలైట్ టౌన్ల అభివృద్ధి, మెట్రోరైలు విస్తరణ, జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణ, రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు, రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాలు, ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం, మహిళాశక్తి పథకం అమలు, జిల్లా సమాఖ్య భవనాల నిర్మాణం, సమీకృత గురుకుల పాఠశాలల సముదాయాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సంస్థాగత అభివృద్ధి, ఐటీఐల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, కొత్త ఉస్మానియా హాస్పిటల్, 15 కొత్త నర్సింగ్, 28 కొత్త పారా మెడికల్ కాలేజీలు, హెల్త్ టూరిజం ప్రమోషన్, ఎకో టూరిజం ప్రాజెక్టుల ప్రమోషన్, టెంపుల్ సర్క్యూట్స్ టూరిజం, మత్తుమందుల నిరోధక విధానం అమలు.

పీజీలో ప్రవేశానికి 32 వేల మంది రిజిస్ట్రేషన్

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి 61 వేల మంది అర్హత సాధించగా 32 వేల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు. ఈనెల 27 నుంచి 30 వరకు ఇష్టం వచ్చిన యూనివర్సిటీలోని కాలేజీలకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలన్నారు. వచ్చేనెల 4న పీజీ కోర్సుల్లో సీటు సాధించిన అభ్యర్థుల తొలి జాబితాలను వెల్లడిస్తామని తెలిపారు. 50 వేల పీజీ సీట్లకు 32 వేల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పాండురంగారెడ్డి వెల్లడించారు.

ఈ ఆత్మ (పరమ పురుషుడు) సమస్త ప్రాణుల్లోనూ నిహితమై ఉన్నప్పటికీ,
యోగమాయ తెర వెనుక దాగివుండటం వల్ల అందరికీ ప్రత్యక్షం కాదు.
తమ బుద్ధిని అతి సూక్ష్మ ము, తీక్షణంగా మలుచుకున్నవారు మాత్రమే దర్శించగలరు.
– కేనోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 24 ఆగస్టు 2024

వినూత్న విదేశాంగ విధానం

నలుగురు నడిచిన బాటలో నడవటం, సంప్రదాయంగా వస్తున్న విధానాలను అనుసరించటం శ్రేయస్కరమని చాలామంది అనుకొనేదే. కొత్త ప్రయోగాలకు దిగితే ఏం వికటిస్తుందోనన్న సంశయమే ఇందుకు కారణం. ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించిన తాజా యూరోప్ పర్యటన మన విదేశాంగ విధానం కొత్త మలుపు తిరిగిన వైనాన్ని వెల్లడించింది. ఇది మంచిదా, కాదా అన్నది ముున్ముందు తేలుతుంది. అయితే తాము ఎవరికీ దగ్గరా కాదు... దూరమూ కాదని అటు రష్యాకూ, ఇటు పాశ్చాత్య దేశాలకూ మనం చెప్పినట్టయింది. ఒక రకంగా ఇది ప్రచ్ఛన్న యుద్ధ దశలో మన దేశం అనుసరించిన అలీన విధానాన్ని గుర్తుకుతెస్తుంది. మోదీ రెండు రోజులు పోలెండ్‌లో పర్యటించారు. అధ్యక్షుడు ఆంద్రెజ్ దుదాతో సమావేశమయ్యారు శుక్రవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చలు జరిపారు. ఇవి రివాజులో భాగంగా సాగిన పర్యటనలు కాదు. మన దేశ ప్రధాని ఒకరు పోలెండ్‌ను సందర్శించటం గత నలభై అయిదేళ్లలో ఇదే తొలిసారి. 1955లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, 1967లో ఇందిరా గాంధీ, 1979లో మొరార్జీ దేశాయ్ ఆ దేశంలో పర్యటించారు. కానీ అప్పటికది సోవియెట్ యూనియన్ ఛత్రచ్ఛాయలో ఏర్పడ్డ వార్సా సైనిక కూటమిలో భాగం. అయితే, 1991లో సోవియెట్ యూనియన్ కుప్పకూలడానికి చాలా ముందే పోలెండ్ బాట మార్చింది. సోవియెట్‌కు వ్యతిరేకంగా ఏర్పడిన నాటో కూటమి దేశాలకు చేరువైంది. 1999లో నాటోలో చేరింది. 2004లో యూరొపియన్ యూనియన్ (ఈయూ)లో భాగమైంది. ఆ తర్వాత మరెప్పుడూ మన ప్రధానులు ఆ దేశాన్ని సందర్శించ లేదు. ఇక సోవియెట్‌లో ఒకప్పుడు భాగమైన ఉక్రెయిన్ 26 ఏళ్ల క్రితం స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. పాశ్చాత్య దేశాల సలహాతో తన అణ్వస్త్రాలను స్వచ్ఛందంగా వదులుకుంది. భిన్న సందర్భాల్లో వాటి మనోభావాలకు తగినట్టు తన విధానాలను తీర్చిదిద్దుకుంది. వాజపేయి హయాంలో మన దేశం నిర్వహించిన అణు పరీక్షలను వ్యతిరేకిస్తూ ప్రకటనలు చేసింది. మన కశ్మీర్ విధానాన్ని ఖండిస్తూ వచ్చింది. పాకిస్తాన్‌కు శతఘ్నులు విక్రయించింది.

రెండు దేశాల మధ్య ఉండే ద్వైపాక్షిక సంబంధాలు మూడో దేశానికి వ్యతిరేకమని భావించటం మూర్ఖత్వమే అవుతుంది. అలాంటి మూర్ఖత్వాన్ని ఈమధ్య అమెరికాతో పాటు ఉక్రెయిన్ కూడా ప్రదర్శించింది. జూలై రెండో వారంలో మోదీ రష్యాలో పర్యటించినప్పుడు జెలెన్‌స్కీ ట్విటర్ వేదికగా భారత్‌ను విమర్శించారు. నెత్తురంటిన పుతిన్‌తో ఎలా కరచాలనం చేస్తారని మోదీని ప్రశ్నించారు. ప్రపంచంలోనే అత్యంత క్రూరుడైన నేరగాడిని హత్తుకోవటం విచారకరమన్నారు. ఆ సమయంలో మోదీ తమ దేశంలో ఉన్నారన్న సంగతిని కూడా విస్మరించి కియూవ్‌లో పిల్లల ఆస్పత్రిపై రష్యా బలగాలు దాడి చేసిన మాట వాస్తవమే. అయితే ఆ ఉదంతాన్ని పుతిన్ సమక్షంలోనే మోదీ ఖండించారు. అయినా జెలెన్‌స్కీకి అది సరిపోలేదు. తాము రష్యాతో యుద్ధం చేస్తున్నాం గనుక ప్రపంచమంతా దాన్ని దూరం పెట్టాలన్న వైఖరిని ప్రదర్శించారు. ఇది తెలివితక్కువతనం. భారత్–రష్యా సంబంధాల సంగతే తీసుకుంటే రష్యా అనేక కారణాల వల్ల పాకిస్తాన్‌కు ఆయుధ విక్రయంపై ఉన్న ఆంక్షలను పదేళ్లక్రితం సడలించింది. దూరశ్రేణి క్షిపణులు, ఇతర రక్షణ పరికరాలు అందజేసింది. ఎంఐ–26 సైనిక రవాణా హెలికాప్టర్లను సమకూర్చుకోవటానికి సాయం అందజేసింది. మనకు ఆయుధాలు, ఇతర రక్షణ పరికరాలు విక్రయించినప్పుడల్లా సమతూకం పాటించే నెపంతో పాకిస్తాన్‌కు కూడా అమ్మకాలు సాగించటం రష్యా నేర్చుకుంది. చైనాతో దాని సంబంధాలు సరేసరి. ఇలా మనకు బద్ధ వ్యతిరేకమైన రెండు దేశాలతో రష్యా సంబంధాలు నెరపుతున్నప్పుడు మనం మాత్రం తమతోనే ఉండాలని అటు రష్యా, ఇటు ఉక్రెయిన్ కోరుకోవటం అర్థరహితం.

రష్యా – ఉక్రెయిన్‌ల మధ్య మూడేళ్లుగా సాగుతున్న యుద్ధాన్ని ఆపటానికి ఒక తటస్థ దేశంగా భారత్ కృషి చేయాలని చాలా దేశాలు ఆశపడుతున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణను మన దేశం ఖండించలేదు. రష్యాను విమర్శిస్తూ తీసుకొచ్చిన తీర్మానాలపై వోటింగ్ సమయంలో మన దేశం గైర్హాజరైంది. అయితే యుద్ధ క్షేత్రంలో కాక చర్చలతో, దౌత్యంతో మాత్రమే ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని వివిధ అంతర్జాతీయ వేదికలపై మోదీ ఈ మూడేళ్లుగా చెబుతూ వచ్చారు. ఇరు దేశాలూ చర్చలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. సరిగ్గా నాటో 75 యేళ్ల ఉత్సవాల సందర్భంలో రష్యా పర్యటనను ఎంచుకున్నందుకు అమెరికా ఆగ్రహించింది. అయితే ఎడతెగకుండా సాగుతున్న ఈ యుద్ధానికి ముగింపు పలకడమెలా అన్నది దానికి బోధపడటం లేదు. తన మద్దతుతో, పాశ్చాత్య దేశాల సహకారంతో 3, 4 నెలల్లో రష్యాను ఉక్రెయిన్ అవలీలగా జయిస్తుందన్న భ్రమ మొదట్లో అమెరికాకు ఉంది. కానీ రోజులు గడిచేకొద్దీ అది కొడిగట్టింది. నిరుడు ఫిబ్రవరిలో శాంతి సాధన పేరుతో చైనా ఒక ప్రతిపాదన చేసింది. కానీ అందులో రష్యావైపే మొగ్గ కనబడుతోందన్న విమర్శలొచ్చాయి. పైపెచ్చు చైనా అధికారిక మీడియా మొదటి నుంచీ రష్యాను వెనకేసుకొస్తోంది. ఇలాంటి సమయంలో భారత్ దౌత్యంపై ఆశలేర్పడటం సహజం. అయితే పరస్పరం తలపడుతున్న వైరి పక్షాలు మానసికంగా చర్చలకు సిద్ధపడితే తప్ప ఎవరి ప్రయత్నాలైనా ఫలించే అవకాశాలుండవు. ముఖ్యంగా ఈ యుద్ధంలోని నిరర్థకతను రష్యాతో పాటు అమెరికా, యూరొప్ దేశాలు గుర్తించాల్సివుంది. ఆ తర్వాతే ఉక్రెయిన్ దూకుడు తగ్గుతుంది. ఆ మాటెలావున్నా మోదీ పర్యటన మన విదేశాంగ విధానానికి కొత్త బాట పరిచింది.


గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
శ్రావణ మాసం, తిథి: బ.పంచమి ప.12.58 వరకు
తదుపరి షష్ఠి, నక్షత్రం: అశ్వని రా.11.55 వరకు
తదుపరి భరణి, వర్జ్యం: రా.8.12 నుండి 9.40 వరకు,
దుర్ముహూర్తం: ఉ.5.41 నుండి 7.25 వరకు,
అమృతఘడియలు: సా.5.17 నుండి 6.47 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.19
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఎలా చూసినా కులగణనే కీలకం!

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఎన్నికల వేళ సందడి చేసిన కులగణన వాదం ఆ తర్వాత కూడా చర్చనీయాంశంగా కొనసాగుతూనే ఉంది. సుప్రీంకోర్టు దేశంలోని ఉపకులాలకు న్యాయం జరిగేలా ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్లను విభజించవచ్చని వెలువరించిన తీర్పు ఇప్పుడు ఎంతో కీలకంగా మారింది. అయితే ఈ తీర్పును అమలుపరచడానికి రాష్ట్రాలు వేటికవి తమ ప్రాంతాల్లో కులగణన చేస్తే కుదరదు. కేంద్రం మాత్రమే జనాభా లెక్కల్లో భాగంగా ఈ పని చేయాలి. లేదంటే కోర్టుల్లో కొత్త వివాదాలు తలెత్తుతాయి. అయితే రిజర్వేషన్ల వల్ల అత్యధిక ప్రయోజనం పొందుతున్న కులాలవారూ, అలాగే స్థానికంగా బలంగా ఉన్న రిజర్వేషన్ వెలుపల ఉన్న శూద్ర కులాలవారూ కులగణనను వ్యతిరేకిస్తూనే ఉన్నారు.

దేశంలోని ఉపకులాలకు న్యాయం జరిగేలా ఓబీసీ/ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్లను విభజించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. పోతే ఆ విభజన న్యాయబద్ధ ఆబ్జెక్టివ్‌గా తేల్చిన జనాభా లెక్కల ప్రకారమే చెయ్యాలని కూడా తేల్చి చెప్పింది. ఈ జడ్జిమెంట్ ప్రకారం ఇటువంటి లెక్కలు రాష్ట్రాలు కమిషన్ల ద్వారానో, లేదా స్వంత రాష్ట్రస్థాయి జనాభా గణన చేపట్టి చెయ్యలేరు. ఏ కేంద్ర ప్రభుత్వమైతే సుప్రీంకోర్టు ముందు ఉపకులాలకు న్యాయబద్ధమైన రిజర్వేషన్ పంపకం అవసరమే అని ఒప్పుకుందో... ఆ ప్రభుత్వమే కేంద్ర స్థాయిలో కులాల వారీగా జనాభా లెక్కలు తీయించే వరకు ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ జడ్జిమెంట్ అమలుకు పూనుకోలేదు. ఒకవేళ ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం సొంత రాష్ట్ర ఉపకులాల లెక్కలు తీయించి, ఏదో ఒక రిజర్వేషన్ కేటగిరీలో రిజర్వేషన్ విభజిస్తే ఆ విభజన మళ్లీ హైకోర్టులో ఉపకుల లెక్కల యాక్యురసీ (కచ్చితత్వం) కొట్టివేయబడుతుంది. చివరకు సుప్రీంకోర్టుకు పోయినా అదే సమస్య ఎదురవుతుంది.

ఇది ఎస్సీ, ఎస్టీల సమస్య మాత్రమే కాదు...

ఇప్పటికే ఉప కులాల లెక్కలు తీసిన బిహార్ రిజర్వేషన్ విభజన, పెంపుదలను ఆ రాష్ట్ర హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్ల ఉపకుల న్యాయపర విభజన కేవలం ఎస్సీలకో, ఎస్టీలకో సంబంధించింది మాత్రమే కాదు. ఓబీసీ కులాల్లో అన్ని రాష్ట్రాల్లో తమ తమ ఉపకులాల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగాలు, సీట్లు రావడం లేదని ఉద్యమాలు నడుస్తున్నాయి. ఉదాహరణకు తెలుగు రాష్ట్రాల్లో మాదిగ, మాల కులాలకో; కోయ, గోండు, చెంచు, లంబాడాల మధ్య విభజనకో సుప్రీంకోర్టు జడ్జిమెంట్ పరిమితమై లేదు. బీసీ కులాల్లో ఉన్న ఏబీసీడీ గ్రూపుల్లో చాలా ఉప కులాలున్నాయి. డీ గ్రూపులో గొల్ల–యాదవులకు... మున్నూరు కాపులకు దొరికే అవకాశాలు దొరకడం లేదనీ, బీ గ్రూపులో కురుమలకు తమ వాటా తమకు దొరకడం లేదనే తీవ్ర అసంతృప్తి ఉంది. అందుకే వాళ్ళు తమ కులాన్ని సెమీ–నొమాడిక్ కమ్యూనిటీ (అర్ధ సంచార జాతి) లోకి మార్చాలని డిమాండ్ ఉంది.

మహారాష్ట్రలో ధనగర్‌లు (గొర్రెల కాపర్లు) చాలా ఉద్యమాలు నడిపి తమ కులానికి మొత్తం ఓబీసీ రిజర్వేషన్‌లో 3 శాతం వాటా సంపాదించుకున్నారు. అక్కడి మరాఠాలు తమకూ రిజర్వేషన్లు కావాలని చాలా కాలంగా పోరాడుతున్నారు. కోర్టులు అందుకు అంగీకరించనందున తమకు కుంబీ కులసర్టిఫికెట్లు ఇచ్చి రిజర్వేషన్లోకి చొప్పించండి అని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నారు. గుజరాత్‌లో పటేళ్లు (పాటీదార్లు) తమకూ రిజర్వేషన్లు కావాలని చాలా కాలంగా ఉద్యమాలు చేస్తున్నారు. ఉపకుల రిజర్వేషన్ జడ్జిమెంట్ ద్వారా ఈ అన్ని రకాల డిమాండ్లకు పరిష్కారం వెతకాల్సి ఉంటుంది.

2024 ఎన్నికల్లో ఓట్ల కోసం చాలా రాష్ట్రాల్లో బీజేపీ ఉపకులాలకు



'మీ వాటా మీకు ఇప్పిస్తామని' వాగ్దానం చేసింది. ప్రధానమంత్రి స్వయంగా ఆ మీటింగులో పాల్గొన్నారు. కానీ జాతీయ స్థాయిలో కుల గణన చేయించడాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నారు. అయితే సుప్రీంకోర్టు జడ్జిమెంట్... 1931 నాటి జనాభా లెక్కల్లో చేసినట్లు కులగణనను జనాభా లెక్కల్లో భాగంగా చెయ్యాల్సిన అవసరాన్ని కేంద్రం ముందు పెట్టింది. ఇక తప్పించుకోవడం సాధ్యం కాదు.

కాంగ్రెస్ వెనక్కి తగ్గింది!

కాంగ్రెస్ పార్టీ 2011 జనాభా లెక్కల్లో భాగంగా కులగణన ఒక ప్రత్యేక కుల లెక్కల షెడ్యూల్‌ను తయారుచేసి లెక్కలు తీయించారు. కానీ శుద్రాతీత అగ్రకులాల్లో (బ్రాహ్మణ, బనియా, క్షత్రియ, కాయస్థ, ఖత్రి కులాల వారి నుండి) వ్యతిరేకత రావడం వల్ల ఆ లెక్కలు బయట పెట్టకుండా ఆపేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో మేధావి వర్గమంతా ఈ ఐదు కులాల వారే! 2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీ కులజనాభా లెక్కలు కావాలని కాంగ్రెస్ ఓట్ల శాతం పెంచే ప్రయత్నం చేశారు. కానీ రిజర్వేషన్ బయట ఉన్న కులాల నుండి అన్ని పార్టీల్లో వ్యతిరేకత వస్తోంది. ఈ కారణం వల్లనే కర్ణాటకలో కులాల లెక్కలు తీసి కూడా బయట పెట్టకుండా ఆపేశారు. కారణం బ్రాహ్మణ, బనియా, లింగాయత్, వక్కళిగ కులాల నుండి తీవ్రమైన వ్యతిరేకత వస్తుంది కనుక. వీటన్నిటికి మూలమేమంటే చాలా చిన్న శూద్రేతర కులాలు చాలా పెద్ద మొత్తంగా ఉద్యోగాలు, ప్రభుత్వరంగ ఐఐటీ, ఐఐఎమ్‌లు, మెడికల్ కాలేజీల్లో సీట్లు పొందుతున్నాయి. వీరి కులాల సంఖ్య జనాభా లెక్కల ద్వారా బయటికి వస్తే వారు దేశాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొని నడుపడానికి వ్యతిరేకంగా చాలా పెద్ద తిరుగుబాటు వస్తుంది.

మొత్తం మీద శూద్రుల వాటా తక్కువే!

రెండు తెలుగు రాష్ట్రాల్లో రెడ్లు, కమ్మలు, వెలమలకు కూడా అర్థం కాని అంశమేమంటే... ఢిల్లీ అధికారంలోగానీ, బ్యూరాక్రసీలోగానీ; గవర్నర్లు, అంబాసిడర్ల వంటి పదవుల్లో కానీ వీరి వాటా చాలా తక్కువ అనేది. రిజర్వేషన్ బయట ఉన్న మొత్తం శూద్ర అగ్ర కులాలకు వారి జనాభా లెక్కల ప్రకారం చూస్తే కేంద్ర అధికారంలో కానీ, మోనోపలీ క్యాపిటల్‌లో కానీ అతి కొద్దిపాటి వాటా మాత్రమే ఉన్నది. కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్‌లో కాని, ప్రధానమంత్రి సెక్రటేరియట్‌లో కాని వారు ఎవ్వరూ కనబడరు. వారు కేవలం రాష్ట్ర అధికారం కోసమే ఆరాటపడుతున్నారు. కానీ కేంద్రంలో మొత్తం శూద్రుల వాటా చాలా చిన్నదిగా ఉంది. కుల గణన... రెడ్డి, కమ్మ, వెలమ వంటి కులాలు జాతీయ స్థాయిలో వాటా పొందడానికి పనికొస్తుంది. ఇదే పరిస్థితి కర్ణాటకలోని లింగాయత్, వక్కళిగ కులస్థులది కూడా! వాళ్ళు రాష్ట్ర రిజర్వేషన్ సిస్టమ్‌లో భాగస్వాములే కానీ కులలెక్కలను వ్యతిరేకిస్తున్నారు. కేరళలో నాయనార్లు కుల లెక్కలే కాదు రిజర్వేషన్లను కూడా వ్యతిరేకిస్తున్నారు. వాళ్ళు తాము శూద్రులం కాదు క్షత్రియులమని చెప్పుకుంటున్నారు. ఇది కేవలం ఆ చిన్న రాష్ట్రంపై పెత్తనం చలాయించడానికి పనికొస్తుంది. కానీ కేంద్రంలో నాయనార్లకు కూడా వాటా లేదు. ప్రతి రాష్ట్రంలో ఉన్న శూద్ర పై కులాలు కులగణనను ఎందుకు స్వాగతించాలో ఆలోచించడం లేదు.

1931లో బ్రిటిష్ ప్రభుత్వం కులాల లెక్కలు తీసి ఉండకపోతే దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఉన్న బ్రాహ్మణులు తామే దేశంలో అత్యధికులం అని నమ్మించేవారు. అంతకుముందు బ్రిటిష్ ప్రభుత్వాన్ని వాళ్ళు అలానే నమ్మించారు. దేశం మొత్తం మీద బ్రిటిష్ పాలక వ్యవస్థ (అడ్మినిస్ట్రేషన్)లో వాళ్ళే ఉండేవారు. జనాభా రీత్యా కూడా 'మేమే అన్ని కులాల కంటే ఎక్కువ సంఖ్యలో ఉన్నామ'ని నమ్మించేవారు. ఆచరణలో కులం ఉన్నప్పుడు ఆ కులం సంఖ్య ఎంత ఉందో తెలిస్తే తప్ప కులాల అభివృద్ధి, దేశం అభివృద్ధి జరిగే ప్రణాళికలు తయారు చెయ్యడం సాధ్యం కాదు.

తక్కువ సంఖ్యలో ఉండి ఎక్కువ ఉద్యోగాలు, విద్యారంగంలో సీట్లు సంపాదించే కులాలు, కులం లెక్కలు తియ్యొద్దని తప్పకుండా వాదిస్తాయి. ఈ ఆలోచనా ధోరణి నుండే రిజర్వేషన్లలో 50 శాతానికి మించి ఉండకూడదని వాదించాయి. సుప్రీంకోర్టులో తమకు అనుకూల జడ్జిమెంటును సంపాదించాయి. దానికి మెరిట్ అనే ఒక వాదనను ముందు పెట్టాయి. అసలు కులాన్ని ఈ దేశానికి బ్రిటిష్ వలసవాదులు తెచ్చారని వాదించాయి. ఉత్పత్తి కులాలు ముఖ్యంగా శూద్రులు ఢిల్లీలో పాలకులైతే తమ చరిత్ర తలకిందులవుతుందని భావించాయి. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉపకులాల వాటా జడ్జిమెంట్ చరిత్ర మలుపును మరో మెట్టు ఎక్కించేదనే అంశంలో సందేహం లేదు. ఇప్పుడు అన్ని శూద్ర కులాలు, దళితులు, ఆదివాసులు ఐక్యంగా కుల జనాభా లెక్కలు చెయ్యాలని పోరాడటమే వారి భవిష్యత్తుకు మార్గం.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

అదుపు లేని పోలీస్ ప్రతాపం!

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

కొత్త నేరచట్టాలు పోలీసులకు ఇచ్చిన విచ్చలవిడి అధికారాల వల్ల చోటుచేసుకుంటున్న దారుణాలు ఇప్పుడిప్పుడే ఒక్కటొక్కటిగా బయటపడుతున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఒక సంఘటన దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. కేవలం అనుమానంతోనే హైదరాబాద్ షాద్ నగర్‌లో ఒక మహిళను దారుణంగా కొట్టి, కాళ్లు విరగ్గొట్టారు పోలీసులు. అంబేడ్కర్ కాలనీకి చెందిన సునీత, భీమయ్య దంపతులను పోలీసులు ఓ దొంగతనం ఆరోపణలపై అదుపులోకి తీసుకున్నారు.

ఇక్కడ 'అదుపు' అంటే ఏమిటో తెలుసుకోవాలి. పోలీసులు చెప్పాపెట్టకుండా ఎవరినైనా సరే పోలీసుస్టేషన్‌లో లాకప్‌లో పడేయడం లేదా పోలీసు ఆఫీసర్ ఎదురుగానో, పక్కనో నిలబెట్టి ఉంచడాన్ని 'అదుపు' అంటారు. నిజానికి ఇది అరెస్టు చేయడమే! కానీ ఆ మాట చెప్పరు. మీడియా రోజూ ఇదే మాట మాట్లాడుతూంటుంది. ప్రతి అదుపులోనూ ఏదో ఒక దారుణం చోటుచేసుకుంటుంది.

ప్రపంచంలో ఎక్కడా లేదు ఈ 'అదుపు'. అరెస్ట్ చేసిన తర్వాత నిందితుణ్ణి 24 గంటల్లో కోర్ట్ ముందు హాజరు చేయాలి. కానీ చాలా కేసుల్లో అది జరగదు. అదుపులోకి తీసుకున్నవారికి పోలీస్ ట్రీట్‌మెంట్ అత్యంత పాశవికంగా ఉంటుంది. చివరకు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తారు. అప్పటివరకు ఆ నిందితుడిపై జరిగిన పోలీసు దౌర్జన్యం జడ్జి ఏ విధంగా తెలుసుకుంటారు? ప్రభుత్వ న్యాయవాదులు వారి డ్యూటీ ప్రకారం పోలీసుల తరపుననే మాట్లాడాలి. నిందితులు తప్పు చేయకపోయినా సొంతంగా లాయర్లను పెట్టుకోవాల్సిందే. లేకపోతే పోలీస్ కస్టడీకి న్యాయమూర్తి ఉత్తర్వు ఇస్తారు. అంటే ఇంకా ఏ వారమో, నెలో, అంతకుమించిన కాలం వరకో పోలీసులు నిందితుణ్ణి తమ కస్టడీలో ఉంచుకుని తమకు రావలసిన సమాచారం కోసం తమదైన పద్ధతిలో చికిత్స చేయడానికి మరి కొంత సమయం ఇస్తారన్నమాట.

ఈ 'అదుపు నుంచి చికిత్స' దాకా భారత రాజ్యాంగం నిందితుల గురించి ఏమీ చేయదు. 24 గంటల కన్నా మించిన సమయం 'అదుపు'లోకి తీసుకోవడం అంటే... 15 రోజులు, 40 రోజులు, 60

ఇవీ మన కొత్త చట్టాలు-5



రోజులు, 90 రోజుల వరకూ పెరుగుతూ పోతుంది ఆ కాలం. ఆ తరువాత కోర్టుకు పోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు సహాయం చేయకపోతే బతుకో, చావో చెప్పలేం! అటువంటి వాస్తవ సంఘటనే ఇది.

పక్కింట్లో నివాసముంటున్న నాగేందర్ అనే వ్యక్తి ఈ భార్యాభర్తలపై జూలై 24న తమ ఇంట్లో బంగారం దొంగతనం జరిగిందని షాద్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడట. పోలీసులు సునీత, భీమయ్య దంపతులను అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్ఐఆర్ ఎప్పుడు చేశారు? అదుపు గురించి ఎక్కడైనా రికార్డుల్లో ఉందా? సమాచార చట్టం 2005 కింద అడిగితే జవాబు ఇస్తారా? ఏమో! ఓసారి కొట్టారు. ఆ తర్వాత భర్త భీమయ్యను వదిలేశారు. కానీ మళ్లీ అనుమానంతో పట్టుకొచ్చారు పోలీస్ స్టేషన్‌కు. అలాగే 13 ఏళ్ల వాళ్ల కుమారుణ్ణి కూడా స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆ పిల్లవాడి కళ్లముందే తల్లి అయిన సునీతను చిత్రహింసలకు గురి చేశారు. ఆ పసివాని హృదయం ఎంతగా క్షోభించిందో కదా! ఒక మహిళ అని కూడా చూడకుండా ఆమె బట్టలు విప్పేశారు. చీరవిప్పి నిక్కర్ తొడిగి రబ్బర్ బెల్టుతో, బూటు కాళ్లతో విచక్షణారహితంగా కొట్టారు. ఇదంతా కేవలం ఆమె నేరం చేసిందేమోననే అనుమానంతోనే! దొంగతనం ఒప్పుకోక పోవడంతో కుమారుడిని కూడా అరికాళ్ళపై రబ్బర్ బెల్ట్‌తో కొట్టినట్లు బాధితులు ఆరోపించారు. పోలీసులు కొట్టిన దెబ్బలకు తాళలేక స్పృహ తప్పి పడిపోయిన సునీతను ఇంటికి పంపించారు పోలీసులు. బయటికి వచ్చిన ఆమె తనపై జరిగిన హింసను బయటపెట్టింది. మనసున్న కొందరు ఆమె కేసును జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు పెట్టారు.

పోలీసులకు ఎక్కడ ఉందీ అధికారం? భారత రాజ్యాంగంలో ఎక్కడన్నా ఉందా? పోనీ కొత్త నేర చట్టాలలో ఉందా? కొత్త చట్టాలే కాదు, పాత క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో కూడా లేదు. కొత్త చట్టాల్లో అనుమానంతో నిర్బంధించే అధికారం ఉందని పేర్కొన్నందున పోలీసులు ఇంతటి దురాగతాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం తెలంగాణలో చోటుచేసుకున్న ఈ నేరానికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా? లేక కొత్త నేర చట్టాలను తెచ్చిన బీజేపీ బాధ్యత వహిస్తుందా? దళితులను చిత్రహింసలకు గురిచేసిన వారిపై ఏం కేసులు పెట్టారు? సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వం, దాని పోలీసులు విఫలమైనప్పుడు, లేదా తప్పు చేశారని భావించినప్పుడు సీబీఐ రంగంలోకి దిగాలని భావిస్తారు. చాలా సందర్భాల్లో అదే జరుగుతుంది. అయితే ప్రతిదానికి సీబీఐ విచారణ చేయాలంటే ఇక ఈ పోలీసు డిపార్ట్‌మెంట్ ఎందుకు?

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

ఎన్నికలు సరే... తర్వాతేంటి?

అభిప్రాయం



రాధా కుమార్

జమ్మూ–కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు ఈసీ ఎట్టకేలకు తేదీలను ప్రకటించింది. పది సుదీర్ఘ సంవత్సరాల తర్వాత, మునుపటి రాష్ట్ర ప్రజలు ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటారు. ఈ ఒక్క వాస్తవం మాత్రమే రాష్ట్ర ప్రజలు సంబరాలు జరుపుకోవడానికి కారణం కావాలి.

కానీ ఇక్కడ ఒక సంకట పరిస్థితి ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పోలీసు, పౌర ఉద్యోగుల నియామకం– బదిలీలు; ప్రాసిక్యూషన్‌కు అనుమతి, ఆర్థిక విషయాలతో సహా కీలక అధికారాలను లెఫ్టినెంట్ గవర్నర్‌కి దఖలు పరచినందువల్ల ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి పరిమిత అధికారం మాత్రమే ఉంటుంది. జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 55 ప్రకారం కొత్త నిబంధనల మేరకు లెఫ్టినెంట్ గవర్నర్ నిర్ణయాలను మంత్రి మండలి సమీక్షించరాదు. పైగా ఆయన ప్రతినిధి అన్ని కేబినెట్ సమావేశాలకు హాజరవుతారు. మంత్రుల షెడ్యూలు లేదా సమావేశాల ఎజెండాలను కూడా కనీసం రెండు రోజుల ముందుగా ఆయన కార్యాలయానికి సమర్పించాలి. మరో మాటలో చెప్పాలంటే... ఢిల్లీ ప్రజల మాదిరిగానే జమ్మూ–కశ్మీర్ ప్రజలు కూడా నూతన ప్రభుత్వం కోసం ఓటు వేసే హక్కును కలిగి ఉంటారు. కానీ వారు ఎన్నుకున్న ప్రభుత్వం వారిని పూర్తిగా పాలించలేదు.

కొత్త నిబంధనల ప్రకారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు దఖలుపడిన అధికారాలను సునిశితంగా ప్రశ్నిస్తున్నారు. ఈ అధికారాలు రాజ్యాంగబద్ధంగా చెల్లుబాటవుతాయా అని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ విషయానికొస్తే, ఉన్నతాధికారవర్గం లెఫ్టినెంట్ గవర్నర్‌కి కాకుండా ఎన్నికైన ప్రభుత్వానికి బాధ్యత వహిస్తుందని గత ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ నియమం రాష్ట్ర హోదాలోని కొన్ని అంశాలను పొందిన కేంద్ర పాలిత ప్రాంతానికి వర్తింపజేస్తే, అది జమ్మూ–కశ్మీర్‌కు కూడా వర్తిస్తుంది. పునర్వ్యవస్థీకరణకు గురై కేంద్రపాలిత ప్రాంతంగా తగ్గించబడే వరకు జమ్మూ–కశ్మీర్ ఎన్నికైన ప్రభుత్వం కింద పూర్తి రాష్ట్రంగా ఉండేది. సొలిసిటర్ జనరల్ తుషార్



మెహతా పేర్కొన్నట్లుగా, పూర్తి రాష్ట్ర హోదా కోసం తాత్కాలిక చర్య అయినప్పటికీ, ఢిల్లీ తరహా ఫార్ములా పూర్వ రాష్ట్రానికి వర్తించవచ్చా?

ఈ ప్రశ్న ఇంకా న్యాయస్థానం ముందుకు రావలసి ఉంది. ఈలోగా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా తాను ఎన్నికైన ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. జమ్మూ–కశ్మీర్‌లో ఘర్షణకు దారితీసే మూలాలుగా... అక్కడి ప్రజలకు దూరమైపోయిన భద్రతా వ్యూహకర్తలు, మానవ హక్కులు, చట్టాన్ని దుర్వినియోగపర్చడం (జమ్మూ కశ్మీర్ హైకోర్టు కూడా ఈ అంశాన్ని ఇటీవలే ఎత్తి చూపింది), వివాదాస్పద భూసేకరణ, ఆర్థిక అభివృద్ధి విధానాలు, మీడియా స్వతంత్రత వంటి కొన్నింటిని పేర్కొనవచ్చు. 2025 ఆగస్టులో పదవీకాలం ముగియనున్న ఎల్జీ సిన్హా లేదా ఆయన వారసుడు ఈ సమస్యలపై ఎన్నికైన ప్రభుత్వంతో ఎలా వ్యవహరిస్తారో చూడాలి.

ఈసీ అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించడానికి ఒక రోజు ముందు, సిన్హా పాలనా యంత్రాంగం దాదాపు 200 మంది సివిల్ అధికారులను, పోలీసులను బదిలీ చేసింది. ఎన్నికలకు వెళుతున్న రాష్ట్రాలు తమ సొంత జిల్లాలకు చెందని అధికారులను నియమించాలన్న ఈసీ ఆదేశాలకు ప్రతిస్పందనగా ఈ బదిలీలు జరుగుతున్నాయి. అయితే ఈ కొత్త నియామకాలను పరిశీలించాలని ఒమర్ అబ్దుల్లా ఎన్నికల కమిషన్‌ని అభ్యర్థించారు. ఈ ఎన్నికలను, తదనంతర పరిణామాలను దేశ విదేశాల్లోని శ్రేయోభిలాషులు, వ్యతిరేకులు కూడా నిశితంగా గమనిస్తారు.

ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్–అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ ఎంత చెడ్డగా పరిణమించిందో, ఎన్నికైన జమ్మూ–కశ్మీర్ ప్రభుత్వానికీ, లెఫ్టినెంట్ గవర్నర్‌కీ మధ్య ఏదైనా ఘర్షణ తలెత్తితే అది మరింత ఘోరంగా తయారవుతుంది. ఎందుకంటే కశ్మీర్‌కు అంతర్జాతీయంగా ఒక గుర్తింపు ఉంది కనుక. ఇది పాకిస్తాన్‌లో కాచుక్కూర్చుని ఉన్న భారత్ వ్యతిరేకులు ప్రయోజనాన్ని పొందే అవకాశాన్ని కూడా అందించవచ్చు. చివరిగా ఒక్క మాట. లద్దాఖ్ ఇప్పుడు ప్రత్యేక కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్నందున ఎన్నికలకు వెళ్లడం లేదు. కానీ అక్కడ కూడా హిల్ కౌన్సిల్ కార్యనిర్వాహక అధికారాలను పునరుద్ధరించడం ద్వారా ఎన్నికయ్యే ప్రభుత్వం కోసం పౌర సమాజ బృందాలు తమ ఆకాంక్షను వ్యక్తం చేశాయి. ఆ కోరిక ప్రజాస్వామ్యయుతం, భద్రతాపరమైన అవసరం.

వ్యాసకర్త తాజాగా వెలువడిన 'ది రిపబ్లిక్ రీలెర్న్‌ట్: రెన్యూయింగ్ ఇండియన్ డెమోక్రసీ 1947–2024' రచయిత

త్యజిస్తే ఇక ఆనందమే!

జ్యోతిర్మయం

ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక రూపంలో అహంకారం ఉంటుంది. దాన్ని త్యజించగలిగినవారు ఆనందాన్ని సొంతం చేసుకుంటారు. ఇందుకు మన ప్రాచీనులు అనేక ఉదంతాలు చెప్పారు. ఇందులో వేదాంతమూ ద్యోతకమవుతుంది.

పూర్వం ఓ భక్తుడు మాటి మాటికీ 'నేను నేను' అని తన గురించి తాను అతిగా చెప్పుకునేవాడు. అది గమనించిన ఓ ప్రవచనకారుడు 'తరచూ నువ్వు నేను, నేను అని చెబుతుంటావు కదా, ఆ నేనుకు నిర్వచనం చెప్పగలవా? శిశువుగా ఉండేవాడివి కదా, అది నువ్వేనా? చిన్నపిల్లాడిగా ఉండేవాడివి అది నువ్వేనా? అనంతరం యువకుడిగా ఎదిగావు కదా అది కూడా నువ్వేనా? తర్వాత వృద్ధుడిగా మారావు, అదీ నువ్వేనా... వీటిలో ఏ నువ్వు నువ్వేనని చెప్పగలవు' అని ప్రశ్నించారు. దీంతో ఆ భక్తుడు తనలోని అహాన్ని గ్రహించి త్యజించాడు.

అలాగే ఓ రాజ్యాన్ని పాలించే రాజు నిరాడంబరంగా బతకాలని, అహంకారాన్ని వీడాలని భావించి రాజభవనాన్ని వదిలి, చిన్న గుడిసెలో సాధారణ జీవితం గడపసాగాడు. ఎవరూ తనకు నమస్కరించకూడదని ఆదేశాలు జారీ చేశాడు. కొంత కాలమైన తర్వాత 'ఆహా! నాలాగా నిరాడంబరంగా బతుకుతున్న వారు ఇంకెవరూ లేర'నుకున్నాడు. అలా అనుకోవడమూ ఓ అహంకారమని తెలీక ఒక జ్ఞానితో ఈ విషయాన్ని చర్చించాడు. అందుకు జ్ఞాని 'ఇదిగో చూడు ప్రభూ! మీరు రాజులా బతకండి. రాజులా వస్త్రధారణ చేసుకోండి. రాచమర్యాదలు అందుకోండి. కానీ మీ మనసులో నిరాడంబరంగా ఉండండి' అన్నాడు. ఆ తర్వాతే రాజుకు నిరాడంబరమంటే ఏమిటో బోధపడింది.

ఒక గురువుండేవాడు. ఆయన ఒకరోజు కొత్త ప్రదేశానికి వెళ్లాడు. ఆ ఊరి ప్రజలందరూ గుమికూడారు. ఆయనకు సన్మానం చేయాలనుకున్నారు. అందుకాయన అంగీకరించాడు. అయితే ఆ గురువు ఆ తర్వాత తన గదిలోకి వెళ్ళి తలుపులు వేసేసుకున్నాడు. ఆ గదిలోనే అటూ ఇటూ నడిచాడు. ఏవేవో అనుకున్నాడు. వాటిలో ఒకటి రెండు మాటలు గది బయట ఉన్న వారికి వినిపించాయి. ఆ మాటలకు అర్థమేమిటని అడిగారు. 'అదా! మరేమీ కాదు... మీరందరూ సభలో నన్ను ఇంద్రుడూ, చంద్రుడూ అని పొగుడుతూ మాట్లాడతారు. ఆ మాటలు వింటుంటే నాలో అహంకారం పెరిగిపోతుంది. అందుకని నేనే ఆ మాటలను పదే పదే చెప్పుకుంటున్నాను. ఇప్పుడా మాటలు నాకు పాతబడిపోయాయి. కనుక నన్నిప్పుడు ఎంత పొగిడినా నాకు అహంకారం రాదు, అన్నాడు గది లోపలి నుంచి!

– యామిజాల జగదీశ్

జూరాల 10 గేట్లు ఎత్తివేత


జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద మొదలైంది. గురువారం సాయంత్రం 55 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా..శుక్రవారం రాత్రి 9 గంటల సమయానికి 89 వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ఉదయం 20 గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేయగా...సాయంత్రం నాలుగు గేట్లను, రాత్రి మరో ఆరు గేట్లు మూసివేసి ప్రాజెక్టు 10 క్రస్టు గేట్ల ద్వారా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ, దిగువ జన్‌కోజల విద్యుత్ కేంద్రంలో 11 యూనిట్లలో విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు.

దిగువకు 81,912 క్యూసెక్కుల నీరు

క్రస్టు గేట్ల ద్వారా 41,400 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి కోసం 37,237 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 95, నెట్టెంపాడుకు 1,500 , కుడి కాల్వకు 500, ఎడమ కాల్వకు 550, కోయిల్‌సాగర్‌కు 630, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 100, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు..ఇలా మొత్తం ప్రాజెక్టు నుంచి 81,912 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

సాగర్‌కు 69,132 క్యూసెక్కుల నీరు

జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.132 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా...ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు 30,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... 6వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల, సుంకేశుల, హంద్రీ నుంచి 1,14,689 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... ఎడమ, కుడి భూగర్భ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 69,132 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రైతు రుణమాఫీకి కొత్త యాప్

- కుటుంబ నిర్ధారణ జరగని రైతుల ఇళ్లకు వెళ్లి ఫిర్యాదుల స్వీకరణ
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: రెండు లక్షల రూపాయలలోపు రుణమాఫీకి సంబంధించి కుటుంబ నిర్ధారణ జరగని 4,24,873 మంది ఖాతాదారుల సమాచారాన్ని సేకరించేందుకు వీలుగా ఒక కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దాని ద్వారా మాఫీ జరగని రైతుల వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈ అంశంపై శుక్రవారం ఆయన రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ అధికారులతో సమీక్షించారు. వ్యవసాయాధికారులు స్వయంగా రైతుల ఇళ్లకు వెళ్లి, అలాగే రైతువేదికలు, కార్యాలయాలలో ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆధార్ వివరాలు తప్పుగా నమోదైన 1,24,545 ఖాతాలలో ఇప్పటికే 41,322 ఖాతాలను సరిచేశామన్నారు. వివిధ బ్యాంకుల్లో ఉన్న ఆయా ఖాతాదారుల అకౌంట్లలో ప్రభుత్వం ద్వారా జమ చేసిన మొత్తాలను రైతులకు అందేటట్లు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. రెన్యువల్ అయిన ఖాతాలకు సొమ్మును తిరిగి చెల్లించే విధంగా, మాఫీ అయిన ఖాతాలకు సంబంధించి తిరిగి కొత్త రుణాలను వెంటనే మంజూరు చేసే విధంగా బ్యాంకు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీలోపు జమ చేసిన రూ.18 వేల కోట్లలో రూ.10,400 కోట్లను రైతులకు కొత్త రుణాల రూపంలో లేదా నగదు రూపంలో బ్యాంకులు తిరిగి రైతులకు చెల్లించాయన్నారు. మిగిలిన ఖాతాదారులకు కూడా కొత్త రుణాలను వెంటనే మంజూరు చేయాల్సిందిగా సొసైటీలకు, బ్యాంకు ప్రతినిధులకు సూచించారు. రూ. 2 లక్షలకుపైగా రుణం ఉన్న ఖాతాదారులకు సంబంధించి త్వరలోనే దశల వారీగా మాఫీని వర్తింపచేస్తామన్నారు. అలాగే సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులు తమకు దగ్గరలోని వ్యవసాయాధికారిని సంప్రదించాలని లేదా అధికారులే ఇంటికి వచ్చినప్పుడు వివరాలు ఇవ్వాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

జూడాల సమ్మె విరమణ

సాక్షి, హైదరాబాద్: జూనియర్ వైద్యుల (జూడా) అసోసియేషన్ సమ్మె విరమించింది. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం ఘటన నేపథ్యంలో జూడాలు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. తమ డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందున సమ్మె విరమిస్తున్నట్లు జూడాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకనుంచి ఔట్‌పేషంట్, వార్డు విధులు, అత్యవసరం సహా అన్ని సేవలు అంతరాయం లేకుండా పనిచేస్తాయని ఆయన ప్రకటించారు. తమకు ఏదైనా అన్యాయం జరిగితే మరో మారు సమ్మెకు సిద్ధమని స్పష్టం చేశారు.

స్వార్జిత ఆస్తిపై తల్లికే హక్కులు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలు హక్కులు కోరలేరని, ఆమెకు నచ్చిన వారికి ఇవ్వొచ్చునని హైకోర్టు స్పష్టం చేసింది. ఒక హిందూ మహిళకు స్వీయ ఆర్జిత ఆస్తిని కలిగి ఉండే హక్కు ఉందని సెక్షన్ 14(1) చెబుతోందని వ్యాఖ్యానించింది. సివిల్ కేసుల్లో స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పుడే దావా వేయాలి తప్ప.. ఊహాజనితాలతో కాదని నొక్కిచెప్పింది. వారసత్వంగా వస్తున్న ఆస్తిలో ముగ్గురు పిల్లల్లో ఒకరైన తనకు మూడో వంతు తల్లి ఇవ్వకపోవడం చెల్లదంటూ సిటీ సివిల్ కోర్టులో హైదరాబాద్‌కు చెందిన బజీరంగ్‌లాల్ సూట్ దాఖలు చేశారు. ఈ సూట్‌పై విచారణ చేపట్టిన జడ్జి.. సివిల్ ప్రొసీజర్ కోడ్ 1908లోని ఆర్డర్ VII రూల్ 11 కింద తల్లి, సోదరుల దరఖాస్తును అనుమతించారు. విభజన కోసం వేసిన దావాలో అన్ని ఉమ్మడి కుటుంబ ఆస్తులను తప్పనిసరిగా చేర్చాలని పేర్కొన్నారు. తల్లి పేరిట ఉన్న స్థిర, చర ఆస్తులను చేర్చడంలో పిటిషనర్ విఫలమయ్యారని చెబుతూ బజీరంగ్‌లాల్ సూట్‌ను కొట్టివేశారు. అయితే సిటీ సివిల్ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో బజీరంగ్‌లాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ ఉత్తర్వులను కొట్టివేస్తూ ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మౌసమి భట్టాచార్య, జస్టిస్ జి.ప్రియదర్శిని విచారణ చేపట్టారు. వాదనలు విన్న ధర్మాసనం .. ఆ అప్పీల్‌ను కొట్టివేస్తూ తీర్పు నిచ్చింది.

'ఆర్వోఆర్'పై ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ

సాక్షి, హైదరాబాద్: రికార్డ్ ఆఫ్ రైట్స్-2024 ముసాయిదా చట్టంపై ప్రజాభిప్రాయ సేకరణ ముగిసింది. ఈనెల 2న ఈ చట్ట ముసాయిదాను ప్రజాబాహుళ్యంలోకి అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు, రైతులు, మేధావుల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు 20 రోజుల గడువు ఇచ్చింది. ఈ గడువు శుక్రవారంతో ముగియగా, ఆరు వందలకు పైగా మెయిల్స్ రూపంలో సూచనలు, సలహాలు వచ్చినట్టు రెవెన్యూ వర్గాల ద్వారా తెలిసింది. వీటితోపాటు వీఆర్వోలు, గ్రీవెన్స్, భూముల సమస్యలకు సంబంధించిన అంశాలపై ఫీడ్‌బ్యాక్ వచ్చినట్టు సమాచారం. ప్రజాభిప్రాయంతోపాటు రెవెన్యూ నిపుణులు, మాజీ అధికారులు కూడా తమ అభిప్రాయాలను సీసీఎల్ఏ కార్యాలయానికి, ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ సభ్యులకు పంపారు. కొన్ని జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో జరిగిన సదస్సుల్లోనూ అభిప్రాయాలు వచ్చాయి. ఈనెల 23, 24 తేదీల్లో అన్ని జిల్లాల్లో కలెక్టర్లు ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తారు. అక్కడ వచ్చిన అభిప్రాయాలను కూడా ప్రభుత్వానికి పంపుతారు. ఈ ముసాయిదా చట్టంపై ప్రభుత్వం అఖిలపక్షం నిర్వహించే ఆలోచనలో ఉంది. ఇప్పటికే ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ కోదండరెడ్డి నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరగ్గా, ప్రభుత్వం వైపు నుంచి కూడా అధికారికంగా అఖిలపక్షం నిర్వహించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, ఈ అభిప్రాయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటామని, సూచనలను పరిశీలించి అవసరమైన మార్పులను ముసాయిదా చట్టంలో చేస్తామని భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) వర్గాలు చెబుతున్నాయి. శుక్రవారం గాంధీభవన్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోకెల్ల ఆదర్శవంతమైన ఆర్వోఆర్ చట్టాన్ని తెస్తామన్నారు. ప్రజల నుంచి వచ్చిన అన్ని సూచనలు, సలహాలు స్వీకరిస్తామని చెప్పిన పొంగులేటి వచ్చే వారంలోపు ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

కాపురాల్లో మద్యం చిచ్చు

రాష్ట్రంలో ఏటేటా పెరిగిపోతున్న గృహ హింస కేసులు

- అనుమానపు పెనుభూతంతోనూ పెరుగుతున్న కేసులు
- 2023లో మొత్తం 9,447 కేసులు నమోదు.. ఈ ఏడాది ఇప్పటికే 5,474కు చేరిన సంఖ్య
- సీడీఈడబ్ల్యూ కౌన్సెలింగ్ సెంటర్ల సహకారంతో తిరిగి కలుస్తున్న జంటలు

40% పెళ్లయిన ఐదేళ్లలోపే కలహాలతో పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కుతున్న జంటలు

వీటిలో **63%** వరకు 'మద్యమే' కారణం

సాక్షి, హైదరాబాద్

పచ్చని కాపురాల్లో మద్యం చిచ్చుపెడుతోంది. 'మద్యం మత్తు' కారణంగా కుటుంబ కలహాలు పెరిగిపోతున్నాయి. గృహ హింసకు దారితీస్తున్నాయి. పోలీసు కేసులు, కోర్టు మెట్లెక్కే వరకు వెళ్తున్నాయి. గత కొన్నేళ్లుగా నమోదవుతున్న కేసులకు కారణాలను పరిశీలిస్తే.. మద్యం అలవాటు తీవ్రత స్పష్టమవుతోంది. ఇక మరికొందరు తమ జీవిత భాగస్వామి ప్రవర్తనపై అనుమానం పెంచుకుంటున్నారు. దీనితో మనస్పర్థలు ఏర్పడి సంసారం గందరగోళంలో పడిపోతోంది. అయితే గృహ హింస కేసులలో బాధితులకు బాసటగా నిలిచేందుకు తెలంగాణ పోలీస్ మహిళా భద్రత విభాగం అందుబాటులోకి తెచ్చిన 'సీడీఈడబ్ల్యూ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ విమెన్)' ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు ఈ సమస్యను కొంత దారిలోకి తెస్తున్నాయి. 2023 ఫిబ్రవరి నుంచి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో అందుబాటులోకి తెచ్చిన 27 సీడీఈడబ్ల్యూ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లలో ఇప్పటివరకు 34,090 కౌన్సెలింగ్ సెషన్లు నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు హాజరైన 40 శాతం జంటలను తిరిగి కలిపారు.

గృహహింస చట్టం కింద రాష్ట్రవ్యాప్తంగా నమోదైన కేసులివీ..

ఏడాది	నమోదైన కేసులు	ట్రయల్ పెండింగ్
2020	10,195	6,841
2021	8,146	4,816
2022	7,407	5,697
2023	9,447	5,962
2024	(జూలై వరకు)	5,4742,414

మూడు నుంచి నాలుగు సిట్టింగ్‌లు

గృహ హింసకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులను పోలీసు అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలోని సీడీఈడబ్ల్యూ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లకు అటాచ్ చేస్తున్నారు. ఈ సెంటర్లలోని ఫ్యామిలీ కౌన్సెలింగ్ సిబ్బంది.. జంటలతో మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, కలహాలకు ప్రధాన కారణాలను తెలుసుకుంటారు. భార్య, భర్త ఇద్దరినీ కలిపి, విడివిడిగా మాట్లాడటంతోపాటు అవసరం మేరకు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతారు. ఇలా మూడు, నాలుగు సార్లు కౌన్సెలింగ్ సెషన్లు నిర్వహిస్తారు. భార్యాభర్తలకు కలిపి, అవసరమైతే కుటుంబంతోనూ కలిపి కౌన్సెలింగ్ చేస్తారు. కలహాలకు కారణమవుతున్న సమస్యలను పరిష్కరించుకునే దిశగా ప్రోత్సహిస్తారు.

విడాకుల వరకు వెళ్లేందుకు దారితీస్తున్న అంశాలు

భాగస్వామి మద్యానికి బానిస కావడం	63%
డబ్బులు, కట్నం కోసం డిమాండ్ చేయడం	49%
భాగస్వామి ప్రవర్తనపై అనుమానం	47%

పెళ్లయిన ఐదేళ్లలోపే..

కుటుంబ కలహాల సమస్య యువ జంటల్లోనే ఎక్కువగా ఉంటున్నట్టు కేసులను బట్టి స్పష్టమవుతోంది. పోలీసు కేసులు, విడాకుల వరకు వెళ్తున్న జంటల్లో.. పెళ్లయి ఐదేళ్లు కూడా కానివారే 40% నికిపైగా ఉంటున్నారు. ఈ తరహా కేసులలో భార్యాభర్తల వయసు 23 నుంచి 30 ఏళ్లలోపే ఉంటుండటం గమనార్హం.

గృహ హింసకు కారణమవుతున్న అంశాలివీ..

- వరకట్నం కోసం వేధింపులు
- మద్యానికి బానిసకావడం
- వివాహేతర సంబంధాలు
- అత్తమామల వేధింపులు
- జీవిత భాగస్వామిపై అనుమానం
- కులాంతర వివాహాలు, ప్రేమ వివాహాలు కావడం

సివిల్ కేసుల విచారణాధికారం ఐటీడీఏ పీవోలకు లేదు

- ఇప్పటివరకు ఉన్న కేసులన్నీ కలెక్టర్లకు బదిలీ చేయండి
- ఉట్నూర్ ఐటీడీఏ పీవోకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఏజెన్సీ ప్రాంతాల్లోని సివిల్ కేసులను విచారించే పరిధి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. తెలంగాణ ఏజెన్సీ రూల్స్-1924 అమలుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో 274లో కలెక్టర్లు/గవర్నమెంట్ ఏజెంట్, ఏజెన్సీ డివిజన్ ఆఫీసర్, ఆర్డీవోలకు అధికారాలు ఉన్నాయని వ్యాఖ్యానించింది. చట్టప్రకారం దాఖలు చేసి..తన ముందు పెండింగ్‌లో ఉన్న దావాల్లో తదుపరి ఎలాంటి ఆదేశాలు ఇవ్వ కూడదని ఐటీడీఏ పీవోను ఆదేశిస్తూ..తన వద్ద కేసులన్నీ నేటి నుంచి నెల రోజుల్లోగా కలెక్టర్లకు బదిలీ చేయాలని చెప్పింది.

ఇదీ వివాదం: ఓ సివిల్ వివాదంలో డాక్యుమెంట్లను చేతిరాత నిపుణులకు పంపాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ ఉట్నూర్ ఐటీ డీఏ పీవో జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆదిలాబాద్ జిల్లా హస్నాపూర్‌కు చెందిన చవన్ ప్రకాశ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ కె.శరత్ విచారణ చేపట్టారు. జీవో 274 ఆధారంగా ఐటీడీఏ పీవోగా ఉట్నూర్ పీవో సివిల్ కేసుల విచా రణ చేపడుతున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కలెక్టర్, ఏజెన్సీ డివిజనల్ అధికారి, ఆర్డీవోలు చాలాకాలంగా సివిల్ కేసుల విచా రణ చేయడం లేదని చెప్పారు. వాదనల అనంతరం ఇకపై సివి ల్ సూట్ల దాఖలు, విచారణ చట్టప్రకారం చేసేలా చర్య లు తీసుకోవాలని కలెక్టర్లు, ఏజెన్సీల్లోని ఆర్డీవోలకు వివరించింది. తెలంగాణ ఏజెన్సీ చట్టం 1924 రూల్ 57 ప్రకారం సంబంధిత కలెక్టర్ల నుంచి నివేదికను, అలాగే 2 నెలల్లోగా ఐటీడీఏ పీవో నుంచి కూడా నివేదిక తెప్పించి న్యాయస్థానానికి అందజేయాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది.

తప్పతాగి.. ప్రసాదం చేయడానికి వచ్చి..

- రాజన్న ఆలయంలో అపచారం
- మద్యం తాగి వచ్చిన వంట బ్రాహ్మణుడు
- వేరే బ్రాహ్మణుడితో నైవేద్యం సిద్ధం చేయించిన అధికారులు
- హడావుడిగా చేయడంతో ఉడికీఉడకని నైవేద్యం సమర్పణ


నివేదనశాలలో తాగినమైకంలో వంట బ్రాహ్మణుడు

వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామికి నైవేద్య సమర్పణలో అపచారం చోటుచేసుకుంది. నైవేద్యాన్ని సిద్ధం చేసే వంట బ్రాహ్మణుడు మద్యం తాగి విధులకు వచ్చాడు. స్వామికి నిత్యం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య నైవేద్యం సమర్పిస్తారు. అయితే స్వామివారికి శుక్ర వారం సమయానికి నైవేద్యం సిద్ధం కాకపోవడంతో ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్, వరి నర్సయ్య వెంటనే నివేదన శాలలోకి వెళ్లి పరిశీలించగా.. నైవేద్యం సిద్ధంగా లేకపోవడంతోపాటు వంటబ్రాహ్మణుడు మద్యం మత్తులో ఉండటాన్ని గమనించారు. సమయం దాటిపోతుండటంతో మరో బ్రాహ్మణుడితో నైవేద్యం సిద్ధం చేయించారు. హడావుడిగా సిద్ధం చేయడంవల్ల వేడిగా ఉన్న నీటిలో బియ్యాన్ని పోసి ఉడికీఉడకని నైవేద్యాన్ని స్వామివారికి నివేదించారు. అప్పటికే నివేదన సమయం అరగంట ఆలస్యమైంది. దీనిపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ ఆ వంట బ్రాహ్మణుడు ఇదేవిధంగా మద్యం మత్తులో విధులు నిర్వహించటంతో మెమో జారీ చేసినట్లు గోదాం పర్యవేక్షకుడు నర్సయ్య తెలిపారు.

ఆదాయం ఘనం.. కైంకర్యాలపై పట్టింపు కరువు

వేములవాడ రాజన్నకు భక్తుల ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం వస్తున్నా శ్రీస్వామి వారికి పవిత్రంగా సమర్పించే నైవేద్యాన్ని సిద్ధం చేయడంలో అధికారుల నిర్లక్ష్యంపై భక్తుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో రెండో రోజు శుక్రవారం కూడా ఏసీబీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. ఆలయంలోని వివిధ విభాగాలపై ఫిర్యాదులు రావడంతో గురువారం నుంచి తనిఖీలు చేస్తున్నారు. శుక్రవారం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో అధికారులు స్వామి వారి అన్నదానం, అకౌంట్స్ విభాగాల్లోని రికార్డులు పరిశీలించారు. రికార్డుల పరిశీలన తర్వాత ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

వర్గీకరణ ప్రక్రియను వెంటనే అమలు చేయండి


మంత్రులకు మంద కృష్ణ వినతి


భట్టి, దామోదర రాజనర్సింహలతో మందకృష్ణ, మోత్కుపల్లి తదితరులు

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేసి రిజర్వేషన్ ఫలితాలను అన్ని వర్గాలకు అందించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మంత్రులను కోరారు. శుక్రవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులను వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో మంద కృష్ణ, మాదిగ ప్రజాప్రతినిధుల బృందంతో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రాలకే అధికారం ఉందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం విద్య, ఉద్యోగాల భర్తీ జరుగుతున్న సందర్భంగా ఎస్సీ వర్గీకరణ ఆలస్యమైతే మాదిగ విద్యార్థులకు, నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కాలె యాదయ్య, కవ్వంపల్లి సత్యనారాయణ, తోట లక్ష్మీకాంతారావు, మందుల సామేల్, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఉమ్మడి కార్యాచరణ

- సమస్యల పరిష్కారానికి జేఏసీ స్టీరింగ్ కమిటీ ఏర్పాటు
- ప్రస్తుత కమిటీలో 29 మందికి అవకాశం కల్పించాం
- అతి త్వరలో వంద మందితో పూర్తిస్థాయి కమిటీ ఏర్పాటు
- ఆ తర్వాత ప్రతి జిల్లాలోనూ జేఏసీ కమిటీలు
- తెలంగాణ ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు మారం జగదీశ్వర్


మీడియాతో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్ స్పష్టం చేశారు. ఉద్యోగులంతా రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలురేనని, సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకుంటామని చెప్పారు. ఈ అంశంపై ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని వివరించారు. శుక్రవారం నాంపల్లిలోని టీఎన్‌జీఓ భవన్‌లో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నేతలు 29 మందితో కూడిన రాష్ట్రస్థాయి జేఏసీ స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం సమావేశమైన స్టీరింగ్ కమిటీ సభ్యులు ఉద్యోగుల సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. ఆ తర్వాత మీడియా సమావేశంలో ఆ వివరాలు, తదుపరి కార్యాచరణ ప్రకటించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్ల తర్వాత జేఏసీ ఏర్పడిందని, ప్రస్తుతం స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగుతా యని, త్వరలోనే వందమందితో పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకుంటామన్నారు. జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి జేఏసీని పటిష్టం చేస్తామని తెలిపారు. ఈ కమిటీల్లో రెండువందలకు పైబడిన సంఘాలు సభ్యులుగా ఉంటాయని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే వెల్లడించారని, ఈ క్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలతో చర్చించి ఉమ్మడిగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఒకే వేదిక ద్వారా వివరించేందుకు జేఏసీని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఉద్యోగుల ప్రధాన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో ముఖ్యమంత్రికి వివరిస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరలో మరో డీఏ కూడా ఇవ్వాల్సి ఉందని, వీటిని వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్‌ను తొలగించి ఓపీఎస్‌ను అమలు చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టారని, పీఆర్సీ, జీఓ 317, ఉద్యోగుల పెండింగ్ బిల్లులు తదితరాలన్నీ ప్రభుత్వానికి వివరిస్తామని చెప్పారు. సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ జేఏసీలో అన్ని సంఘాలకు ప్రాధాన్యం ఉంటుందని, ప్రభుత్వంతో సఖ్యతగా ఉండి శాంతియుతంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం సాధించుకుంటామన్నారు.

జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు వీరే

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా టీఎన్‌జీఓ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్‌గా టీజీఓ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు వ్యవహరిస్తారు. సభ్యులుగా పి.శ్రీపాల్‌రెడ్డి, చావ రవి, వి.రవీందర్‌రెడ్డి, ఎ.సత్యనారాయణరెడ్డి, జి.సదానందంగౌడ్, జి.జ్ఞానేశ్వర్, నాగిరెడ్డి, అశోక్‌కుమార్, టి.లింగారెడ్డి, అంజిరెడ్డి, ఎం.మణిపాల్‌రెడ్డి, పి.సత్యనారాయణ, ఎం.రాధాకృష్ణ, ఎస్‌ఎం.హుస్సైనీ, ఎ.సత్యనారాయణ, శ్రీధర్, డాక్టర్ బి.రమేశ్, పి.మధుసూదన్‌రెడ్డి, ఎం.చంద్రశేఖర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, బి.శ్యామ్, సత్యనారాయణ గౌడ్, లక్ష్మయ్య, దామోదర్‌రెడ్డి, స్థితప్రజ్ఞ, కె.వెంకటేశ్వర్లు, ఇ.నరేశ్‌గౌడ్ ఉంటారు.

తీర్మానాలు

- సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినంగా ప్రకటిస్తూ ఆ రోజున ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో విధుల నిర్వహణ, గన్‌పార్కు అమరవీరుల స్తూపం వద్ద, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు
- ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6న రవీంద్రభారతిలో ప్రొఫెసర్ కోదండరాం అభినందన సభ
- మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా సెప్టెంబర్‌లో కార్యక్రమాల నిర్వహణ



శుక్రవారం కీవ్‌లో జెలెన్‌స్కీతో ప్రధాని మోదీ

శాంతి, సుస్థిరతకు చర్చలే మార్గం

ఉక్రెయిన్-రష్యా కలిసి కూర్చొని మాట్లాడుకోవాలి

- సంఘర్షణకు సాధ్యమైనంత త్వరగా తెరదించాలి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తి
- ఉక్రెయిన్‌లో మోదీ పర్యటన... అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ

కీవ్/న్యూఢిల్లీ: ఉక్రెయిన్–రష్యా మధ్య సంఘర్షణకు సాధ్యమైనంత త్వరగా తెరదించాలని, ఇందుకోసం రెండు దేశాలు చర్చించుకోవాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. ఆయన పోలండ్ నుంచి ట్రైన్ ఫోర్స్ వన్ రైలులో బయలుదేరి, 10 గంటలపాటు సుదీర్ఘ ప్రయాణం సాగించి, శుక్రవారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు చేరుకున్నారు. మోదీకి ఉక్రెయిన్ ప్రభుత్వ అధికారులు, భారతీయులు ఘన స్వాగతం పలికారు. కీవ్‌లో ఆయన బస చేసిన హయత్ హోటల్ వద్దకు పెద్ద సంఖ్యలో భారతీయులు తరలివచ్చారు. వారికి మోదీ అభివాదం చేశారు. 1991 తర్వాత ఉక్రెయిన్‌లో భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర.. రష్యాపై ఉక్రెయిన్ ఎదురుదాడి ఉధృతమవుతున్న నేపథ్యంలో భారత ప్రధానమంత్రి పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. కీవ్‌లో అడుగుపెట్టిన తర్వాత మోదీ నేషనల్ మ్యూజియం ఆఫ్ హిస్టరీ వద్దనున్న 'మల్టీమీడియా మార్టీరాలజిస్టు ఎక్స్‌పోజిషన్'ను సందర్శించారు. యుద్ధంలో మరణించిన ఉక్రెయిన్ చిన్నారుల స్మారకార్థం ఈ కట్టడాన్ని నిర్మించారు. ఇక్కడ ప్రధాని మోదీ ఓ బొమ్మను ఉంచి, అమరులైన బాలలకు నివాళులర్పించారు. చేతులు జోడించి నమస్కరించారు. వారిని తలచుకొని చలించిపోయారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని మోదీ ఆలింగనం చేసుకున్నారు. కరచాలనం చేశారు. యుద్ధంలో దెబ్బతిన్న ఉక్రెయిన్‌కు మద్దతు ప్రకటిస్తూ జెలెన్‌స్కీ భుజంపై మోదీ ఆత్మీయంగా చెయ్యి వేశారు. అనంతరం కీవ్ సిటీలోని ఒయాసిస్ ఆఫ్ పీస్ పార్కులో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మోదీ ఘనంగా నివాళులర్పించారు. శాంతి, సామరస్యంతో వర్ధిల్లే సమాజ నిర్మాణానికి మహాత్ముడు బోధించిన శాంతి సందేశం ఎల్లవేళలా అనుసరణీయమని ప్రధానమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. గాంధీజీ చూపిన ఆదర్శ మార్గం ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సంక్షోభాలకు చక్కటి పరిష్కార మార్గం అవుతుందన్నారు. కీవ్‌లో స్కూల్ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లో హిందీ భాష నేర్చుకుంటున్న ఉక్రెయిన్ విద్యార్థులతో మోదీ ముచ్చటించారు.

ఆచరణాత్మక సంప్రదింపులు జరగాలి

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మోదీ సమావేశమయ్యారు. భారత్–ఉక్రెయిన్ మధ్య సంబంధాలు, ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. వాణిజ్యం, ఆర్థికం, రక్షణ, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నారు. భారత్–ఉక్రెయిన్ మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు కూడా జరిగాయి. ఉక్రెయిన్–రష్యా మధ్య సంఘర్షణ అంతం కావాలని, ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరత నెలకొనాలని ప్రధాన మంత్రి మోదీ ఆకాంక్షించారు. సంఘర్షణకు సాధ్యమైనంత త్వరగా ముగింపు పలికేలా ఒక పరిష్కార మార్గాన్ని కనుక్కోవడానికి ఉక్రెయిన్, రష్యా పరస్పరం చర్చించుకోవాలని కోరారు. శాంతి, సుస్థిరత కోసం రెండు దేశాల మధ్య ఆచరణాత్మక సంప్రదింపులు జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. జెలెన్‌స్కీతో జరిగిన చర్చలో మోదీ ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. ఉక్రెయిన్‌లో శాంతియుత పరిస్థితుల పునరుద్ధరణకు అన్ని రకాలుగా సాయం అందిస్తామని మోదీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. మోదీ–జెలెన్‌స్కీ మధ్య నిర్మాణాత్మక, సమగ్ర చర్చ జరిగిందన్నారు. ఉక్రెయిన్‌లో ప్రస్తుత పరిస్థితులు, ఆహార, ఇంధన భద్రత కొరవడడంపై మోదీ ఆందోళన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఉక్రెయిన్–రష్యా మధ్య చర్చలు ప్రారంభించి, ముందుకు తీసుకెళ్లడానికి అందుబాటులో ఉన్న ప్రభావవంతమైన మార్గాలపై మోదీ, జెలెన్‌స్కీ చర్చించుకున్నారని వివరించారు. ఆ రెండు దేశాలు కలిసి కూర్చొని చర్చించుకొని, సంఘర్షణకు పరిష్కారం కనిపెట్టాలన్నదే భారతదేశ అభిమతమని జైశంకర్ స్పష్టంచేశారు. మోదీ చేపట్టిన ఉక్రెయిన్ పర్యటనను ఒక ల్యాండ్‌మార్క్‌గా ఆయన అభివర్ణించారు.

నాలుగు భీష్మ క్యూబ్స్ బహూకరణ

ప్రధాని మోదీ ఉక్రెయిన్ ప్రభుత్వానికి నాలుగు భీష్మ(భారత్ హెల్త్ ఇనీషియేటివ్ ఫర్ సహయోగ్ హిత, మైత్రి) క్యూబ్స్‌ను బహూకరించారు. అన్ని రకాల గాయాలకు చికిత్స అందించేందుకు అవసరమైన ఔషధాలు, పరికరాలు, వస్తువులు ఈ క్యూబ్స్‌లో ఉన్నాయి. అంతేకాదు పరిమితంగా విద్యుత్, ఆక్సిజన్‌ను ఉత్పత్తిచేసే పరికరాలు సైతం ఉన్నాయి.

భారత్ మద్దతు మాకు కీలకం: జెలెన్‌స్కీ

తమ దేశ జాతీయ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు భారత్ మద్దతు ఇస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. భారత్ మద్దతును తాము అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నామని చెప్పారు. భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ రోజు ఒక కొత్త చరిత్ర నమోదైందని పేర్కొన్నారు. భారత్‌లో పర్యటించాలని జెలెన్‌స్కీని మోదీ ఆహ్వానించారు.

నాలుగు ఒప్పందాలపై భారత్, ఉక్రెయిన్ సంతకాలు

మోదీ–జెలెన్‌స్కీ చర్చల తర్వాత నాలుగు కీలక ఒప్పందాలపై భారత్, ఉక్రెయిన్ శుక్రవారం సంతకాలు చేశాయి. వ్యవసాయం, ఆహార పరిశ్రమ, ఔషధాలు, సాంస్కృతికం–మానవతా సాయం విషయంలో రెండు దేశాలు పరస్పరం సహకరించుకోనున్నాయి.

సోషల్ మీడియాలో విశేష స్పందన

మోదీ, జెలెన్‌స్కీ భేటీకి సోషల్ మీడియాలో విశేష స్పందన లభించింది. ఈ సమావేశం గురించి నెటిజన్లు విస్తృతంగా చర్చించుకున్నారు. తమ అభిప్రాయాలు పంచుకున్నారు. మోదీతో కలిసి ఉన్న ఫొటోలను జెలెన్‌స్కీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు చేశారు. ఈ పోస్టుకు గంటల వ్యవధిలోనే 10 లక్షలకుపైగా లైక్‌లు వచ్చాయి. భారత్–ఉక్రెయిన్ అనుబంధాన్ని బలోపేతం చేసుకోవడానికి ఈ సమావేశం చాలా కీలకమని జెలెన్‌స్కీ ఉద్ఘాటించారు.

జెలెన్‌స్కీ అప్పుడేమన్నారంటే...



ఉక్రెయిన్ పర్యటనలో అధ్యక్షుడు జెలెన్‌స్కీని ప్రధాని మోదీ ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడం, భుజంపై చెయ్యి వేయడం ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. దీనిపై పలు వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. నరేంద్ర మోదీ ఈ ఏడాది జూలై 9వ తేదీన రష్యాలో పర్యటించారు. రష్యా అధినేత పుతిన్‌తో సమావేశమై, చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఫొటోలకు ఫోజులిచ్చారు. ఈ ఆత్మీయ కలయికపై అప్పట్లో జెలెన్‌స్కీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శాంతి ప్రయత్నాలకు ఇదొక ఎదురుదెబ్బ అని ఆక్షేపించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధానమంత్రి అయిన నరేంద్ర మోదీ ప్రపంచంలో అత్యంత క్రూరమైన రక్తపిపాసి, నేరగాడు అయిన పుతిన్‌ను ఆలింగనం చేసుకున్నారని మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. జెలెన్‌స్కీ అప్పట్లో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి తెరపైకి వచ్చాయి.

అస్సాంలో బాలికపై సామూహిక అత్యాచారం

ట్యూషన్ నుంచి తిరిగివస్తుండగా అఘాయిత్యం

- ఇద్దరు నిందితుల అరెస్టు.. మరొకరి కోసం గాలింపు
- దుండగులను కఠినంగా శిక్షిస్తామని సీఎం హిమంత బిశ్వ శర్మ ప్రకటన

గౌహతి: ఈశాన్య రాష్ట్రం అస్సాంలో దారుణం జరిగింది. నాగావ్ జిల్లాలో 14 ఏళ్ల బాలికపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రజలు ఆగ్రహంతో వీధుల్లోకి వచ్చి ఆందోళనకు దిగారు. మహిళలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందిస్తూ బాలికపై అత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షిస్తామని, మహిళలకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. నాగావ్ జిల్లాలోని ధింగ్ ప్రాంతంలో గురువారం రాత్రి 8 గంటల సమయంలో బాలిక ట్యూషన్ నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా, ముగ్గురు వ్యక్తులు మోటార్ సైకిల్ వచ్చి, ఆమెను బంధించి అత్యాచారానికి పాల్పడి, రోడ్డు పక్కన విసిరేసి వెళ్లిపోయినట్లు పోలీసులు చెప్పారు. బాధితురాలు పదో తరగతి చదువుతోందని, దుండగుల దుశ్చర్య వల్ల గాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకుందని తెలిపారు. స్థానికులు గమనించి, తమకు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. బాధితురాలిని ఆసుపత్రికి తరలించామని, చికిత్స కొనసాగుతోందని పేర్కొన్నారు. నిందితుల్లో ఇద్దరిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని, పరారీలో ఉన్న మరొకడి కోసం గాలింపు ముమ్మరం చేశామని అస్సాం డీజీపీ జి.పి.సింగ్ చెప్పారు.

ముష్కరుల ఆగడాలను అడ్డుకుంటాం

బాలికపై అత్యాచారం గురించి తెలియగానే శుక్రవారం అస్సాం అట్టుడికిపోయింది.



నాగావ్‌లో మహిళల నిరసన

జనం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని మండిపడ్డారు. బాధితురాలికి న్యాయం చేయాలని, దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలు శుక్రవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో దుకాణాలు, విద్యా సంస్థలు మూతపడ్డాయి. మైనర్ బాలికపై అత్యాచార ఘటన ఘటన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిందితులను అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హిందూ మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత అస్సాంలో ఓ వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారని, వారి ఆగడాలను కచ్చితంగా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గత రెండు నెలల్లో 23 మంది మహిళలపై అఘాయిత్యాలు జరిగాయన్నారు. ఇతర ప్రాంతాల నుంచి కొనసాగుతున్న వలసల వల్ల స్థానికులు మైనార్టీలుగా మారిపోతున్నారని చెప్పారు.

కులం పేరిట వేధిస్తేనే...
ఎస్సీ, ఎస్టీ కేసు

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- కేవలం బాధితులు ఎస్సీ, ఎస్టీలు అయినంత మాత్రాన ఆ చట్టం వర్తించదని స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ వేధింపుల (నిరోధక) చట్టం వర్తింపు విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'ప్రత్యేకించి కులం పేరిట వేధించినప్పుడు మాత్రమే ఆ చట్టం వర్తిస్తుంది. అంతే తప్ప కేవలం బాధితులు ఆ సామాజికవర్గాలకు చెందినంత మాత్రాన వర్తించబోదు' అని స్పష్టం చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద అభియోగాలు ఎదుర్కొంటున్న షాజన్ స్కారియా అనే యూట్యూబర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కేరళకు చెందిన ఎమ్మెల్యే పీవీ శ్రీనిజన్ ఆయనపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద క్రిమినల్ కేసు పెట్టారు. మరుణదాన్ మలయాళీ అనే యూట్యూబ్ చానల్ నడుపుతున్న షాజన్ అందులో పెట్టిన ఒక వీడియోలో తనను ఉద్దేశపూర్వకంగా అవమానించారని ఆరోపించారు. షాజన్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కేరళ హైకోర్టు తిరస్కరించింది. దాంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన ధర్మాసనం, 'బెదిరింపులకు, లేదా అవమానాలకు గురైన వ్యక్తి కేవలం ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందినంత మాత్రాన సదరు నేరానికి ఎస్సీ, ఎస్టీ వేధింపుల (నిరోధక) చట్టం సెక్షన్ 3(1)(ఆర్) వర్తించబోదు. కులం పేరిట అవమానించినప్పుడు, వేధించినపుడు మాత్రమే వర్తిస్తుంది. సదరు చట్టంలో పేర్కొన్న మేరకు అంటరానితనం వంటి దురాచారాన్ని పాటించినప్పుడు, అగ్ర కులస్తులు మైల, పవిత్రత అంటూ నిమ్నవర్ణాల వారిపట్ల కులం పేరిట దురహంకారపూరితంగా ప్రవర్తించినప్పుడు ఈ సెక్షన్ వర్తిస్తుంది. ఎస్సీ, ఎస్టీలను కులం పేరిట వేధించకుండా చూసేందుకే కఠినమైన సెక్షన్లు చేర్చారు. కనుక ఈ చట్టం వర్తింపులో నిందితుని ఉద్దేశం చాల ముఖ్యం' అని స్పష్టం చేసింది. 'షాజన్ కేసులో అదేమీ కన్పించడం లేదు. సదరు వీడియో ద్వారా ఎస్సీ, ఎస్టీల పట్ల ఉద్దేశపూర్వకంగా ద్వేషం, శతృత్వ భావం, దురుద్దేశాల వంటివి వెళ్లగక్కినట్టు ఎక్కడా రుజువు కాలేదు. ఎమ్మెల్యేను కేవలం వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకున్నారు' అని పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసులో ప్రాథమికంగా అభియోగాలు నిర్ధారణ అయితే తప్ప ముందస్తు బెయిల్‌ను తిరస్కరించలేమని స్పష్టం చేసింది.

సీబీఐ దర్యాప్తుపై నమ్మకముంది

ట్రెయినీ వైద్యురాలి తల్లిదండ్రుల వెల్లడి

బరాసత్(పశ్చిమబెంగాల్): కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో తమ కుమార్తెపై అత్యాచారం, హత్య ఘటనపై సీబీఐ చేపట్టిన విచారణపై విశ్వాసముందని బాధితురాలి తల్లిదండ్రులు తెలిపారు. 'ఈ ఘటన వెనుక ఉన్న వారిని రక్షించేందుకు ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు మాకున్న అనుమానం నిజమేనని తేలింది. ఈ నేరానికి కేవలం ఒక్కరు మాత్రమే కారణం కాదు'అని శుక్రవారం నార్త్ 24 పరగణాల జిల్లాలోని తమ నివాసంలో మీడియాతో వారన్నారు. ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో జరిగే అక్రమాల గుట్టును బయటపెట్టాలన్నారు.

నేపాల్‌లో ఘోర ప్రమాదం

- బస్సు నదిలో పడి.. 27 మంది మృతి
- మరో 16 మందికి గాయాలు
- బాధితులు మహారాష్ట్ర వాసులు

కఠ్మాండు: నేపాల్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన 27 మంది చనిపోగా, మరో 16 మంది గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో రిజిస్టరయిన ఈ బస్సు సెంట్రల్ నేపాల్‌లోని మార్స్యాంగడీ నదిలో పడిపోయినట్లు అధికారులు తెలిపారు. మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లా భుసాల్ గ్రామానికి చెందిన 104 మంది యాత్రికులు మూడు బస్సుల్లో నేపాల్‌కు వచ్చారు. మొత్తం 10 రోజుల యాత్రలో పోఖారాలో రెండు రోజులు గడిపారు. అక్కడి నుంచి శుక్రవారం ఉదయం మూడు బస్సుల్లో కఠ్మాండు వైపు తిరుగు పయనమయ్యారు. ఇందులో ఒక బస్సు ఉదయం 11.30 గంటల సమయంలో తనహూన్ జిల్లా ఐనా పహరా వద్ద హైవేపై అదుపుతప్పి 150 మీటర్ల లోతున్న మార్స్యాంగడీ నదిలో పడిపోయింది. ఈ బస్సులో డ్రైవర్, హెల్పర్ సహా మొత్తం 43 మంది ఉన్నారు. పరవళ్లు తొక్కుతున్న నదిలో నుంచి 16 మృతదేహాలను వెలికితీశారు. క్షతగాత్రులైన 11 మంది ఆస్పత్రిలో చనిపోయారు. మరో 16 మందికి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. బస్సు నుజ్జునుజ్జయింది. మూడు బస్సుల్లో ఉన్న వారంతా కుటుంబసభ్యులు, బంధువులేనని పోలీసులు తెలిపారు. విషయం తెల్సిన వెంటనే ఘటనా ప్రాంతానికి యూపీ ప్రభుత్వం మహారాజ్‌గంజ్ సబ్ కలెక్టర్‌ను పంపించింది. రక్షణ, సహాయక చర్యలను ఈయన సమన్వయం చేస్తారని తెలిపింది. బాధితులను సాధ్యమైనంత త్వరగా నేపాల్ నుంచి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ తెలిపారు.



నదిలో పడిపోయిన బస్సు వద్ద కొనసాగుతున్న రక్షణ చర్యలు



ట్రంప్ వస్తే వినాశనమే

అమెరికన్లకు హారిస్ హెచ్చరిక

- దేశాన్ని వెనక్కు తీసుకెళ్తారంటూ ధ్వజం
- డెమొక్రాట్ల అభ్యర్థిత్వం స్వీకరిస్తూ భావోద్వేగ ప్రసంగం

షికాగో: రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను 'ఏ మాత్రం సీరియస్‌నెస్ లేని వ్యక్తి'గా అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అభివర్ణించారు. 'పొరపాటున ఆయన మళ్లీ అధ్యక్షుడైతే అంతులేని వినాశనమే. దేశాన్ని ట్రంప్ అన్ని రంగాల్లోనూ పూర్తిగా వెనక్కు తీసుకెళ్తారు' అంటూ అమెరికన్లను హెచ్చరించారు. డెమొక్రాట్ల జాతీయ కన్వెన్షన్‌లో గురువారం (స్థానిక కాలమానం ప్రకారం) చివరి రోజు పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని ఆమె లాంఛనంగా స్వీకరించారు. 'జాతి, లింగ, భాషా భేదాలకు అతీతంగా, తమ కలల సాకారానికి అహరహం శ్రమిస్తున్న అమెరికన్లందరి తరఫున ఈ నామినేషన్‌ను స్వీకరిస్తున్నా' అంటూ కరతాళ ధ్వనుల నడుమ ప్రకటించారు. ఈ సందర్భంగా అత్యంత భావోద్వేగ పూరితంగా ప్రసంగించారు. నవంబర్ 5న జరగబోయే అధ్యక్ష ఎన్నికలను అమెరికా చరిత్రలోనే అత్యంత కీలకమైనవిగా హారిస్ అభివర్ణించారు. 'నన్ను గెలిపిస్తే పార్టీ భేదాలు తదితరాలకు అతీతంగా, అమెరికన్లందరి ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తా. దేశ మౌలిక విలువలను, సూత్రాలను సమున్నతంగా నిలబెడతా. రాజకీయంగా, సైనికంగా సూపర్ పవర్‌గా అమెరికా స్థానాన్ని అన్నివిధాలా సుస్థిరం చేస్తా. అమెరికన్ల ప్రయోజనాల పరిరక్షణకు శక్తివంచన లేకుండా పోరాడతా. గత పాలన తాలూకు విద్వేషాలు, విభజనవాదాలను రూపుమాపి దేశాన్ని ఒక్కటి చేస్తా' అని ప్రకటించారు. 59 ఏళ్ల హారిస్ వేదిక మీదకు వస్తుండగా పార్టీ ప్రతినిధులు కరతాళ ధ్వనులతో హోరెత్తించారు. పలు అంశాలను స్పృశిస్తూ 40 నిమిషాల పాటు ఏకధాటిగా సాగిన ఆమె ప్రసంగానికి స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ఆమె మాట్లాడుతున్నంత సేపూ, 'ఎస్, యూ కెన్ (నువ్వు సాధించగలవ్)' అంటూ నినాదాలతో హోరెత్తించారు. గురువారమే హారిస్ పదో పెళ్లి రోజు కూడా కావడం విశేషం. హిల్లరీ క్లింటన్ తర్వాత డెమొక్రటిక్ పార్టీ తరఫున అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న రెండో మహిళగా ఆమె నిలిచారు. అమెరికా చరిత్రలో అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న తొలి భారత, ఆఫ్రికన్ మూలాలున్న నేత హారిసే. ఆమె గెలిస్తే అగ్రరాజ్యానికి తొలి అధ్యక్షురాలిగా చరిత్ర సృష్టిస్తారు.

ట్రంప్‌పై నిప్పులు

ట్రంప్‌పై హారిస్ తన ప్రసంగంలో నిప్పులు చెరిగారు. ఏ కోణంలో చూసినా ఆయన అత్యంత నాన్ సీరియస్ వ్యక్తి అని దుయ్యబట్టారు. ట్రంప్ హయాంలో దేశంలో అయోమయం, గందరగోళమే రాజ్యం చేశాయన్నారు. చివరికి ఓటమిని ఒప్పుకోకుండా పార్లమెంటు మీదికే అల్లరిమూకలను ఉసిగొల్పిన చరిత్ర ఆయనదని దుయ్యబట్టారు. హష్ మనీ మొదలుకుని ప్రాడ, లైంగిక వేధింపుల దాకా నానారకాల ఆరోపణలు, లెక్కలేనన్ని కోర్టు కేసులు ఎదుర్కొంటున్న విచ్ఛిన్నకర శక్తిగా ట్రంప్‌ను అభివర్ణించారు. 'ట్రంప్ రష్యాకు అన్ని అరాచకాలకూ లైసెన్సు ఇచ్చారు. అమెరికా మిత్రదేశాలపై దండెత్తేలా ప్రోత్సహించారు' అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయనను మళ్లీ గెలిపిస్తే కేవలం తన కోసం, తన బిలియనీర్ మిత్రుల ప్రయోజనాల కోసమే పాటుపడతారని దుయ్యబట్టారు. 'నేనలా కాదు. అమెరికన్లందరి కోసం పోరాడతా. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ లాంటి నియంతలను ట్రంప్ మాదిరిగా నేను ఉపేక్షించను. అమెరికాను ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైనిక శక్తిగా తీర్చిదిద్దుతా. సైనికులు, వారి కుటుంబాల త్యాగాలను ట్రంప్‌లా ఎన్నటికీ కించపరచను' అని చెప్పారు. గాజా యుద్ధాన్ని ఆపేందుకు బైడెన్‌తో కలిసి నిరంతరం కృషి చేస్తున్నట్టు చెప్పారు. అదే సమయంలో ఇజ్రాయెల్ ఆత్మరక్షణకు సర్వ హక్కులూ ఉన్నాయని కుండబద్దలు కొట్టారు.

కోర్టు హౌస్ నుంచి వైట్ హౌస్ దాకా... అనూహ్య ప్రస్థానాలు అలవాటే

అధ్యక్షుడు జో బైడెన్ తప్పుకోవడంతో అత్యంత అనూహ్యంగా తాను అధ్యక్ష రేసులోకి వచ్చిన వైనాన్ని హారిస్ ప్రస్తావించారు. ఇలాంటి అనూహ్య ప్రస్థానాలు జీవితంలో తనకు కొత్తేమీ కాదన్నారు. అమెరికాను తిరిగి ఐక్యం చేసి నూతన దిశానిర్దేశం చేసే సత్తా ఉన్న నేతగా తనను తాను పరిచయం చేసుకున్నారు. కోర్టు హౌస్ నుంచి ఇప్పుడు వైట్ హౌస్‌కు పోటీపడే దాకా తన జీవనయానం ఆద్యంతం ఆసక్తికరంగా సాగిందన్నారు. 'ప్రపంచంలోనే అతి గొప్ప ప్రజాస్వామ్య దేశ ఘన చరిత్రకు వారసులం మనం. అమెరికా అంటే అనంతమైన అవకాశాలకు, అంతులేని ప్రేమకు, అపరిమితమైన స్వేచ్ఛకు ఆలవాలమని ప్రపంచానికి మరోసారి చాటుదాం' అని అమెరికన్లకు పిలుపునిచ్చారు.

తల్లీ నిన్ను తలంచి..

తన తల్లి శ్యామలా గోపాలన్‌ను ఈ సందర్భంగా హారిస్ గుర్తు చేసుకున్నారు. ఆమెను రోజూ మిస్సవుతున్నానని చెప్పారు. ముఖ్యంగా అమెరికా చరిత్రలోనే అత్యంత ప్రధానమైన గాజుతెరను బద్దలు కొట్టే ప్రయత్నంలో ఉన్న ఈ సమయంలో అమ్మ మరీ మరీ గుర్తొస్తోందని చెప్పారు. ఆమె నూరిపోసిన విలువలే తనను నడిపిస్తున్నాయని చెప్పారు. ఏ పనీ సగంలో వదలొద్దని తల్లి తనకు మరీ మరీ చెప్పేదని గుర్తు చేసుకున్నారు. 'నా తల్లి కేవలం 19 ఏళ్ల వయసులో సప్త సముద్రాలు దాటి ఎన్నో కలలతో భారతదేశం నుంచి అమెరికాలో అడుగు పెట్టింది. ఒక సైంటిస్టుగా రొమ్ము క్యాన్సర్‌కు మందు కనిపెట్టడమే లక్ష్యంగా శ్రమించింది. ఉన్నది ఐదడుగులే అయినా అనంతమైన ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. భారత్ తిరిగి వెళ్లి పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవాలనుకుంది. ఆ సమయంలో జమైకా నుంచి వచ్చిన మా నాన్న డొనాల్డ్ హారిస్‌తో అమ్మకు పరిచయమైంది. అది ప్రేమగా మారి పెళ్లికి దారితీసింది. నన్నూ, చెల్లెలు మాయను అమ్మే పెంచింది. ఈస్ట్ బేలో అద్దెకు తీసుకున్న ఒక చిన్న ఫ్లాట్‌లో ఉండేవాళ్లం. శ్రామిక తరగతి వ్యక్తుల నడుమ పెరిగాం. అమ్మ రోజంతా పనిచేస్తే మా బాగోగులు ఇరుగుపొరుగు చూసుకునే వాళ్లు' అంటూ వారిని పేరుపేరునా హారిస్ గుర్తు చేసుకున్నారు. 'వాళ్లంతా మాకు రక్త సంబంధీకులు కాకున్నా ప్రేమ బాంధవులు. కలసికట్టుగా నెగ్గడం ఎలానో వారి మధ్య పెరగడం వల్లే నేర్చుకున్నా' అన్నారు. 'ఈ క్షణం అమ్మ పైనుంచి నన్ను కచ్చితంగా నిండు మనసుతో ఆశీర్వదిస్తూ ఉంటుంది' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. తండ్రిని కూడా ఈ సందర్భంగా ఆప్యాయంగా స్మరించుకున్నారు.


హ్యాపీ బర్త్ డే డియర్ ఘోష్..!

- ఆర్‌జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపాల్‌కు సీఎం మమత లేఖ
- తాజాగా వెలుగులోకి..



కోల్‌కతా: ట్రెయినీ వైద్యురాలి హత్యోదంతం వెలుగు చూసిన ఆర్‌జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్‌కు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖ తాజాగా బయటపడింది. 2022లో సీఎం మమతా బెనర్జీ వ్యక్తిగతంగా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఘోష్‌కు ఒక లేఖ రాశారు. డియర్ ప్రొఫెసర్ ఘోష్ అంటూ అందులో ఆమె సంబోధించారు. తన సన్నిహితులైన వారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపడం మమతా బెనర్జీకి అలవాటు. ఆమె సన్నిహితుల్లో ఘోష్ ఒకరు. అంతేకాదు, ప్రభుత్వ యంత్రాంగంలో, అధికార టీఎంసీ వర్గాల్లో ఆయనకు ఎంతో పలుకుబడి ఉంది. వైద్యురాలి హత్యోదంతం అనంతరం రాజీనామా చేసిన ఆయన్ను సీఎం మమత ఆ వెంటనే కోల్‌కతా నేషనల్ మెడికల్ కాలేజీ ఆస్పత్రి ప్రిన్సిపాల్‌గా నియమించడమే ఇందుకు నిదర్శనం. అయితే, హైకోర్టు ఆయన్ను సెలవుపై వెళ్లాల్సిందిగా ఆదేశించింది. దీంతో, ప్రభుత్వం డాక్టర్ ఘోష్ నియామక ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది.

నాపై నిఘాకే జెడ్ ప్లస్ భద్రత



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున తన కదలికలపై అధికారిక సమాచారం కోసమే తనకు జెడ్ ప్లస్ భద్రతను కల్పించి ఉండొచ్చని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ అన్నారు. శరద్ పవార్‌కు వీఐపీ భద్రతలో అత్యున్నతమైన జెడ్ ప్లస్ భద్రతను బుధవారం కేంద్రం కల్పించింది. 55 మందితో కూడిన సీఆర్‌పీఎఫ్ బృందం ఆయనకు రక్షణ కల్పిస్తారు. ముప్పును అంచనా వేసి కేంద్ర ఏజెన్సీలు ఈ మేరకు సిఫారసు చేశాయని కేంద్రం పేర్కొంది. జెడ్ ప్లస్ సెక్యూరిటీపై అడగ్గా.. భద్రత పెంపునకు కారణాలు తనకు తెలియదని పవార్ విలేకరులతో అన్నారు. 'ముగ్గురికి జెడ్ ప్లస్ భద్రత ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిందని, అందులో నేనొకడినని హోంశాఖ అధికారి ఒకరు నాకు తెలిపారు. మిగతా ఇద్దరు ఎవరని అడగ్గా.. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్, హోంమంత్రి అమిత్ షాలని ఆ అధికారి బదులిచ్చారు' అని పవార్ వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున నాపై నిఘాకు ఈ ఏర్పాటు చేశారేమోనని 83 ఏళ్ల పవార్ అన్నారు. విపక్ష మహా వికాస్ అఘాడీలో కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)లు భాగస్వాములనే విషయం తెలిసిందే.



పొలం గట్టు.. బడికి దారెటు..

హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర శివారు వావిల్లకుంట తండా ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాలంటే పొలం గట్లే దారి. వావిల్లకుంట తండా పాఠశాలలో 11 మంది పాఠశాల విద్యార్థులు, 8మంది అంగన్‌వాడీ చిన్నారులు ఉన్నారు. గతంలో గ్రామానికి చెందిన ఓ దాత పాఠశాల, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చారు. ఆ స్థలం పక్కన ఇతరుల భూమి ఉండటంతో వారు వరి సాగు చేసుకున్నారు. పాఠశాలకు, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాలంటే దారి లేదు. పొలంగట్ల పైనుంచే వెళ్లాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా గట్లపై నుంచి నడిపిస్తూ తీసుకెళ్తున్నారు. ఒక్కోసారి పిల్లలు జారి బురదలో కూడా పడ్డారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. – వేలేరు

హింసల కొలిమిలో పదేళ్లు..

మీట్‌ ది ప్రెస్‌లో ప్రొఫెసర్‌ సాయిబాబా

తొమ్మిదేళ్లు నాగ్‌పూర్‌ జైల్లోని అండాసెల్‌లోనే ఉంచారు

21 రకాల జబ్బుల బారిన పడ్డా

తొలిసారి దివ్యాంగుడిననే భావన కలిగినా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు

ఉద్యమ పంథా వీడను.. బోధన వృత్తిలో కొనసాగుతా



మీట్‌ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న సాయిబాబా. చిత్రంలో హరగోపాల్‌

సాక్షి, హైదరాబాద్‌: తప్పుడు కేసుల కారణంగా పదేళ్లు నాగ్‌పూర్‌ సెంట్రల్‌ జైల్లో చిత్రహింసల కొలిమిలో మగ్గిపోయానని, తొమ్మి దేళ్లు తనను అండా సెల్లోనే (జైలు ఆవరణ లోపలి ప్రత్యేక జైలు) ఉంచారని ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, మానవహక్కుల ఉద్యమకారుడు ప్రొఫెసర్‌ జీఎన్‌ సాయిబాబా తెలిపారు. ఇంత నిర్బంధం ఎదుర్కొన్నప్పటికీ తన ఉద్యమ పంథాను వీడనని, అధ్యాపకుడిగా కొనసాగుతానని స్పష్టం చేశారు. తెలంగాణ స్టేట్‌ యూనియన్‌ ఆఫ్‌ వర్కింగ్‌ జర్నలిస్ట్స్‌ (టీయూడబ్ల్యూజే) శుక్రవారం బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన మీట్‌ ది ప్రెస్‌ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్‌ జి.హరగోపాల్, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కె.విరాహత్‌ అలీతో కలిసి సాయిబాబా మాట్లాడారు.

పదేళ్ల తర్వాత స్వేచ్ఛగా మాట్లాడుతున్నా..

'జైలు జీవితం అంతా చీకటి రోజులు. అందులో రెండేళ్ల కరోనా సమయం మరింత దారుణం. పదేళ్ల తర్వాత తెలంగాణలో స్వేచ్ఛగా మాట్లాడుతున్నా. రాజ్య హింస నుంచి ఆదివాసీయులను కాపాడేందుకు జస్టిస్‌ రాజేంద్ర సచార్, మరికొందరు సామాజిక వేత్తలతో కలిసి 'ఫోరం అగైనెస్ట్‌ వార్‌ అండ్‌ పీపుల్‌'ను స్థాపించి 'ఆపరేషన్‌ గ్రీన్‌ హంట్‌'కు వ్యతిరేకంగా ప్రచారం చేయడమే నా అరెస్టుకు ప్రధాన కారణం. ఆపరేషన్‌ గ్రీన్‌హంట్‌ వ్యతిరేక పోరాటం ఆపాలని నన్ను, నా భార్య వసంతను కొందరు బెదిరించారు. మాట వినకపోతే తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతామని చెప్పడంతో పాటు చేసి చూపించారు. నన్ను ఢిల్లీలో కిడ్నాప్‌ చేసి గడ్చిరోలికి తీసుకు వచ్చారు. అక్కడ మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసి నాగ్‌పూర్‌ జైలుకు తరలించారు. ఆ సమయంలో నా వీల్‌చైర్‌ను విరగ్గొట్టారు. నన్ను బయటికి ఈడ్చారు. ఆ దాడితో నా ఎడమ చేతి నరాలు దెబ్బతిన్నాయి. జైల్లో పెట్టిన తర్వాత 9 నెలలు నాకు కేవలం నొప్పిని తగ్గించే మాత్రలే ఇచ్చారు తప్ప డాక్టర్‌కు చూపించలేదు. పదేళ్లలో కొన్నిసార్లు మాత్రమే ఆసుపత్రికి తీసుకెళ్లారు. సరైన ట్రీట్మెంట్‌ లేకపోవడంతో ఎడమ చేయి పూర్తిగా పడిపోయింది. క్రమంగా ఊపిరితిత్తులు, గుండెపై ప్రభావం పడింది. చిన్ననాటి నుంచి పోలియో తప్ప మరే జబ్బులు లేని నేను, జైలుకు వెళ్లిన తర్వాత 21 రకాల జబ్బుల బారినపడ్డా. కనీసం గ్లాస్‌ మంచినీళ్లు తాగలేని స్థితి. బాత్‌రూంకు ఇద్దరు మోసుకెళ్లాల్సిన దుస్థితి. ఇతర ఖైదీలతో కలవకుండా చేశారు. అప్పుడే తొలిసారి నేను దివ్యాంగుడిని అన్న భావన కలిగినా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు..' అని సాయిబాబా చెప్పారు.

జైల్లో కుల వ్యవస్థ విచ్చలవిడిగా ఉంది

'నాగ్‌పూర్‌ జైల్లో కుల వ్యవస్థ విచ్చలవిడిగా ఉంది. మహారాష్ట్ర జైలు మాన్యువల్‌లో కుల వ్యవస్థ గురించి, ఖైదీలను అవసరం అయితే కొంత హింసించవచ్చని రాసి ఉంది. నక్సల్స్, గ్యాంగ్‌స్టర్స్, పొలిటికల్‌ కేసులు మినహా మిగతా కేసుల్లో సాధారణ ఖైదీలను క్రమ శిక్షణ పేరిట చిత్రహింసలు పెడుతున్నారు. జైల్లో ఉన్న పదేళ్లలో సాహిత్యమే నాకు ఊరటను, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. అనేకమార్లు బెయిల్‌ కోసం ప్రయత్నించినా చేదు అనుభవ మే ఎదురైంది. క్యాన్సర్‌తో బాధపడుతున్న మా అమ్మను చివరి దశలో చూసేందుకు, ఆమె అంత్య క్రియల్లో పాల్గొనేందుకు కూడా బెయిల్‌ దక్కలేదు. చివరకు 'ఒక మేధావిని హింసించడం తప్ప ఈ కేసులో ఏమీ లేదు' అని సుప్రీంకోర్టు చీఫ్‌ జస్టిస్‌ నా బెయిల్‌ ఉత్తర్వుల్లో రాశారు. రాజ్య వ్యవస్థలో మిగిలిన వ్యవస్థలు పతనమవుతుంటే అందులోనే ఒక భాగమైన న్యాయ వ్యవస్థ నిలబడదు. ప్రజా ఉద్యమం తీవ్రంగా ఉంటేనే కోర్టులు న్యాయాన్ని త్వరగా అందిస్తాయి. అయితే క్రమంగా న్యాయవ్యవస్థ పైనా నమ్మకం సన్నగిల్లుతోంది. దీనిని జడ్జీలుకూడా అర్థం చేసుకుంటున్నారు..' అని సాయిబాబా అన్నారు.

డిస్‌లొకేటెడ్‌ టీచర్లకు వార్నింగ్‌!

సొసైటీ కార్యాలయంలో చేపట్టిన ఆందోళనపై ఎస్సీ గురుకుల సొసైటీ ఆగ్రహం

142 మంది ఉద్యోగులకు లిఖితపూర్వక హెచ్చరికలు జారీ



సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌) పరిధిలో డిస్‌లొకేట్‌ అయిన టీచర్ల వైఖరిపై సొసైటీ యంత్రాంగం ఆగ్రహం వ్యక్తం చేసింది. జోనల్‌ కేటాయింపుల్లో భాగంగా డిస్‌లొకేట్‌ చేసిన నేపథ్యంలో ఆయా ఉద్యోగులంతా ఈనెల 21న సొసైటీ కార్యాలయంలో ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. సొసైటీ కార్యాలయ పరిధిలో గుంపుగా అల్లరి చేయడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం, ధర్నా చేపట్టడం, కార్యాలయంలోకి బలవంతంగా ప్రవేశించడం, దురుసు ప్రవర్తన ఘటనలపై సొసైటీ అధికారులు మండిపడుతున్నారు. సమస్యలుంటే పలు వేదికల వద్ద నిబంధనలకు లోబడి విన్నవించుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆందోళనపూరిత వాతావరణం సృష్టించడం నిబంధనలకు విరుద్ధమని టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌ కార్యదర్శి అలగు వర్షిణి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం వారంతా శిక్షార్హులని, అయినప్పటికీ చివరి అవకాశంగా భావిస్తూ వారికి లిఖితపూర్వక హెచ్చరికలు జారీ చేయాలని జోనల్‌ అధికారులను ఆమె ఆదేశించారు. ఈమేరకు 142 మంది ఉద్యోగులతో కూడిన జాబితాను సంబంధిత జోనల్‌ అధికారులకు ఆమె పంపారు. మరో వైపు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి గురుకుల పాఠశాలకు చెందిన టీజీటీ కె.విజయనిర్మలను సొసైటీ కార్యాలయానికి హాజరై వివరణ సమర్పించాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఆమె శుక్రవారం ఉదయం 11గంటలకు కార్యదర్శి ఎదుట హాజరైనట్లు సమాచారం. మరోవైపు విజయనిర్మలను సస్పెండ్‌ చేస్తూ సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి 22వ తేదీనే ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

ప్రజాభవన్‌లో వినతులు: ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో డిస్‌లొకేట్‌ అయిన ఉద్యోగులు పలువురు శుక్రవారం ప్రజాభవన్‌కు చేరుకుని ప్రజావాణిలో ప్రత్యేకాధికారి దివ్యకు వినతులు సమర్పించారు. స్థానికతను పరిగణించకుండా ఉద్యోగ కేటాయింపులు జరపడాన్ని తప్పుబట్టిన ఉద్యోగులు... తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి జోక్యం చేసుకుని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

రాధే మరణశిక్షను అంగీకరించింది

- తాను చేసిన ద్రోహానికి ఇదే సరైంది అని చెప్పిందంటూ లేఖ విడుదల చేసిన ఏవోబీ ఎస్‌జెడ్‌సీ కార్యదర్శి గణేశ్‌
- మావోయిస్టులవి మాయ మాటలంటూ ప్రతిగా మరో లేఖ విడుదల చేసిన ఎస్పీ



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: 'పార్టీ, విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి పోలీసులు బంటి రాధ అలియాస్‌ నీల్సోను కోవర్టుకుట్రలో భాగం చేయడం ద్వారా ఆమె మరణానికి కారకులయ్యారు.. చివరకు రాధే తాను చేసిన ద్రోహానికి మరణశిక్ష విధించడం సరైందని మనస్ఫూర్తిగా అంగీకరించింది' అని మావోయిస్టు పార్టీ ఆంధ్రా–ఒడిశా బార్డర్‌ స్పెషల్‌ జోనల్‌ కమిటీ కార్యదర్శి గణేశ్‌వెల్లడించారు. ఈ మేరకు ఆయన పేరిట శుక్రవారం ఒక లేఖ విడుదలైంది. ఆ లేఖలోని వివరాల ప్రకారం.. 'పోలీసు ఉన్నతాధికారులు ఆమె కులం, జెండర్‌ను ఉపయోగించుకొని అవాస్తవాలతో కొన్ని సంఘాల పేరిట పోస్టర్లు, ప్రకటనలు, పాటలు విడుదల చేశారు. నిత్యం దళిత, ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడే పోలీసులకు రాధ కులం, మహిళ అని మాట్లాడే అర్హత లేదు. పీడితవర్గ మహిళగా సమస్యల్ని ఎదుర్కొని వాటికి పరిష్కారంగా విప్లవ రాజకీయాలను మనస్ఫూర్తిగా స్వీకరించి స్వచ్ఛందంగా పార్టీ లో చేరింది. సభ్యురాలి నుంచి నాయ కత్వ స్థానంలోకి ఎదగడానికి ఆమె పట్టుదల, పార్టీ కృషి ఉంది. ఆపై ఆమె కుటుంబ బలహీనతలను పోలీసులు వాడుకొని విప్లవద్రోహిగా మార్చి పార్టీ నాయకత్వాన్ని నిర్మూలించాలని చూశా రు. ఇంతలోనే పార్టీ అప్రమత్తం కావడం, పోలీసుల పథకం విఫలమైంది'. అని పేర్కొన్నారు.

వాళ్లకు మానవత్వం లేదు..

బండి రాధను చంపి మృతదేహాన్ని రోడ్డుపై పడవేసిన మావోయిస్టు నేతలు మాయ మాటలతో ప్రకటనలు విడుదల చేయడం వారి క్రూరత్వానికి నిదర్శనమని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత చదువు పూర్తిచేసిన రాధను బలవంతంగా పార్టీలో చేర్చుకొని జీవితాన్నే లేకుండా చేసిన మావోలకు మానవత్వమే లేదని ఈ ఘటనతో అర్థమవుతోందని చెప్పా రు. తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి పోలీసులే బాధ్యత వహించాలని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. రాధను శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పెట్టి లైంగికంగా వేధిస్తూ కులం పేరుతో దూషించారని ఆమె సోదరుడు కూడా ఆరోపించా డని తెలిపారు. మావోయిస్టుల్లో కీలకపాత్ర పోషించిన దళిత మహిళ రాధపై పోలీస్‌ ఇన్‌ఫార్మర్‌ అని ముద్రవేయడం ఆ పార్టీ నేత ల నీచమైన ఆలోచనలకు నిదర్శనమన్నారు.

సైట్ చూడకుండానే డిజైన్లు!

సీఈ నల్లా వెంకటేశ్వర్లు ఇచ్చిన సాంకేతిక వివరాలే డిజైన్లకు ఆధారం

సుందిళ్ల బరాజ్ అదనపు గేట్లకు డిజైన్లు ఇవ్వలేదు

క్షేత్రస్థాయి ఇంజనీర్లే నిర్ణయం తీసుకున్నారు

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో సీడీవో రిటైర్డ్ ఎస్‌ఈ ఫజల్



సాక్షి, హైదరాబాద్: ప్రతిపాదిత నిర్మిత స్థలాన్ని(సైట్) సందర్శించకుండానే కాళేశ్వరం ప్రాజెక్టులోని సుందిళ్ల బరాజ్ డిజైన్లు, డ్రాయింగ్స్‌ను నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీవో) ఇంజనీర్లు రూపొందించారని ఆ విభాగం రిటైర్డ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ మహ్మద్ అబ్దుల్‌ఫజల్ వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నాటి రామగుండం సీఈ నల్లా వెంకటేశ్వర్లు ఇచ్చిన సైట్‌కు సంబంధించిన సాంకేతిక సమాచారం(క్రాస్ సెక్షన్ల) ఆధారంగా డిజైన్లు, డ్రాయింగ్స్‌ను రూపొందించినట్టు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ శుక్రవారం నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌కు ఆయన హాజరై వాంగ్మూలం ఇచ్చారు. నాటి సీఈ నల్లా వెంకటేశ్వర్లు జారీ చేసిన సాంకేతిక అనుమతులు, హైపవర్ కమిటీ సిఫారసుల ప్రకారం సుందిళ్ల బరాజ్ నిర్మాణం విషయంలో నిర్ణయాలు జరిగాయని తెలిపారు. వరంగల్ ఎన్‌ఐటీ నిపుణులు అందించిన జియో టెక్నికల్ స్టడీస్ నివేదిక ఆధారంగా షీట్ పైల్స్‌కు బదులుగా సికెంట్ పైల్స్‌తో సుందిళ్ల బరాజ్ నిర్మించడానికి వీలు కల్పిస్తూ డిజైన్లలో మార్పులు చేశామన్నారు. బరాజ్‌కు అదనపు గేట్లు పెట్టాలని ఎవరు నిర్ణయం తీసుకున్నారని కమిషన్ ప్రశ్నించగా, 58 గేట్లు, మరో 10 స్లూయిస్ల(పూడిక తొలగింపు గేట్లు)తో బరాజ్ నిర్మించడానికి మాత్రమే డ్రాయింగ్స్, డిజైన్లు ఇచ్చామని బదులిచ్చారు. అదనపు గేట్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనగానీ, దానికి డిజైన్లు సిద్ధం చేయాలని కోరుతూ ఫైల్ గానీ తన వద్దకు రాలేదన్నారు. అదనపు గేట్ల ఏర్పాటు విషయంలో క్షేత్రస్థాయి అధికారులు నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. 2డీ మోడల్ స్టడీస్ ఆధారంగానే సుందిళ్ల బరాజ్ డిజైన్లు రూపొందించామన్నారు. తమకు బరాజ్ నిర్మాణంతో సంబంధం లేదని చెప్పారు.

హరిరామ్ ఇచ్చిన లేఖను అందజేసిన నరేందర్‌రెడ్డి

→ కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్స్ పనులకు తానే బాధ్యుడిని అని ధ్రువీకరిస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు నాటి సీఈ హరిరామ్(ప్రస్తుతం గజ్వేల్ ఈఎన్‌సీ) ఇచ్చిన లేఖను సీడీవో రిటైర్డ్ ఈఎన్‌సీ నరేందర్‌రెడ్డి శుక్రవారం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు అందజేశారు. బరాజ్‌ల డిజైన్లు, డ్రాయింగ్స్‌ను కేంద్ర జలసంఘానికి పంపడానికి ముందు చెక్ లిస్ట్‌పై సంతకం చేయడానికి తాను నిరాకరించగా, హరిరామ్ ఈ మేరకు ధ్రువీకరణ పత్రం రాసిచ్చారని ఆయన గురువారం కమిషన్‌కు నివేదించిన విషయం తెలిసిందే. శుక్రవారం మళ్లీ కమిషన్ ఎదుట ఆయన హాజరై ఈ పత్రాన్ని ఆధారంగా అందజేశారు. గురువారం జరిగిన విచారణ సందర్భంగా కమిషన్‌కు ఇవ్వలేకపోయిన సమాచారాన్ని శుక్రవారం ఆయన అందజేశారు. రేడియల్ గేట్లను ఒకే ప్రయత్నంలో 2 మీటర్లకు మించి పైకి ఎత్తడం సాధ్యం కాదని, వాటిని ఎందుకు డిజైన్లలో ప్రతిపాదించారని కమిషన్ ఆయన్ను ప్రశ్నించింది. ఈ వాదన సరైనది కాదని తెలిపే పత్రాలను ఆయన కమిషన్‌కు అందజేశారు. కమిషన్ తదుపరి క్రాస్ ఎగ్జామినేషన్ ఈ నెల 27న నిర్వహించనుంది.

కొత్త జన్యులోపం 'సర్పినోపతి'


కడుపులో ఉన్నప్పుడే పిల్లల్లో.. పరిశోధనతో వెలుగులోకి

ప్రపంచంలోనే మొదటిసారిగా కనుగొన్న నిమ్స్

ఐదేళ్లుగా జెనెటిక్ విభాగం పరిశోధన

అంతర్జాతీయ 'క్లినికల్ జెనెటిక్స్'లో ప్రచురణ

ఈ జన్యులోపం కారణంగానే పిల్లల్లో అకాల మరణం



కొత్త జన్యులోపానికి సంబంధించిన రూపం ఇదే.. (ఇన్‌సెట్)లో డాక్టర్ షాగున్ అగర్వాల్

సాక్షి, హైదరాబాద్: కడుపులో ఉన్నప్పుడే పిల్లల్లో ఉండే జన్యుపరమైన లోపాన్ని(జెనెటిక్ డిజార్డర్) నిమ్స్ వైద్య బృందం కనుగొన్నది. నిమ్స్‌లోని సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ (సీడీఎఫ్‌డీ) ఆధ్వర్యంలో ఐదేళ్లుగా జరిగిన పరిశోధన ద్వారా ఈ లోపం వెలుగులోకి వచ్చింది. నిమ్స్ మెడికల్ జెనెటిక్ విభాగ అధిపతి డాక్టర్ షాగున్ అగర్వాల్ ఈ ఘనత సాధించారు. అంతర్జాతీయ జెనెటిక్ విభాగం కూడా ఈ కొత్త జన్యులోపాన్ని నిర్ధారించినట్లు నిమ్స్ పరిశోధకులు వెల్లడించారు. వైద్యశాస్త్రంలో దాదాపు 6,000 నుంచి 7,000 జన్యుపరమైన లోపాలు ఉండగా, కొత్తగా ఇది కూడా చేరింది.

తెలంగాణలో తొలి కేసు

హైదరాబాద్‌కు చెందిన దంపతులు 2017లో ఒక బిడ్డకు జన్మనిచ్చారు. ఆ బిడ్డ పుట్టుకతోనే చనిపోయింది. ఆ తర్వాత 2018లో మళ్లీ ఆ దంపతులకు చెందిన మరో బిడ్డ కడుపులో ఉండగానే పరీక్షలు చేశారు. ఆ పరీక్షల్లో జన్యుపరమైన సమస్యలు ఉన్నట్టు గుర్తించారు. ఆ బిడ్డ పుడితే బతకదని తేల్చారు. ఆ బిడ్డకు ఐదు నెలలు ఉన్నప్పుడే అబార్షన్ చేసి తీశారు. పోసుమార్టం ద్వారా అసాధారణమైన లక్షణాలను పరిశోధకులు గుర్తించారు. ఏదో కొత్త వ్యాధిగా అనుమానించారు. దీంతో అప్పటినుంచి పరిశోధన ప్రారంభమైంది. చర్మం నుంచి డీఎన్‌ఏ తీసుకొని పరీక్షలు చేశారు. అప్పుడు కొత్త జన్యులోపం సర్పినోపతి–11గా నిర్ధారణకు వచ్చారు. మరోవైపు ఆ దంపతులు 2020లో మూడోసారి కూడా బిడ్డను కనేందుకు సిద్ధమయ్యారు. బిడ్డ కడుపులో ఉండగానే స్కానింగ్, జెనెటిక్ పరీక్షల్లో అరుదైన లక్షణాలు కనిపించాయి. ఐదు నెలలు ఉండగానే కడుపులో ఉన్న బిడ్డలో ఊపిరితిత్తులు, గుండె సహా ఇతర అవయవాల్లో నీరు చేరింది. ఈ బిడ్డ కూడా బతకదని గుర్తించి అబార్షన్ చేశారు. ఆ బిడ్డకు కూడా అదే జన్యు లోపం ఉందని నిర్ధారించారు. మరోవైపు ఆ దంపతులకు కూడా ఆ జన్యులోపం ఉందని... ఇద్దరిలో సగం సగం ఉందని గుర్తించారు. వారిద్దరి నుంచి పిల్లలకు వ్యాపించిందని నిమ్స్ వైద్యులు కనుగొన్నారు. ఇలా ఒకే కుటుంబానికి చెందిన కడుపులోని ఇద్దరు బిడ్డలను అబార్షన్ చేసి పిండాలపై జెనెటిక్ విభాగంలో పరిశోధన చేశారు. ఈ జన్యులోపానికి సంబంధించిన ప్రధాన లక్షణం గుండె, ఊపిరితిత్తులు సహా ప్రతి అవయవంలో నీరు చేరిపోతుందని, దీనిని కనుగొన్న డాక్టర్ షగున్ అగర్వాల్ 'సాక్షి'కి చెప్పారు. సీడీఎఫ్‌డీ శాస్త్రవేత్తలు డాక్టర్ రష్నా భండారి, డాక్టర్ అశ్విన్ దలాల్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధనలో పాల్గొన్నది. పరిశోధనలో నిమ్స్ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిందంటూ మంత్రి దామోదర రాజనర్సింహ పరిశోధనలో పాల్గొన్న వైద్య బృందానికి అభినందనలు చెప్పారు.

చికిత్సకు ఊతం: నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

ఇలాంటి జన్యులోపంతో ఇబ్బంది పడుతున్న వారికి చికిత్స అందించేందుకు ఈ పరిశోధన ఎంతగానో ఉపయోగపడుతుందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. రెండు పిండాలపై(ఫీటస్) డాక్టర్లు పరిశోధనలు చేయగా, శరీరంలో ఉండే 'సెర్పినా11' అనే జన్యువులో మ్యుటేషన్లు జరుగుతున్నాయని, ఈ మ్యుటేషన్ల వల్ల శరీరంలోని ఇతర టిష్యూస్ కూడా దెబ్బ తింటున్నాయని గుర్తించారని చెప్పారు. ఇలాంటి ఒక అరుదైన జన్యులోపాన్ని గుర్తించడం ప్రపంచంలోనే తొలిసారి అని క్లినికల్ జెనెటిక్స్ జర్నల్ ప్రకటించిందని బీరప్ప తెలిపారు.

వ్యవసాయ, సహకార బదిలీల్లో

'చేతి'వాటం

డిమాండ్‌ను బట్టి రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు

ఓ కీలక ప్రజాప్రతినిధి ఓఎస్డీ నిర్వాకం..

వ్యవసాయశాఖలో 40, సహకారశాఖలో 20 బదిలీల్లో అక్రమాలు?

ఉద్యోగుల ఫిర్యాదులు.. వ్యవసాయ కమిషనరేట్‌లో ఆందోళన



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ, సహకార శాఖల్లో చేపట్టిన బదిలీల్లో ఓ కీలక ప్రజాప్రతినిధికి చెందిన ఓఎస్డీ చేతివాటం చూపించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తానే వ్యవసాయ కమిషనరేట్‌లో మూడురోజులు కూర్చొని డబ్బులు తీసుకొని తనకు ఇష్టమైన వారికి ఇష్టమైన చోట పోస్టింగ్ ఇచ్చారని వ్యవసాయ ఉద్యోగులు మండిపడుతున్నారు. వ్యవసాయ శాఖలో జరిగిన బదిలీలపై అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ ఇప్పటికే డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, సహకారశాఖలో జరిగిన బదిలీలపై ఉద్యోగ సంఘాలు ఏకంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికే ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. 40 శాతం ఉద్యోగులనే బదిలీ చేయాల్సి ఉన్నా, ఉన్నతాధికారులు దానికి మించి ఉత్తర్వులు ఇచ్చారని, సీనియారిటీని పట్టించుకోలేదని, ఆప్షన్లు ఇచ్చిన వారికి కోరుకున్న చోట కాకుండా దూరంగా బదిలీ చేశారని ఆ వినతిపత్రంలో ప్రస్తావించారు.

బ్లాక్ చేసి... ఆపై డబ్బులు వసూలు చేసి

వ్యవసాయశాఖలో వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో), మండల వ్యవసాయాధికారులు (ఏవో), వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీఏ), డిప్యూటీ డైరెక్టర్లు (డీడీ), వ్యవసాయ జాయింట్ డైరెక్టర్లు (జేడీఏ)ల బదిలీలు చేపట్టారు. వ్యవసాయ, సహకారశాఖల్లో రుణమాఫీ కారణంగా ఈ నెల 20వ తేదీ వరకు బదిలీల ప్రక్రియ చేపట్టారు. దాదాపు 900 మంది వరకు బదిలీలు జరిగాయని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. డిమాండ్‌ను బట్టి బదిలీల కు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆ ఓఎస్డీ వసూలు చేసినట్టు ఉద్యోగులే చెబుతున్నారు. 83 ఏడీఏ పోస్టులకుగాను 29 బ్లాక్ చేశా రు. మరో 11 ఇతర పోస్టులు బ్లాక్ చేశారని తెలిసింది. బ్లాక్ చేసినవే కాకుండా ఇతర పోస్టులను కూడా కౌన్సెలింగ్‌లో తమ వారికి దక్కేలా ఆ ఓఎస్డీ చక్రం తిప్పారు. సహకారశాఖలో 366 మంది ఉద్యోగులకు బదిలీలు అయ్యాయి. గడు వు ముగిసిన తర్వాత ఈ నెల 21న ఐదుగురు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ రిజిస్ట్రార్లు, 17 మంది జాయింట్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని ఉద్యోగులు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం బదిలీలు చేయలేదని, డబ్బులు చేతులు మారాయని విమర్శిస్తున్నా రు. సహకారశాఖలో దాదాపు 20 పోస్టులు బ్లాక్ చేసి, వాటిని అమ్ముకున్నారని ఉద్యోగులు అంటున్నారు. కొందరికై తే నాలుగేళ్లు నిండకుండానే బదిలీ చేస్తే... కొందరికైతే రెండేళ్లు కూడా పూర్తి కాకుండానే బదిలీ చేశారు. అసలు వ్యవసాయ, సహకారశాఖల్లో బదిలీకి అర్హులైన జాబితాలో పేర్లు లేనివారిని కూడా చెప్పాపెట్టకుండా బదిలీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మార్క్‌ఫెడ్‌లో బదిలీల నిలిపివేత

→ మార్క్‌ఫెడ్‌లో గత నెలలోనే బదిలీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కానీ బదిలీలు నిలిపివేశారు. హైదరాబాద్‌లో కీలకమైనచోట పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ఉన్నతస్థాయిలో పైరవీలు చేయించుకొని తమకు స్థానచలనం జరగకుండా బదిలీలు నిలుపుదల చేశారన్న విమర్శలున్నాయి. మరోవైపు ఆయిల్‌ఫెడ్‌లోనూ ఏళ్లుగా బదిలీల ప్రక్రియ జరగడం లేదు. అనేకమంది ఏళ్ల తరబడి ఒకేచోట ఉన్నా, వారిని కదిలించడం లేదన్న చర్చ జరుగుతోంది.

సాక్షి హైదరాబాద్

శనివారం । 24 । ఆగస్టు । 2024



ఉద్యోగాలిప్పిస్తాం..

ఉద్యోగిలిప్పిస్తాం.. బదిలీలు చేయిస్తామని మోసాలకు పాల్పడుతున్న ఘరానా ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. ఆరుగురిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. - 10లో



రన్ రాజా రన్

నగరంలో ప్రస్తుతం రన్నింగ్ ట్రెండ్ విపరీతంగా పెరిగిపోయింది. కనీసం వారంలో ఒకసారైనా వాకింగ్, జాగింగ్, రన్నింగ్‌తో ఒళ్లు కదిపితే లెక్కలేనన్ని ప్రయోజనాలున్నాయి. - సిటీ ప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/24.0

నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి లేదా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 31, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక నజర్: ఆమ్రపాలి

లక్డీకాపూల్: నగరంలో సీజనల్ వ్యాధుల నివారణపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అదనపు, జోనల్ కమిషనర్లతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధుల కేసుల రికార్డులను జీహెచ్ఎంసీ, జిల్లా వైద్యాధికారులు సంయుక్తంగా రూపొందించాలన్నారు. ముఖ్యంగా వ్యాధుల హెచ్చు తగ్గుదల నమోదుపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అధికారుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. కేసుల సమాచారం సరిగా ఉంటే వ్యాధుల నివారణ సులభమవుతుందన్నారు. ఇందుకు ప్రతి శుక్రవారం జీహెచ్ఎంసీ, వైద్య శాఖ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ ఆరోగ్య విభాగం అడిషనల్ కమిషనర్‌ను ఆదేశించారు.

'గాంధీ'లో మంకీ పాక్స్ ఐసోలేషన్ వార్డులు



గాంధీఆస్పత్రి : ప్రపంచవ్యాప్తంగా భయాందోళనలు సృష్టిస్తున్న మంకీపాక్స్ (ఎంపాక్స్) వైరస్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో రంగం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆస్పత్రి ప్రధాన భవనం మూడో అంతస్తులో మహిళలు, పురుషులకు వేర్వేరుగా మొత్తం 14 పడకలతో ఎం.పాక్స్ ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేసినట్లు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి తెలిపారు. ఎంపాక్స్ పాటిజివ్ కేసులు తెలంగాణలో ఒక్కటి కూడా నమోదు కాలేదని, ముందు జాగ్రత్తచర్యగా ఐసోలేషన్ వార్డులు, నిర్ధారణ కిట్లు, మందులు, నిష్ణాతులైన వైద్యులను అందుబాటులో ఉంచామన్నారు.

ఇవీ లక్షణాలు...

తీవ్రమైన జ్వరం, తలనొప్పి, చలి, అలసట, వెన్నునొప్పి, కాళ్లు చేతులు, ముఖం తదితర శరీర భాగాలపై దురదతో కూడిన దద్దుర్లు వస్తాయి. రెండు వారాల తర్వాత దద్దుర్లు శరీరమంతా వ్యాపిస్తాయి. పై లక్షణాలలో రెండు కంటే ఎక్కువ ఉంటే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి.

పిల్లల సమస్యలపై అసెంబ్లీలో ఒకరోజు చర్చ జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

పంజగుట్ట: ప్రతీ అసెంబ్లీ సెషన్‌లో పిల్లల కోసం ఒక రోజు చర్చ జరగాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కారాలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందిన దేశాల్లో పిల్లలగూర్చి ప్రజా ప్రతినిధులే కాకుండా మేధావులను పిలిపించి వారి సమస్యలు ఎలా పరిష్కరించాలో చట్టసభల్లో మాట్లాడిస్తారని వారు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎంవీ ఫౌండేషన్, అంకురం, పిల్లల సంరక్షణ సంఘాల ఆధ్వర్యంలో మైనర్ పిల్లల్ని పోర్న్ వీడియోలు, లైంగిక వేధింపుల నుంచి కాపాడటం ఎలా అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎంవీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సాంకేతిక సలహాదారు నల్లమోతు శ్రీధర్, అంకురం ఫౌండేషన్ ప్రతినిధి సుమిత్ర, సజయలు మాట్లాడారు. పిల్లలు సెల్‌ఫోన్‌లో ఏం చూస్తున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు తరచూ గమనించాలని సూచించారు. సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు ఉషారాణి, శ్యామలా దేవి, భాగ్యలక్ష్మి, ప్రకాష్, సాంబమూర్తి, ఖలీదా, కృష్ణకుమారి, దీప్తి, మల్లిక పాల్గొన్నారు.

వేధిస్తున్నాడని కడతేర్చాడు

కుమారుడిని కత్తితో పొడిచి చంపిన తండ్రి



శివకుమార్ రెడ్డి (ఫైల్)

శంషాబాద్ రూరల్: మద్యం మత్తులో వేధింపులకు గురి చేస్తున్న కుమారుడిని ఓ కన్న తండ్రి కత్తితో పొడిచి చంపిన ఘటన శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని తొండుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన దూలప్ప రెడ్డి, సరస్వతి దంపతులకు ముగ్గురు కుమారులు. వీరి రెండో కుమారుడు శివకుమార్‌రెడ్డి (36)తో కలిసి కొన్నేళ్ల నుంచి తొండుపల్లి పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్నారు. శివకుమార్‌రెడ్డి కొంత కాలం డ్రైవర్‌గా పని చేసి ప్రస్తుతం గైడ్‌గా వ్యవహరిస్తున్నాడు. మద్యానికి బానిసగా మారాడు. తన జీతాన్ని జల్సాలకు ఖర్చు చేసి తండ్రి పెన్షన్ డబ్బులు కూడా కావాలని తరచూ వేధించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం తాగిన శివకుమార్ ఇంట్లో తండ్రితో గొడవ పడ్డాడు. వీరిని తల్లి సరస్వతి సముదాయించి బయటకు వెళ్లింది. కాసేపటికి ఇంట్లో నుంచి కొడుకు అరుపులు విని లోపలికి వెళ్లి చూడగా.. శివకుమార్‌రెడ్డి మంచంపై పడి ఉన్నాడు. అతని మెడ, కాలుపై కత్తిగాట్లు ఉండడంతో పాటు రక్తస్రావంతో ప్రాణాపాయస్థితిలో పడి ఉన్నాడు. భర్త చేతిలో కత్తి ఉంది. కాసేపటికే శివకుమార్ ప్రాణాలు విడిచాడు. కుమారుడి వేధింపులు భరించలేక ఇంట్లో చెట్లు నరికే కత్తితో మెడ, కాలుపై పొడిచినట్లు దూలప్ప తన భార్యకు చెప్పాడు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సరస్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గళమెత్తండి







లైంగిక వేధింపులకు గురైన మహిళలకు మద్దతుగా సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల విద్యార్థులు ఆవాజ్ ఉఠావో పేరుతో శుక్రవారం నాటకం ప్రదర్శించారు. ఆ తర్వాత 1,500 మంది విద్యార్థులు కలిసి బేగంపేటలోని ఉమానగర్ వీధుల్లో 'సైలెంట్ మార్చ్ ఫర్ జస్టిస్' పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేబూని మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఫైళ్లకు బ్రేక్!

హెచ్ఎండీఏలో కదలిక లేని దస్త్రాలు

- కొత్త కమిషనర్ వచ్చినా మారని పరిస్థితి
- 'పరిమితం'గా ఫైళ్ల కదలిక
- రెక్కలు తెగిన నిర్మాణ రంగం
- భూ మార్పిడి, బహుళ అంతస్తులపై ఆంక్షలు


సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగర పాలక అభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రణాళికా విభాగం పడకేసింది. నిర్మాణ రంగం అనుమతులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఎక్కడి ఫైళ్లు అక్కడే నిలిచిపోయాయి. బహుళ అంతస్తుల భవనాలు, భూ మార్పిడి అనుమతులు నత్తకు నడకలు నేర్పుతున్నాయి. నెలల తరబడి పడిగాపులు కాసినా పనులు కావడం లేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాల కోసం రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టి సకాలంలో అనుమతులు లభించకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సివస్తోందని బిల్డర్లు, రియల్టర్లు ఆవేదన చెందుతున్నారు. హెచ్ఎండీఏ రెగ్యులర్ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా అనుమతుల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని, తీవ్రమైన జాప్యం చోటుచేసుకొంటోందని వివిధ రకాల అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న భూ యజమానులు అంటున్నారు. పైనుంచి ఆదేశాలు వస్తే తప్ప కొన్ని ఫైళ్లు కదలడం లేదు. చివరకు నిర్మాణం పూర్తయిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌లు కూడా సకాలంలో లభించడం లేదని పేర్కొంటున్నారు. మరోవైపు సకాలంలో పాతవి పరిష్కారం కావడం లేదు. కొత్త దరఖాస్తులు నమోదు కావడం లేదు. 'పరిమితుల'కు లోబడి పని చేయాల్సివస్తోందని, పైనుంచి వచ్చే ఆదేశాలను మాత్రమే తాము పాటిస్తున్నా'మని అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులకు 'పరిమితి'..

- గత ఆరు నెలలుగా అన్ని రకాల ఫైళ్లు నత్త నడక నడుస్తున్నాయి. ఏ ఒక్క ఫైల్ కూడా సకాలంలో పరిష్కారం కావడం లేదు. ఇటీవల హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగంలో సమూలమైన మార్పులు చేశారు. అధికారులు, ఉద్యోగులపై పని భారాన్ని తగ్గించేందుకు 4 జోన్‌లను 6కు పెంచారు. మేడ్చల్, శంకర్‌పల్లి జోన్‌లను మేడ్చల్-1, మేడ్చల్-2, శంకర్‌పల్లి-1, శంకర్‌పల్లి-2 జోన్‌లుగా విభజించారు. వీటితో పాటు శంషాబాద్, ఘట్కేసర్ మరో రెండు జోన్‌లు ఉన్నాయి. ఇలా జోన్‌ల విభజన జరిగినప్పటికీ సకాలంలో ఫైళ్లకు మోక్షం లభించడం లేదని బాధితులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.
- మరోవైపు కన్జర్వేషన్ జోన్‌లలోని భూములను నివాసయోగ్యమైన జాబితాలోకి మార్చేందుకు సైతం పరిమితులు ఉన్నాయి. 7 ఎకరాల కంటే ఎక్కువ ఉన్న భూముల మార్పిడికి పై నుంచి ఆదేశాలు వస్తే తప్ప ఫైళ్లు ముందుకు కదలడం లేదు. అలాగే బహుళ అంతస్తుల భవనాల నిర్మాణంలోనూ 5 లక్షల చదరపు అడుగులలోపు మాత్రమే ఉన్న ఫైళ్లను అధికారులు పరిశీలిస్తుండగా, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నవాటిపై ఉన్నతాధికారుల ఆదేశాలు తప్పనిసరిగా మారినట్లు తెలిసింది. ఈ విషయంలో ఉన్నతాధికారులు బాహాటంగానే తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నట్లు బడా నిర్మాణ సంస్థలకు చెందిన ప్రతినిధులు చెబుతున్నారు. 'గతంలో 53 అంతస్తుల భవనాలకు సైతం ప్రభుత్వం అనుమతినిచ్చింది. కానీ.. ప్రస్తుతం 10 అంతస్తుల భవనాలకు కూడా సకాలంలో అనుమతులు లభించడం లేదు'అని ఒక సంస్థకు చెందిన ప్రతినిధి చెప్పారు.

తగ్గిన ఆదాయం..

మరోవైపు రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న స్తబ్దత కారణంగా హెచ్ఎండీఏకు కొత్తగా వచ్చే ఫైళ్ల సంఖ్య కూడా గణనీయంగా తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో హెచ్ఎండీకు ఫీజుల రూపంలో వచ్చే ఆదాయం కూడా తగ్గింది. గతంలో నగరంలోని అన్ని వైపులా రియల్ ఎస్టేట్ పరుగులు పెట్టింది. ఆకాశహర్మ్యాలు వెలిశాయి. దీంతో హెచ్ఎండీఏకు కూడా భారీ ఎత్తున ఆదాయం లభించింది. రియల్ భూమ్ బలంగా ఉండడంతోనే కోకాపేట్, బుద్వేల్, మోకిలా, హయత్‌నగర్, మేడిపల్లి, బాచుపల్లి, తొర్రూరు, ఉప్పల్ భగాయత్ తదితర ప్రాంతాల్లో హెచ్ఎండీఏ స్వయంగా భూములు వేలం వేసి రూ.వేల కోట్లలో ఆదాయం ఆర్జించింది. ప్రస్తుతం రియల్ రంగం కుదేలు కావడంతో హెచ్ఎండీఏ సైతం భూములు వేలం వేసేందుకు వెనకంజ వేస్తోంది. 'ఈ స్తబ్దత తొలగిపోవాలంటే పనుల్లో వేగం పెరగాలి. అదొక్కటే పరిష్కారం. ప్రభుత్వం ఈ దిశగా సరైన చర్యలు తీసుకోవాలి' అని రియల్ రంగానికి చెందిన నిపుణులు సూచిస్తున్నారు.



హైడ్రాలో 3 జోన్లు

సెంట్రల్, నార్త్, సౌత్‌లుగా విభజన

- ఒక్కో జోన్‌కు ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వం
- ముగ్గురి అధీనంలో మొత్తం 72 బృందాలు
- ఆక్రమణలపైనా ప్రత్యేక ఠాణాతో దర్యాప్తు

సాక్షి, సిటీబ్యూరో: జల వనరులు, ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించడంతో పాటు ప్రకృతీ వైపరీత్యాల సమయంలో సత్వర స్పందన కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సంస్థాగత నిర్మాణంపై డైరెక్టర్ ఏవీ రంగనాథ్ దృష్టి సారించారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న 2053.44 చదరపు కిలోమీటర్ల ప్రాంతం దీని పరిధిలోకి రానుండటంతో అందుకు తగినట్లు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. హైడ్రా విభజన, సిబ్బంది కేటాయింపు, యూనిఫాం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కేబినెట్ సమావేశం లోపు ఈ అంశాలపై ఓ స్పష్టత తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు.

ఒక్కో కమిషనరేట్‌కు ఒక్కో జోన్

వివిధ రకాలైన బాధ్యతలు నిర్వర్తించే హైడ్రా ప్రధానంగా పోలీసు విభాగంతో సమన్వయం ఏర్పాటు చేసుకుని పని చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తమ పరిధిలోని ప్రాంతాన్ని మూడు జోన్లుగా విభజించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. నార్త్ జోన్‌లోకి సైబరాబాద్, సౌత్ జోన్‌లోకి రాచకొండ, సెంట్రల్ జోన్‌లోకి హైదరాబాద్ పోలీసు కమిషనరేట్లు రానున్నాయి. హైడ్రాలో ఒక్కో జోన్‌కు ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వం వహించనున్నారు. ప్రతి ఎస్పీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు అసెట్ ప్రొటెక్షన్‌ను పర్యవేక్షిస్తారు. మొదటి అంశంలో ట్రాఫిక్ పోలీసులు, రెండో అంశంలో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పని చేస్తారు.

మొత్తం 72 బృందాలు ఏర్పాటు...

హైడ్రా పరిధిలోకి జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ లోపల ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, ప్రత్యేక పరిపాలన బాడీలు, ఇండస్ట్రియల్ ప్రాంతాలు వస్తున్నాయి. వాటికి సంబంధించిన చట్టాల ప్రకారం ఈ అధికారులు పని చేస్తారు. హైడ్రాలో ఏర్పడే మూడు జోన్లలో కలిపి 72 ప్రత్యేక బృందాలు పని చేయనున్నాయి. ఇవన్నీ తమ పరిధిలో విపత్తు స్పందన, ఆక్రమణల నిరోధంతో పాటు అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటాయి. ప్రాథమికంగా 3,500 వరకు సిబ్బందిని ఈ విభాగానికి కేటాయించనున్నారు. కూల్చివేతలు తదితర సున్నిత సందర్భాల్లో హైడ్రా అధికారులు సాధారణ దుస్తుల్లో ఉండటంతో కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైడ్రాకు ప్రత్యేక యూనిఫాం కేటాయించాలా? లేక ఆ విభాగంలో పని చేసే పోలీసు సిబ్బందిని వారి యూనిఫాంలో ఉంచాలా అనేది ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకోవాలని హైడ్రా అధికారులు నిర్ణయించారు.



కబ్జా కథల గుట్టు విప్పే ఠాణా..

ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై జీహెచ్ఎంసీ అధికారులు స్థానిక పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు. హైడ్రా పరిధి మొత్తానికి కలిపి ఆ విభాగం పరిధిలో ఓ ఠాణా ఏర్పాటు కానుంది. ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వంలో పని చేసే ఈ పోలీసుస్టేషన్‌లో జల వనరులతో పాటు ప్రభుత్వ భూముల కబ్జాలకు సంబంధించిన కేసుల నమోదు, దర్యాప్తు ఉంటుంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహితలను (బీఎన్ఎస్ఎస్) ఆధారంగానే ఈ ఠాణా పని చేయనుంది. పోలీసు, జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారుల ఫిర్యాదుతో పాటు జల వనరులు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, ఆక్రమణలపై సాధారణ ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను సైతం ఈ పోలీసుస్టేషన్‌ను అధికారులు పరిగణనలోకి తీసుకుంటారు. విచారణ, దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోనున్నారు.

బల్దియాలో బదిలీలు

పలువురు డీసీలకు స్థానచలనం

- శానిటేషన్ ఏసీగా రఘుప్రసాద్
- సామ్రాట్ అశోక్‌కు 'ఎస్టేట్స్'..

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ అంతర్గత బదిలీల్లో భాగంగా తాజాగా మరో 25 మంది అధికారులను ఆయా పోస్టుల్లో నియమించారు.. ఇతర స్థానాలకు బదిలీ చేశారు.. అదనపు బాధ్యతలప్పగించారు. ఈ మేరకు కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక వాటిని విడుదల చేశారు. ఇటీవలే గవర్నర్ కార్యాలయం నుంచి బదిలీ అయి జీహెచ్ఎంసీలో విధుల్లో చేరిన మున్సిపల్ పరిపాలన శాఖ అడిషనల్ డైరెక్టర్ సీఎన్ రఘుప్రసాద్‌ను శానిటేషన్, ట్రాన్స్‌పోర్ట్ విభాగాలకు అడిషనల్ కమిషనర్‌గా నియమించారు. సీడీఎంఏ నుంచి బదిలీపై వచ్చిన ఎన్.సామ్రాట్ అశోక్‌ను ఎస్టేట్స్ విభాగం అడిషనల్ కమిషనర్‌గా నియమించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఆర్.ఉపేందర్‌రెడ్డికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)బాధ్యతలు అదనంగా అప్పగించారు. రెవెన్యూ, ఐటీ విభాగాల అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌కు 'ట్రాఫిక్' బాధ్యతలు అదనంగా అప్పగించారు.

- కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ (డీసీ) ముకుందరెడ్డిని శేరిలింగంపల్లి డీసీగా నియమించారు. శేరిలింగంపల్లి డీసీ రజనీకాంత్ రెడ్డిని ఖైరతాబాద్ డీసీగా,ఖైరతాబాద్ డీసీ జగన్‌ను కాప్రా డీసీగా నియమించారు. కూకట్‌పల్లి జోన్ ఘనవ్యర్థాల నిర్వహణ విభాగం డీసీ పి.మోహన్‌రెడ్డిని చందానగర్ డీసీగా, అరుణకుమారి చరణ్ ఫలక్‌నుమా డీసీగా నియమితులయ్యారు. యూసుఫ్‌గూడ డీసీగా ఉన్న సేవా ఇస్లావత్‌ను ఎల్‌బీనగర్ డీసీగా, అక్కడ డీసీగా ఉన్న జకియా సుల్తానాను యూసుఫ్‌గూడ డీసీగా, సంతోష్‌నగర్ డీసీగా ఎ. శైలజను నియమించారు.
- వై. శ్రీనివాస్‌రెడ్డిని ఎస్టేట్ ఆఫీసర్‌గా.. జి.ఉమాప్రకాశ్‌కు రెవెన్యూ జాయింట్ కమిషనర్ (జేసీ) బాధ్యతలప్పగించారు. స్పోర్ట్స్ జేసీగా ఎస్. వాణిశ్రీ నియమితులయ్యారు.
- చీఫ్ వాల్యుయేషన్ ఆఫీసర్ మహేశ్ కులకర్ణిని పరిపాలన విభాగం జేసీగా నియమించారు. ఆ పోస్టులో ఉన్న కె.జయంత్‌రావును హెల్త్ జేసీగా నియమించారు. ఐటీ జేసీగా సి.రాధను నియమించారు.
- రెహానా బేగంను ఖైరతాబాద్ జోన్ స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమించారు.
- ఎస్.సుధాంశ్‌ను స్వచ్ఛభారత్ మిషన్ జేసీగా నియమించారు.
- డిప్యూటీ సీఈఓ జి.కృష్ణకుమారిని ఎల్‌బీనగర్ జాయింట్ కమిషనర్‌గా నియమించారు
- ఘన వ్యర్థాల నిర్వహణ ఎల్‌బీనగర్ జోన్ డీసీగా మహ్మద్ షేక్‌ను , చార్మినార్ జోన్ డీసీగా శంకర్‌సింగ్‌ను , సికింద్రాబాద్ జోన్ డీసీగా పద్మప్రియను, కూకట్‌పల్లి జోన్ డీసీగా డి.ఉదయ్‌కుమార్ నియమితులయ్యారు.



గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

మూసాపేట: ముగ్గురు చిన్ననాటి స్నేహితులు గంజాయి సేవించడంతోపాటు విక్రయాలు జరుపుతుండంతో శుక్రవారం అరెస్టు చేశారు. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లా పెనుగొండ గ్రామానికి చెందిన సాయిచరణ్ రెడ్డి, జగదీష్, సాయికిరణ్‌రెడ్డి స్నేహితులు. వీరిలో సాయిచరణ్ రెడ్డి, జగదీష్ అమీన్‌పూర్‌లో ఉంటూ ఉద్యోగ అన్వేషణలో ఉండగా..సాయికిరణ్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తూ మూసాపేటలోని ఓ గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నాడు. బీటెక్ చదువుతున్న సమయంలో వీరికి గంజాయి తాగడం అలవాటుగా మారింది. ఉద్యోగం లేకపోవటంతో తేలికగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయించడం ప్రారంభించారు. ఏపీలోని అనకాపల్లి నుంచి గంజాయిని కొనుగోలు చేసి బస్సులో డ్రైవర్‌కు పార్శిల్ హైదరాబాద్‌లో ఇవ్వాలని కోరుతూ..కారులో బస్సును ఫాలో అవుతూ హైదరాబాద్‌కు వచ్చాక పార్సిల్ తీసుకుంటున్నారు. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో పోలీస్ తనిఖీ ఉండదని భావించి గుట్టు చప్పుడు కాకుండా ఫ్లాట్‌లోనే ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు గురువారం రాత్రి దాడి చేసి కిలో 800 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేయటంతో పాటు కొన్న వారిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారికి కౌన్సిలింగ్ ఇవ్వనున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురు నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

మలేషియా సంస్థతో టీ హబ్ ఒప్పందం

రాయదుర్గం: ప్రముఖ స్టార్టప్ ఇంక్యుబేటర్ టీ హబ్, మలేషియాలోని ప్రీమియర్ యాక్సిలరేటర్ ఎకోసిస్టమ్..బియాండ్ 4 సంస్థతో ఒక ఒప్పందం చేసుకున్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో జరిగిన కార్యక్రమంలో రెండు సంస్థలకు చెందిన వారు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. భారత్–మలేషియా దేశాల మధ్య ఉన్న మార్కెట్ యాక్సెస్‌ను ప్రోత్సహించడం, రెండు దేశాల నుంచి స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడానికి బలమైన ఫ్రేమ్ వర్క్‌ను సృష్టించడానికి ఈ ఒప్పందం దోహదపడుతుంది. ఈ సందర్భంగా బియాండ్ 4 సీఈఓ ఎస్.రుబనేశ్వరన్ మాట్లాడుతూ భారత్–మలేషియా దేశాల మధ్య స్టార్టప్‌లకు చేయూత అందించేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందన్నారు. టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాస రావు మాట్లాడుతూ బియాండ్ 4 భాగస్వామ్యంతో ఇండియా–మలేషియా దేశాల స్టార్టప్‌లు గ్లోబల్‌గా విస్తరించడానికి ఉన్నత స్థాయిలో మరిన్ని ఆవిష్కరణలను చేయడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మలేషియా ఇన్వెస్ట్‌మెంట్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ శాఖా మంత్రి పాల్గొన్నారు.

ఉద్యోగాలిప్పిస్తాం.. బదిలీలు చేయిస్తాం!

ప్రభుత్వ ముఖ్య సలహాదారు పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠా

- ఉద్యోగాలు, బదిలీలు, డబుల్ ఇళ్లు ఇప్పిస్తామంటూ వల
- 107 మందిని మోసం చేసిన ఘరానా గ్యాంగ్
- ఆరుగురిని అరెస్టు చేసిన రాచకొండ పోలీసులు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: 'హలో..నేను రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మాట్లాడుతున్నా..'అంటూ ఫోన్ చేసి మోసాలకు పాల్పడుతున్న ఘరానా ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. భారత ఆహార సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, నచ్చిన చోటుకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు చేస్తామని, చర్లపల్లిలో 2 బీహెచ్‌కే గృహాలు కేటాయిస్తామని అమాయకులకు వల వేసి, మోసాలకు పాల్పడుతున్న ఆరుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఆయా వివరాలను శుక్రవారం స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ)-1 డీసీపీ రమణా రెడ్డి, అదనపు డీసీపీ ఎన్.నరసింహారెడ్డిలతో కలిసి పోలీసు కమిషనర్ జి.సుధీర్‌బాబు మీడియాకు వెల్లడించారు.

- కుషాయిగూడకు చెందిన అనుగు సురేందర్ రెడ్డి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం ఏజెన్సీలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో ఇతను కీసరకు చెందిన మెరీనా రోజ్, బండ వెంకటేష్, అనుగు హర్షిణిరెడ్డి, జమ్మాయిగూడకు చెందిన కట్రావత్ గోపాల్ నాయక్‌లతో కలిసి ముఠాగా ఏర్పడ్డారు.
- ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి మాదిరిగా ఫోన్‌లో మాట్లాడుతూ అమాయకులను బుట్టలో వేసుకునేవాడు. ఫుడ్ కార్పొరేషన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఉద్యోగులను బదిలీ చేయిస్తామని, 2 బీహెచ్‌కే గృహాలు కేటాయిస్తామని నమ్మించేవారు. డిమాండ్‌ను బట్టి ఒక్కొక్కరి నుంచి రూ.2–5 లక్షలు వసూలు చేసేవారు. ఎడ్యుకేషన్ విభాగంలో ఏడుగురు ఉపాధ్యాయులను బదిలీ చేస్తామని నమ్మించి వారి నుంచి రూ.7 లక్షలు, పలువురు నిరుద్యోగులకు ఎఫ్‌సీఐలో ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.18.5 లక్షలు వసూలు చేశారు. మొత్తంగా ఈ ముఠా రూ.1.29 కోట్లు మోసం చేశారు.

కీసర ఆర్డీఓగా పేర్కొంటూ..

- చర్లపల్లిలో 2 బీహెచ్‌కే గృహాలు కేటాయిస్తామని అమాయకులను బుట్టలో వేసుకున్నారు. సుమారు వంద మంది బాధితుల నుంచి ఫ్లాట్‌కు రూ.2.5 లక్షలు వసూలు చేశారు. నకిలీ డాక్యుమెంట్లు సమర్పించి రూ.1.4 కోట్లు వసూలుచేశారు. ఈ క్రమంలో గతేడాది నవంబర్‌లో కల్యాణి, ఆమె సోదరుడు ఇద్దరికి 2 బీహెచ్‌కే ఇళ్లు కేటాయిస్తామని నమ్మించి రూ.5 లక్షలు వసూలు చేశారు. అయితే ఎంతకీ ఇల్లు కేటాయించకపోయేసరికి వీరు నిందితులపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో అనుగు హర్షిణి కీసర ఆర్డీఓగా పరిచయం చేసుకొని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉందని, దీంతో కేటాయించలేకపోతున్నామని వారిని నమ్మించింది. ఎన్నికలు ముగిసినా ఇళ్లు కేటాయించకపోయేసరికి మోసపోయానని గ్రహించిన బాధితురాలు కీసర పోలీసులను సంప్రదించింది.

గురుకుల సెక్రటరీకి ఫోన్‌తో వెలుగులోకి..

ఉద్యోగం కోసం పోచారంకు చెందిన బొలుగు అంజయ్య ఈ ముఠాను సంప్రదించాడు. ఓ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి వేం నరేందర్ రెడ్డిని మాట్లాడుతున్నానని చెప్పి, అతనికి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం ఇప్పించారు. దీంతో నిజంగానే వేం నరేందర్ రెడ్డే మాట్లాడుతున్నాడని విశ్వసించిన సదరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తనకు వేరే చోటుకు బదిలీ కావాలని కోరింది. దీంతో సురేందర్ గురుకుల శాఖ సెక్రటరీకి ఫోన్ చేసి నరేందర్ రెడ్డిని మాట్లాడుతున్నానని చెప్పాడు. ఫలానా ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయాలని ఆదేశించాడు. ఫోన్‌లో బదిలీ ప్రక్రియల గురించి ఆదేశించడమేంటని అనుమానించిన సదరు సెక్రటరీ..వెంటనే అప్రమత్తమై రాచకొండ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన ఎస్ఓటీ, కీసర పోలీసులు ముఠా ఆటకట్టించారు. నిందితుల నుంచి రూ.1.97 లక్షల నగదుతో పాటు నకిలీ డాక్యుమెంట్లు, స్టాంప్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

మేయర్ పేరిట జారీ అయిన ట్రేడ్ లైసెన్స్ రద్దు

సాక్షి, సిటీబ్యూరో: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో 'డ్రగ్‌మార్ట్ ఇన్ కాంగ్రెస్' దుకాణానికి మేయర్ విజయలక్ష్మి గద్వాల్ పేరిట జారీ అయిన ట్రేడ్ లైసెన్స్‌ను జీహెచ్ఎంసీ రద్దు చేసినట్లు కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. తప్పుడు పత్రాలతో ట్రేడ్ లైసెన్సులు జారీ అవుతున్న తీరు శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన విషయం విదితమే.స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలన జరిపి తప్పుడు పత్రాలు అప్‌లోడ్ చేసినా మేయర్ పేరిట ట్రేడ్ లైసెన్స్ జారీ అయినట్లు గుర్తించి బ్లాక్ చేసినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ పనితీరు మెరుగుపరచుకోవడానికి ఇది ఉపకరించిందని పేర్కొన్నారు. ట్రేడ్‌లైసెన్సుల దరఖాస్తులు 15 రోజుల్లోగా తనిఖీ అవుతున్నదీ లేనిదీ తెలుసుకునేందుకు మరింత దృష్టి కేంద్రీకరించనున్నట్లు పేర్కొన్నారు. ట్రేడ్ లైసెన్సుల జారీ తీరును పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులను అభినందించారు.

'మట్టి గణపతులనే పూజిద్దాం'

లక్డీకాపూల్: మట్టి గణపతులనే పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు చేద్దామని స్ఫూర్తి సేవా సంఘం వ్యవస్థాపకుడు పుట్టా రామకృష్ణ అన్నారు. కాలుష్యంపై యుద్ధం ప్రకటించిన ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ గత కొంత కాలంగా తమ సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతులపై ప్రజల్లో అవేర్‌నెస్ పెంచుతున్నామని చెప్పారు. గత రెండేళ్లుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. మట్టి గణపతులపై త్వరలో సినీ నటులతో ప్రచారం చేపట్టేందుకు కార్యచరణను రూపొందిస్తున్నామన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థి ఆత్మహత్య



వరుణ్ (ఫైల్)

అల్వాల్: అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఎంబీబీఎస్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వెంకటాపురం సాయినగర్ అపార్టుమెంట్‌లో నివసించే అగ్నిగుండాల వరుణ్‌రావు (23) ఉజ్బెకిస్తాన్‌లో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. రెండు నెలల క్రితం సెలవులకు ఇంటికి వచ్చాడు. తండ్రి శ్రీనివాస్ రావు మృతి చెందడంతో తల్లితో కలిసి ఉంటున్నాడు. ఇదిలా ఉండగా శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో సీలింగ్ హుక్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. తల్లి అనితరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యూట్యూబర్ హర్షపై కేసు నమోదు



గాల్లోకి డబ్బులు ఎగరేస్తున్న హర్ష

సనత్‌నగర్: గుర్తింపు కోసం ఆరాటంతో గాలిలోకి డబ్బులు వెదజల్లిన యూట్యూబర్ హర్ష అలియాస్ మహదేవ్‌పై సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లోనూ కేసు నమోదైంది. బోరబండ సమీపంలోని పర్వత్‌నగర్‌కు చెందిన యూట్యూబర్ హర్ష (24) ఇన్‌స్టాగామ్‌లో రీల్స్ చేస్తుంటాడు. ఇందులో గుర్తింపు రావడం కోసం పలు ప్రాంతాల్లో గాల్లోకి డబ్బులు వెదజల్లాడు. ఇటీవల కూకట్‌పల్లి మెట్రోస్టేషన్ సమీపంలో గాల్లోకి డబ్బులు వెదజల్లడం, వాటిని ఏరుకోవడం కోసం జనం గుమిగూడిన దృశ్యాలను ఇన్‌స్టాలో పోస్టు చేశాడు. ఈ సంఘటనపై కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఇదిలా ఉండగా ఆగస్టు 11వ తేదీన ఎర్రగడ్డలోని ఆదివారం అంగడిలో కూడా నడుచుకుంటూ వెళ్తూ గాల్లోకి డబ్బులు వెదజల్లాడు. డబ్బు కోసం కొందరు పోటీపడడంతో తీవ్రంగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ దృశ్యాలను కూడా 'ఇట్స్ మి పవర్' ఐడీతోట హర్ష ఇన్‌స్టాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారాయి. ఈ సంఘటనపై బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు గురువారం సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హర్షపై కేసు నమోదు చేసినట్లు సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మొయినాబాద్: గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను అధికారులు తొలగిస్తున్నారు. మొయినాబాద్‌లోని సు రబి వెంచర్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తు న్న భవనాలను పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ శుక్రవారం జేసీబీలతో కూల్చివేయించా రు. పంచాయతీ అధికారులు చేపట్టిన కూల్చివేతలను స్థానికులు అడ్డుకున్నారు. బడాబాబుల నిర్మాణాలను వదిలేసి స్థానికులు నిర్మించుకునే ఇళ్లను కూల్చివేయడంపై మండిపడ్డారు.

ఏసీబీ వలలో స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్

గన్‌ఫౌండ్రీ: ఓ వ్యాపారి వద్ద నుండి రూ.35 వేలు లంచం తీసుకుంటూ వాణిజ్యపన్నుల శాఖ అధికారి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ సంఘటన శుక్రవారం అబిడ్స్‌లోని వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయంలో చోటు చేసుకుంది. ఏసీబీ హైదరాబాద్ సిటీ రేంజ్ డీఎస్పీ కె.శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయంలో స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇందిరా వసంత గత రెండు రోజుల క్రితం నారాయణగూడ ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారికి జీఎస్టీ పెండింగ్‌లో ఉందంటూ నోటీసులు జారీ చేశారు. సదరు వ్యాపారి ఆ నోటీసులకు వివరణ ఇస్తూ జీఎస్టీకి సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకొని అధికారిని కలిశారు. జీఎస్టీ చెల్లింపుతో పాటు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదంటూ రూ.50 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను అంత ఇచ్చుకోలేనని, రూ.35 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు శుక్రవారం రూ.35 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అధికారిణి ఇందిరా వసంతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.



కోయంబత్తూరులో జరిగిన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) సౌత్‌జోన్ ఇంటర్ రీజియన్ క్రీడల్లో తెలంగాణ ఎఫ్‌సీఐ టీంం ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ రాష్ట్రాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

8 నెలల్లో భూ సేకరణ

- పాతబస్తీ మెట్రో అలైన్‌మెంట్ కోసం
- ఎంజీబీఎస్– చాంద్రాయణగుట్ట వరకు
- హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రో అలైన్‌మెంట్ కోసం భూసేకరణను వేగవంతం చేసినట్లు హైదాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో చేపట్టనున్న పాతబస్తీ మెట్రో ప్రాజెక్టు కోసం 8 నెలల్లో భూసేకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ మార్గంలో రోడ్ల విస్తరణ, మెట్రో స్టేషన్ల నిర్మాణం కోసం సుమారు 1200 నిర్మాణాలను పాక్షికంగా లేదా పూర్తిగా తొలిగించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ మేరకు ఇప్పటికే 400 ఆస్తులకు సంబంధించి భూసేకరణ కోసం నోటిఫికేషన్లు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 'జీహెచ్ఎంసీ మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల వెడల్పుతో హైదరాబాద్ మెట్రో రైల్ ఈ రూట్‌లో రహదారుల విస్తరణ చేపట్టింది. స్టేషన్ల వద్ద మాత్రం 120 అడుగుల వెడల్పుతో రోడ్లను విస్తరించనున్నారు. దారుషిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ వరకు ప్రస్తుతం 50 నుంచి 60 అడుగుల వరకు మాత్రమే రోడ్లు ఉన్నాయి. శాలిబండ జంక్షన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు రోడ్లు 80 అడుగుల వరకు ఉన్నాయి. దీంతో దారుషిఫా–శాలిబండ మధ్యలోనే ఎక్కువగా భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఈ రూట్‌లో ఒక్కో నిర్మాణం వద్ద 20 నుంచి 25 అడుగుల చొప్పున విస్తరణ చేయాల్సి ఉంటుంది. అలాగే శాలిబండ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మాత్రం ఒక్కో ఆస్తి 10 అడుగుల వరకు విస్తరించాల్సి ఉంటుంది. స్టేషన్లు, వంపు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ఆస్తుల విషయంలో మాత్రం రహదారి విస్తరణ ఎక్కువగానే ఉంటుంది' అని ఎన్వీఎస్ తెలిపారు.

లైడార్ డ్రోన్ సర్వే పూర్తి..

సాంప్రదాయ సర్వే పద్ధతులతో పాటు 3డీలో వీక్షించే విధంగా లైడార్ డ్రోన్ సర్వేను కూడా ఈ రూట్‌లో పూర్తి చేశారు. ఈ సర్వే వల్ల ప్రభావితం అయ్యే ఆస్తులతో పాటు చుట్టుపక్కల ఉన్న ఆస్తులను కూడా వీక్షించేందుకు అవకాశం ఉంటుంది.ప్రభావిత నిర్మాణాల విలువను అంచనా వేసేందుకు హెచ్ఏఎంఎల్ ఇంజినీర్లు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు ఎండీ తెలిపారు.

ఐటీ అడ్డాగా హైదరాబాద్

- పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కంపెనీలో మదర్‌బోర్డులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఇబ్రహీంపట్నం రూరల్: పెట్టుబడిదారులను ఆకర్షించేలా పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి, అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కొంగరకలాన్‌లో రూ.2,800 కోట్లతో నిర్మించిన కేన్స్ టెక్నాలజీ అడ్వాన్స్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ ఐటీ సంస్థలకు నిలయంగా.. సాంకేతిక రంగాల్లో దిగ్గజంగా మారిందన్నారు. కేన్స్ సంస్థ తెలంగాణ చరిత్రలో నిలిచిపోయేలా రూ.2,800 కోట్ల పెట్టుబడులతో 2 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా నిర్మించడం శుభపరిణామమన్నారు. తమ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తూ పెట్టుబడులకు స్వర్గధామంగా నిలుస్తోందని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇప్పటికే 65 చోట్ల ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

అంతరిక్ష విజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేస్తాం



కార్యక్రమంలో పాల్గొన్న రఘునందన్‌కుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: అంతరిక్ష విజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు 'ఫ్లాగ్ ఆన్ మూన్' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ప్లానెటరీ సొసైటీ ఇండియా డైరెక్టర్ రఘునందన్ కుమార్ తెలిపారు. శుక్రవారం అబిడ్స్‌లోని లిటిల్‌ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో చంద్రయాన్ మిషన్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చంద్రయాన్–3కి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా జాతీయ స్పేస్ డేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 150 పాఠశాలల్లో చంద్రయాన్ మిషన్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న పాఠశాలలు ప్లానెటరీ సొసైటీని సంప్రదించాలని కోరారు.

ప్రేమ వ్యవహారంతోనే బీటెక్ విద్యార్థి హత్య!

పోలీసుల అదుపులో నిందితులు

మహేశ్వరం: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకున్న బీటెక్ విద్యార్థి హత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నాదర్‌గుల్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రశాంత్ (21)ను స్నేహితుడే దారుణంగా హత్య చేసిన విషయం విదితమే. మృతుడు ప్రశాంత్‌తో పాటు నిందితులు రెండో తరగతి నుంచే స్నేహితులుగా ఉన్నట్లు పోలీసులు తేల్చారు. ప్రశాంత్ హత్యకు ప్రధాన కారణం ప్రేమ వ్యవహారమేనని నిర్ధారణ అయ్యింది. దీంతో పాటు పాత గొడవలు కూడా ఉన్నట్లు తేలింది. హత్యకు పాల్పడిన ప్రధాన నిందితుడితో పాటు అతనికి సహకరించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. బర్త్‌డే వేడుకల్లో కేక్ కటింగ్‌కు వినియోగించే ప్లాస్టిక్ చాక్‌తో పొడిచినట్లు పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. సిగరెట్ తాగుతూ జరిగిన గొడవలో క్షణికావేశంలోనే ఈ హత్యోదంతం చోటు చేసుకున్నట్లు తెలిసింది.

సరికొత్త జన్యువును గుర్తించిన నిమ్స్ డాక్టర్లు

సాక్షి, సిటీ బ్యూరో: నిమ్స్ వైద్యులు సెర్పినా–11 అనే సరికొత్త జన్యువును గుర్తించారు. ఈ విషయాన్ని శుక్రవారం వైద్యులు వెల్లడించారు. గర్భంలోనే మృతి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు శిశువుల్లో ఈ జన్యువును గుర్తించారు. ఇది సర్పిన్ సూపర్ ఫ్యామిలీలోని క్లాడ్ ఏకు చెందినదని వైద్యులు వివరించారు. ఈ జన్యువు గర్భంలో శిశువు పెరుగుదలకు చాలా కీలకంగా తోడ్పడుతుందని పేర్కొన్నారు. దీని నిర్మాణాన్ని గుర్తించేందుకు లోతైన అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందని వైద్యులు వెల్లడించారు.

తాజ్‌కృష్ణాలో వరల్డ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం


జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

బంజారాహిల్స్: అత్యంత గ్లామరస్ ఈవెంట్‌లలో ఒకటైన జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్ శుక్రవారం బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ప్రారంభమైంది. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ ఆభరణాల ప్రదర్శన ఉంటుంది. ప్రపంచ ప్రఖ్యాత డిజైనర్లు తమ బ్రాండ్లను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. అరుదైన, కనువిందు చేసే డిజైనర్ ఆభరణాలు ప్రదర్శనలో విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మహిళల మనస్సును దోచే రీతిలో ఇక్కడ ప్రధాన ఆభరణాల తయారీదారులు జైపూర్‌కు చెందిన జీకే చుడీవాలాస్, బహేతి జెమ్స్ అండ్స్ జ్యువెలర్స్, ముంబాయికి చెందిన దివా జ్యువెలర్స్, చెన్నైకి చెందిన జ్యువెలర్స్ క్రియేషన్స్, సూరత్‌కు చెందిన ఇవానా జ్యువెలర్స్ ఇక్కడ తమ ఆభరణాల డిజైనర్లను అందుబాటులో ఉంచారు. సోనియాచావ్లా, నమ్రత సాద్వాని, అనికా కారా, ఆంచల్ బన్సాల్, దీపిక, సుధారెడ్డి, పూనం పారక్, రేఖా సేఠియా, రాఖీ సురారా తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

సందడిగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


ఆత్మకూరి రామారావు స్కూల్‌లో ...


జెహెచ్‌పీఎస్‌లో...

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో శుక్రవారం ప్రీ ప్రైమరీ విద్యార్థులు చిన్ని కృష్ణుల వేషధారణల్లో గోపికలు నృత్యాలు చేస్తుండగా ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకున్నారు. ముకుందా..ముకుందా.. అంటూ చిన్ని కృష్ణులు, గోపికలు చేసిన నృత్యం ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. వెన్న దొంగిలించే కృష్ణుని వేషధారణలో చిన్నారులు అలరించారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టే రీతిలో ఈ వేడుకలు నిర్వహించారు. రంగురంగుల దుస్తుల్లో ముస్తాబైన పిల్లలతో ఆవరణలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. చిన్నారులను స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ అభినందించారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో...
జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకున్నారు. చిన్నారుల ఆటపాటలతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. రంగురంగుల దుస్తులు ధరించిన విద్యార్థులు శ్రీకృష్ణుని జీవితంలోని విభిన్న ఘట్టాలను వివరించే నృత్యాలు చేసి ఆహుతులను అలరించారు. నాటికలతో ఆకట్టుకున్నారు. వీనులవిందైన పాటలతో అందరినీ ఓలలాడించారు. ధర్మ, ప్రేమ, సత్యం సద్గుణాలను ఈ ప్రదర్శన ద్వారా వివరించారు. ప్రేమ, సంరక్షణ, నిస్వార్థమైన స్నేహాలు అత్యంత విలువైనవని శ్రీకృష్ణుని జీవితం నేర్పుతుందని పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మీ అన్నారు. అనంతరం చిన్నారులు ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకల ద్వారా విద్యార్థుల్లో సాంస్కృతిక, సంప్రదాయక, ఆధ్యాత్మిక అవగాహన కలిగించడానికి ఉపయోగపడ్డాయని స్కూల్ ప్రిన్సిపాల్ కాంచనవల్లి తెలిపారు. సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలన్నారు.

ఫొటోగ్రాఫర్స్‌కు సన్మానం

ఫిలింనగర్: వరల్డ్ ఫొటోగ్రఫీ డేను పురస్కరించుకుని తెలుగు సినీ స్టిల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిలింనగర్ కల్చరల్ క్లబ్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ హీరోలు శర్వానంద్, అల్లరి నరేష్, దర్శకుడు మారుతి ముఖ్య అతిథులుగా హాజరై ఫొటోగ్రఫీతో వారికున్న అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు సినీ స్టిల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.మల్లేశ్, సెక్రటరీ జి.వెంకట్రావు, ట్రెజరర్ పి.సతీష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


సినీ స్టిల్ ఫొటోగ్రాఫర్స్‌తో శర్వానంద్, అల్లరి నరేష్, దర్శకుడు మారుతి

సంస్కృతి భాషతో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఉపయోగించాలి

స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డీజీపీ అరవిందరావు, స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి

బంజారాహిల్స్: సంస్కృతి భాష కేవలం సంభాషణ నిమిత్తమే కాకుండా మన రుషులు, మునులు రాసిన అనేక గ్రంథాల్లో ఉన్న అద్భుత ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అవగాహన చేసుకోవడానికి ఉపయోగించాలని స్వామి తత్త్వవిదానంద సరస్వతి శిష్యులు స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి సూచించారు. మారుతున్న కాలంతో పాటు సంస్కృత ప్రచారం కూడా మారాలనే ఉద్దేశంతో సంస్కృత భాషా శిక్షణ ఆన్‌లైన్ మాధ్యమంలో జరగాలని ఏకదంతా ప్రాజెక్టును రూపొందించామని, ఏ మారుమూల ఉన్నా ఫోన్, కంప్యూటర్ ద్వారా ఈ సంస్కృత శిక్షణ తరగతులు వినవచ్చని తెలిపారు. ఏకదంతా మొదటి లెవల్ ఇంటర్నెట్ ప్రాజెక్టును శుక్రవారం జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-42లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ సంస్కృత కోర్సులు బ్రోచర్‌ను కూడా మాజీ డీజీపీ కరణం అరవిందరావు, ఎంఎస్ రామారావు టస్ట్ చైర్మన్ పి.శ్రీనివాసస్వామి, సంస్కృత భారతి చైర్మన్ లక్ష్మీనటాచార్య, వేద సంస్కృత సమితి వైస్ చైర్మన్ డాక్టర్ విశాలక్ష్మి, సంభాషణం సంస్కృత వార్తా వాహిని చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, కుమరవేలు తదితరులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లో వర్ణమాల నుంచి సంభాషణ వరకు అనేక వేదికల్లో సంస్కృత క్లాసులు ఉంటాయన్నారు. ఈ ఏకదంతా ప్రాజెక్టు భగవద్గీత శిక్షకురాలు ఆచార్య సీహెచ్. సద్గుణ, ఫిల్మ్ డైరెక్టర్ ఎంవీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పనిచేస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా భగవద్గీత లాంటి మోక్షశాస్త్రాన్ని యదార్థంగా అర్థం చేసుకుని నిజ జీవితంలో అనునయింపుచేసుకోవాలని సూచించారు. మాజీ డీజీపీ అరవిందరావు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని చిన్నప్పటి నుంచే ప్రతిఒక్కరికీ బోధించాలని, సంస్కృత భాష రావాలంటే ముందుగా తెలుగు వ్యాకరణం తెలపాలన్నారు.

జర్నలిస్టుల గొంతుకగా నిలబడతా

ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్


అమీర్ అలీ ఖాన్‌ను సత్కరిస్తున్న విరాహత్ అలీ

కాచిగూడ: ఓ పత్రికా సంపాదకుడిగా జర్నలిస్టుల కష్టసుఖాలపై తనకు ఎంతో అవగాహన ఉందని, చట్టసభలో వారి గొంతుకగా నిలబడతానని ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ భరోసా ఇచ్చారు. తెలంగాణ శాసన మండలి సభ్యులుగా ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాదాపు యాభై ఏళ్లుగా తమ కుటుంబానికి ఈ యూనియన్‌తో సంబంధం ఉందని, నాడు తన తాత అబిద్ అలీ ఖాన్, తండ్రి జహేద్ అలీ ఖాన్, నేడు తాను యూనియన్ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాలుపంచుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. జర్నలిస్టులకు ఎలాంటి ఆపదవచ్చినా తనవంతు చేయూత అందిస్తానని అమీర్ అలీ ఖాన్ హామీ ఇచ్చారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ మాట్లాడుతూ ఆబిద్ అలీ ఖాన్ ఉమ్మడి రాష్ట్రంలోని తమ ఏపీయూడబ్ల్యూజే సంఘంలో క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అమీర్ అలీ ఖాన్ ఎమ్మెల్సీగా నియామకం కావడం ఉర్దూ జర్నలిజానికి దక్కిన గౌరవంగా తాము భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఏ మాజీద్, వి.యాదగిరి, ఏ.రాజేష్, యూసుఫ్ బాబు, శిగా శంకర్ గౌడ్, హమీద్ షౌకత్ లతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

సన్నబియ్యం నాణ్యతపై నజర్!

- వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు
- మధ్యాహ్న భోజనం రుచి చూసిన అధికారులు
- సన్నబియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ మిక్స్ చేయాలని సూచన


సన్నబియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న రేషనింగ్ అధికారులు..

బంజారాహిల్స్: పేద, మధ్యతరగతి పిల్లలు చదువుకునే, వసతి పొందే అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ హాస్టళ్లకు ప్రతి నెలా కోట్లాది రూపాయల విలువ చేసే సన్నబియ్యం పంపిణీ ప్రభుత్వం చేస్తుంది. అన్ని కేంద్రాలకు ఏమాత్రం ఆలస్యం కాకుండా ప్రతినెలా ఠంచన్‌గా సమయానికి సన్నబియ్యం సరఫరా చేస్తున్నారు. ప్రతి 100 కిలోల బియ్యంలో విటమిన్లతో కూడిన ఫోర్టిఫైడ్ రైస్‌ను కూడా కలిపి అన్నం వండాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యం, విటమిన్లతో కూడిన ఫోర్టిఫైడ్ రైస్ విద్యార్థులకు సక్రమంగా వండిపెడుతున్నారా? లేదా? అని తెలుసుకునేందుకు అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్-7 ఏఎస్ఓ బి.జ్యోతి నేతృత్వంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సయ్యద్ అంజద్ అలీ, సీనియర్ సీఐ ఎం.ఆదిత్య, మహ్మద్ నసీర్, జూనియర్ ఈఐ సాయి కిరణ్, ఎం.శంకర్ తదితరులు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న పలు అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యం నాణ్యతతో వండిపెడుతున్నారా? లేదా? పరిశీలించారు. ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీలోని ప్రకాశం విద్యానికేతన్ గవర్నమెంట్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని సైతం పరిశీలించారు. అలాగే సైఫాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో సన్నబియ్యం వండిపెడుతున్నారో లేదో తనిఖీలు చేశారు. ఫోర్టిఫైడ్ రైస్‌ను సన్నబియ్యంలో కలిపి వండుతున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. యూసుఫ్‌గూడ సమీపంలోని జవహర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించి అంగన్‌వాడీ టీచర్ యాదమ్మతో సన్నబియ్యం నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె బియ్యం చాలా బాగున్నాయని తెలియజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమెకు సూచించారు. దయానంద్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అనంతరం స్కూల్ హెడ్‌మాస్టర్ పిల్లలతో ముఖాముఖి ఏర్పాటు చేసి అన్నం నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఎస్ఓ మాట్లాడుతూ ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్-7 పరిధిలో మూడు బీసీ హాస్టళ్లు, రెండు ఎస్సీ హాస్టళ్లు, ఒక మైనారిటీ వెల్ఫేర్ స్కూల్ కొనసాగుతున్నాయని, వీటికి బియ్యం ప్రభుత్వమే పంపిణీ చేస్తుందన్నారు. అలాగే యూసుఫ్‌గూడ స్టేట్ హోంలో కూడా సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని, అక్కడ కూడా నాణ్యతను పరిశీలించామని, తప్పనిసరిగా ఫోర్టిఫైడ్ రైస్ మిక్స్ చేసి వండాలని సూచించినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలోని 141 అంగన్‌వాడీ కేంద్రాలు, 10 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు, 63 ప్రభుత్వ పాఠశాలలకు కూడా బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు. పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం తమ సిబ్బంది వేర్వేరు చోట్ల ర్యాండమ్‌గా ఈ తనిఖీలు చేపట్టామన్నారు. తమ పరిశీలనలో అన్నిచోట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారని, ఎక్కడా ఫిర్యాదులు అందలేదన్నారు. ఈ తనిఖీలు తరచూ చేస్తుంటామని వెల్లడించారు.







విజయారెడ్డి ప్రత్యేక పూజలు



వరలక్ష్మీవ్రతం వేడుకల్లో స్థానిక మహిళలతో విజయారెడ్డి

పంజగుట్ట: గంగపుత్ర మహిళా సంఘం, మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తుమ్మలబస్తీలో వరలక్ష్మీవ్రతం వేడుకలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ మహిళా మత్స్య సహకార సంఘం అధ్యక్షురాలు మంగళపల్లి సునిత, ఖైరతాబాద్ గంగపుత్ర మహిళా సంఘం అధ్యక్షురాలు మదునాల చంద్రకళ, మహిళా మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షురాలు చెలమణి తులసి, కోశాధికారి మంగళపల్లి లావణ్య, సూర స్వరూప పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

ఖైరతాబాద్: మింట్ కాంపౌండ్‌లోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌లో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో ఉద్యోగులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచుకోవడంతో పాటు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ మెగా వైద్య శిబిరంలో కమాండెంట్ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ పి.ఎస్ రావు, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.రాఘవేందర్, అసిస్టెంట్ కమాండెంట్ అసెంబ్లీ జి.బాబూరావు, ఆర్‌బిఐ అసిస్టెంట్ కమాండెంట్ ఈఎస్ జాన్‌లతో పాటు ఇన్‌స్పెక్టర్లు ఎం.భాస్కర్, బి.తిరుపతి, ఎ.రాములు, వి.ఈశ్వర్ రావు, ఎం.శ్రీనావాస రావులతో పాటు ఎస్ఐలు, ఎస్ఐలు ఇలా 290 మంది మెగా వైద్య శిబిరంలో పాల్గొన్నారు.

నియామకం



శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ హ్యూమన్ రైట్స్ వైస్ చైర్మన్‌గా పైలా మల్లారెడ్డిని నియమించారు. ఈ మేరకు సౌత్ ఇండియా హ్యూమన్ రైట్స్ చైర్మన్ డాక్టర్ కుర్రా సూర్యనారాయణ ఆయనకు శుక్రవారం నియామకపు పత్రాన్ని అందించారు. అనంతరం ఎర్రగడ్డలో జరిగిన కార్యక్రమంలో పైలా మల్లారెడ్డిని అభినందించారు. అంతేగాకుండా ఆయనకు ఐడీ కార్డును కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ సభ్యులు పాల్గొన్నారు.

25న 'ఓ.బీసీ అడ్వొకేట్స్ కన్వెన్షన్'

పంజగుట్ట: ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన బిపి మండల్ జయంతి పురస్కరించుకుని మాసాబ్ ట్యాంక్ లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో 'ఓ.బీసీ అడ్వకేట్స్ కన్వెన్షన్' నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు పొన్నం దేవరాజు గౌడ్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్, అసోసియేషన్ కన్వీనర్ బి.శంకర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో 75 శాతం న్యాయవాదులు ఓ.బిసీలు ఉన్నారని కానీ న్యాయ వ్యవస్థలో ఎక్కడా తమకు ప్రాధాన్యత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద, బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.జె.సాంసన్, లక్ష్మిదేవి, భిక్షమయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


స్తుతి ఘోష్

ఖైరతాబాద్: మహిళ అదృశ్యమైన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం... వెస్ట్ బెంగాల్‌కు చెందిన స్తుతి ఘోష్ (19)కు ఎనిమిది నెలల క్రితం సుభాన్ ఘోష్‌తో వివాహమైంది. వీరు గత కొద్ది నెలలుగా చింతలబస్తీలో నివాసముంటున్నారు. టోలిచౌకిలోని ఓ బేకరీలో పనిచేసేందుకు శుక్రవారం ఉదయం భర్త సుభాన్ బయటకు వెళ్లాడు. దీంతో ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన స్తుతి ఘోష్ తిరిగి రాలేదు. బంధువులు, చుట్టుపక్కల వారికి సంప్రదించినా ఫలితం లేకపోవడంతో భర్త సుభాన్ ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోగులకు ఆరోగ్యకరమైన నీటిని అందించడమే లక్ష్యం

వాటర్ ఏటీఎంని ప్రారంభించిన డైరెక్టర్ బీరప్ప


ఏటీఎంను ప్రారంభిస్తున్న బీరప్ప, చిత్రంలో డాక్టర్ చరణ్ తదితరులు

లక్డీకాపూల్ : నిమ్స్‌లో రోగులకు జీరో వేస్టేజ్ టెక్నాలజీతో పాటు నీటి శుద్ధత ప్రమాణాలతోను పాటిస్తూ రోగులకు ఉచితంగా మంచినీటిని అందిస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణంలో నిమ్స్ సౌజన్యంతో సేఫ్ వాటర్ నెట్‌వర్క్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత వాటర్ ఏటీఎం కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ రోగులకు వైద్య సేవల్లోనే కాదు.. తాగు నీటి విషయంలో కూడా నిమ్స్ అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తుందన్నారు. ఈ వాటర్ ఏటీఎం వల్ల రోగులకే కాకుండా వారి సహాయకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 24 గంటలు శుద్ధి చేసిన నీరు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ క్రమంలో రెండు ఉచిత వాటర్ ఏటీఎంలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చరణ్, డాక్టర్ సల్మాన్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, సేఫ్ వాటర్ నెట్‌వర్క్ ప్రతినిధులు శ్రీకాంత్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మేలు చేసే మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించండి

కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్(బోరబండ): పర్యావరణాన్ని పరిరక్షించడం మన అందరి బాధ్యతగా భావించి మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సూచించారు. హానికర రసాయనాలతో చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించకుండా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. బోరబండలోని తన నివాసంలో శుక్రవారం బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ రసాయన రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాల ద్వారా పర్యావరణ కాలుష్య పెరిగిపోతుందని నిపుణులు చెబు తున్నప్పటికీ ప్రజల్లో మార్పురావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ వారివారి ప్రాంతాల్లో మట్టి వినామక విగ్రహాలను ప్రతిష్ఠించాలని ఆయన కోరారు. పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ బిల్లుల బాధలకు సోలార్ ఒక్కటే మార్గం

రెన్యూవబుల్ ఎన్జరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ జానయ్య


కార్యక్రమంలో అజయ్ మిశ్రా, జానయ్య

బంజారాహిల్స్: ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్న విద్యుత్ బిల్లుల బాధ నుంచి ఉపశమనం పొందేందుకు సౌర విద్యుత్ అనేది మంచి పరిష్కారమని తెలంగాణ రెన్యూవబుల్ ఎన్జరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ ఎన్. జానయ్య అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో భాను ఎనర్జీ సిస్టమ్స్, సాత్విక్ సోలార్ సంస్థతో జరిగిన వ్యూహాత్మక ఒప్పంద కార్యక్రమంలో ఆయన రెడ్ క్రాస్ కార్యదర్శి అజయ్ మిశ్రాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు సైతం వినియోగదారులు సౌర విద్యుత్ వాడుకునేందుకు ముందుకు వస్తే పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇస్తున్నామన్నారు. అనంతరం వారు పూర్తి స్వదేశీ టెక్నాలజీతో తయారు చేసిన సోలార్ ప్యానెల్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాను ఎనర్జీ సిస్టమ్స్ ఎల్ఎల్‌పీ ఫౌండర్, చైర్మన్ సురేష్, శంతను సిర్సాత్, సాత్విక్ సోలార్ నేషనల్ సేల్స్ హెడ్ పుష్పేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీటీనగర్ హైస్కూల్‌లో నేషనల్ స్పేస్ డే


అంతరిక్షం గురించి వివరిస్తున్న విద్యార్థి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా అంతరిక్షానికి సంబంధించిన సమాచారాన్ని వివరించారు. అంతరిక్ష శోధనలో భారతదేశం సాధించిన ఘనతను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. స్కూల్ హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

వైభవంగా అష్టలక్ష్మి హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఫిలింనగర్: శ్రావణ శుక్రవారం సందర్భంగా ఫిలింనగర్ దైవసన్నిధానంలో అష్టలక్ష్మి హోమాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఈ హోమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అర్చన నిర్వహించారు. అష్ట లక్ష్మీ దేవతలకు హోమాలు నిర్వహిస్తే సకలం మంచి జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు.

కబ్జాను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లోని ఆశయ్యనగర్ బస్తీలో అధికారులు భూ కబ్జాను అడ్డుకుని ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఆశయ్యనగర్ బస్తీకి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ భూమిలో నిర్మాణ పనులు చేపడుతున్నారన్నా సమాచారం మేరకు ఖైరతాబాద్ మండల ఉప తహసీల్దార్ లక్ష్మణ్, ఆర్ఐ కిరణ్‌రాజ్, సర్వేయర్ విమల నాయక్, చైన్‌మాన్ మేహతాత్‌లు ఆశయ్యనగర్ బస్తీకి చేరుకుని ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా వివాదాల్లో ఉన్నా ఈ భూమి చుట్టూ ప్రహారి గోడను ఏర్పాటు చేయాలని బస్తీవాసులు కోరారు.

ప్రొఫెసర్ అదృశ్యం


ప్రొఫెసర్ బ్రహ్మానందం

బంజారాహిల్స్: అనుమానాస్పదస్థితిలో ఓ ప్రొఫెసర్ అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..యూసుఫ్‌గూడ సమీపంలోని కృష్ణానగర్‌లో నివసించే నువ్వుల బ్రహ్మానంద (35) అమీర్‌పేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17వ తేదీన సెస్‌లో ఉండగానే ఆయన మతిస్థిమితం కోల్పోయి ప్రవర్తిస్తున్నాడని భార్య రేవతికి ఫోన్ చేసి చెప్పారు. హుటాహుటిన ఆయన భర్తను ఇంటికి తీసుకువచ్చింది. ఈ నెల 21వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎవరికీ చెప్పకుండా బ్రహ్మానందం బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎన్ని ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో తన భర్త కనిపించడం లేదంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఆర్‌యూలో జాతీయస్థాయి 24 గంటల హ్యాకథాన్



హ్యాకథాన్‌లో వక్తలు

మేడ్చల్ రూరల్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో జాతీయ స్థాయి 24 గంటల హ్యాకథాన్‌ను శుక్రవారం నిర్వహించారు. దేశంలోని 30 యూనివర్సిటీలకు చెందిన 600 మంది విద్యార్థులు హ్యాకథాన్‌లో పాల్గొన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి హ్యాకథాన్‌ను ప్రారంభించారు. కంప్యూటర్ సైన్స్, సాంకేతిక పురోగమనాలు, డేటాసైన్స్, జనరేటివ్ ఏఐ, ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటిలిజెన్స్, సైబర్ భద్రత వంటి రంగాలను హ్యాకథాన్‌లో హైలెట్ చేశారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆంజనేయులు, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ మీరావలి, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ ఆనంద్‌కుమార్, డాక్టర్ రాజాశరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో స్పేస్ డే



స్పేస్ డే కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

మణికొండ: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో జరిగిన భారత మండపం కార్యమాన్ని ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జీ.చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇస్రో సాధించిన ప్రగతి, విజయాలను వివరించారు. ఎంజీఐటీ కళాశాలలో మెటలర్జికల్, మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగంలోని పూర్వ విద్యార్థులైన డాక్టర్ వి.అనిల్‌కుమార్, చెన్న కృష్ణ, నరేష్‌కుమార్, జొన్నలగడ్డ శ్రీనాథ్ ఇస్రోకు అందిస్తున్న సేవలను, చంద్రయాన్–3 విజయంలో అందించిన సహకారాన్ని కొనియాడారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ స్పేస్ డే సందర్భంగా మరిన్ని కార్యక్రమాలను కళాశాలలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి, డీఎస్‌డబ్ల్యూ అధికారి డాక్టర్ డి.వెంకట్‌రెడ్డి, డాక్టర్ ఎం.రవిచందర్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌సీఐలో ఘనంగా అంతరిక్ష దినోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటాలర్జీ అండ్ న్యూమెటీరియల్ (ఏఆర్‌సీఐ)లో అంతరిక్ష దినోత్సవం ఘనంగా జరిగింది. వేడుకలను ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్.విజయ్ ప్రారంభించారు. చంద్రయాన్–3లో భాగంగా చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా గతేడాది ఆగస్టు 23న ల్యాండ్ అయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలు జరుపుతున్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన కళాఖండాలు, సృజనాత్మకమైన వస్తువులను ప్రదర్శించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ నుంచి స్పేస్ ఆన్ వీల్స్ వాహనం అందరినీ ఆకట్టుకుంది. ఈ వాహనం భారత స్పేస్ మిషన్లకు సంబంధించిన వివరాలను కళ్లకు కట్టేలా చూపించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్‌తో పాటు పలు కాంపిటీషన్స్ నిర్వహించారు. ఇలాంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ ఉత్సుకత పెంపొందుతుందని ఏఆర్‌సీఐ అసోసియేట్ డైరెక్టర్ పీకే జైన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌సీఐ అసోసియేట్ డైరెక్టర్ డీఎస్ రావు, ఐఐఎస్‌సీటీ ప్రొఫెసర్ డాక్టర్ వైవీఎస్ కృష్ణమూర్తి, డాక్టర్ పాపియా బిశ్వాస్, డాక్టర్ నవీన్, చావన్, అపర్ణారావు తదితరులు పాల్గొన్నారు.


ఇంజినీరింగ్ కోర్సుల్లో అమ్మాయిల సంఖ్య అధికం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియాయూనివర్సిటీ: ఇంజినీరింగ్ కోర్సుల్లో గతంలో కంటే అమ్మాయిల సంఖ్య అధికమైందని రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి అన్నారు. ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అడ్వాన్సెస్ ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్ అండ్ నానో టెక్నాలజీ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. శుక్రవారం కార్యక్రమానికి సదస్సు ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొ.కృష్ణయ్య అధ్యక్షత వహించగా ప్రొ.లింబాద్రి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. సదస్సుకు వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ హాజరుకాగా 65 పరిశోధ పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, హెడ్ చంద్రశేఖర్‌రెడ్డి, సదస్సు కన్వీనర్ ప్రొ.నరేందర్, కో–కన్వీనర్లు డా.అశోక్ కుమార్, డా.నాగవేణి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

అందుబాటులో.. ఒత్తిడి తగ్గించే గేమ్స్



స్పోర్ట్స్ ఎక్స్‌పో ఇండియాను ప్రారంభిస్తున్న సినీనటుడు శ్రీనివాస్ అవసరాల

మాదాపూర్: చురుకైన జీవనశైలి కలిగి ఉండటం చాలా ముఖ్యమని సినీనటుడు శ్రీనివాస్ అవసరాల తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న స్పోర్ట్స్ ఎక్స్‌పో ఇండియా–2024ను డెకథ్లాన్ విశ్వరాజ్‌మోహన్, ఎన్ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయపాల్‌రెడ్డి, హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ రాజేశ్‌వెత్సా, ఆదిత్యరెడ్డి, హైటెక్స్ బిజినెస్ సెంటర్ హెడ్ శ్రీకాంత్ టీజీలు శుక్రవారం ప్రారంభించారు. సినీనటుడు శ్రీనివాస్ అవసరాల మాట్లాడుతూ జీవితంలో ఫిట్‌గా ఉండటం భాగమని అన్నారు. సమస్య వచ్చినప్పుడు ఇబ్బంది పడటం కంటే ఫిట్‌గా ఉండటమే మంచిదని చెప్పారు. హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎక్స్‌పోలో స్పోర్ట్స్, ఫిట్‌నెస్, న్యూట్రిషన్, వెల్‌నెస్‌తో పాటు పరిశ్రమలోని విభిన్న విభాగాల నుంచి ప్రముఖ బ్రాండ్‌లు, ఎగ్జిబిటర్లను ఒక ప్లాట్‌ఫాంలోకి చేర్చినట్లు తెలిపారు. 55 మంది ఎగ్జిబిటర్లు పాల్గొన్నట్లు చెప్పారు. సరదా గేమింగ్ జోన్ అయిన గామాలజీ ఎక్స్‌పోలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందన్నారు.



కబ్జాకు గురవుతున్న సరూర్‌నగర్ చెరువు



సరూర్‌నగర్ చెరువు దుస్థితి

చెరువులు, నాలాల కబ్జాపై జనాగ్రహం

చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి మురుగు నీరు

- రోగాలబారిన పడుతున్నామని ఆవేదన
- మురుగు నీటి శుద్ధి కేంద్రానికి మరమ్మతులు చేయించాలి
- ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఈ వారం 'మీతో సాక్షి'

సాక్షి, సిటీబ్యూరో: చెరువుల కబ్జాలు.. రోడ్లపై మురుగు నీరు.. విచ్చలవిడి గంజాయి వినియోగం.. చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు.. వీధివీధినా సమస్యలు.. ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి.. ఎలాగోలా అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకునే నాథుడే ఉండరు.. సమస్య వచ్చినప్పుడు మాత్రమే అలా వచ్చి హడావుడి చేయడం.. ఆ తర్వాత అంతా షరా మామూలే. ఈ సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి నగరవాసుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టేలా అధికారులు, ప్రజాప్రతినిధులను మేల్కొలిపే బృహత్తర కార్యక్రమాన్ని 'సాక్షి' చేపట్టింది. 'మీతో సాక్షి' పేరిట ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని ఒక్కో ప్రాంతాన్ని సందర్శించి, స్థానికులతో మాట్లాడి, అక్కడి సమస్యలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. సమస్యల నుంచి గట్టెక్కడానికి ప్రత్యామ్నాయంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంలో సలహాలు, సూచనలు సేకరిస్తోంది. ఈ వారం 'మీతో సాక్షి' బృందం ఎల్బీనగర్ నియోజకవర్గంలో పర్యటించింది. సరూర్‌నగర్, గడ్డిఅన్నారం, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో సాక్షి బృందానికి తమ బాధలను ఏకరువు పెట్టుకున్నారు.

కేన్సర్ వస్తుంది..



హైదరాబాద్ అభివృద్ధి చెందింది అంటున్నారు. అయినా వీధివీధినా సమస్యలున్నాయి. సరూర్‌నగర్, చంపాపేట్, ఐఎస్ సదన్, బీఎన్‌రెడ్డి, లింగోజిగూడ, హస్తినాపురం, బడంగ్‌పేట్ నుంచి సరూర్‌నగర్ చెరుకు నీరు వస్తోంది. నీరు కలుషితమైపోయింది. ఘాటైన దుర్వాసన వస్తోంది. కొందరికి కేన్సర్ వచ్చింది. చెరువు అభివృద్ధికి రూ.16 కోట్లు వచ్చాయని చెప్పారు. పనులు సగంలో వదిలేశారు. రాజకీయ నాయకులు మారుతున్నారు. చెరువు పరిస్థితి మాత్రం మారడంలేదు. – రాంరెడ్డి, సరూర్‌నగర్

100 ఎకరాలు కబ్జా



సరూర్‌గర్ చెరువు 135 ఎకరాలు ఉండేది. రాజకీయ నాయకులు కుదించి చివరికి 30 ఎకరాలు మాత్రమే మిగిల్చారు. మురుగు నీరు ఇందులోనే కలుస్తోంది. వర్షం కురిస్తే చాలు ఈ నీరు మా ఇళ్లలోకి వస్తోంది. మేం ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని కోరుకుంటున్నట్లున్నారు. ఇంత పెద్ద ప్రభుత్వ వ్యవస్థలో లోపాన్ని గుర్తించి, సమస్యను పరిష్కరించడం తెలీదా? – యాదయ్య, సరూర్ నగర్

కబ్జాలు.. మురుగు నీరు..

సరూర్‌నగర్ చెరువు సుమారు 100 ఎకరాలకుపైగా కబ్జాకు గురైందని స్థానికులు ఆరోపించారు. మురుగు నీటి పైపులైన్ అక్రమంగా చెరువులో కలిపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు చుట్టూ రహదారి పనులు చేపట్టారని, ఆ పనులు కూడా అసంపూర్తిగా మిగిలిపోయాయని వివరించారు. ఇక ఈ ప్రాంతంలో గంజాయి వినియోగం విపరీతంగా పెరిగిపోయిందని, ఆకతాయిలు గంజాయి తాగి తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన మురుగు కాల్వపై స్లాబ్ వేయకపోవడంతో దోమలు, దుర్వాసన వస్తోందని దుయ్యబట్టారు. డెంగీ, విష జ్వరాలు వస్తున్నాయని, చిన్నపాటి వర్షం కురిసినా లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి రెండు అడుగుల నుంచి నాలుగు అడుగుల ఎత్తు వరద నీరు వచ్చి చేరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లోని సామగ్రి, దుస్తులు, నిత్యావసర వస్తువులు వరదలో కొట్టుకుపోతున్నాయని, దీంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. ఇక ఇళ్లు ఖాళీ చేసి పాఠశాల భవనాలు, బంధువుల ఇంటికి వెళ్లి తలదాచుకుంటున్నామని ఆవేదన చెందారు. ఎన్నికల సమయంలోనే రాజకీయ నాయకులు వచ్చి, తూతూమంత్రంగా మాయమాటలు చెప్పి తర్వాత పత్తా లేకుండా పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణాలు నిర్వహించుకునే వారిది మరో రకమైన ఆవేదన కనిపిస్తోంది. వరద వచ్చినపుడల్లా రూ.లక్షల్లో సరుకు నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. నాలుగేళ్ల నుంచే ఈ రకమైన పరిస్థితి కనిపిస్తోందని స్థానికులు వాపోతున్నారు.

మీతో సాక్షి

పదిసార్లు ఫిర్యాదు చేశా..

బాలాపూర్ నుంచి చైన్ లింక్ చెరువులు ఉండేవి. రానురాను కనెక్టివిటీ నాలాలు కబ్జా అవుతున్నాయి. వర్షం నీరు రోడ్డుపైకి వస్తోంది. పట్టణ ప్రణాళికాధికారులు అక్రమంగా అనుమతులు ఇస్తున్నారు. డ్రైన్ నేరుగా చెరువులోకి వదిలేస్తున్నారు. ఇక్కడ 2018లో ఎస్టీపీ మరమ్మతులకు గురైంది. ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోలేదు. 10 దఫాలు ఫిర్యాదు చేశా.. అయినా స్పందన లేదు. మరమ్మతులు చేయిస్తే ఈ ప్రాంతం సుభిక్షంగా ఉంటుంది.



– బద్దం మహేశ్వర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్

శిశువుకు తప్పిన ప్రాణాపాయం

- 32 వారాలు.. • శిశువును కాపాడిన ఏఐఎన్‌యూ వైద్యులు
- 2 కిలోల బరువు.. శస్త్రచికిత్సలు



లక్డీకాపూల్: నెలలు నిండక ముందే జన్మించిన ఓ శిశువుకు అరుదైన వ్యాధి సోకింది. ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ(ఏఐఎన్‌యూ) వైద్యులు రెండు శస్త్రచికిత్సలు చేసి శిశువు ప్రాణాలు కాపాడారు. దీంతో రెండు కిలోల బరువుతో 32 వారాలకే పుట్టిన పసిగుడ్డుకు వైద్యులు క్లిష్టతరమైన రెండు శస్త్రచికిత్సలు చేసి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. నగరానికి చెందిన ఓ వ్యాపారవేత్తకు నెలలు నిండకముందే మగ శిశువు జన్మించాడు. ఆ శిశువుకు పోస్టీరియర్ యూరేత్రల్ వాల్వ్స్ (పీయూవీ) అనే అరుదైన సమస్య వచ్చింది. దీంతో అడ్డంకులుగా ఉన్న కణజాలలను తొలగించి, శిశువు సాధారణ మూత్ర విసర్జన అయ్యే విధంగా చేపట్టిన శస్త్రచికిత్స విజయవంతమైంది. వయసు పెరిగేకొద్దీ మూత్రపిండాలకు ఏదైనా నష్టం కలిగిందా అని పరిశీలిస్తున్నామని కన్సల్టెంట్ పీడియాట్రిక్ యూరాలజిస్టు డాక్టర్ ప్రభ కరుణాకరన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత చిన్న వయసున్న రోగులకు సైతం అత్యాధునిక వైద్య సేవలు అందించడంలో ఏఐఎన్‌యూకు ఉన్న నిబద్ధతను ఈ శస్త్ర చికిత్స మరోసారి నిరూపించిందన్నారు. శస్త్రచికిత్సలో వైద్యులు నిత్యానంద్, పీడియాట్రిక్స్, ఎన్ఐసీయూ, పీడియాట్రిక్ నెఫ్రాలజీ బృందాలు పాల్గొన్నాయి.

నగరంలో నేడు..

1 మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కళాకారిణి ఆశరాధిక వేసిన ది మిస్టికల్ వింగ్స్ ఎటార్నల్ టింకిల్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శన అందుబాటులో ఉంటుంది.

2 అత్యంత గ్లామరస్ ఈవెంట్‌లలో ఒకటైన జ్యువెలరీ వరల్డ్ ఎగ్జిబిషన్ బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో జరుగుతుంది.

3 శామీర్‌పేట్ తూమ్‌కుంటలోని అలంకృత రిసార్ట్‌లో ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పీపుల్ పవర్ సమ్మిట్ కార్యక్రమం జరుగుతుంది.

హైదరాబాద్ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా చాటుతాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- ఎమ్మెల్యే, ఎంపీ కాలనీ కల్చరల్ సెంటర్ ప్రారంభం



ఎమ్మెల్యే, ఎంపీల కాలనీ కల్చరల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, నటుడు మెగాస్టార్ చిరంజీవి తదితరులు

బంజారాహిల్స్: ప్రపంచ చిత్రపటంలో హైదరాబాద్‌కు ప్రత్యేక బ్రాండ్‌ను తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయని రూ.వేలాది కోట్ల వ్యయంతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. జూబీహిల్స్ రోడ్డు నంబర్–10లోని విజయా కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో అత్యంత ఆర్భాటంగా అన్నిహంగులతో నిర్మించిన ఎమ్మెల్యే, ఎంపీల కాలనీ కల్చరల్ సెంటర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కాలనీ అభివృద్ధికి, కల్చరల్ సెంటర్ సౌకర్యాలకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఏ రకమైన అవసరాలు కావాలో తెలియజేయాలన్నారు. జూబ్లీహిల్స్‌లోని ది స్పైసీ మెన్యూ హోటల్ భోజనాలు నాణ్యతతో పాటు ఎంతో రుచికరంగా ఉంటాయని, అది తన ఫేవరెట్ హోటల్ అని, అక్కడి భోజనాలు ఈ కల్చరల్ సెంటర్‌లో పెట్టడానికి ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ఇక్కడి ల్యాండ్ స్కేపింగ్‌ను అటవీశాఖ సహకారంతో అభివృద్ధి చేయిస్తానని, ప్రభుత్వం నుంచి ఇంకా ఏ సహకారం కావాలన్నా చేస్తామన్నారు. పద్మ విభూషన్, మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. 60 సంవత్సరాలు పైబడ్డవారు వాకింగ్‌లోనూ, ఇలాంటి కల్చరల్ సెంటర్‌లోనూ సరదాగా మాట్లాడుతూ గడిపితే 20 సంవత్సరాల కుర్రాళ్లలా ఉండవచ్చని అన్నారు. ఇలాంటి కల్చరల్ సెంటర్లు ఒంటరి తనాన్ని దూరం చేసి నలుగురితో కలిసి మెలిసి ఉండేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు వి.భూపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రాగిడి లక్ష్మారెడ్డి, కోశాధికారి చల్లా ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పరిపాలనా దక్షుడు టంగుటూరి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

గన్‌ఫౌండ్రీ: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అసమాన ధైర్య సాహసాలు, పరిపాలన దక్షత కలిగిన మహనీయుడని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎదురుగా ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టంగుటూరి ప్రకాశం పంతులు నేటి యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కేవీపీ.రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచంద్రరావు, గిడుగు రుద్రరాజు, ప్రకాశం పంతులు మనవళ్లు టంగుటూరి శ్రీరామ్, ప్రకాష్, సంస్థ సభ్యులు డాక్టర్ మోహన్‌రావు, నిరంజన్ దేశాయ్, సీవీ.రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వ సహకారం

- తెలంగాణ ఉద్యమకారుల సమితికి ఎమ్మెల్సీ కోదండరామ్ హామీ



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసిన తెలంగాణ ఉద్యమకారుల సమితి ప్రతినిధులు

కాచిగూడ: తొలిదశ, మలిదశ తెలంగాణ ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి నేతృత్వంలో శుక్రవారం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ ఆయనకు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటుందని కోదండరామ్ ఉద్యమకారులకు హామీ ఇచ్చారు. ఉద్యమకారులకు ప్రభుత్వ సహకారం ఎప్పుడూ ఉంటుందని, ఉద్యమ సంస్థలు, ఉద్యమకారులందరూ ఎవరికి వారుగా కలవడం కంటే అందరూ ఒక జేఏసీగా ఏర్పడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తే త్వరితగతిన పరిష్కారమవుతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో బి.రంగారెడ్డి, తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, బత్తుల సోమన్న, ఎం.వెంకటస్వామి, చంద్రన్న ప్రసాద్, గంటి చంద్రుడు, డప్పు స్వామి, స్వరూప, అరుణ, సునీత, అంజలి, డి.అంజయ్య, సుజి, మాదాసు శ్రీనివాస్, అశోక్‌సింగ్, లత, శంకర్‌రావు, తుల్జారెడ్డి తదితర ఉద్యమ నేతలు పాల్గొన్నారు.

సర్వే చేసి చర్యలు తీసుకుంటాం

- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రంరెడ్డి



ఎక్స్ వేదికగా ఫిర్యాదులు చేసిన స్థానిక ప్రజలు

మణికొండ: వెయ్యి కోట్లకు పైగా విలువైన 23 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రబుద్ధులు ప్రయత్నిస్తుండగా వారికి అండగా నిలిచిన కౌన్సిలర్ బి.పద్మారావుపై స్థానిక దళితులు ఇచ్చిన ఫిర్యాదును శుక్రవారం 'సాక్షి' దినపత్రిక ప్రచురించింది. దాంతో అది మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సంచలనంగా మారింది. ప్రభుత్వ భూములు, ఆస్తులను కాపాడాల్సిన ప్రజాప్రతినిధి అక్రమార్కులతో చేతులు కలపడం ఏమిటని వందలాది మంది ప్రశ్నించారు. నెక్నాంపూర్ సర్వే నెంబర్–20లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని గూగుల్ మ్యాప్ స్పష్టంగా చూపిస్తోందని, అలాంటి నిర్మాణాలకు మణికొండ మున్సిపాలిటీ అధికారులు అనుమతులు జారీ చేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూమిని కాపాడాలని జిల్లా కలెక్టర్, హెచ్ఎండీఏ, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. స్థానికంగా వాట్సాప్ గ్రూపులలో వైరల్ చేశారు. దాంతో స్పందించిన గండిపేట తహసీల్దార్ ఆదేశాలకు నిర్మాణాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రంరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్–20, 31ల హద్దులను త్వరలోనే నిర్ణయిస్తామన్నారు. ప్రభుత్వ భూమిలో వచ్చిన నిర్మాణాలను నేలమట్టం చేస్తామన్నారు.

సామాజిక న్యాయ రచయిత బీఎస్ రాములు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నర్సింగ్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: సామాజిక న్యాయమే రచయిత బీఎస్ రాములు లక్ష్యమని పలువురు ప్రముఖులు అన్నారు. రవీంద్రభారతిలో విశాల సాహిత్య అకాడమి, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సాహిత్య అకాడమిల సంయుక్త ఆధ్వర్యంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు 75వ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. బీఎస్ రాములు తన 25 ఏళ్ల సాహిత్య ప్రయాణంలో ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి విద్యాసాగర్ మాట్లాడుతూ.. బీఎస్ రాములు తన రచనలో, ఉపన్యాసాలతో జీవన నైపుణ్య కార్యశాలలు నిర్వహించిన తాత్వికవేత్త అని అభివర్ణించారు. బీఎస్ రాములు మాట్లాడుతూ.. తెలంగాణ రచయితలు గుర్తింపుపరంగా వివక్షకు గురవుతున్నారనే ఉద్దేశ్యంతో తాత్విక విశాల సాహితి పురస్కారాలు ఏర్పాటు చేసి 25 సంవత్సరాలుగా ఎంతో మందిని సత్కరించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో తన లక్ష్యం నెరవేరిందని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బీఎస్ రాములు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గద్దర్ అవార్డుల కమిటీ చైర్మన్ బి.నర్సింగ్‌రావు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, అందెశ్రీ, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రెస్ అకాడమి మాజీ చైర్మన్ అల్లం నారాయణ, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంట చక్రపాణి, విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య ఎస్వీ సత్యనారాయణతో పాటు పలువురు సాహితీవేత్తలు, ఉద్యమకారులు, రచయితలు పాల్గొన్నారు.

ఆర్ట్ గ్యాలరీలో చిత్రప్రదర్శన ప్రారంభం





మాదాపూర్: కళాకారిణి వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం కళాకారిణి ఆశ రాధిక వేసిన ది మిస్టికల్ వింగ్స్ ఎటార్నల్ టింకిల్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను ఆర్టిస్ట్, ప్రొఫెసర్ కవిత, చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మితో కలిసి ప్రారంభించారు. కళాకారిణి వేసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగనున్న చిత్ర ప్రదర్శనలో 60 పెయింటింగ్ చిత్రాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు ప్రదర్శన సందర్శకులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

- నగరంలో పెరుగుతున్న మారథాన్ ట్రెండ్
- సామాజిక సేవ కోసం నిర్వహిస్తున్న సంస్థలు
- సేకరించిన డబ్బు చారిటీలకు వినియోగం
- పోటాపోటీగా కార్పొరేట్ కంపెనీలు, ఆస్పత్రులు
- వేల సంఖ్యలో పాల్గొంటున్న భాగ్య నగరవాసులు

రన్ రాజా.. రన్

పరిగెత్తి పాలు తాగడం కన్నా.. నిలబడి నీళ్లు తాగడం ఉత్తమం అంటారు పెద్దలు. అది ఏ సందర్భంలో వాడినప్పటికీ ప్రస్తుతం భాగ్యనగరంలో రన్నింగ్ ట్రెండ్ విపరీతంగా పెరిగిపోయింది. జీవన విధానం, ఆహారపు అలవాట్లలో విపరీతమైన మార్పులు రావడం.. శారీరక వ్యాయామం చేయకపోవడంతో అనేక రకాల అరోగ్య సమస్యలు వస్తున్నాయి. కనీసం వారంలో ఒక్కసారైనా వ్యాయామం చేయడం, వాకింగ్, జాగింగ్, రన్నింగ్‌తో ఒళ్లు కదిపితే లెక్కలేనన్ని ప్రయోజనాలు ఉన్నాయి. నిపుణుల సూచనలు, ఫిట్‌నెస్ ట్రైనర్స్ సలహాల మేరకు నగర వాసులు పరుగులు పెడుతున్నారు..ఈ నేపథ్యంలో దీని గురించి పలు ఆసక్తికర అంశాలు...

- సాక్షి, సిటీబ్యూరో





రన్నింగ్‌తో ఎన్నో లాభాలు



రన్నింగ్ చేస్తే శారీరక, మానసిక లాభాలు ఎన్నో ఉన్నాయి. 2010లో ఆర్మీలో చేరాను. పుణేలో ఉన్నప్పుడు మా కోచ్ సలహాతో మారథాన్‌లో పాల్గొనాలనే ఆలోచన వచ్చింది. 2013 నుంచి మారథాన్‌లో పాల్గొంటూ వస్తున్నా. దేశ, విదేశాల్లో ఎక్కడ మారథాన్ జరిగినా వెళ్లి పాల్గొంటా. ఇటీవల ముంబైలో జరిగిన మారథాన్‌లో గోల్డ్ మెడల్ సాధించా. ఢిల్లీలో జరిగిన మారథాన్‌లో సిల్వర్ పతకం వచ్చింది. రేపు జరగబోయే హైదరాబాద్ మారథాన్‌లో పాల్గొనేందుకు నగరానికి వచ్చాను. మారథాన్‌లో పాల్గొనేందుకు రోజూ కనీసం 30 కిమీ చొప్పున వారానికి 160– 180 కిమీ పరుగెడుతూ సాధన చేస్తుంటాను. రన్నింగ్‌తో పాటు సరైన పోషకాహారం తీసుకుంటేనే ఫలితం ఉంటుంది. – శ్రీను బుగత, బంగారంపేట, విజయనగరం

అక్కడే నిలబడకోయ్.. కాస్త ఉరకవోయ్..

హైదరాబాద్ వైబ్స్

ఉరుకుల పరుగుల జీవితంలో శరీరానికి అలసట లేకుండా పోతోంది. బుర్రనిండా ఆలోచనలతో గజిబిజి గందరగోళాల నడుమ ఒత్తిడితో కూడిన జీవనం సాగిస్తున్నారు నగరవాసులు. అలాంటి అలవాట్లను మార్చే ఉద్దేశంతో, సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు మారథాన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. దీంతో పాటు ఆరోగ్య విషయాలపై నగర ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మారథాన్ ట్రెండ్ కాస్తా హైదరాబాద్‌లో గత కొన్నేళ్లుగా విపరీతంగా పెరిగిపోయింది. ఒక్కో సంస్థ ఒక్కో సమస్యపై అవగాహన కల్పించేందుకు మారథాన్ నిర్వహించి పలువురిని భాగస్వాములను చేసుకుంటున్నాయి.

సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో..

సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. నైట్ డ్యూటీలు, లేట్ నైట్ ఫుడ్, జంక్ ఫుడ్‌తో ఆరోగ్యాలు పాడుచేసుకుంటున్నారు. దీంతో శారీరక, మానసిక రుగ్మతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరిలో మానసిక సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు ఒత్తిడి తగ్గించేందుకు పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు మారథాన్ నిర్వహిస్తున్నాయి. దీంతో మానసిక ప్రశాంతతతో పాటు తోటి ఉద్యోగులతో సరదాగా ఉంటూ.. ఉల్లాసంగా గడుపుతున్నారు.

ఎన్నో పాఠాలు నేర్పిస్తుంది..



మారథాన్ అనేది పరుగు మాత్రమే కాదు. ఎన్నో జీవిత పాఠాలను నేర్పిస్తుంది. జీవితంలో ఎలా నిలకడగా ఉండాలనే విషయాలు తెలుస్తాయి. సవాళ్లను స్వీకరించడం ఎలాగో తెలియజేస్తుంది. నలుగురితో కలిసి జీవిస్తే వచ్చే ప్రయోజనాలను గురించి నేర్పిస్తుంది. భారత్‌లో గత పది, పదిహేనేళ్ల నుంచి మారథాన్ ట్రెండ్ అవుతోంది. తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో పట్టణాలు, గ్రామాల్లో కూడా మారథాన్ నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో దీన్నొక సామాజిక పండుగలా సంబరంగా జరుపుకొంటున్నారు.

– రాజేశ్ వెచ్చా, హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ, ఫౌండర్



వ్యాధులపై ప్రచారానికి..

దీర్ఘకాలిక సమస్యలతో పాటు జీవన శైలి వ్యాధులపై అవగాహన కల్పించేందుకు నగరంలోని చాలా ఆస్పత్రులు మారథాన్ నిర్వహిస్తున్నాయి. మారథాన్ నిర్వహించడం ద్వారా వచ్చిన డబ్బులను దీర్ఘకాలిక సమస్యలతో బాధపడే వారి సంక్షేమం కోసం వినియోగిస్తున్నాయి. ఇదే దారిలో చాలా సంస్థలు మారథాన్ నిర్వహిస్తూ చారిటీ చేస్తున్నాయి. దీంతో రెండు రకాలుగా మారథాన్ ఉపయోగపడుతోందని నిర్వాహకులు చెబుతున్నారు.

అద్భుతమైన అనుభూతి..



మారథాన్‌లో పాల్గొంటే అద్భుతమైన అనుభూతి ఉంటుంది. తోటి ఉద్యోగులతో మారథాన్‌లో పాల్గొంటే ఆ ఉత్సాహమే వేరు. ఇప్పటివరకూ దాదాపు 10 మారథాన్లలో పాల్గొన్నాను. రన్నింగ్ చేయడం వల్ల ఫిట్‌నెస్ కూడా వస్తుంది. ఒత్తిడి నుంచి బయటపడినట్టు అనిపిస్తుంది.

– మహేశ్‌రెడ్డి మోదుగు, ఐటీ ఉద్యోగి

సమస్యలపై అవగాహన కల్పిస్తూ..

యువతలో ప్రస్తుతం అనేక మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతున్నాయి. కొందరికి వాటిపై అవగాహన లేక వాటి బారిన పడుతున్నారు. ముఖ్యంగా డ్రగ్స్, గంజాయి వంటి సమస్యలు నగరంలో తీవ్రతరం అవుతున్నాయి. మత్తుకు బానిసలవుతూ యువత తమ జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. సిగరెట్, గుట్కాలు తింటూ క్యాన్సర్ బారిన పడుతున్నారు. వివిధ రకాల క్యాన్సర్లపై అవగాహన లేక ప్రాణాలు కోల్పోతున్నారు. సమాజంలో ఇలాంటి సమస్యల గురించి ప్రపంచానికి అవగాహన కల్పిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. సమాజంలో చర్చ జరుగుతుంది. అందుకోసమే పలు ఆస్పత్రులు, సంస్థలు మారథాన్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నాయి.

డ్రగ్స్ రహిత సమాజం కోసం..

ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రభుత్వంలోని పలు శాఖలు కూడా అప్పుడప్పుడూ మారథాన్ నిర్వహిస్తూ అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నాయి. డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఇటీవల తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మారథాన్ నిర్వహించారు. దీనిద్వారా కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పలు కళాశాలలు మారథాన్ నిర్వహిస్తూ విద్యార్థులకు పలు అంశాల గురించి వివరిస్తున్నారు.





మిసెస్ సౌత్ ఇండియా వర్షారెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: అల్కాజర్ వాచెస్, డీక్యూయూఈ సోప్ ఆధ్వర్యంలోని మిసెస్ సౌత్ ఇండియా 2024 కిరీటాన్ని తెలంగాణకు చెందిన వర్షారెడ్డి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నగరంలో నిర్వహించిన సమావేశంలో గెలుచుకున్న టైటిల్‌తో సందడి చేశారు. తెలంగాణ నుంచి కోయంబత్తూర్ వెళ్లి లే మెరిడియన్ వేదికగా టైటిల్ నెగ్గడం సంతోషంగా ఉందని తెలిపారు. 2012లో మిస్ సౌత్ ఇండియా పోటీలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించాను, అప్పుడు మిస్ కన్జెనియాలిటీ టైటిల్‌ను సంపాదించానని గుర్తు చేసుకున్నారు. ఫ్యాషన్ రంగంతో పాటు యూఎస్‌ఐటీ సిబ్బంది, డిజిటల్ మార్కెటింగ్, విదేశీ విద్య, హాస్పిటాలిటీ, చలనచిత్ర నిర్మాణం వంటి ఐదు విభిన్న కంపెనీలకు వైస్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్నానని తెలిపారు. విజేతకు పెగాసస్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ జెబితా అజిత్ కిరీటాన్ని అందించారు. మిసెస్ సౌత్ ఇండియా 2024 అందాల పోటీల్లో కేరళకు చెందిన రేవతి మోహన్ మొదటి రన్నరప్ స్థానాన్ని పొందగా, కేరళకు చెందిన దృశ్య డినాయర్ రెండో రన్నరప్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మిసెస్ సౌత్ ఇండియా పోటీకి దక్షిణ భారత రాష్ట్రాల నుండి 12 మంది పోటీదారులు ఎంపికయ్యారు. మిసెస్ సౌత్ ఇండియా విజేతలకు పరక్కత్ జ్యూయలర్స్‌కు చెందిన ప్రీతి పరక్కత్ రూపొందించిన బంగారు కిరీటాన్ని బహూకరించారు.

ప్రాపర్టీ షోలో అనూ సందడి



సాక్షి, సిటీబ్యూరో: భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) హైదరాబాద్ చాప్టర్ ప్రాపర్టీ షోలో ప్రముఖ నటి అను ఇమ్మాన్యుయల్ సందడి చేశారు. నాగోల్ మెట్రో స్టేషన్ సమీపంలో శుక్రవారం ఈ స్థిరాస్తి ప్రదర్శన ప్రారంభమైంది. ప్రాపర్టీ షో మొత్తం సందడిగా తిరుగుతూ నగరంలోని ప్రముఖ నిర్మాణ సంస్థలు నిర్మిస్తున్న నివాస, వాణిజ్య సముదాయాల వివరాల గురించి స్టాళ్ల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

చీరలంటే ప్రాణం: సునీత



బంజారాహిల్స్: తనకు చీరలంటే ప్రాణమని, అందులోనూ హ్యాండ్లూమ్స్ అంటే మరీ ఇష్టమని సింగర్ సునీత అన్నారు. కాటన్ చీరలతో పాటు ఖాదీ చీరలంటే కూడా అమితమైన ఇష్టమని ఆమె అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లో ఏర్పాటు చేసిన సావిత్రి హ్యాండ్లూమ్ స్టోర్‌ను శుక్రవారం ప్రారంభించారు. చీరలు మహిళలకు ఎంతో సౌకర్యంగా ఉంటాయని, మరింత గౌరవాన్ని తీసుకొస్తాయని సునీత అన్నారు. చేతివృత్తిదారులను ప్రోత్సహించేందుకు తాము ఈ రెండో బ్రాంచ్ ఏర్పాటు చేశామని, తమ తొలి శాఖ కేపీహెచ్‌బీలో ఉందని నిర్వాహకులు దామర్ల శివ ప్రసాద్, సాయి సుమన్ అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన చేనేత ఉత్పత్తులను తాము అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

రేపు హైదరాబాద్ మారథాన్



సాక్షి, సిటీబ్యూరో: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ 13వ ఎడిషన్ ఆదివారం ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 10కె రన్, శనివారం ఉదయం ఫన్ రన్ పేరుతో 5కే రన్ జరగనుంది. ఇక, ఆదివారం ఉదయం పీపుల్స్‌ప్లాజా వద్ద మారథాన్ రన్ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి ఇలైట్ రన్నర్లకు నిబంధనలను వివరించేందుకు హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో మారథాన్ నిర్వాహకులు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. దీనికి అంతర్జాతీయ, జాతీయ ప్రముఖ మారథాన్ రన్నర్స్ హాజరయ్యారు. వరల్డ్ అథ్లెటిక్స్ నుంచి నోరీ విలియమ్సన్, ఇండియన్ అథ్లెటిక్స్ నుంచి హనీఫ్ ఇక్బాల్, పంజాగుట్ట ఏసీపీ హరిప్రసాద్, రేస్ డైరెక్టర్ రాజేశ్ వెచ్చ, రేస్ అసిస్టెంట్ డైరెక్టర్ అవినాశ్ పాల్వంచ తదితరులు పాల్గొన్నారు.

తారల తలుక్కు..

రుద్ర డైమండ్స్‌లో జ్యూయలరీ ఫ్యాషన్ షో

ఆకట్టుకున్న మోడల్స్ ర్యాంప్ వాక్





సాక్షి, సిటీబ్యూరో: రుద్ర డైమండ్ జ్యూయలరీ ఫ్యాషన్ షోలో మోడల్స్, సినీ తారలు తళుక్కున మెరిశారు. డైమండ్స్ పొదిగిన ఆభరణాలు ధరించి మోడల్స్ ర్యాంప్ వాక్ చేశారు. ఈ దృశ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని రుద్ర జెమ్స్ అండ్ డైమండ్స్ షోరూం ఈ ఈవెంట్‌కు వేదికైంది. ఈ సందర్భంగా మోడల్స్ వివిధ రకాల విలువైన బంగారు, డైమండ్, వజ్రాభరణాలు ధరించి ఫొటోలకు పోజులిచ్చారు. మార్కెట్‌లో డైమండ్ ఆభరణాలు అనగానే ఉన్నత శ్రేణి వర్గాలకు మాత్రమే అనే అపోహ ఉందని, దాన్ని తొలగించడానికే తక్కువ ధరలకు డైమండ్ ఆభరణాలను అందుబాటులోకి తెస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ సారాంశాన్ని సామాన్య ప్రజలు అర్థం చేసుకోవాలనే ఈవెంట్ నిర్వహిస్తున్నామన్నారు.



ఫెమినా మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ -2024



రసూల్‌పురా: ఫెమినా మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ -2024 విజేతగా కంటోన్మెంట్‌కు చెందిన భవ్య రెడ్డి ఎంపికయ్యారు. ఒక్కో రాష్ట్రం నుండి టాప్ 5 ఫైనలిస్టులు షార్ట్‌లిస్ట్ చేసి ముంబైలో మెగా ఆడిషన్ నిర్వహించారు. ఇందులో మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌గా కంటోన్మెంట్ లోతుకుంటకు చెందిన భవ్య రెడ్డి అక్టోబర్‌లో జరిగే గ్రాండ్ ఫినాలేలో పాల్గొనున్నారు. భవ్య రెడ్డి ఎంఎల్ఆర్ ఐటీలో బీటెక్ పూర్తి చేశారు. ఫ్యాషన్ మోడల్‌గా జీవితాన్ని ఆరంభించి మోడల్ రంగంలో రాణిస్తున్నారు. స్వతహాగా భరతనాట్య కళాకారిణి అయిన భవ్య పలు టీవీ షోల్లో ప్రదర్శనలు ఇచ్చారు. ప్రపంచ ఐటీ కౌన్సిల్ కార్యక్రమంలో సోలో నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అమేజాన్, ప్రముఖ బ్రాండ్స్ కరారీ జ్యూయలర్స్, కళామందిర్ రాయల్ తదితర బ్రాండ్లకు మోడల్‌గా పనిచేశారు. లాభాపేక్ష లేకుండా పలువురికి మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు దోహదపడ్డారు. పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో మానసిక ఆరోగ్య క్లబ్‌లను ఏర్పాటు చేశారు. సామాజిక సేవ తదితర అంశాల్లో భవ్యారెడ్డి ప్రతిభను గుర్తించి ఫెమినా ఇండియా ఆంధ్రప్రదేశ్‌గా ఎంపిక చేసింది. భవ్య కుటుంబ నేపథ్యం తల్లి నివేదిత రెడ్డి గృహిణి. తండ్రి తిరుమల్ రెడ్డి మరణించారు. సోదరి పదో తరగతి చదువుతోంది.


ప్రీతి పట్నాయక్

ప్రీతి... మిస్ ప్రీ టీన్

మనకు మిస్ ఇండియా తెలుసు, మిస్ వరల్డ్ తెలుసు. అలాగే మిస్ ఆంధ్ర, మిస్ తెలంగాణలూ తెలుసు. మిస్ ప్రీ టీన్‌ను మనకు పరిచయం చేసింది ప్రీతి పట్నాయక్. థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి మోడలింగ్ పోటీల్లో పాల్గొని 'మిస్ ప్రీ టీన్' (టీనేజీకి ముందు వయసు కేటగిరీ)గా నిలిచింది.

బుల్లి తార



ఆంధ్రప్రదేశ్, విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన ప్రీతి పట్నాయక్ టీవీ వీక్షకులకు సుపరిచితం. స్టార్ మా టీవీ సీరియల్‌లో నటించింది. రియాలిటీ షోల్లో మెరిసింది. బుల్లితెరకి పరిమితం కాను, వెండితెర మీద వెలుగుతాను అంటున్న ప్రీతి అనేక వేదికల మీద తళుక్కుమంటూనే ఉంది.

తొలి ర్యాంప్ వాక్ వైజాగ్‌లో

ప్రీతి ఏడేళ్ల వయసులో తొలిసారిగా ర్యాంప్ మీద అడుగుపెట్టి, ఫ్యాషన్ ప్రీస్టార్స్‌లో విజేతగా నిలిచింది. స్టార్‌కిడ్స్ రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో నెగ్గింది. ఇప్పుడు థాయ్‌లాండ్‌లో అంతర్జాతీయ వేదిక మీద 13 దేశాల ప్రతినిధులతో పోటీ పడి ప్రీ టీన్ కిరీటాన్ని సొంతం చేసుకుంది. 'ఫ్యాషన్ రన్ వే' విభాగంలో రన్నర్ అప్‌గా నిలిచింది.

చదువుల తల్లి

ప్రీతి భరతనాట్యం, కూచిపూడి, వెస్టర్న్ డాన్స్, హిప్ హాప్, బ్రేక్ డాన్స్... మొత్తం 13 రకాల నాట్యరీతుల్లో ఆరితేరింది. ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో ఎంత చురుగ్గా ఉందో చదువులోనూ అదే స్థాయిలో రాణిస్తోంది. ప్రస్తుతం ఎనిమిదవ తరగతి చదువుతున్న ప్రీతి 90 శాతం మార్కులతో క్లాసులో తొలి ఐదుగురిలో ఉంటోంది. అందరికీ ఉన్నది 24 గంటలే. పిల్లలు రోజంతా స్కూలు సిలబస్‌తోనే కుస్తీపడుతున్న రోజుల్లో ప్రీతికి ఇంత సమయం ఎలా సాధ్యమైందంటే... 'కోవిడ్' అన్నది చిరునవ్వుతో. కోవిడ్ సమయంలో స్కూలు ఆన్‌లైన్ క్లాసుల తర్వాత మిగిలిన టైమంతా తనలో నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి కేటాయించినట్లు చెప్పింది. నాట్య సాధన మానసిక వికాసానికి కూడా దోహదం చేస్తుంది. కళల సాధన వల్ల ఏకాగ్రత, ఐక్యూ లెవెల్స్ బాగా పెరుగుతాయి. ప్రీతి నాట్యప్రదర్శనలు, మోడలింగ్‌తోపాటు తదుపరి జరగబోయే అంతర్జాతీయ స్థాయి టీన్స్ విభాగపు పోటీలకు శిక్షణ తీసుకుంటోంది. గ్లామర్ ఫీల్డ్‌లో రాణించడానికి అందం మాత్రమే సరిపోదని, విషయపరిజ్ఞానం కూడా మెండుగా ఉండాలని అందుకే ఈ ప్రయత్నం అంటోంది ప్రీతి. ఆమె తన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆల్ ది బెస్ట్ చెబుదాం. ఈ బుల్లి తార రేపటి వెండితారగా వెలగాలని కోరుకుందాం.

– అల్లు సూరిబాబు, సాక్షి, విజయనగరం


కేర్ ఇంతింతై... కేరింతై

అమ్మ బొజ్జలోంచి... గుండెల్లోకి

నవజాత శిశువును ఎలాంటి ఆచ్ఛాదనా లేకుండా తల్లి గుండెలకు హత్తుకుని ఉండటాన్ని 'కంగారూ పొజిషన్' అంటారు. అచ్చం కంగారూ తన బిడ్డను శిశుకోశంలో మోస్తూ పెంచే విధానం ఇందులో కనిపిస్తుంది. నవజాత శిశు సంరక్షణలో ఈ పద్ధతి వల్ల తల్లీబిడ్డలిద్దరినీ సానుకూల ప్రయోజనాలు కలుగుతున్నాయి. భద్రాచలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అమలు చేసిన ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోంది.

'కంగారూ మదర్ కేర్' (కేఎంసీ)ని 2003 నుంచి 'వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్' ప్రోత్సహిస్తోంది. ఇందులో తల్లీబిడ్డల మధ్య 'స్కిన్ టు స్కిన్ కాంటాక్ట్' (ఎస్ఎస్‌సి) ఉండటం పిల్లల సంరక్షణకు ఎంతో మేలు చేస్తోందని డబ్ల్యుహెచ్ఓ ప్రయోగాత్మక ఆధారాలతో సహా తెలియచేసింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా ఈ పరిరక్షణను వైద్యులు అమలులోకి తెచ్చారు. మన దగ్గర భద్రాచలంలో ఇలాంటి సంరక్షణను ప్రోత్సహిస్తున్నారు. తక్కువ బరువు, నెలలు నిండకుండానే పుట్టిన శిశువులందరికీ ఈ కంగారూ కేర్ అవసరమని వైద్యులు అంటున్నారు.

భద్రాచలంలో ఎందుకంటే..

కంగారూ కేర్ పద్ధతిని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అమలు చేయాలని 2012లోనే ప్రభుత్వం ఆదేశించింది. అయితే మిగిలిన చోట్ల కంటే భద్రాచలంలో కంగారూ మదర్ కేర్‌పై ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నారు. అన్ని ఆస్పత్రుల తరహాలోనే ఇక్కడ తల్లీపిల్లలకు వైద్యసేవలు అందిస్తూనే అదనంగా కంగారూ మదర్ కేర్ కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. ఇంతగా ఇక్కడ శ్రద్ధ చూపడానికి ప్రధాన కారణం స్థానికంగా ఉన్న పరిస్థితులే. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిషా నాలుగు రాష్ట్రాల సరిహద్దులో భద్రాచలం ఉంది. ఇక్కడ అత్యధికంగా గిరిజనులే జీవిస్తున్నారు. ఈ అటవీ ప్రాంతంలో జీవించే ప్రజల్లో ఉండే నిరక్షరాస్యత, ఆర్థిక వెనుకబాటుతనం, పోషకాహార లోపం, బాల్య వివాహాలు, కాన్పు తర్వాత కాన్పుకు వ్యవధి తక్కువగా ఉండటం, నెలలు నిండకుండానే ప్రసవం జరగడం వంటి సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి.

ప్రయోజనాలు

కంగారూ కేరింగ్ కారణంగా బిడ్డ శ్వాసక్రియ, హృదయ స్పందన రేటు, నాడీవ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. అంటువ్యాధులు సోకే ప్రమాదం బాగా తగ్గుతుంది. తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుంది. తల్లి చెంతనే ఉండటం వల్ల భద్రతాభావం పెరిగి శిశువుపై ఒత్తిడి తగ్గుతుంది. మరోవైపు బాలింతల్లో ప్రసవానంతరం కలిగే నిర్వేదం, మనోవైకల్యాలు గణనీయంగా తగ్గుతాయి. కంగారూ మదర్ కేర్‌లో తండ్రులకూ భాగస్వామ్యం ఉంటుంది. కాన్పు సందర్భంగా శస్త్ర చికిత్స జరిగితే తల్లి కోలుకునేందుకు కొంత సమయం పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో తండ్రులు కంగారూ కేరింగ్ ఇవ్వవచ్చు.

జాగ్రత్తలు

బిడ్డకు ప్రతిరోజూ స్నానం చేయించాల్సిన అవసరం లేదు. తల్లి మాత్రం రోజూ స్నానం చేయాలి. ఒక వేళ ఇంటి ఆచారాల ప్రకారం బిడ్డకు తప్పనిసరిగా స్నానం చేయించాల్సి వస్తే ఏదైనా గదిలో గోరువెచ్చని నీటితో తొందరగా స్నానం చేయించాలి. స్నానమైన వెంటనే పాపాయిని తడి లేకుండా మెత్తటి క్లాత్‌తో తుడవాలి. తర్వాత వెచ్చని బట్టలో చుట్టి పెట్టాలి. వీలైనంత త్వరగా శిశువును కంగారూ మదర్ కేరింగ్ స్థితిలోకి తీసుకురావాలి, శిశువుకు పాలిచ్చే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. పాపాయికి పాలు పట్టేందుకు ఉపయోగించే కప్పు, చెంచా తదితరాలను సబ్బు, నీళ్లతో బాగా శుభ్రం చేయాలి. దీనివల్ల పాపాయికి ఎలాంటి ఇన్ఫెక్షన్లు సోకకుండా, నీళ్ల విరేచనాలు, వాంతులు కాకుండా చూడవచ్చు.

– వై. దుర్గాప్రసాద్, సాక్షి, భద్రాచలం అర్బన్



కంగారూ మదర్ కేర్‌తో మార్పు

పురిటి నొప్పులతో ఈ ఏడాది ఏప్రిల్ 8న భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చేరాను. సాధారణ కాన్పు జరిగింది. 1.6 కేజీల బరువుతో ఆడశిశువు జన్మించింది. పాప బరువు తక్కువ కావడం వల్ల వైద్యుల సూచన మేరకు ఆసుపత్రిలో గల నవజాత శిశు కేంద్రంలో ఉంచి వైద్యం అందిస్తున్నారు. ఈ క్రమంలో తల్లికి బిడ్డకి మధ్య బంధాన్ని మెరుగు పరిచే విధంగా కంగారూ మదర్ కేర్ విధానం పై వైద్యులు, నర్సులు అవగాహన కల్పించారు. వారం రోజుల్లోనే బిడ్డ బరువు పెరిగి 2 కేజీలకు చేరుకుంది. ఇంటి వద్ద కూడా ఇదే ప్రక్రియను కొనసాగిస్తున్నాను.

– శివమణి, కూనవరం, ఆంధ్రప్రదేశ్



తక్కువ బరువు ఉంటే..

ప్రసవించినప్పుడు 1.5 కిలోల బరువుతో పుట్టిన బిడ్డకు కంగారూ కేర్ అమలు చేస్తున్నాం. ప్రతిరోజు 15 గ్రాముల చొప్పున బిడ్డ బరువు పెరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుంది. సుమారు రెండు కిలోల బరువుకు వచ్చాక బిడ్డను నవజాత శిశు సంరక్షణ కేంద్రం నుంచి డిశ్చార్జి చేస్తాం. ఇలా బిడ్డ ఎదుగుదలకు వారి ఆరోగ్య స్థితిని బట్టి 45 రోజుల నుంచి రెండు నెలల వరకు కంగారూ కేర్ ఇస్తాం.

– డాక్టర్ రామకృష్ణ, సూపరింటెండెంట్, ఏరియా హాస్పిటల్, భద్రాచలం

* యువ జంటల కొత్త నినాదం

డబ్బే ముద్దు.. పిల్లలు వద్దు

**డబుల్ ఇన్‌కమ్... నో కిడ్స్
ఫ్యామిలీ ప్లానింగ్‌లో ఓ కొత్త ఒరవడి మొదలయ్యింది.
నవ దంపతులు రెట్టింపు ఆదాయంపైనే దృష్టి పెడుతున్నారు.
పిల్లలు మాత్రం వద్దు అనుకుంటున్నారు.**

రాహుల్ మంచి జీతంతో స్థిరపడ్డాడు. పెళ్లి చేసుకోవడానికి చాలా సంబంధాలు చూసి, ఒకమ్మాయిని ఇష్టపడ్డాడు. ఆ అమ్మాయి మాత్రం 'నేను పిల్లలను కనాలనుకోవడం లేదు' అని కచ్చితంగా చెప్పేసింది. ఎంత నచ్చజెప్పినా పెళ్లి క్యాన్సిల్ చేస్తానంది కానీ, మాట మార్చుకోనంది.

స్నిగ్ధ, కిరణ్ లు పెళ్లి తర్వాత మూడేళ్ల వరకు పిల్లలు వద్దనుకున్నారు. ఆ తర్వాత అసలు పిల్లలే వద్దు అనే ఆలోచనకు వచ్చేశారు.పెద్దవాళ్లు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తే తమ ఉద్యోగాలు మరో స్టేట్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వెళ్లిపోయారు.



• • •

'ఇది ఒకరో ఇద్దరిదో సమస్య కాదు. మేం డబుల్ ఇన్‌కమ్ నో కిడ్స్ (DINKS)' దంపతులను ప్రపంచవ్యాప్తంగా ఎక్కడెక్కడున్నారో కనుక్కుంటున్నాం' అని తేల్చింది ప్రముఖ లాన్సెట్ అధ్యయనం. రానున్న రోజుల్లో ఇది తీవ్రమైన ఆర్థిక, సామాజిక అంశాలపై పెనుభారంగా పరిణమించనుందని స్పష్టం చేసింది.

మోయడం కష్టమట..

మొదట పిల్లలు వద్దనుకునే దంపతులు చాలా తక్కువగా కనిపించేవారు. అది పెద్దగా పట్టించుకోదగిన విషయంగా కూడా ఉండేది కాదు. కానీ, ఇప్పుడు పూర్తిస్థాయి సాంస్కృతిక ప్రధాన స్రవంతిగా మారాయి. అమెరికాలో పిల్లలు లేని కుటుంబాలు 2022 నాటికి 43 శాతానికి చేరుకున్నాయి. దశాబ్దం క్రితంతో పోల్చి చూస్తే 36 శాతానికి పైగా పెరిగింది. సమీప భవిష్యత్తులో వీరు 50 శాతానికి చేరుకోబోతున్నారు. కడుపున బిడ్డను మోయడం అనేది ఓ పెద్ద పనిగా, సమయం తీసుకునే అంశంగా భావిస్తున్నారు. ఇది ఒక్క అమెరికాలోనే కాదు ఆర్థికాభివృద్ధిలో కొంతస్థాయికి చేరుకుంటున్న దాదాపు 90 దేశాలు ఈ జాబితాలో ఉన్నాయని సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నిర్ణయాలు అమలు

'మేం ఇద్దరం.. మాకు ఇద్దరు' అనేది 1970 – 80లలో ఆకట్టుకునే ఫ్యామిలీ ప్లానింగ్ నినాదం. కొత్త తరాలు కోరుకునే ఈ నినాదాలేమీ విననివి కాదు. అధిక పేదరికం ఉన్న రోజుల్లో ప్రతి స్త్రీకి 4–5 మంది పిల్లలు ఉండేవారు. దీంతో సంతానోత్పత్తి రేటును తగ్గించడానికి ప్రభుత్వం ఈ నినాదాలు రూపొందించింది. అవి అప్పటి పరిస్థితులకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయాలు.

నాటి నుంచి ప్రపంచం చాలా పురోభివృద్ధి సాధించింది. సంతానోత్పత్తి రేట్లు తగ్గుతున్నందున, ఆధునిక చరిత్రలో మొదటిసారిగా ప్రపంచ జనాభా ఈ శతాబ్దం చివరి నాటికి పెరగడం ఆగిపోతుందని యునైటెడ్ నేషన్స్ జనాభా డేటా ప్యూ రీసెర్చ్ సెంటర్ విశ్లేషణ తెలియజేస్తుంది.

రాబోయే రోజుల్లో అంటే 2050 నుంచి 2100 మధ్య కాలంలో 90 దేశాల్లో జనాభా బాగా తగ్గిపోనుంది. వాటిలో ఎక్కువ భాగం ఐరోపా, లాటిన్ అమెరికాలో ఉన్నాయి. జనాభా పెరుగుదల నమోదవుతున్న ఏకైక ప్రాంతం ఆఫ్రికా మాత్రమే. 2020–2100 ఆఫ్రికా ఖండంలో మధ్య భాగం జనాభా 1.3 మిలియన్ల నుండి 4.3 బిలియన్లకు పెరుగుతుందని అంచనా. దక్షిణ కొరియాలో రాజకీయ నాయకులు సంతానోత్పత్తి రేటును పెంచాలని అక్కడి దంపతులను వేడుకుంటున్నారు.

మన దేశంలో...

లాన్సెట్ కొంతకాలంగా వేస్తున్న అంచనా ప్రకారం 2050 నాటికి పిల్లల రేటు భారీగా తగ్గి, ప్రతి ఐదుగురు భారతీయులలో ఒకరు సీనియర్ సిటిజన్‌గా ఉంటారు. ఇది ఉత్పాదకతపై ప్రభావం చూపే శ్రామిక శక్తిని తగ్గిస్తుంది. మనం ఎంత దూరం వచ్చామో అర్థం చేసుకోవాలంటే 1950 మన దేశ సంతానోత్పత్తి రేటు 6.18గా ఉంది. 1980లో 4.60 ఉండగా, 2021లో 1.91కి తగ్గింది. కొన్ని స్థానిక అంశాలు మానవ మనస్తత్వ కోణాలను పూర్తిగా మార్చేశాయి. చాలా మంది పిల్లలు వృద్ధ తల్లిదండ్రులకు పెట్టుబడి. కానీ, ఈ ఆలోచన పూర్తిగా తిరగబడింది. నేడు పిల్లల పెంపకం ఖర్చుతో కూడుకున్నది. పైగా వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటారనే నమ్మకం లేదు.

పరిస్థితి ఇలా మారుతోంది

- పేరెంట్‌హుడ్‌ను నివారించడానికి యువ జంటలు పట్టణాలలో పెంపుడు జంతువులను ఎంచుకుంటున్నారు. కుక్కలు, పిల్లులు తక్కువ బాధ్యత ఉన్నప్పటికీ, యజమానులను బాగా ప్రేమిస్తాయి.
- మరికొందరు తమ జీవితాన్ని కొత్త స్వేచ్ఛను, ప్రయాణ, సాహస క్రీడల కోసం ఉపయోగిస్తున్నారు.
- నగరాలు, చిన్న పట్టణాలలో జీవనం కష్టంగా మారి పిల్లలతో కలిసి శివారు ప్రాంతాలకు వలస వెళుతున్నారు. పట్టణీకరణ కేంద్రాలలోనూ జనాభా వేగంగా తగ్గిపోతోంది.
- పిల్లలు లేకుండా, తల్లిదండ్రులుగా మారడానికి ఇష్టపడే జంటలు సాధారణంగా ఐటీ, అడ్వర్టైజింగ్ ఇతర అధిక కార్పొరేట్ ఉద్యోగాలలో ఉంటున్నారు. సుదీర్ఘ పని గంటల తర్వాత సమయాన్ని, డబ్బును సెలవుల కోసమే కేటాయించుకుంటున్నారు.

• స్వీట్‌న్యూస్



నిద్ర పోయే ముందు స్వీట్లు తినకూడదా!

రాత్రిపూట దేహక్రియలు మందగిస్తాయి. రాత్రి స్వీట్లు తింటే అందులోని చక్కెరలు దేహక్రియల కోసం ఖర్చు కాకుండా దేహంలో నిల్వ చేరడంతో రక్తంలో చక్కెర స్థాయులు ఒక్కసారిగా పెరుగుతాయి. చక్కెరలు విడుదల చేసే శక్తితో దేహం ఉత్తేజితమై నిద్ర దూరమవుతుంది. హార్మోన్ల సమతుల్యత మీద కూడా దుష్ప్రభావాన్ని చూపిస్తుంది. కాబట్టి నిద్రకు ముందు స్వీట్లు తినకపోవడమే మంచిది. అలాగని చక్కెరతో చేసిన స్వీట్లను పూర్తిగా మినహాయించాలని చెప్పడం లేదు కానీ మోతాదు విషయంలో గమనింపు తప్పనిసరి. ప్రొటీన్‌లు, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులతో కలిసిన స్వీట్ అయితే అది జీర్ణం కావడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది. కాబట్టి దేహం చక్కెరను గ్రహించడం ఆలస్యమవుతుంది, దాంతో రక్తంలో చక్కెర స్థాయులు అమాంతం పెరిగే ప్రమాదం ఉండదు. స్వీట్ల విషయంలో గుర్తుంచుకోవాల్సిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే... ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఆహారంలో చక్కెరలు తప్ప యాడెడ్ షుగర్స్‌ను మినహాయించాలి. జీవక్రియల విరామం తర్వాత అందే ఆహారం కాబట్టి అందులోని చక్కెరలను త్వరగా గ్రహించే లక్షణంతో ఉంటుంది దేహం. రక్తంలో షుగర్ లెవెల్స్ వేగంగా పెరగడానికి కారణమవుతుంది. కాబట్టి స్వీట్‌లను ఉదయం వద్దు, రాత్రి వద్దు. మధ్యాహ్నం మాత్రమే తినడం మంచిది. పగలైతే స్వీట్‌తో అందే చక్కెరల నుంచి విడుదలయ్యే కేలరీలను కరిగించడం కూడా జరుగుతుంది.

ఫ్యామిలీ లైఫ్

యుద్ధం–ప్రేమ

**ఉక్రెయిన్‌పై రష్యా భీకర యుద్ధం, వెనక్కి తగ్గని దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ, భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉక్రెయిన్ చారిత్రక పర్యటన... ఇవి మాత్రమే మనకు కనిపించే దృశ్యాలు. యుద్ధ ప్రభావం దేశంపై సరే, కుటుంబంపై ఎలా ఉంటుంది? వైవాహిక జీవితంపై ఎలా ఉంటుంది?
ఈ ప్రశ్నలకు తాజా ఇంటర్వ్యూలో సమాధానం చెప్పింది ఉక్రెయిన్ ప్రథమ మహిళ, జెలెన్‌స్కీ భార్య ఒలెనా...**


భార్య ఒలెనాతో జెలెన్‌స్కీ

భర్త క్షేమంగా ఉండాలని ఏ భార్య అయినా కోరుకుంటుంది. భర్తను ఏ రోజు మృత్యువు కాటేస్తుందో అనే భయం మాత్రం భార్యకు క్షణ క్షణం నరకాన్ని చూపిస్తుంది. అలాంటి గడ్డు పరిస్థితిని ఎదుర్కొని తట్టుకొని గట్టిగా నిలబడింది ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భార్య ఒలెనా. ఉక్రెయిన్ భూభాగంలో గత రెండున్నర సంవత్సరాల యుద్ధ విషాదాలలో, జీవన్మరణ సమయాలలో వారి వివాహ బంధం పేకమేడలా కుప్పకూలి పోవాల్సిన పరిస్థితి.

'ఈ యుద్ధం మీ వివాహబంధంపై ప్రతికూల ప్రభావాన్ని చూపిందా?' అని అడిగిన ప్రశ్నకు ఒలెనా జెలెన్‌స్కీ చెప్పిన సమాధానం...'రెండు దశాబ్దాల మా వివాహ బంధం గతంతో పోలిస్తే మరింత దృఢమైంది. ఒకరికి ఒకరు అండగా నిలబడ్డాం' అన్నది.

'యుద్ధప్రభావం కుటుంబ జీవితంపై ఉంటుందా?' అని అడిగిన ప్రశ్నకు 'కచ్చితంగా ఉంటుంది' అని చెప్పింది ఒలెనా.

యుద్ధ ఉద్రిక్తతల వల్ల గతంలో మాదిరిగా వారు తీరిగ్గా మాట్లాడుకునే రోజులు పోయాయి. తన కుమార్తె ఒలెంక్సాండ్రా, కుమారుడు కైరీలోతో పాటు ఒలెనా తన భర్తకు దూరంగా ఉండాల్సి వచ్చింది.

'ఈ విషయంలో ఎలాంటి అసంతృప్తీ లేదు. మేము ఒకరినొకరం బాగా అర్థం చేసుకున్నాం. భార్యాభర్తల మధ్య ప్రేమ ఒక్కటే సరిపోదు. విశ్వాసం ముఖ్యం. నేను


భార్య, పిల్లలతో జెలెన్‌స్కీ

నా భర్త నిజాయితీని విశ్వసించకపోతే అపారమైన ప్రేమ పంచినప్పటికీ అది వృథా అవుతుంది' అంటుంది ఒలెనా.

'యుద్ధంలో మునిగితేలుతున్న దేశంలో ఏ వ్యక్తి అయినా సాధారణ జీవితం గడపలేరు. నిరంతరం మానసిక ఒత్తిడి అనేది సాధారణం' అంటుంది.

గత నెలలో కీవ్ శివార్లలోని పిల్లల ఆసుపత్రిపై రష్యా క్షిపణి దాడిలో ఇద్దరు పిల్లలు మరణించారు. ఎంతోమంది గాయపడ్డారు. తన సొంత పిల్లలపైనే దాడి జరిగినట్లు తల్లడిల్లి పోయింది ఒలెనా.

'యుద్ధం వల్ల ప్రతి ఒక్కరూ అలిసిపోతారు. మిణుకు మిణుకుమనే ఆశ ఉజ్వలంగా వెలగాలనుకుంటారు. అయితే దీనికి ఎంతో సాహసం, అంతకు మించిన ఆత్మవిశ్వాసం కావాలి. పిల్లల నుంచి వృద్ధుల వరకు ఏ ఒక్కరినీ వదిలిపెట్టకుండా రాక్షసంగా దాడులు జరుగుతున్నాయి. ఇలా జరుగుతుందేమిటి? అని నా భర్త ముందు ఎప్పుడూ కన్నీళ్లు పెట్టుకోలేదు. న్యాయం జయిస్తుంది అన్నట్లే మాట్లాడాను' గతాన్ని గుర్తు చేసుకుంటూ అంటుంది ఒలెనా.

ఒలెనాకు తన దేశ పౌరుల ధైర్యసాహసాల గురించి కథలు కథలుగా చెప్పడం అంటే ఇష్టం.

ధైర్యం మంచిదేగానీ అన్నిసార్లూ కాకపోవచ్చు. ప్రమాదపు ఊబిలో దించవచ్చు. తిరుగులేని ధైర్యంతో ముందుకు వెళ్లిన జెలెన్‌స్కీపై ఎన్నోసార్లు హత్యాప్రయత్నాలు జరిగాయి. ఆ సమయంలో ఒలెనా మానసిక పరిస్థితి మాటలకందనిది. అయినా సరే, ప్రతికూల ఆలోచనలపై దృష్టి పెట్టేది కాదు. 'అంతా మంచే జరుగుతుంది. ఆయన క్షేమంగా ఉండాలి' అని ఒకటికి పదిసార్లు అనుకునేది.

'నిర్మొహమాటంగా చెప్పాలంటే నా భర్త ధైర్యసాహసాలను చూసి నేను గర్విస్తున్నాను' అంటుంది ఒలెనా.

యుద్ధ విధ్వంసాన్ని కళ్లారా చూసిన ఒలెనా... 'యుద్ధంలో మనం అత్యంత విలువైన వాటిని కోల్పోతాం' అంటుంది.

అయితే ఆమె కోల్పోనిది మాత్రం ధైర్యం. తన కుటుంబానికే కాదు దేశ ప్రథమ మహిళగా తనకు ఆ ధైర్యం ఎంతో ముఖ్యం.





శుక్రవారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను మర్యాదపూర్వకంగా కలిసిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

ఏపీ ప్రభుత్వంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

సాక్షి, న్యూఢిల్లీ: రెండు రోజుల వ్యవధిలో ఏపీలో జరిగిన మూడు ఘోరమైన ప్రమాదాలను జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్రంగా పరిగణించింది. అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృతిచెందడంపై.. అలాగే చిత్తూరు సమీపంలోని మురకంబట్టు ప్రాంతంలోని అపోలో మెడికల్ కాలేజీలో ఫుడ్ పాయిజన్ అయ్యి 70మంది విద్యార్థులు ఆసుపత్రి పాలవడంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాపట్నంలోని ఓ అనాథాశ్రమంలో ఫుడ్ పాయిజన్ అయ్యి ముగ్గురు విద్యార్థులు మృతిచెందడం, 37మంది తీవ్ర అస్వస్థతకు గురి కావడంపై అసహనం వ్యక్తం చేసింది. ఈ 3 ఘటనలపై పత్రికలు, టీవీల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటోగా కేసు నమోదు చేసినట్లు తెలిపింది. ఈ ఘటనల్లో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించింది. రెండు వారాల్లో ఈ 3 ఘటనలపై సమగ్రమైన నివేదికను ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ శుక్రవారం చీఫ్ సెక్రటరీ, డీజీపీలకు నోటీసులు జారీ చేసింది.

జగన్ వచ్చారు.. చెక్కులు అందాయి

సాక్షి, అనకాపల్లి: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా కంపెనీలో దుర్ఘటన జరిగి 17 మంది మృత్యువాత పడితే 24 గంటల వరకు కనీసం ఘటనా స్థలానికే వెళ్లని అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు మాజీ సీఎం వైఎస్ జగన్ రాకతో ఆగమేఘాల మీద చెక్కులు సిద్ధం చేశారు. బాధితులకు గడువులోగా పరిహారం అందకుంటే ధర్నా చేస్తామన్న వైఎస్ జగన్ హెచ్చరికలతో అప్పటికప్పుడు 17 మంది మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. మృతుల కుటుంబాలకు స్థానిక తహసీల్దారుల చేతుల మీదుగా చెక్కులు అందచేశారు.

న్యాయం జరగకుంటే ధర్నా చేస్తాం

ఫార్మా ప్రమాద బాధితులు ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలి.. ఏపీ సర్కారుకు జగన్ అల్టిమేటం

- ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇకనైనా మేలుకోండి
- ఈ సర్కారుకు ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనే లేదు
- సూపర్ సిక్స్ హామీలపైనా పట్టింపు లేదు.. కక్షలు తీర్చుకునేందుకు కొట్టడం, చంపడం.. ఇదీ వీరి రెడ్‌బుక్ పాలన అంటూ విమర్శ



అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా ప్రమాద బాధితులందరికీ న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతులతోపాటు క్షతగాత్రుల్లో ప్రతి ఒక్కరికీ పరిహారం అందించే వరకు బాధితుల తరఫున తాము పోరాడతామని ప్రకటించారు. ప్రభుత్వానికి 2–3 వారాల సమయం ఇస్తున్నామని, బాధితులందరికీ నష్ట పరిహారం అందించే విషయంలో ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకుంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ధర్నాకు దిగుతుందని, అవసరమైతే తాను కూడా స్వయంగా వచ్చి ధర్నాలో పాల్గొంటానని స్పష్టం చేశారు. దుర్ఘటనలు జరిగినప్పుడు బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం వేగంగా స్పందించాలని, నష్ట పరిహారం అందించే విషయంలో సానుభూతితో, మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన సేఫ్టీ ప్రోటోకాల్స్‌ను పక్కాగా పర్యవేక్షిస్తూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 'ఎవరెవరు ఏం చేయాలి? ప్రోటోకాల్ ప్రకారం జరుగుతోందా? లేదా? అని పర్యవేక్షిస్తే ఫ్యాక్టరీల పరిస్థితి ఇలా ఉండేది కాదు. ఈ రోజు ఇంతమంది ఇలా చనిపోయి ఉండేవారు కాదు'' అని ఆవేదన వ్యక్తం చేశారు. అచ్యుతాపురం సెజ్ ఫార్మా కంపెనీలో జరిగిన దుర్ఘటనలో గాయపడి ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైఎస్ జగన్ శుక్రవారం పరామర్శించారు. ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి దుర్ఘటన ఎలా జరిగింది? ఆరోగ్యం ఎలా ఉంది? బాగా చూసుకుంటున్నారా? అని వాకబు చేశారు. ఎవరూ అధైర్యపడొద్దని, అందరికీ న్యాయం జరిగే వరకు పోరాడతామని, తాము అండగా ఉంటామని బాధిత కుటుంబాలకు భరోసానిచ్చారు. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు.

అప్పటికి, ఇప్పటికి తేడా ఇదీ..

ఇలాంటి ఘటనే మా ప్రభుత్వ హయాంలో కూడా ఒకసారి జరిగింది. కోవిడ్ మహమ్మారి సమయంలో మే 2020లో ఎల్జీ పాలిమర్స్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. కానీ కోవిడ్ ఉన్నా కూడా గత ప్రభుత్వం ఎలా స్పందించిందన్నది ఒకసారి తేడా గమనించాలి. ఆ ఘటన తెల్లవారుజామున 3.40 గంటల సమయంలో జరిగితే 5 గంటల కల్లా కలెక్టర్, కమిషనర్ ఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే అంబులెన్సులన్నీ పెద్ద ఎత్తున మోహరించాయి. ప్రతి బాధితుడికి తోడుగా నిలుస్తూ ఉదయం 6 గంటలకల్లా వైఎస్సార్ సీపీకి చెందిన సీనియర్ నాయకులందరూ ఘటనా స్థలానికి వెళ్లారు. అదే రోజు 11 గంటల కల్లా ఏకంగా ముఖ్యమంత్రి అంటే నేనే స్పాటు వద్దకు వెళ్లా. బాధితులకు 24 గంటల్లోనే ఏకంగా కోటి రూపాయల నష్టపరిహారం ప్రకటించిన పరిస్థితులు గతంలో ఎన్నడూ జరగలేదు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వం బాధ్యత తీసుకుని బాధితుల పట్ల ఇంతగా సానుభూతితో వ్యవహరించిన సంఘటనలు గతంలో లేవు. మొట్టమొదటిసారిగా నష్ట పరిహారం కోటి రూపాయలు ఇచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే.. మన ప్రభుత్వమే.. జగన్ ప్రభుత్వమే ఇచ్చిందని గర్వంగా చెప్పగలుగుతున్నా. 24 గంటల్లోనే ఏకంగా రూ.30 కోట్లు అక్కడకు పంపించి బాధితులకు తోడుగా నిలిచాం. బాధితులను వెంటనే ఆస్పత్రిలో చేర్పించడంతోపాటు 3 రోజులు ఆస్పత్రిలో ఉంటే రూ.10 లక్షలు, ఒక రోజు ఉంటే రూ.3 లక్షలు, చిన్న చిన్న గాయాలైన వారికి రూ.25 వేలు చొప్పున ఇప్పించాం. అంతేకాకుండా చుట్టుపక్కల ఉన్న ఐదు గ్రామాల్లో 15 వేల జనాభా ఉండగా ప్రతి ఒక్కరికీ రూ.10 వేలు ఇచ్చి తోడుగా నిలిచిన పరిస్థితులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగాయి. ఇప్పుడు ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే.. ఒక సంఘటన జరిగినప్పుడు ప్రభుత్వం స్పందించే తీరు ఎలా ఉండాలనేది చాలా ముఖ్యం.

సానుభూతి చూపాలి.. బాధ్యత తీసుకోవాలి

చంద్రబాబు ఇక్కడకు వచ్చినప్పుడు నిర్వహించిన ప్రెస్‌మీట్ చూసి చాలా ఆశ్చర్యపోయా. జగన్ హయాంలోనూ ఘటనలు జరిగాయంటూ విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేశాడు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న 2014–19 మధ్యలో ప్రమాదాలు జరగలేదా? ఎవరున్నా ఇటువంటి ఘటనలు జరుగుతాయి. కానీ అలా జరిగినప్పుడు ప్రభుత్వం ఎలా స్పందిస్తుందన్నది ముఖ్యమైన విషయం. ప్రభుత్వం ఇటువంటి ఘటనల సమయంలో ప్రజల పట్ల, బాధితుల పట్ల సానుభూతి చూపించాలి. రెండోది ఏమిటంటే.. ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి. ఈ రెండు కూడా ఆ రోజు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకుంది. ఇవాళ చీఫ్ సెక్రటరీగా ఉన్న నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆధ్వర్యంలోనే ఒక హై లెవల్ కమిటీని నియమించి ఫ్యాక్టరీ సెక్యూరిటీ, పొల్యూషన్ కంట్రోల్ అంశాలను జోడించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తేవాల్సిన సంస్కరణలపై సిఫారసులు చేయాలని కమిటీని నాడు మా ప్రభుత్వం కోరింది. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆగస్టు 2020లో ఒక జీవో కూడా జారీ చేశాం. దీనిపై పక్కాగా ప్రోటోకాల్ కూడా తీసుకొచ్చాం. ఫ్యాక్టరీ భద్రత ప్రోటోకాల్, కాలుష్య నియంత్రణ ప్రోటోకాల్.. అన్నింటినీ కలిపి ఒకే ప్రోటోకాల్ తెచ్చాం. ఇందులో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ప్రతి కంపెనీ సెల్ఫ్ కంప్లయిన్స్ రిపోర్టు ఇవ్వాలి. తయారు చేసే నైపుణ్యం ఆ కంపెనీకి సొంతంగా లేకపోతే గుర్తింపు పొందిన థర్డ్ పార్టీ ద్వారా తీసుకుని కచ్చితంగా ఇవ్వాలి. ఆ నివేదిక ఆధారంగా నిజంగానే అన్నీ సరిగ్గా ఉన్నాయా? ఇంకా ఏమైనా చేయాల్సిన అవసరం ఉందా? అనే విషయాన్ని అన్ని విభాగాల అధికారులతో కూడిన కమిటీ పరిశీలించి నెల రోజుల తర్వాత తనిఖీలు నిర్వహిస్తుంది. ఒకవేళ ఏవైనా సమస్యలు ఉంటే సరిదిద్దుకునేందుకు కంపెనీకి 15 రోజుల సమయం ఇస్తుంది. గడువులోగా అది పూర్తయ్యేలా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షించాలని ప్రోటోకాల్‌లో ఉంది. ఇది ఇప్పటికే అమల్లో ఉంది. అదొక సంస్కరణ కింద తెచ్చాం. ఇవాళ ప్రభుత్వంలో ఉన్న పెద్దలు వీటిని తు.చ. తప్పకుండా అమలు చేసేలా పర్యవేక్షించి ఉంటే ఇటువంటి ఘటనలు పునరావృతమయ్యేవి కాదు.

లోతైన విచారణ జరగాల్సిందే..

ఇవాళ చంద్రబాబుకు ఒకటే మాట చెబుతున్నా. నష్టపరిహారం అన్నది సానుభూతితో ఇవ్వాలి. ఇవ్వాల్సిన సమయంలో ఇవ్వాలి. ఇంత మంది ఆస్పత్రిలో ఉన్నారు. వారికి ఇస్తామన్న డబ్బులు వెంటనే ఇప్పించే ఏర్పాట్లు చేయండి. ఫ్యాక్టరీలలో భద్రతా చర్యలపై తెచ్చిన ప్రోటోకాల్‌ను కనీసం ఇప్పటి నుంచైనా పర్యవేక్షించే దిశగా అడుగులు వేయాలి. ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోండి. ఆ ఫ్యాక్టరీకి సంబంధించి వాస్తవంగా ఏం జరిగిందో విచారణ చేయండి. యాజమాన్యం ఎవరైనా కానీ.. ఎందుకు తప్పు జరిగిందో విచారణ జరగాలి. సేఫ్టీ పారామీటర్స్ అమలైతే ఇటువంటి ఘటనలు నివారించవచ్చు. ఇవన్నీ కచ్చితంగా అమలు చేసేందుకు 2–3 వారాల సమయం ఇస్తాం. చనిపోయిన వారందరికీ నష్టపరిహారం అందించే విషయంలో ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకుంటే బాధితుల తరఫున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ధర్నాకు దిగుతుంది. అవసరమైతే నేను కూడా వచ్చి ధర్నాలో పాల్గొంటా.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

సాక్షి, విశాఖపట్నం/తుమ్మపాల/అనకాపల్లి: ఒకవైపు కాలిన గాయాలు.. మరోవైపు సర్కారు నిర్లక్ష్యంతో కుమిలిపోతున్న ఎసైన్షియా ఫార్మా ప్రమాద బాధితులను అండగా నేనున్నానంటూ ఓదార్చారు! తృటిలో ప్రాణాలతో బయటపడి ఆస్పత్రిలో తల్లడిల్లుతున్న క్షతగాత్రుల్ని ఊరడించి కన్నీళ్లు తుడిచారు! ఆత్మీయ స్పర్శతో కొత్త ఊపిరి అందించారు!! విశాఖ అచ్యుతాపురం సెజ్ ప్రమాదం జరిగి మూడు రోజులు కావస్తున్నా ప్రభుత్వం అందించలేని ప్రేమ పూర్వక భరోసాని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారు. ఎవరూ అధైర్యపడొద్దు.. మీరంతా క్షేమంగా ఇంటికి చేరుకుంటారు.. నిబ్బరంగా ఉండాలంటూ ధైర్యం చెప్పారు. ప్రతి ఒక్కరూ మీ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. చికిత్స అనంతరం అందరూ ఆరోగ్యవంతులుగా ఇళ్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం ప్రతి ఒక్కరికీ అందేలా మేం అండగా నిలిచి పోరాడతామని, అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని భరోసానిచ్చారు. ఎవరికి, ఎలాంటి సమస్య ఎదురైనా మా పార్టీ నాయకులు అందుబాటులో ఉంటారని, వెంటనే వారి దృష్టికి తేవాలని సూచించారు.

వీళ్ల ధ్యాసంతా రెడ్ బుక్‌పైనే

ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత 3 నెలలుగా ఏం జరుగుతోంది? వీరికి పాలన మీద ధ్యాస లేదు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, సూపర్ టెన్‌ల మీద ధ్యాస లేదు. వీళ్ల ధ్యాసంతా రెడ్ బుక్ తెరవడం.. ఎవరెవరిపై కక్షలు ఉన్నాయో వాటిని తీర్చుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపైనే! కక్షలు తీర్చుకోవడానికి రోజూ కొట్టడం, చంపడం, ఆస్తులను ధ్వంసం చేస్తున్న ఘటనలే కనిపిస్తున్నాయి. కూటమి పాలనలో ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన, తాపత్రయం కనిపించని అధ్వాన పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. వీళ్ల పరిపాలన మీద దృష్టి పెట్టి ఉంటే ఇంగ్లిష్ మీడియంతో మన స్కూల్స్ బాగుపడి ఉండేవి. 3వ తరగతిలోనే టోఫెల్ క్లాసులు, నాడు–నేడు కొనసాగి ఉండేవి. గోరుముద్ద కార్యక్రమం బాగా జరుగుతూ ఉండేది. ఇప్పుడు ప్రభుత్వ స్కూల్స్ నాశనమైపోయాయి. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు ఇవ్వకపోవడంతో పేదలకు వైద్యం అందని దుస్థితి నెలకొంది.

సాక్షి రియల్టీ

- స్టార్టప్స్ కోసం 2–3 ఐటీ హబ్‌లు
- హైటెక్స్ తరహాలో పెద్ద కన్వెన్షన్ సెంటర్ కూడా
- స్థల ఎంపిక, పాలసీలపై త్వరలో స్పష్టత
- క్రెడాయ్ ప్రాపర్టీ షోలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



ఈస్ట్‌లో ఐటీ పార్క్

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ హైదరాబాద్ తరహాలో ఈస్ట్‌ను అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. తూర్పు హైదరాబాద్‌లో ఐటీ పార్క్‌ను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. నెల రోజుల వ్యవధిలో స్థల ఎంపిక, పాలసీ, విధి విధానాలపై స్పష్టత వస్తుందని తెలిపారు. ఇప్పటికే ఈస్ట్‌లో హబ్సిగూడ, పోచారంలో ఐటీ కేంద్రాలున్నాయని, ఇవి కాకుండా ఏ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే సమగ్ర అభివృద్ధి జరుగుతుందో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సాంకేతికత, సేవల రంగంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్స్ కోసం 2–3 హబ్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) హైదరాబాద్ మూడో ప్రాపర్టీ షో నాగోల్‌లో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈస్ట్ హైదరాబాద్‌లో హెచ్ఐసీసీ తరహాలో కన్వెన్షన్ సెంటర్‌తో పాటు కాలుష్యం తక్కువగా ఉండే హార్డ్‌వేర్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇక్కడ ఫైవ్ స్టార్ హోటళ్లను నిర్మించేందుకు ఆతిథ్య రంగం ప్రతినిధులతో సమావేశం అవుతామని, వీటి నిర్మాణానికి ముందుకొచ్చే సంస్థలకు స్థల కేటాయింపు, పన్ను రాయితీలు, ఇతరత్రా ప్రోత్సాహకాలు ఇస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను స్కిల్స్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేయనున్న స్కిల్స్ యూనివర్సిటీని రెండున్నరేళ్లలో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని, దీంతో ఐటీ, ఫార్మా, రియల్టీ అన్ని రంగాలకు అవసరమైన నైపుణ్య కార్మికులు అందుబాటులోకి వస్తారని చెప్పారు. ప్రభుత్వం సిబ్బందితో పాటు ఆయా రంగాల్లోని ప్రతినిధులతో కూడా కార్మికులకు శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. నాణ్యమైన నిర్మాణాలు చేపట్టాలి, వాటికి తగ్గట్టుగానే ధరలను నిర్ణయించాలి. ఈ తరహా ప్రాపర్టీలకు ఎక్కడైనా డిమాండ్ ఉంటుందని సూచించారు.

ప్రణాళిక లేకే బెంగళూరులో సమస్యలు..

సమగ్రమైన ప్రణాళిక లేనందు వల్లే బెంగళూరులో నీటి సమస్య, మొబిలిటీ సమస్యలు ఎదురవుతున్నాయని, హైదరాబాద్ అభివృద్ధిలో ఇలాంటి తప్పులు పునరావృతం కానివ్వమని చెప్పారు. పశ్చిమ హైదరాబాద్‌లోనే కాదు నగరం నలువైపులా అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి చేపడతామని చెప్పారు. ఈస్ట్ హైదరాబాద్‌లో సామాజిక మౌలిక వసతులను కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తూర్పు హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు 'లుక్ ఈస్ట్ పాలసీ'ను తీసుకొచ్చిందని, కానీ, ఆశించిన మేర అభివృద్ధి జరగలేదని ఎద్దేవా చేశారు. అప్పటి ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. కానీ, మా ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే 30–40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈస్ట్ హైదరాబాద్‌లో మొబిలిటీ, ప్రజా రవాణాను మరింత మెరుగు పర్చడంతో పాటు ఔటర్ వరకు మెట్రో విస్తరించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వీ రాజశేఖర్ రెడ్డి, ప్రెసిడెంట్–ఎలెక్ట్ ఎన్ జైదీప్ రెడ్డి, జనరల్ సెక్రటరీ బీ. జగన్నాథ రావు తదితరులు పాల్గొన్నారు.

లైఫ్@360

స్వీట్ డ్రీమ్స్..



కోరుకున్న కలలు కనడం మన చేతిలో ఏమైనా ఉందా? ఫలానా కల రావాలి అని కళ్లు మూసుకుని పడుకుంటే అదే కల వస్తుందా..? అలా వస్తుందన్న గ్యారంటీ ఏమైనా ఉందా? ఒకప్పుడు ఇదే మాట ఎవరితో అయినా అంటే అవును కదూ... అనేవారే. కానీ ఇప్పుడు సీన్ మారిపోయింది. ఇష్టమైన, స్పష్టమైన కలలు కనవచ్చునంటున్నారు పరిశోధకులు.

ఇష్టమైన కల కందామా?

కలలు కనడం అనేది మన ఆలోచనలు, భావోద్వేగాలు, రోజంతా చూసిన విషయాలను విడుదల చేయడానికి మానవ మస్తిష్కం అనుసరించే ఒక మార్గం. అణచి పెట్టుకున్న భావోద్వేగాలు అపరిష్కృతంగా ఉన్నప్పుడు అవి కలలు రూపంలో మస్తిష్కంలోకి ప్రవేశిస్తాయి. ఒకోసారి అవి గుర్తుండవు. ఒకోసారి చాలా స్పష్టంగా గుర్తుంటాయి. అయితే మనం కన్న కలలను స్పష్టంగా గుర్తుంచుకునేలా చేయడానికి, వాటిని నియంత్రించడానికి ఒక మార్గం ఉంటే.. వ్యక్తిగత అభివృద్ధితోపాటు వైద్య చికిత్స కోసం కూడా ఉపయోగించవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

మీ కలలపై మీకు నియంత్రణ ఉందా?

చాలాసార్లు, మీరు ఎప్పుడు కలలు కంటున్నారో మీకు తెలియదు. మీరు ఎక్కువగా మేల్కొంటారు. వాస్తవం తర్వాత మీరు కలలు కంటున్నారని గ్రహిస్తారు. కొన్నిసార్లు, కలలను గుర్తుంచుకోవడం కూడా కష్టంగా ఉంటుంది. ఇది వింతగా అనిపించవచ్చు, కానీ కొన్ని మార్గాలు ఉన్నాయి.

మీరు కలలో పరిష్కరించాలనుకుంటున్న సమస్య ఉంటే, మీ విజయావకాశాలను పెంచుకోవడానికి మీరు తీసుకోవలసిన కొన్ని దశలు ఉన్నాయి. ముందుగా, పడుకునే ముందు సమస్య గురించి ఆలోచించండి. మనస్సులో దానిని ముద్రించుకునే ప్రయత్నం చేయండి. అంతేకాదు.. నిద్రపోయే ముందు మీ సమస్యను ఒక తెల్లకాగితం లేదా పుస్తకం మీద రాసుకోవడం కూడా ఉపయోగకరంగా ఉండవచ్చు. రెండవది, కలలు కంటున్నప్పుడు, పరిష్కారంపై కూడా దృష్టి పెట్టడం వల్ల సమస్యకు సమాధానం చిహ్నం లేదా రూపకంలో వస్తుంది. దానిని విశ్లేషించుకోవడం ద్వారా పరిష్కారం గురించి ఆలోచించవచ్చు.

కలలో సమస్య పరిష్కారం ఎలా??

కలలు చాలా కాలంగా కళాకారులకు, ఆవిష్కర్తలకు స్ఫూర్తినిచ్చే ప్రధాన వనరుగా ఉన్నాయి. అయితే అవి సమస్యలకు పరిష్కారాల మూలంగా కూడా ఉండగలవంటున్నారు కెకులే అనే ఒక జర్మన్ రసాయన శాస్త్రవేత్త, అతను బెంజీన్ రహస్యాలను అన్‌లాక్ చేయడానికి సంవత్సరాల తరబడి కష్టపడ్డాడు, అనేక విఫల యత్నాల తర్వాత, కెకులే చివరకు 1865లో ఒక పాము తన తోకను కొరుకుతున్నట్లు కలలు కన్నప్పుడు పురోగతి సాధించాడు. ఈ చిత్రం బెంజీన్ రింగ్–ఆకారపు అణువుగా గుర్తించడానికి అతనికి సహాయపడింది, ఇది ఆర్గానిక్ కెమిస్ట్రీ రంగంలో పెద్ద పురోగతికి దారితీసింది.

నిపుణులు కొన్ని టెక్నిక్స్ చెబుతున్నారు చూడండి.

డ్రీమ్ డైరీ

స్పష్టమైన కలలు రావాలంటే మరో మంచి మార్గం డ్రీమ్ డైరీని దగ్గరే ఉంచుకోవడం. ప్రతి రోజూ నిద్ర లేవగానే రాత్రి మీకొచ్చిన కలలో మీకు గుర్తున్నదంతా వివరంగా రాసుకోవడం వల్ల క్రమేణా కలను గుర్తుంచుకోవడానికి దోహదం చేస్తుంది.

వైల్డ్ టెక్నిక్

WILD(మేల్కొలుపు–ప్రేరిత స్పష్టమైన కలలు కనడం) టెక్నిక్ ఒక స్పష్టమైన కలని ప్రేరేపించడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి. దీన్ని ప్రాక్టీస్ చేయాలంటే పడుకునే ముందే స్పష్టమైన కలలు కనాలన్న మీ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. మీరు కలలు కంటున్న దాని గురించి ఆలోచించండి.

మంత్రంలా పఠించడం

స్పష్టమైన కలలను ప్రేరేపించడానికి జపించడం మరొక ప్రసిద్ధ పద్ధతి. పడుకునే ముందు, 'నేను కలలు కంటున్నాను' లేదా 'రేపు నాకు స్పష్టమైన కల వస్తుంది' వంటి స్పష్టమైన కలలు కనాలన్న మీ సంకల్పంపై దృష్టి పెట్టండి. మీ వాయిస్ మీ మనస్సును ఏకాగ్రతగా ఉంచడంలో సహాయపడుతుంది. మీరు నిద్రపోకుండా చేస్తుంది.

విజువలైజేషన్

స్పష్టమైన కలలను ప్రేరేపించడానికి విజువలైజేషన్ మరొక ప్రభావవంతమైన పద్ధతి. కళ్ళు మూసుకుని, మిమ్మల్ని మీరు ఊహించుకోండి. ఉదాహరణకు మీరు మరొక ప్రపంచంలోకి ఎగురుతూ లేదా తలుపు ద్వారా నడుస్తున్నట్లు ఊహించుకోండి. స్పష్టమైన కల రావాలన్న మీ లక్ష్యంపై దృష్టి పెట్టండి. సాధన మేరకు ఈ మేల్కొనే స్థితి నుంచి నేరుగా స్పష్టమైన కలలోకి ప్రవేశించగలుగుతారు.

చిన్నారులకు డైపర్.. కేర్



నేటిరోజుల్లో చిన్న పిల్లలకు డైపర్ల వాడకం తప్పనిసరి అయిపోయింది. రోజంతా వాటిని వాడకుండా ఉండటానికి ప్రయత్నించినా.. రాత్రిళ్లు మాత్రం తప్పదు. వీటివల్ల డైపర్ ర్యాషెస్ రావడం సాధారణమే. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే డైపర్ ర్యాషెస్ రాకుండా ఉంటాయి.

వేసేముందు... మార్చేటప్పుడు..

డైపర్ వేసే ముందు, డైపర్ మార్చేటప్పుడు ఒకసారి తడిగుడ్డతో తుడవాలి. లేదంటే వెట్ వైప్స్ వాడినా పరవాలేదు. చర్మం పూర్తిగా ఆరిపోయాక డైపర్ వేయండి. ఒకవేళ డైపర్ ర్యాష్ ఇదివరకే వచ్చి ఉంటే కాసేపలా వదిలేయండి.

క్రీములు

డైపర్ ర్యాషెస్ రాకుండా కొన్ని క్రీములు ముందే వైద్యులు సూచిస్తారు. వాటిని డైపర్ వేసే ముందు డైపర్ అంచులు చర్మానికి తగిలే చోట రాస్తే.. డైపర్‌కు చర్మానికి మధ్య అడ్డు పొరలాగా పనిచేస్తాయి. అలాగే ర్యాషెస్ వచ్చాక వాటిని తగ్గించే క్రీములు రాస్తే వెంటనే సమస్య తగ్గుముఖం పడుతుంది.

సరైన సైజు

ఒక్కోసారి డైపర్ మీద బరువు ప్రకారం చూపించే సైజ్.. మీ పిల్లలకు పెద్దగానో చిన్నగానో అవ్వొచ్చు. ఒక్కో బ్రాండ్ సైజ్ పిల్లలకు నప్పకపోవచ్చు కూడా. డైపర్ మరీ బిగుతుగా ఉన్నా, మరీ వదులుగా ఉన్నా, మీరు వాడుతున్న డైపర్ బ్రాండ్ మీ బిడ్డకు నప్పకపోయినా ఈ సమస్య వస్తుంది.

ఎప్పుడు మార్చాలి?

ప్రతి డైపర్ మీద దాన్ని ఎంతసేపు, ఎన్ని గంటలసేపు వాడొచ్చో రాసి ఉంటుంది. ఆ నియమం తప్పకుండా పాటించాలి. ఎక్స్‌ట్రా అబ్జర్బ్సన్ డైపర్లకు పీల్చుకునే గుణం ఎక్కువగా ఉంటుంది. వాటిని కాసేపు ఎక్కువే ఉంచొచ్చు. సాధారణ డైపర్లు కాస్త తొందరగానే మార్చేయాలి. లేదంటే అవి పిల్లలకు తడిగా అనిపించి అసౌకర్యం కలిగించడంతో పాటూ ర్యాషెస్‌కు కారణం అవుతాయి.



ఈ సీజన్‌లో... ఇవి తగ్గించండి

సీజన్ మారేకొద్దీ మనం డైట్ కూడా మార్చాలి. ఆ సీజన్‌లో కొన్ని ఫుడ్స్ తీసుకోవడం, కొన్నింటిని తీసుకోకపోవడం వంటివి చేయాలి. దీంతో ఆరోగ్య సమస్యల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు. ఇది వర్షాకాలం. ఈ సీజన్‌లో కొన్ని ఫుడ్స్ తీసుకోకపోవడమే మంచిది. అవేంటో తెలుసుకుందాం.



ఫ్రూట్ సలాడ్.

మార్కెట్లో చాలా మంది ఫ్రూట్స్‌ని కట్ చేసి ఇస్తారు. వీటిని తీసుకోవడం తగ్గించాలి. వారు ఎలా నిల్వ చేస్తున్నారో తెలియదు. ఇందులో బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంది. దీనివల్ల ఇన్ఫెక్షన్స్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, ఇలాంటి వాటిని ఇంట్లోనే తయారు చేసుకుంటే మంచిది.



ఆకుకూరలు..

ఆకుకూరలు ఆరోగ్యానికి చాలా మంచివి. అయితే పాలకూర, క్యాబేజీ వంటి వాటి వాడకాన్ని వర్షాకాలంలో తగ్గిస్తే మంచిది. ఇందులో బ్యాక్టీరియా, పారాసైట్స్ పెరగడమే ఇందుకు కారణం. దీనివల్ల జీర్ణ సమస్యలు, ఇన్ఫెక్షన్స్ వస్తాయి. ఒకవేళ వీటిని తినాలనుకుంటే చక్కగా కడిగి ఉడికించి వండితే రిస్క్ తగ్గుతుంది.

నిల్వ ఉన్న ఆహారం

కొన్నిసార్లు మన ఇంట్లో ఆహారం మిగిలిపోతుంది. దీనిని ఎక్కువ సమయం స్టోర్ చేసి తినడం తగ్గించాలి. ఎందుకంటే ఈ టైమ్‌లో తేమ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఫుడ్ పాయిజన్‌లా మారే అవకాశం ఉంది. అందుకనే ఈ ఫుడ్‌ని తీసుకోకుండా ఉండటం చాలా మంచిది.



డెయిరీ ఉత్పత్తులు

డెయిరీ ప్రోడక్ట్స్ అయిన పాలు, చీజ్, పనీర్ కూడా ఈ టైమ్‌లో తక్కువగా తీసుకోవాలి. దీనికి కారణం వీటిని ఎక్కువగా తీసుకుంటే ఫుడ్ పాయిజనింగ్ అయ్యే అవకాశం ఉంది. వీటిని తీసుకున్నప్పుడు కూడా సరిగ్గా పాశ్చరైజ్ అయ్యాయా, ఎక్స్‌పైర్ డేట్ ఎప్పటివరకూ ఉందనేది తెలుసుకుని తీసుకోవాలి. లేదంటే వీటి బదులు పెరుగు, పాలని తీసుకోవచ్చు.



వేపుళ్లు, జంక్ ఫుడ్

చల్లని వాతావరణంలో చాలా మంది సమోసా, పకోడి వంటి ఫ్రై ఐటమ్స్ ఎక్కువగా తింటారు. అయితే, వీటిని మనం ఇంట్లోనే చేసుకోవచ్చు. అది కూడా తక్కువగా తినాలి. లేదంటే జీర్ణ సమస్యలు వస్తాయి. బయట చేసే ఈ ఫుడ్స్‌లో ఏ నూనె కలుస్తుందో తెలియదు కాబట్టి అలాంటి వాటి జోలికి పోకుండా ఉండటం చాలా ఉత్తమం.



స్ప్రౌట్స్..

మొలకల్లో ఎన్నో అద్భుత గుణాలు ఉన్నాయి. కానీ, వీటిలో ఈ సమయంలో బ్యాక్టీరియా, ఫంగస్ ఉండే అవకాశం ఉంది. వర్షాకాలంలో వీటిని ఎక్కువగా తీసుకుంటే ఫుడ్ పాయిజనింగ్ అయ్యే అవకాశం ఉంది. వీటిని తినాలనుకుంటే చక్కగా క్లీన్ చేసి తినాలి.

ఆరోగ్య పత్రం



బిర్యానీ అంటే ఇష్టపడని వారుండరు. బిర్యానీకి మంచి ఫ్లేవర్‌ని ఇచ్చేది బిర్యానీ ఆకులో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. అయితే ఉప్మాలో కరివేపాకులా బిర్యానీలో వచ్చే బిర్యానీ ఆకును ఏరిపారేయడమే కానీ వీటిని తీసుకోవడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయని తెలుసా?

బిర్యానీ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్, ఫైబర్స్ ఉన్నాయి. ఇవన్నీ ఆరోగ్యానికి చాలా మంచిది. దీనిని రెగ్యులర్‌గా తీసుకుంటే కడుపు నొప్పి, జలుబు, తలనొప్పి వంటి సమస్యల్ని దూరం చేస్తాయి. వీటితో ఇంకేం లాభాలున్నాయంటే..

డీ టాక్సిఫికేషన్

మూత్ర సంబంధిత సమస్యలు దూరమవుతాయి. బాడీ టాక్సిసిటీ తగ్గుతుంది. కిడ్నీలో రాళ్ళ సమస్య తగ్గుతుంది.

యాంటీ క్యాన్సర్ గుణాలు..

బిర్యానీ ఆకుల్లో యాంటీ క్యాన్సర్ గుణాలు ఉన్నాయి. వీటిని తీసుకోవడం వల్ల బాడీలోని క్యాన్సర్ సెల్స్ తగ్గుతాయి. దీంతో క్యాన్సర్ వంటి సమస్యల్ని ముందునుంచే తగ్గించుకోవచ్చు. అంతేకాదు. వీటిలో ఉండే విటమిన్ సి, విటమిన్ ఈ, కెరోటినాయిడ్స్ బ్లడ్ కొలెస్ట్రాల్, యూరిక్ యాసిడ్ లెవల్స్‌ని తగ్గిస్తాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు, ఫైటోకెమికల్స్ ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని తగ్గిస్తాయి. దీంతో పాటు లివర్, కడుపు సంబంధిత సమస్యల్ని దూరం చేస్తాయి.

డయాబెటిస్..

బిర్యానీ ఆకులో ఉండే ఫైటో కెమికల్స్ షుగర్ ఉన్న వారికి చాలా మంచిది. దీనిని తీసుకుంటే టైప్ 2 డయాబెటిస్ తగ్గుతుంది.

గుండె ఆరోగ్యానికి..

పరిశోధనల ప్రకారం బిర్యానీ ఆకుల్లోని కొన్ని ఆర్గానిక్ కాంపౌండ్స్ గుండె గోడలను ఆరోగ్యంగా ఉంచుతాయి. చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దీంతో గుండె సమస్యలు తగ్గుతాయి.

ఎలా తీసుకోవాలి?

బిర్యానీ ఆకుల్ని టీలా చేసుకుని తాగొచ్చు. దీనికోసం నీటిలో బిర్యానీ ఆకుల్ని వేసి మరిగించి తాగొచ్చు. అందులో దాల్చిన చెక్క వేస్తే మరీ మంచిది.

సినిమా

కాకినాడలో మట్కా

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వంలో డా. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ సినిమాలో నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ తాజా షెడ్యూల్ కాకినాడలో జరుగుతోంది. "మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'మట్కా'. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమాలో వరుణ్ డిఫరెంట్ మేకోవర్‌లలో కనిపించనున్నారు. ప్రస్తుతం కాకినాడలో జరుగుతున్న షెడ్యూల్‌లో కీలక తారాగణంపై టాకీ పార్ట్‌తో పాటు యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం" అని చిత్ర యూనిట్ పేర్కొంది. నవీన్ చంద్ర, సలోని, అజయ్ ఘోష్, కన్నడ కిశోర్, రవీంద్ర విజయ్, పి. రవి శంకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: ఎ. కిశోర్ కుమార్.



● వరుణ్ తేజ్

ఆరు వారాలు విశ్రాంతి



● రవితేజ

స్క్రీన్‌పై జోష్‌గా కనిపించే రవితేజ సినిమాలు చేయడంలోనూ అంతే జోష్‌గా ఉంటారు. ఏడాదికి మూడు నాలుగు సినిమాలు చేస్తూ బిజీగా ఉంటుంటారు. కాగా ఈ బిజీ షెడ్యూల్‌కి ఆరు వారాలు బ్రేక్ పడింది. కొన్నాళ్లుగా రవితేజ తన 75వ చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా కోసం ఈ మధ్య యాక్షన్ సీన్ చేస్తుండగా రవితేజ కుడి చేతికి గాయం అయింది. కండరం చిట్లినా లెక్క చేయకుండా షూటింగ్ చేస్తుండటంతో గాయం పెద్దదైందట. చివరికి శస్త్ర చికిత్స వరకు దారి తీసింది. హైదరాబాద్‌కి చెందిన ఓ ఆస్పత్రిలో గురువారం ఆయనకు సర్జరీ జరిగింది. సర్జరీ విజయవంతంగా జరిగిందని, ఈ గాయం తగ్గడానికి ఆరు వారాలు పడుతుందని, పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారని పీఆర్ టీమ్ పేర్కొంది. దాంతో రవితేజ 75వ చిత్రం షూటింగ్‌కి తాత్కాలిక బ్రేక్ పడింది. భాను భోగవరపు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రవితేజ సరసన శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు.

సూపర్ యోధ సాహసాలు



● తేజ సజ్జ

'హను–మాన్' సినిమాతో పాన్ ఇండియా హిట్ అందుకున్న హీరో తేజ సజ్జ నటిస్తున్న తాజా పాన్ ఇండియా మూవీ 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మనోజ్ మంచు, రితికా నాయక్ నటిస్తున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం (ఆగస్టు 23) తేజ సజ్జ పుట్టినరోజు సందర్భంగా 'మిరాయ్' నుంచి కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. "యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందుతోన్న ఈ సినిమాలో తేజ సూపర్ యోధ పాత్రలో కనిపిస్తారు. ఈ సినిమా కోసం చాలా కష్టపడుతున్నారు తేజ" అని చిత్రబృందం పేర్కొంది. 2025 ఏప్రిల్ 18న ఎనిమిది భాషల్లో 2 డి, 3డి వెర్షన్‌లలో 'మిరాయ్' విడుదల కానుంది.

నా ప్రేమతో నిశ్చితార్థం

– మేఘా ఆకాశ్

హీరోయిన్ మేఘా ఆకాశ్ పెళ్లి పీటలు ఎక్కనున్నారు. సాయి విష్ణుతో ఆమె త్వరలో ఏడడుగులు వేయనున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం గురువారం జరిగింది. ఇందుకు సంబంధించిన ఫొటోల్ని తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసి, "నా జీవితంలోని ప్రేమ (సాయి విష్ణుతో ప్రేమని ఉద్దేశించి) తో నిశ్చితార్థం జరిగింది" అని పేర్కొన్నారు మేఘా ఆకాశ్. నితిన్ హీరోగా నటించిన 'లై' (2017) సినిమాతో తెలుగులో హీరోయిన్‌గా పరిచయమయ్యారు మేఘా ఆకాశ్. ఆ తర్వాత 'ఛల్ మోహన్ రంగ, రాజరాజ చోర, డియర్ మేఘ, గుర్తుందా శీతాకాలం, ప్రేమదేశం, రావణాసుర, బూ, మనుచరిత్ర' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారామె. హిందీ, తమిళ సినిమాల్లోనూ నటించిన ఈ చెన్నై బ్యూటీ పెళ్లి గురించి గతంలో పలు పుకార్లు వచ్చాయి. తమిళనాడుకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడి కొడుకుతో ఆమె వివాహం జరగనుందంటూ వార్తలు హల్‌చల్ చేస్తుండగానే.. ఎలాంటి హడావిడి లేకుండా విష్ణుతో నిశ్చితార్థం చేసుకున్నారు మేఘ. అయితే పెళ్లి తేది నిర్ణయించలేదు. ఇదిలా ఉంటే మేఘాతో ఏడడుగులు వేయబోయే విష్ణు ఎవరు? తన నేపథ్యం ఏంటి? వంటివి తెలియాల్సి ఉంది.



● సాయి విష్ణు, మేఘా ఆకాశ్

ఏఆర్ఎమ్ నాకో పెద్ద సవాల్

– కృతీ శెట్టి



యువ కథానాయికల్లో వరుస సినిమాలతో దూసుకెళుతున్న వారిలో కృతీ శెట్టి ఒకరు. ఈ బ్యూటీ 'అజయంతె రండం మోషనుమ్' (ఏఆర్ఎమ్) చిత్రంతో మలయాళ చిత్ర పరిశ్రమకు పరిచయం కానున్నారు. వచ్చే నెల 12న ఈ చిత్రం విడుదల కానుంది. మలయాళం సినిమా చేసిన అనుభవం గురించి కృతీ శెట్టి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ – "1900, 1950, 1990.... ఈ మూడు కాలాల్లో ఈ సినిమా సాగుతుంది. ఇలాంటి సినిమాలో నటించడం అనేది ఒక మంచి అవకాశం. ఈ చిత్రంలో పూర్తి మలయాళీ గ్రామీణ అమ్మాయిలా కనిపిస్తాను. నటన పరంగా చాలా నేచురల్‌గా ఉండాలి. చిన్న చిన్న హావభావాలతో చెప్పాల్సినదంతా చెప్పాలి. ఆ పరంగా ఇప్పటివరకూ నటించినదానికి పూర్తి భిన్నంగా అనిపించింది. అదొక సవాల్ అయితే మలయాళ భాష నేర్చుకోవడం మరో సవాల్. ఇక ఒక్కోసారి 36 నుంచి 38 గంటలు కంటిన్యూస్‌గా షూటింగ్ చేసేవాళ్లం. నాకంటే కార్‌వేన్ ఉంటుంది కాబట్టి షాట్ గ్యాప్‌లో అందులో విశ్రాంతి తీసుకునేదాన్ని. అలాగే నా పాత్ర షూట్ పూర్తి కాగానే వెళ్లిపోయేదాన్ని. కానీ, షూటింగ్ మొత్తం పూర్తయ్యాక అన్నీ సర్దుకుని వెళ్లడానికి కొందరు సాంకేతిక నిపుణులకు టైమ్ పట్టేది. మరుసటి రోజు మాకన్నా ముందు సెట్లో ఉండేవాళ్లు. అలాగే ఈ చిత్రం హీరో టొవినో థామస్‌లో 36 గంటలు షూట్ చేసినా అలసట కనిపించేది కాదు. ఇలా ఈ సినిమా టీమ్ ఇన్‌స్పయిరింగ్‌గా అనిపించింది" అన్నారు.

రాజావారు రాణిగారు ఒక్కటయ్యారు



● కిరణ్, రహస్య

'రాజావారు రాణిగారు' (2019) సినిమాతో హీరో హీరోయిన్లుగా పరిచయమైన కిరణ్ అబ్బవరం, రహస్య గోరక్ ఓ ఇంటివారయ్యారు. కర్ణాటకలోని కూర్గ్‌లో గురువారం రాత్రి వీరి వివాహం జరిగింది. 'రాజావారు రాణిగారు' సినిమాలో కలిసి నటించిన కిరణ్ అబ్బవరం, రహస్య గోరక్ మధ్య ఏర్పడిన స్నేహం ఆ తర్వాత ప్రేమగా మారింది. వీరి ప్రేమకు ఇరు కుటుంబ పెద్దలు పచ్చజెండా ఊపడంతో ఈ ఏడాది మార్చిలో నిశ్చితార్థం జరిగింది. తాజాగా ఏడడుగులతో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. ఓ రిసార్ట్‌లో ఇరు కుటుంబ సభ్యులు, సన్నిహితులు, మిత్రుల సమక్షంలో వీరి వివాహం జరిగింది. కాగా 'ఎస్ఆర్ కల్యాణ మండపం, సమ్మతమే, నేను మీకు బాగా కావాల్సినవాడిని, వినరో భాగ్యము విష్ణుకథ, రూల్స్ రంజన్' వంటి చిత్రాలతోమంచి గుర్తింపు సొంతం చేసుకున్నారు కిరణ్ అబ్బవరం. ప్రస్తుతం ఆయన హీరోగా నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ మూవీ 'క' విడుదలకు ముస్తాబవుతోంది.

నా శక్తి అదే!



● అజయ్

"సంగీతదర్శకుడిగా అన్ని రకాల సినిమాలు చేయాలని ఉంది. అయితే చిన్నప్పట్నుంచి కమర్షియల్ సినిమాలు ఎక్కువగా చూస్తూ పెరిగాను కాబట్టి ఆ తరహా చిత్రాలకు మ్యూజిక్ ఇవ్వాలని ఉంటుంది" అన్నారు అజయ్ అరసాడ. ఇటీవల విడుదలైన 'ఆయ్' చిత్రానికి మూడు పాటలు, నేపథ్య సంగీతం అందించారాయన. ఈ సందర్భంగా అజయ్ అరసాడ మాట్లాడుతూ – "'జగన్నాటకం' (2014) సినిమాతో సంగీత దర్శకుడిగా పరిచయం అయ్యాను. ఆ తర్వాత 'కిరాక్, నేడే విడుదల, క్షీరసాగర మదనం, శ్రీరంగ నీతులు, మిస్సింగ్' చిత్రాలకు సంగీత దర్శకుడిగా చేశాను. ఈ చిత్రాలతో మంచి గుర్తింపు వచ్చింది. 'ఆయ్'తో మరో మెట్టు ఎక్కాను. ఈ సినిమాలోని ఐటమ్ సాంగ్, ప్రీ క్లైమాక్స్ సాంగ్, టైటిల్ సాంగ్‌కి ఇచ్చిన ట్యూన్స్‌కి, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కి మంచి పేరొచ్చింది. నేపథ్య సంగీతం చాలా ప్లస్ అయ్యిందని చిత్రనిర్మాత 'బన్నీ' వాసు కూడా అన్నారు. నిజానికి నాకు నేపథ్య సంగీతం అంటే చాలా ఆసక్తి, నా శక్తి కూడా అదే. ప్రస్తుతం 'వికట కవి' అనే వెబ్ సిరీస్, 'రాజమండ్రి రోజ్ మిల్క్' అనే ప్రేమకథా చిత్రానికి సంగీతం అందిస్తున్నాను" అని చెప్పారు.

పసందైన పాటలతో...

"'ఎమ్4ఎమ్' సినిమాతో ప్రతిభావంతుడైన మ్యూజిక్ డైరెక్టర్ వసంత్‌ని పరిశ్రమకి పరిచయం చేయడం సంతోషంగా ఉంది. ఈ సినిమా సంగీతం చాలా పసందుగా ఉంటుంది. నేపథ్య సంగీతం నెక్ట్స్ లెవల్‌లో ఉంటుంది" అని మోహన్ వడ్లపట్ల అన్నారు. సంబీత్ ఆచార్య, జో శర్మ జంటగా నటించిన చిత్రం 'ఎమ్4ఎమ్' (మోటివ్ ఫర్ మర్డర్). 'మల్లెపువ్వు, మెంటల్ కృష్ణ, కలవరమాయే మదిలో' వంటి చిత్రాలను నిర్మించిన మోహన్ వడ్లపట్ల దర్శకత్వం వహించిన సినిమా 'ఎమ్4ఎమ్'. మోహన్ మీడియా క్రియేషన్స్, జో శర్మ మెక్విన్ గ్రూప్‌పై రూపొందిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటోంది. ఈ మూవీ నుంచి మ్యూజిక్ స్పెషల్ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు వసంత్ ఇసైపెట్టై మాట్లాడుతూ– "నాకు ఇంత పెద్ద అవకాశం ఇచ్చిన మోహన్ వడ్లపట్లగారికి కృతజ్ఞతలు. మ్యూజిక్ లవర్స్‌కి ఈ సినిమా బాగా నచ్చుతుంది" అని పేర్కొన్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళంలో ఈ చిత్రం రిలీజ్ కానుంది.



● జో శర్మ, సంబీత్ ఆచార్య

సాక్షి బిజినెస్
శనివారం
24-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
33	12
81,086	24,823

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,827	▲ 208
డోజోన్స్	41,021	▲ 308
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,328	▲ 40
డాక్స్	18,633	▲ 140
షాంఘై	2,854	▲ 6
నికాయ్	38,364	▲ 153

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,424 ▼	175
బంగారం (99.5 స్వచ్ఛత)	71,138 ▼	174
వెండి (కేజీ)	84,615 ▼	205

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.53	84.55
£	బ్రిటన్ పౌండ్	108.82	111.43
€	యూరో	92.30	94.70
¥	జపాన్ ఎన్ (100)	57.08	58.38
AUS	ఆస్ట్రేలియా డాలర్	55.47	57.42
S$	సింగపూర్ డాలర్	61.98	66.43
SAR	సౌదీ రియాల్	21.48	23.03
UAE D	యూఏఈ దిర్హామ్	21.96	23.74
¥	చైనా యువాన్	10.88	12.71

మూతబడిన కెన్‌కో!

నిధుల కొరత కారణం



ముంబై: ఆర్థిక, నిర్వహణపరమైన సంక్షోభాలతో హెల్త్‌కేర్ స్టార్టప్ సంస్థ రెడ్‌క్లిఫ్ హెల్త్‌టెక్ (కెన్‌కో హెల్త్) మూతబడినట్లు సమాచారం. 2019 నుంచి స్థిరంగా వృద్ధి బాటలో పురోగమిస్తున్నప్పటికీ నిధుల కొరత, బీమా లైసెన్సు పొందడంలో వైఫల్యం కారణంగా నిర్వహణ పరిస్థితులు కష్టతరం కావడం వంటి అంశాలు సంస్థ మూసివేతకు దారి తీసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కొందరు ఉద్యోగులకు మూణ్నెల్ల నుంచి జీతభత్యాలు లేవని పేర్కొన్నాయి. రూ. 9 కోట్ల మేర సొంత నిధులను ఇన్వెస్ట్ చేసినప్పటికీ పరిస్థితులు మెరుగుపడలేదని జూలై, ఆగస్టుల్లో ఉద్యోగులకు రాసిన లేఖల్లో సంస్థ వ్యవస్థాపకులు అనిరుద్ధ సేన్, ధీరజ్ గోయల్ తెలిపారు.

హైదరాబాద్‌లో పిడిలైట్ కొత్త ప్లాంటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అడెసివ్స్ తయారీ దిగ్గజం పిడిలైట్ ఇండస్ట్రీస్ నూతన ప్లాంటును హైదరాబాద్ సమీపంలోని జడ్చర్ల వద్ద ప్రారంభించింది. టైల్ అడెసివ్ బ్రాండ్ రాఫ్ ఉత్పత్తులను ఇక్కడ తయారు చేస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఈశాన్య కర్ణాటక ప్రాంతాల్లో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఈ కేంద్రం కీలకంగా ఉంటుందని కంపెనీ శుక్రవారం తెలిపింది. ఏపీ, తెలంగాణ విపణిలో ప్రీమియం, ప్రత్యేక ఉత్పత్తుల వినియోగం స్థిరంగా పెరుగుతోందని పిడిలైట్ ఎండీ భరత్ పురీ తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

డిపాజిట్లు తగ్గడం సవాలు కాదు: ఎస్‌బీఐ చీఫ్ | సిమెంటు పరిశ్రమలో భారీ పెట్టుబడులు

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-8-2024	
విశాఖ	505–00
చిత్తూరు	508–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	485–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	450–00
వరంగల్	452–00
రిటైల్ ధర	5.10

ఆకాశ వీధిలో బడ్జెట్ ఎయిర్‌లైన్స్‌దే హవా



దేశీయంగా సీట్ల సామర్థ్యంలో 71% వాటా • అగ్రస్థానంలో ఇండిగో

దేశీయంగా చౌక విమానయాన సంస్థల (బడ్జెట్ ఎయిర్‌లైన్స్-ఎల్‌సీసీ) హవా కొనసాగుతోంది. అంతర్జాతీయ ట్రావెల్ డేటా సంస్థ ఓఏజీ తాజా గణాంకాల ప్రకారం ఎల్‌సీసీల మార్కెట్ వాటా అత్యధికంగా ఉన్న టాప్ 10 దేశాల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. మొత్తం సీట్ల సామర్థ్యంలో ఇండిగో సారథ్యంలోని ఎల్‌సీసీలకు ఏకంగా 71 శాతం వాటా ఉంది. అంతర్జాతీయంగా చూస్తే భారత్‌కు సమీప పోటీదారు ఇండోనేసియాలో ఇది 64 శాతమే. ఈ విషయంలో అంతర్జాతీయ సగటు 34 శాతంగానే ఉంది. ప్రపంచంలోనే టాప్‌లో ఉన్న నాలుగు విమానయాన సంస్థలు ఎల్‌సీసీలే కావడం గమనార్హం. సౌత్‌వెస్ట్, రయాన్‌ఎయిర్, ఇండిగో, ఈజీజెట్ ఈ లిస్టులో ఉన్నాయి. 2019 నుంచి అంతర్జాతీయంగా ఎల్‌సీసీల వాటా 13 శాతం మేర పెరిగింది.

సంపన్న దేశాలు, చైనాలో ఎఫ్‌ఎస్‌సీలు ..

ఇతర దేశాలను చూసినప్పుడు, అతి పెద్ద ఎయిర్‌లైన్స్ మార్కెట్లలో ఒకటైన చైనాలో ఫుల్ సర్వీస్ ఎయిర్‌లైన్స్‌దే (ఎఫ్‌ఎస్‌సీ) హవా ఉంటోంది. అక్కడ ఎల్‌సీసీల మార్కెట్ వాటా కేవలం 12 శాతమే. ఇక బ్రిటన్ మార్కెట్‌లో పరిస్థితి కాస్త అటూ ఇటుగా ఉంది. ఎఫ్‌ఎస్‌సీలతో పోలిస్తే ఎల్‌సీసీలకు కాస్త మొగ్గు ఎక్కువగా ఉంది. రయాన్‌ఎయిర్, ఈజీజెట్, విజ్ ఎయిర్ వంటి ఎల్‌సీసీలు అక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఎఫ్‌ఎస్‌సీలతో పోలిస్తే ఎల్‌సీసీల మార్కెట్ వాటా ఎక్కువగా ఉన్న దేశాలను పరిశీలిస్తే లాటిన్ అమెరికాలో బ్రెజిల్, యూరప్‌లో ఇటలీ, స్పెయిన్ మొదలైనవి ఉన్నాయి. అమెరికా, జర్మనీ, జపాన్ వంటి సంపన్న దేశాల్లో ఎఫ్‌ఎస్‌సీలదే ఆధిపత్యం ఉంటోంది. ఫుల్ సర్వీస్ క్యారియర్లు ఇంకా కరోనా పూర్వ స్థాయికి కోలుకోవాల్సి ఉంది. ఇండిగో భారీగా విస్తరించడం భారత్‌లో ఎల్‌సీసీల మార్కెట్ వాటా వృద్ధికి దోహదపడింది. ఈ ఏడాది జూలై గణాంకాల ప్రకారం దేశీ ప్యాసింజర్ మార్కెట్లో ఇండిగో సంస్థకు 62 శాతం వాటా ఉంది. ఎల్‌సీసీ విభాగంలో పూర్తి ఆధిపత్యం కొనసాగిస్తోంది.

ఇతర ఆదాయంపరంగా సవాళ్లు..

మార్కెట్ వాటాను విస్తరించుకుంటున్నప్పటికీ దేశీయంగా ఎల్‌సీసీలు అనుబంధ ఆదాయాలను మాత్రం పెంచుకోలేకపోతున్నాయి. సీట్లను బట్టి ఫీజులు, ఆహారం, స్పెషల్ చెకిన్‌లు, సీట్ అప్‌గ్రేడ్‌లు, ఎక్స్‌ట్రా లగేజీ చార్జీలపరమైన ఆదాయం అంతంతే ఉంటోంది. దీన్ని పెంచుకునే అవకాశాలు పరిమితంగానే కనిపిస్తున్నాయి. 2022లో ఇండిగో మొత్తం ఆదాయంలో ఇతరత్రా అనుబంధ ఆదాయం వాటా 7.1 శాతమే. ఈ విషయంలో మొత్తం 64 ఎయిర్‌లైన్స్‌లో ఇండిగో 54వ స్థానంలో ఉంది. అదే అంతర్జాతీయంగా టాప్ 10 ఎల్‌సీసీలను చూస్తే .. రయాన్‌ఎయిర్ గ్రూప్ ఆదాయాల్లో అనుబంధ ఆదాయం వాటా 35.7 శాతంగా ఉంది. అదే ఈజీజెట్‌ను చూస్తే ఇది 33.9 శాతంగా, సౌత్‌వెస్ట్ విషయంలో 24.9 శాతంగా ఉంది. ఈ విషయంలో ఇండిగో ఎక్కడో వెనకాల ఉండటం గమనార్హం.

– సాక్షి, బిజినెస్ డెస్క్

పీఎన్‌బీ హౌసింగ్ వాటా విక్రయం



న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఏషియా అపర్చునిటీస్ వి(మారిషస్) తాజాగా పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్‌కు చెందిన 3% వాటాను విక్రయించింది. షేరుకి రూ. 866.70 ధరలో బీఎస్‌ఈ బల్క్ డీల్ ద్వారా 78 లక్షల షేర్లను అమ్మివేసింది. తద్వారా రూ. 676 కోట్లు అందుకుంది. వీటిలో 16.6 లక్షల షేర్ల(0.64% వాటా)ను దాదాపు రూ. 144 కోట్లు వెచ్చించడం ద్వారా సింగపూర్ ప్రభుత్వం సొంతం చేసుకుంది. ఈ లావాదేవీ తదుపరి పీఎన్‌బీ హౌసింగ్‌లో ఏషియా అపార్చునిటీస్ వాటా 5.19% నుంచి 2.19 శాతానికి క్షీణించింది.

టాటా టెక్‌లో వాటా అమ్మకం



న్యూఢిల్లీ: ఇంజినీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ కంపెనీ టాటా టెక్నాలజీస్‌లో సింగపూర్ సంస్థ అల్ఫా టీసీ హోల్డింగ్స్ 2.44% వాటా విక్రయించింది. బీఎస్‌ఈ బల్క్ డీల్ ప్రకారం షేరుకి రూ. 1013.91 సగటు ధరలో 99 లక్షలకుపైగా షేర్లను అమ్మింది. తద్వారా దాదాపు రూ. 1,005 కోట్లు అందుకుంది. దీంతో కంపెనీలో అల్ఫా టీసీ వాటా 4.34% నుంచి 1.9 శాతానికి దిగివచ్చింది. డీల్ వివరాలు వెల్లడికాలేదు. కాగా.. ఈ ఏడాది తొలి క్వార్టర్‌లో టాటా టెక్నాలజీస్ కన్సాలిడేటెడ్ నికర లాభం 15 శాతం క్షీణించి రూ. 162 కోట్లకు పరిమితమైంది.

అనిల్ అంబానీకి సెబీ షాక్



సెక్యూరిటీల మార్కెట్ నుంచి నిషేధం • మరో 24 సంస్థలపైనా ఐదేళ్లపాటు వేటు • రూ. 624 కోట్ల జరిమానాలు

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా పారిశ్రామికవేత్త అనిల్ అంబానీపై నిషేధం విధించింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్) నుంచి నిధులను అక్రమంగా తరలించడం లేదా వినియోగించడం చేసినందుకు ఐదేళ్లపాటు సెక్యూరిటీల మార్కెట్ల నుంచి దూరం పెట్టింది. అనిల్‌సహా ఇందుకు సహకరించిన మరో 24 సంస్థలు, వ్యక్తులను సైతం నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్‌కు రూ. 6 లక్షలతో పాటు రూ. 25 కోట్ల జరిమానా చెల్లించవలసిందిగా అనిల్‌ను ఆదేశించింది. మిగిలిన 24 సంస్థలు, వ్యక్తులకు రూ. 21–25 కోట్ల మధ్య జరిమానాలు విధించింది.

పలు ఫిర్యాదులు

ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నుంచి నిధుల అక్రమ మళ్లింపు, దుర్వినియోగంపై పలు ఫిర్యాదులు అందడంతో సెబీ దర్యాప్తును చేపట్టింది. నిజాలను నిగ్గు తేల్చేందుకు 2018–19 ఆర్థిక సంవత్సరం లావాదేవీలను పరిశోధించింది. దర్యాప్తులో భాగంగా ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ కీలక యాజమాన్య వ్యక్తులు(కేఎంపీలు) అక్రమ వ్యవహారాలలో అనిల్ అంబానీకి సహకరించినట్లు గుర్తించింది. అమిత్ బాప్న, రవీంద్ర సుధాల్కర్, పింకేష్ ఆర్.షా నిధుల అక్రమ మళ్లింపునకు తోడ్పాటునిచ్చినట్లు తేల్చింది. అనిల్ అంబానీకి చెందిన సంస్థలకు రుణాల రూపేణా నిధులను తరలించినట్లు సైతం గుర్తించింది. అయితే ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ డైరెక్టర్ల బోర్డు ఇలాంటి అక్రమ రుణాలను వ్యతిరేకిస్తూ ఆదేశాలు జారీ చేసినప్పటికీ కంపెనీ యాజమాన్యం వీటిని పెడచెవిన పెట్టింది. వెరసి కార్పొరేట్ పాలనకు పాతరేసినట్లు సెబీ పేర్కొంది. ఇందుకు ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్‌ను మాత్రమే అభిశంసించలేమని, అక్రమాలకు పాల్పడిన వారంతా బాధ్యులేనని తెలియజేసింది. ఈ నేపథ్యంలో అక్రమంగా రుణాలందుకోవడం లేదా నిధుల చట్టవిరుద్ధ మళ్లింపునకు ఆయా సంస్థలు కీలక పాత్ర పోషించినట్లు వెల్లడించింది. అనిల్ అంబానీ అడాగ్ చైర్‌పర్సన్‌గా భారీ పరోక్ష వాటాతో ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్‌ను అక్రమరీతిలో వినియోగించుకున్నట్లు పేర్కొంది. 222 పేజీల ఆర్డర్‌లో సెబీ.. ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ నుంచి వందల కోట్ల సొమ్మును ప్రమోటర్ల సంబంధిత సంస్థలకు అక్రమ రుణాలు, తదితర మార్గాలలో మళ్లించినట్లు వివరించింది. ఈ సంస్థలు రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో సొంత రుణ చెల్లింపుల్లో ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ విఫలమైనట్లు తెలియజేసింది. ఇది ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం కంపెనీ రిజల్యూషన్‌కు దారితీసినట్లు వివరించింది. ఫలితంగా 9 లక్షలమంది వాటాదారులు తీవ్రంగా నష్టపోయినట్లు పేర్కొంది. బాప్నపై రూ. 27 కోట్లు, సుధాల్కర్‌పై రూ. 26 కోట్లు, షాపై రూ. 21 కోట్లు చొప్పున సెబీ జరిమానా విధించింది. రిలయన్స్ యూనికార్న్, ఎక్స్ఛేంజ్ నెక్ట్స్, కమర్షియల్ ఫైనాన్స్, క్లీన్‌జెన్, బిజినెస్ బ్రాడ్‌క్యాస్ట్ న్యూస్ హోల్డింగ్స్, బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌లకు రూ. 25 కోట్లు చొప్పున జరిమానా విధించింది. వెరసి మొత్తం రూ. 624 కోట్ల జరిమానాలు సెబీ విధించింది.

అడాగ్ షేర్లపై అమ్మకాల పిడుగు

10-5 శాతం మధ్య పతనం

సెబీ చర్యల నేపథ్యంలో అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్(అడాగ్) షేర్లలో ఒక్కసారిగా అమ్మకాలు ఊపందుకున్నాయి. దీంతో అడాగ్ కౌంటర్లు 10–5% మధ్య పతనమయ్యాయి. అనిల్‌తోపాటు ఇతర 24 సంస్థలు, వ్యక్తులపై సైతం సెబీ నిషేధం, జరిమానా విధింపు సెంటిమెంటును దెబ్బతీసినట్లు నిపుణులు పేర్కొన్నారు. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ షేరు 10% కుప్పకూలి రూ. 212 దిగువన నిలవగా.. ఎన్‌ఎస్‌ఈలో 11% దిగజారి రూ. 210కు చేరింది. ఈ బాటలో రిలయన్స్ పవర్ 5% పతనమై రూ. 34.5 వద్ద, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ 5% లోయర్ సర్క్యూట్‌ను తాకి రూ. 4.46 వద్ద ముగిశాయి.

సెబీ చర్యలకు కారణం- సాక్షి ప్లస్‌లో

మార్కెట్లు అక్కడక్కడే



ఆటుపోట్ల మధ్య స్వల్ప లాభాలు

ముంబై: దేశీ స్టాక్ మార్కెట్లు ఆటుపోట్ల మధ్య స్వల్ప లాభాలతో నిలిచాయి. సెన్సెక్స్ 33 పాయింట్లు బలపడి 81,086 వద్ద, నిఫ్టీ 12 పాయింట్లు పెరిగి 24,823 వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 170 పాయింట్ల నష్టం, 178 పాయింట్ల లాభాన్ని నమోదు చేసింది. జాక్సన్ హోల్ వద్ద యూఎస్ ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ ప్రసంగంపై దృష్టిపెట్టిన మార్కెట్లు స్వల్ప పరిధిలోనే కదిలినట్లు నిపుణులు పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఈలో ఆటో రంగం మాత్రమే లాభపడింది. రియల్టీ అధికంగా 2.4 శాతం తగ్గింది. బీఎస్‌ఈలో మిడ్ క్యాప్ 0.7 శాతం క్షీణించింది. ట్రేడైన షేర్లలో 2,018 లాభపడితే 1,939 నష్టపోయాయి.

నిఫ్టీలోకి ట్రెంట్

కీలకమైన నిఫ్టీ 50 సూచీలో రెండు కొత్త స్టాక్స్ చోటు దక్కించుకోనున్నాయి. దివీస్ ల్యాబొరేటరీస్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీని తప్పించి వాటి స్థానంలో టాటా గ్రూప్ సంస్థ ట్రెంట్ లిమిటెడ్, ప్రభుత్వ రంగ భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్)ని చేర్చనున్నారు. సెప్టెంబర్ 30 నుంచి ఈ మార్పులు అమల్లోకి వస్తాయి. దివీస్ మొదలైన వాటికి నిఫ్టీ నెక్ట్స్50 ఇండెక్స్‌లో చోటు లభిస్తుంది. ఇతరత్రా నిఫ్టీ 200, నిఫ్టీ 500 తదితర సూచీల్లోనూ ఎన్‌ఎస్‌ఈ కొన్ని మార్పులు చేసింది.

ఎకోస్ ఇండియా @ రూ. 318–334

అద్దెకు కార్లు, ఉద్యోగుల తరలింపు సర్వీసుల కంపెనీ ఎకోస్(ఇండియా) మొబిలిటీ అండ్ హాస్పిటాలిటీ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 28న ప్రారంభం కానుంది. 30న ముగియనున్న ఇష్యూకి రూ. 318–334 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా 1.8 కోట్ల ఈక్విటీ షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 601 కోట్లకుపైగా సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 44 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవాలి.

సాక్షి స్పోర్ట్స్



జేమీ స్మిత్ సెంచరీ: ఇంగ్లండ్ 358 ఆలౌట్

మాంచెస్టర్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 85.3 ఓవర్లలో 358 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 259/6తో మూడో రోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్ 99 పరుగులు జోడించి మిగతా నాలుగు వికెట్లను కోల్పోయింది. కెరీర్‌లో నాలుగో టెస్టు ఆడుతున్న వికెట్ కీపర్ జేమీ స్మిత్ (148 బంతుల్లో 111; 8 ఫోర్లు, ఒక సిక్స్) తొలి సెంచరీని నమోదు చేసుకున్నాడు. లంక బౌలర్లలో అసిత ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 3 వికెట్లు పడగొట్టారు. 122 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక జట్టు ఆట ముగిసే సమయానికి 60 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసి 82 పరుగుల ఆధిక్యాన్ని దక్కించుకుంది. ఏంజెలో మాథ్యూస్ (65 : 2 ఫోర్లు, ఒక సిక్స్), కమిందు మెండిస్ (56 బ్యాటింగ్; 6 ఫోర్లు, ఒక సిక్స్) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ రెండు వికెట్లు పడగొట్టాడు.

'ఆరు'లో అదరగొట్టి...

ఆఖరి ప్రయత్నంలో జావెలిన్‌ను 89.49 మీటర్ల దూరం విసిరిన భారత స్టార్ నీరజ్ చోప్రా

సరిగ్గా రెండు వారాల క్రితం భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకంతో మెరిశాడు. ఆరు ప్రయత్నాల్లో ఐదుసార్లు అతను ఫౌల్ అయినా ఒక్క మంచి త్రో అతనికి 'పారిస్'లో రెండో స్థానాన్ని అందించింది. ఇప్పుడు వేదిక మారింది. సమరం ఒలింపిక్స్ నుంచి డైమండ్ లీగ్‌కు మారింది... కానీ అగ్రస్థానంలో నిలవాలనే ఒత్తిడి అతనిలో తగ్గినట్లు కనిపించలేదు... ఫలితంగా అదే తడబాటు. తొలి ఐదు ప్రయత్నాల్లో ఆశించిన దూరం జావెలిన్ వెళ్లలేదు... కానీ ఎట్టకేలకు ఆరో ప్రయత్నంలో నీరజ్ తన స్థాయిని ప్రదర్శించాడు. ఒక్క త్రోతో రెండో స్థానానికి దూసుకెళ్లి మీట్‌ను ముగించాడు.

లుసాన్ డైమండ్ లీగ్ మీట్‌లో రెండో స్థానం • సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన

లుసాన్ (స్విట్జర్లాండ్): ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ అథ్లెటిక్స్ లుసాన్ మీట్‌లో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా రెండో స్థానంలో నిలిచాడు. భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఈ మీట్‌లో నీరజ్ జావెలిన్‌ను 89.49 మీటర్ల దూరం విసిరాడు. ఈ సీజన్‌లో అతనికి ఇది అత్యుత్తమ ప్రదర్శన కాగా... మొత్తం కెరీర్‌లో రెండో అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం. రెండేళ్ల క్రితం స్టాక్‌హోమ్‌లో జరిగిన డైమండ్ లీగ్ పోటీల్లో జావెలిన్‌ను నీరజ్ 89.94 మీటర్ల దూరం విసిరాడు. ఈ ఈవెంట్లో 90.61 మీటర్ల దూరంతో ప్రపంచ మాజీ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) మొదటి స్థానంలో నిలవగా... జూలియన్ వెబర్ (జర్మనీ; 87.08 మీటర్లు) మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలుచుకున్న పాకిస్తాన్ ఆటగాడు అర్షద్ నదీమ్ ఈ మీట్‌లో పాల్గొనలేదు.

పారిస్ ఒలింపిక్స్‌లో 89.45 మీటర్ల దూరంతో నీరజ్ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. గజ్జల్లో గాయంతో బాధపడుతున్న అతను ఒకదశలో డైమండ్ లీగ్ నుంచి తప్పుకోవాలని భావించినా... చివరకు బరిలోకి దిగాడు. ఇప్పుడు పక్షం రోజుల తేడాతో కాస్త మెరుగైన ప్రదర్శన అతడి నుంచి వచ్చింది. తొలి నాలుగు ప్రయత్నాల్లో అతని త్రో ఒక్కటీ కనీసం 85 మీటర్లు కూడా వెళ్లలేదు. నీరజ్ వరుసగా 82.10 మీటర్లు... 83.21 మీటర్లు... 83.13 మీటర్లు... 82.34 మీటర్లు మాత్రమే జావెలిన్‌ను విసరగలిగాడు. వీటి తర్వాత అతను నాలుగో స్థానంలో ఉన్నాడు. అయితే ఐదో ప్రయత్నం అతడిని మూడో స్థానానికి తీసుకెళ్లింది. ఇందులో జావెలిన్ 85.58 మీటర్లు వెళ్లింది. ఆఖరి ప్రయత్నంలో అండర్సన్ ఏకంగా 90.61 మీటర్లతో కొత్త మీట్ రికార్డు నెలకొల్పి అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. అనంతరం నీరజ్ తన శక్తిని మొత్తం ఉపయోగించి విసిరిన ఆరో అస్త్రం ఎట్టకేలకు సానుకూల ఫలితాన్ని అందించింది. 89.49 మీటర్లతో అతనికి రెండో స్థానం దక్కింది. అయితే చాలా కాలంగా నీరజ్ ఆశిస్తున్న 90 మీటర్ల మైలురాయిని మాత్రం అతను మరోసారి అందుకోలేకపోయాడు!

ఫైనల్‌కు అర్హత సాధించినట్లేనా!

తాజా ఈవెంట్‌లో రెండో స్థానంలో నిలవడంతో నీరజ్‌కు 7 పాయింట్లు దక్కాయి. దోహా డైమండ్ లీగ్‌లో కూడా రెండో స్థానం సాధించడం ద్వారా వచ్చిన 7 పాయింట్లు కలిపి ప్రస్తుతం నీరజ్ ఖాతాలో 14 పాయింట్లు ఉన్నాయి. ఓవరాల్‌గా ప్రస్తుతం వెబర్‌తో సమానంగా అతను మూడో స్థానంలో ఉన్నాడు. అండర్సన్ (21), జాకబ్ వదెల్ (16) తొలి రెండు స్థానాలతో ఇప్పటికే ఫైనల్‌కు అర్హత సాధించారు. ఫైనల్‌కు మొత్తం ఆరుగురు అర్హత పొందుతారు. సెప్టెంబర్ 5న జ్యూరిచ్‌లో జరిగే చివరి మీట్‌లోనూ నీరజ్ పాల్గొనబోతున్నాడు. అక్కడా రాణిస్తే అతను ఫైనల్‌కు అర్హత సాధించడం లాంఛనమే కానుంది. బ్రసెల్స్‌లో సెప్టెంబర్ 14 నుంచి ఫైనల్ పోటీలు జరుగుతాయి.



"ఈవెంట్ ఆరంభంలో కొంత నిరాశ కలిగింది. అయితే ఫలితం తర్వాత చూస్తే నా ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నా. ముఖ్యంగా చివరి ప్రయత్నంలో నా కెరీర్‌లో రెండో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వగలిగాను. సరిగ్గా మొదలు పెట్టకపోయినా ఆ తర్వాత నేను కోలుకోగలగడం, పోరాటస్ఫూర్తి కనబర్చడం ఆనందాన్నిచ్చింది. తొలి నాలుగు ప్రయత్నాలు 80–83 మీటర్ల మధ్యే ఉన్నా ఆఖరి రెండు త్రోలలో నా పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించాను. ఈ స్థాయి పోటీల్లో మానసికంగా కూడా దృఢంగా ఉండి చివరి వరకు పోరాడటం ముఖ్యం. అండర్సన్ 90 మీటర్ల త్రో విసిరాక నాపై ఒత్తిడి పెరిగింది. ఎలాగైనా దానిని దాటాలని అనుకున్నా. అయితే నా మిత్రుడైన కెన్యా ప్లేయర్ జూలియస్ యెగో నా వద్దకు వచ్చి తగిన సలహా ఇచ్చాడు. ప్రశాంతంగా ఉండు, నువ్వు ఎక్కువ దూరం విసరగలవు అని చెబుతూ నా ఆందోళనను తగ్గించాడు. దాంతో ఒత్తిడి లేకుండా జావెలిన్‌ను విసరగలిగాను." –నీరజ్ చోప్రా

ఓవరాల్ టీమ్ చాంప్ భారత్


- 185 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన భారత మహిళా రెజ్లర్ల బృందం
- పసిడి పతకం నెగ్గిన కాజల్
- శ్రుతిక ఖాతాలో రజతం
- రాజ్‌బాలా, ముస్కాన్‌లకు కాంస్యం



అమ్మాన్ (జోర్డాన్): ప్రపంచ అండర్–17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ చరిత్రలో భారత మహిళల జట్టు ఫ్రీస్టయిల్ విభాగంలో తొలిసారి ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. శుక్రవారం భారత్ ఖాతాలో ఒక స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్య పతకాలు చేరాయి. 69 కేజీల విభాగం ఫైనల్లో కాజల్ 9–2తో ఒలెక్సాండ్రా రిబాక్ (ఉక్రెయిన్)పై గెలిచి బంగారు పతకం సాధించింది. 46 కేజీల విభాగం ఫైనల్లో శ్రుతిక శివాజీ పాటిల్ 0–13తో యు కత్సుమె (జపాన్) చేతిలో ఓడిపోయి రజతం దక్కించుకుంది. 40 కేజీల విభాగం కాంస్య పతక బౌట్‌లో రాజ్‌బాలా 11–5తో మొనాకా ఉమెకావా (జపాన్)పై, 53 కేజీల విభాగం కాంస్య పతక బౌట్‌లో ముస్కాన్ 12–2తో ఇసాబెల్లా గొంజాలెస్ (అమెరికా)పై విజయం సాధించారు. 61 కేజీల విభాగం కాంస్య పతక బౌట్‌లో రజ్నిత 2–6తో హిన్నై హర్చనోవా (అజర్‌బైజాన్) చేతిలో ఓడిపోయి నాలుగో స్థానంలో నిలిచింది. మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో మొత్తం 10 వెయిట్ కేటగిరీల్లో పోటీలు జరగ్గా... తొమ్మిది కేటగిరీల్లో భారత రెజ్లర్లు పోటీపడ్డారు. ఐదు స్వర్ణాలు (25 పాయింట్ల చొప్పున), ఒక రజతం (20 పాయింట్లు), రెండు కాంస్యాలు (15 పాయింట్ల చొప్పున) సొంతం చేసుకున్నారు. మరో కేటగిరీలో నాలుగో స్థానం (10 పాయింట్లు) లభించింది. ఓవరాల్‌గా 185 పాయింట్లతో భారత్ టాప్ ర్యాంక్‌ను దక్కించుకుంది. 146 పాయింట్లతో జపాన్ రన్నరప్‌గా నిలువగా... 79 పాయింట్లతో కజకిస్తాన్ మూడో స్థానం పొందింది.

భారత్ 'ఎ' 184 ఆలౌట్

- రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 'ఎ' 164/7
- ఐదు వికెట్లతో మెరిసిన మిన్ను మణి



గోల్డ్‌కోస్ట్: మరోసారి బౌలర్లు రాణించడంతో... ఆస్ట్రేలియా 'ఎ' మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక అనధికారిక టెస్టుపై భారత 'ఎ' మహిళల జట్టు పట్టు కోల్పోలేదు. 28 పరుగుల స్వల్ప ఆధిక్యం పొందిన ఆస్ట్రేలియా 'ఎ' జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 60 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా 'ఎ' ఓవరాల్ ఆధిక్యం 192 పరుగులకు చేరుకుంది. మ్యాడీ డార్క్ (54 బ్యాటింగ్; 2 ఫోర్లు), లిల్లీ మిల్స్ (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన భారత 'ఎ' జట్టు కెప్టెన్, ఆఫ్ స్పిన్నర్ మిన్ను మణి రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆకట్టుకుంది. మిన్ను 20 ఓవర్లలో 6 మెయిడెన్లు వేసి 47 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టింది. ప్రియా మిశ్రా, సయాలీలకు ఒక్కో వికెట్ దక్కింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 100/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత 'ఎ' జట్టు మరో 84 పరుగులు జోడించి మిగతా 8 వికెట్లను కోల్పోయింది. శ్వేత సెహ్రావత్ (40; 3 ఫోర్లు), తేజల్ హసాబ్నిస్ (32; 2 ఫోర్లు), సయాలీ (21; 2 ఫోర్లు) రాణించారు.

అండర్-19 సింగిల్స్ సెమీస్‌లో నవ్య

సాక్షి, హైదరాబాద్: కొటక్ ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల అండర్–19 సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ నవ్య కందేరి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గచ్చిబౌలిలోని కొటక్ పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నవ్య 21–13, 21–18తో ముస్కాన్ ఖాన్ (భారత్)పై గెలిచింది. భారత్‌కే చెందిన తనూ చంద్ర, రుజులా రాము కూడా సెమీఫైనల్లోకి ప్రవేశించారు. అండర్–19 పురుషుల సింగిల్స్‌లో భారత ప్లేయర్లు లక్ష్ చెంగప్ప, రౌనక్ సెమీఫైనల్లోకి అడుగుపెట్టారు.

బంగ్లాదేశ్ దీటైన జవాబు

రావల్పిండి: పాకిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ దీటైన సమాధానం ఇచ్చింది. ఓవర్‌నైట్ స్కోరు 27/0తో మూడో రోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ ఆట ముగిసే సమయానికి 92 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. చేతిలో 5 వికెట్లు ఉన్న బంగ్లా.. పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 132 పరుగులు వెనుకబడి ఉంది. ఓపెనర్ షాద్‌మన్ ఇస్లామ్ (93; 12 ఫోర్లు) సెంచరీని కోల్పోయాడు. మోమినుల్ హక్ (50; 5 ఫోర్లు), ముష్ఫికర్ (55 బ్యాటింగ్; 7 ఫోర్లు), లిటన్ దాస్ (52 బ్యాటింగ్; 8 ఫోర్లు, ఒక సిక్సర్) హాఫ్ సెంచరీలు సాధించారు. పాక్ బౌలర్లలో ఖుర్రం షెహజాద్ రెండు వికెట్లు పడగొట్టాడు.



మహారాష్ట్రలోని పుణేకి చెందిన సన్నీ నన వాగ్హోరీ, సంజయ్ దత్తాత్రేయ గుజర్, ప్రీతి సోని శుక్రవారం వీఐపీ విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ ముగ్గురూ రెండు చేతుల్లో వేళ్లకు సరిసమానంగా బంగారు ఉంగరాలు, భారీ కంకణాలు, మెడలో పెద్ద గొలుసులు ధరించారు. వీరి ఒంటిపై 25 కేజీలకు పైగా బంగారు ఆభరణాలు ఉండటంతో భక్తులు వీరిని ఆసక్తిగా చూశారు.
- తిరుమల

వచ్చేదెవరు.. వెళ్లేదెవరు?

గోవా, ముంబై, బెంగళూరు 'ప్రయాణికుల'పై కన్ను

సాక్షి, హైదరాబాద్: బెంగళూరులో స్థిరపడిన నైజీరియాకు చెందిన ఒఫోజో సండే ఎజోకాకు అక్కడే మరో నైజీరియన్ పరిచయం కావడంతో డ్రగ్స్ సప్లయర్‌గా మారాడు. హైదరాబాద్‌లో ఉన్న పెడ్లర్స్‌కు సప్లై చేసేందుకు నిత్యం ప్రైవేట్ బస్సుల్లో వచ్చిపోతుండేవాడు. ఇటీవల ఇతడితో పాటు పెడ్లర్స్‌ను పట్టుకున్న హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) అధికారులు ఏకంగా రూ.కోటి విలువైన ఆరు రకాలైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు.

ఆ ప్రాంతాల నుంచే సిటీకి వస్తున్న మాదకద్రవ్యాలు

సింథటిక్ డ్రగ్స్ కట్టడికి టీజీ ఏఎన్‌బీ కొత్త వ్యూహం

ట్రావెల్ ఏజెన్సీల సహకారం తీసుకోవాలని నిర్ణయం

ఆర్టీసీ బస్సు డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చేలా ప్రణాళికలు

ఈ ఒక్క కేసులోనే కాదు.. రాజధానిలో దొరుకుతున్న సింథటిక్ డ్రగ్స్‌లో దాదాపు 98 శాతం గోవా, ముంబై, బెంగళూరు నుంచే వస్తున్నాయి. కొకైన్, హెరాయిన్, బ్రౌన్‌షుగర్, ఎండీఎంఏ, ఎల్ఎస్డీ వంటి సింథటిక్ డ్రగ్స్‌కు ఆ మూడు నగరాలే అడ్డాగా ఉన్నాయి. వివిధ రకాలైన వీసాలపై దేశంలోకి ప్రవేశించి, ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన నైజీరియన్లే ఈ దందా చేస్తూ ప్రధాన సప్లయర్స్‌గా మారిపోయారు. మాదకద్రవ్యాల క్రయవిక్రయాల కోసం ఆ సప్లయర్స్ ఇక్కడకు వచ్చి వెళ్లడానికి, ఇక్కడ ఉన్న పెడ్లర్స్ వెళ్లి రావడానికి ఎక్కువగా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులనే వాడుతున్నారు. ఈ విషయం గుర్తించిన తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ ఏఎన్‌బీ) డైరెక్టర్ సందీప్ శాండిల్య ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలోనే టీజీ ఏఎన్‌బీ అధికారులు డేటా విశ్లేషణపై దృష్టి పెట్టారు.



బస్సు టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న ప్రయాణికుల జాబితాతో పాటు దూరప్రాంతాల సర్వీసులకు నేరుగా టికెట్ తీసుకున్న వారి జాబితా సైతం ట్రావెల్ ఏజెన్సీలకు చేరుతుంది. ఈ నేపథ్యంలో నగరం నుంచి గోవా, ముంబై. బెంగళూరు, పుణే తదితర ప్రాంతాలకు నిత్యం సర్వీసులు నడిపే 140 ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలను టీజీ ఏఎన్‌బీ అధికారులు గుర్తించారు. త్వరలో వాటి నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. వీళ్ల అనునిత్యం తమ బస్సుల్లో ప్రయాణిస్తున్న

140 ట్రావెల్ ఏజెన్సీల గుర్తింపు

వారిపై ఓ కన్నేసి ఉండేలా, వారి జాబితాల సాఫ్ట్‌కాపీలను టీజీ ఏఎన్‌బీకి పంపేలా కౌన్సెలింగ్ చేయనున్నారు. ఇలాంటి చర్యలు తీసుకోవడం ద్వారా సప్లయర్స్, పెడ్లర్స్‌ను కట్టడి చేయడంతో పాటు మరో అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కొందరు డ్రగ్స్ బానిసలు నగరం నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లి వాటిని సేవించి వస్తున్నారని, ఇలాంటి వారికి చెక్ చెప్పడానికి సైతం ఆస్కారం ఏర్పడుతుందని భావిస్తున్నారు.

డ్రైవర్లూ... 'పార్సిల్స్' తీసుకోవద్దు

కొందరు డ్రగ్ సప్లయర్స్, పెడ్లర్స్ తమ చేతికి మట్టి అంటకుండా ఈ స్మగ్లింగ్ పూర్తి చేస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రైవేట్, ఆర్టీసీ బస్సు డ్రైవర్లను అక్రమ రవాణా కోసం వాడుకుంటున్నారు. మాదకద్రవ్యాలను వివిధ రకాలైన బాక్సుల్లో పార్సిల్ చేసి బస్సు డ్రైవర్లకు అందిస్తున్నారు. నగరంలో ఉన్న తమ వాళ్లు వచ్చి తీసుకుంటారని చెబుతూ కొంత మొత్తం ముట్టచెబుతున్నారు. కొందరు విషయం తెలిసి సహకరిస్తుంటే... అత్యధికులు మాత్రం రొటీన్ పార్సిల్స్‌గా భావించి తీసుకువస్తున్నారు. ఈ పంథాలో సింథటిక్ డ్రగ్స్‌తో పాటు గంజాయి సంబంధిత పదార్థమైన హాష్ ఆయిల్ కూడా అక్రమ రవాణా అవుతోంది. ఈ తరహా పార్సిల్స్‌ను తెలిసి తెచ్చినా, తెలియక తెచ్చినా బాధ్యులే అవుతారని, ఆ ఉచ్చులో దిగవద్దంటూ కౌన్సెలింగ్ చేసేందుకు టీజీ ఏఎన్‌బీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



గాడి తప్పిన ప్రజారోగ్యంపై సమీక్షకు తీరిక లేదా ?

సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగలేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రజాపాలనలో ప్రజారోగ్యం పూర్తిగా పడకేసిందని, డెంగీ సహా విజృంభిస్తున్న విషజ్వరాలతో జనం పరేషాన్ అవుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పారిశుధ్య నిర్వహణ, దోమల బెడద నివారణలో సర్కార్ విఫలమైందంటూ సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ శుక్రవారం బహిరంగలేఖ రాశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయని, గాడి తప్పుతున్న ప్రజారోగ్యంపై సీఎం సమీక్ష జరపడం లేదన్నారు. ఎనిమిది నెలలుగా పారిశుధ్య నిర్వహణ పూర్తిగా దిగజారిపోయిందని, ఫలితంగా దోమల బెడద కారణంగా డెంగీ, మలేరియాతోపాటు చికెన్ గున్యాలాంటి జ్వరాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. అధికారిక లెక్కల ప్రకారమే ఈ ఏడాదిలో దాదాపుగా 5,700 డెంగీ కేసులు నమోదయ్యాయని, కానీ అనధికారికంగా దీనికి పదిరెట్లు ఎక్కువగా ఈ సంఖ్య ఉంటుందన్నారు. డెంగీకి సరైన సమయంలో చికిత్స అందకపోవడంతో ఇటీవల దాదాపు 50 మంది చనిపోయారని, ఇందులో చిన్నపిల్లలు కూడా ఉండటం అత్యంత బాధాకరమని చెప్పారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక కేంద్రాల్లో ఇప్పటికైనా అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. రోగులకు మెరుగైన చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడాలని కేటీఆర్ ఆ లేఖలో డిమాండ్ చేశారు.



హాస్పిటల్స్ క్లిక్..క్లిక్

కుర్చీలోనే ప్రసవించిన మహిళ

- నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన.. తల్లీబిడ్డ క్షేమం.. దేవరకొండ ఆస్పత్రి వైద్య సిబ్బంది సస్పెన్షన్‌కు ఆదేశాలు



ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువుతో అశ్విని

నల్లగొండ టౌన్: నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ గర్భిణి కుర్చీపైనే ప్రసవించింది. వివరాల్లోకి వెళితే.. నేరడుగొమ్ముకు చెందిన అశ్విని పురిటి నొప్పులతో గురువారం రాత్రి 10 గంటలకు దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి వెళ్లగా, డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేరు. దీంతో నర్సులు నల్లగొండలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి పంపారు. గురువారం రాత్రి 12:30 గంటలకు అక్కడికి చేరుకోగా, డ్యూటీలో ఉన్న డాక్టర్ అశ్వినిని పరీక్షించారు. ప్రసవానికి అరగంట పడుతుందని కొంతసేపు వాకింగ్ చేయాలని సూచించారు. శుక్రవారం తెల్లవారుజాము రెండుగంటల సమయంలో అశ్విని నడుస్తున్న క్రమంలో నొప్పులు వచ్చాయి. లేబర్‌రూమ్ ముందు ఉన్న కుర్చీలో కూర్చోగా వెంటనే బిడ్డ బయటకు వచ్చేసింది. అక్కడే ఉన్న అశ్విని తల్లి రాములమ్మ బిడ్డను గట్టిగా పట్టుకొని వెంటనే డాక్టర్‌ను పిలవగా నర్సులు వచ్చి వైద్యసేవలు అందించారు. దీంతో బిడ్డ, తల్లికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యం పై రాములమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కలెక్టర్ నారాయణరెడ్డి విచారణకు ఆదేశించగా, అదనపు కలెక్టర్ పూర్ణ చంద్ర ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించా రు. నివేదిక ఆధారంగా డ్యూటీ డాక్టర్ నిఖిత, స్టాప్ నర్సులు ప్రమీల, ఉమ, పద్మ, సుజాతలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దేవరకొండలో అందుబాటులో లేని డ్యూటీ డాక్టర్ శాంతి స్వరూపతో పాటు స్టాఫ్ నర్సులు విజయలక్ష్మి, సైదమ్మ, మౌనిక, సరితను సస్పెండ్ చేయాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించినట్టు అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర వెల్లడించారు.

పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రి



సులానగర్ పీహెచ్‌సీ



'పడకేసిన' ప్రజారోగ్యం

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకల కొరత
- మంచంపై ఇద్దరికి.. కొందరికి కుర్చీల్లో వైద్యం

టేకులపల్లి/పెద్దపల్లి: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో... ప్రభుత్వ ఆస్పత్రుల్లో పడకల కొరత రోగుల్ని తీవ్రంగా వేధిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం సులానగర్ పీహెచ్‌సీలో ఒక్కో పడకపై ఇద్దరిని ఉంచి, కొందరిని కుర్చీల్లో కూర్చోపెట్టి, మరికొందరిని బల్లలపై పడుకోబెట్టి సెలైన్లు ఎక్కిస్తూ చికిత్స చేస్తున్నారు. మండలంలోని రాజుతండా సమీపాన సీతారాంపురం గ్రామానికి చెందిన ఒకే కుటుంబసభ్యులు గుగులోత్ హరి, తార, బాలు, ఝాన్సీ, శరత్ తీవ్ర జ్వరంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేక శుక్రవారం సులానగర్ పీహెచ్‌సీకి వచ్చారు. దీనిపై సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేశ్ మాట్లాడుతూ రోజుకు 100 నుంచి 120 మంది వరకు వస్తుండడంతో పడకలు సరిపోకున్నా మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పడకలు సరిపోక.. ఆస్పత్రి యాజమాన్యం మంచాలు కొనుగోలు చేసి వైద్యం అందిస్తోంది. జ్వరపీడితులు అధికంగా వస్తుండడంతో ఇప్పటివరకు 35 మంచాలు కొనుగోలు చేశామని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

ఎలుకలు కొరికేసిన క్యాప్సుల్స్





బాత్‌రూంలో అస్తవ్యస్తంగా సెలైన్లు

ఏ'మాత్ర'ం శ్రద్ధ లేదు!

ఎన్ని విమర్శలు వస్తున్నా.. ఆదిలాబాద్ రిమ్స్ అధికారుల తీరు మారడం లేదు. ఆసుపత్రికి వచ్చే పేద రోగుల వైద్యానికి ఉపయోగించే రూ.లక్షల విలువైన ఔషధాలు, టానిక్‌లు, సెలైన్ సీసాలను రిమ్స్ ఆడిటోరియంలో చెత్త కుప్పమాదిరిగా పడేశారు. బాత్‌రూముల్లోనూ నిల్వ చేసినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. విలువైన మందులను ఎలుకలు కొరకడంతో ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి.

సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



చిందరవందరగా మాత్రలు





అప్పుడు కుడికాలు.. ఇప్పుడు ఎడమకాలు

చికిత్స పొంది వస్తుండగా ప్రమాదం

అదుపుతప్పి ప్రైవేట్ అంబులెన్స్ బోల్తా

తంగళ్లపల్లి(సిరిసిల్ల): విరిగిన కుడి కాలికి ఆస్పత్రిలో చికిత్స పొంది అంబులెన్సులో వస్తుండగా.. జరిగిన ప్రమాదంలో ఎడమ కాలు కూడా విరిగి ఆస్పత్రిలో చేరాడొక వృద్ధుడు. రాజన్నసిరిసిల్ల జిల్లా బద్దెనపల్లిలో జరిగిన సంఘటన వివరాలివి. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన వృద్ధుడు డి.శేఖర్ కుడికాలు ఇటీవల విరిగింది. అతన్ని కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించి శుక్రవారం తిరిగి వేములవాడకు ప్రైవేటు అంబులెన్స్‌లో బయల్దేరారు. అంబులెన్స్ తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోకి రాగానే అదుపుతప్పి, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శేఖర్ ఎడమకాలు విరిగిపోగా, అంబులెన్స్ డ్రైవర్ శివకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఒక ఫీడర్‌కు బదులు మరో ఫీడర్ కరెంటు నిలిపివేత..

షాక్‌తో యువకుడు మృతి..

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం..



రవి (ఫైల్)

అడ్డాకుల: విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యం ఓ యువకుడి నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. అడ్డాకుల మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మునగల రవి (27) విద్యుత్ శాఖలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్నాడు. శుక్రవారం కాటవరం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజు పోవడంతో సరిచేయాలని లైన్‌మెన్ గట్టన్న.. రవికి ఫోన్ చేసి చెప్పారు. అక్కడికి వెళ్లిన రవి అడ్డాకుల విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి, తిమ్మాయిపల్లి ఫీడర్‌కు కరెంటు సరఫరా నిలిపి వేయాలని కోరాడు. కొద్దిసేపటికి సబ్‌స్టేషన్ నుంచి ఫోన్ చేసి కరెంటు సరఫరా నిలిపేశామని చెప్పారు. అయితే తిమ్మాయిపల్లి ఫీడర్‌కు కాకుండా పొరపాటున గుడిబండ ఫీడర్‌కు కరెంటు సరఫరాను నిలిపేశారు. ఇది తెలియని రవి ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫీజును సరిచేస్తుండగా, కరెంటు షాక్‌కు గురై కిందపడ్డాడు. స్థానికులు గుర్తించి లైన్‌మెన్ గట్టన్నకు ఫోన్ చేశారు. వెంటనే సబ్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి క్షతగాత్రుడిని జిల్లా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.


సంతోషం ఎక్కువ రోజులు నిలువలే..

మృతుడు రవికి భార్య సుమలత, నెల రోజుల వయసున్న కుమారుడు ఉన్నాడు. కొడుకు పుట్టాడన్న సంతోషం ఎక్కువ రోజులు నిలువకుండానే తండ్రి చనిపోవడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు అందరినీ కలిచివేశాయి. మృతుని కుటుంబానికి పరిహారంతో పాటు ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

లిఫ్ట్ అడుగుతున్నావా చిన్నా?

'పిల్లలు స్కూల్‌ను నడుచుకుంటూ వెళ్లి... పరిగెత్తుకుంటూ ఇంటికొస్తారు' అని పాత రోజుల్లో అనుకునేవారు. ఇప్పుడు చాలామంది పిల్లలు నడవడం లేరు. బస్, ఆటో, వ్యాన్ వస్తుంది. లేదా నాన్నో, అమ్మో, ఇంటి కారో దింపుతుంది. మళ్లీ పికప్ చేసుకుంటుంది. అయితే ఇలా కాకుండా చాలామంది పిల్లలు తమ సొంతగా స్కూలుకు వెళ్లాల్సి ఉంటుంది. వీళ్లు సైకిల్ తొక్కుకుంటూ వస్తారు. లేదా షేర్ ఆటో ఎక్కి వస్తారు. లేదా ఆర్టీసి బస్ ఎక్కి వస్తారు. నడవడం ఇష్టం ఉన్నవాళ్లు నడుస్తారు. కాని కొందరు మాత్రం 'అంకుల్... లిఫ్ట్' అని రోడ్డు మీద నిలబడి టూవీలర్ ఎక్కి దిగుతారు. ఉదయం స్కూలు మొదలయ్యే టైమ్‌లో, సాయంత్రం స్కూల్ విడిచే టైములో అమ్మాయిలు, అబ్బాయిలు 'లిఫ్ట్' అడగడం చాలా ఊళ్లలో కనపడుతుంది. పల్లెటూళ్లలో, సిటీల్లో కూడా ఇలాంటి పిల్లలు ఉంటారు. వీరిని చూసిన వాహనదారులు 'పాపం చిన్నపిల్లలు కదా' అని లిఫ్ట్ ఇస్తారు. ఈ లిఫ్ట్ ఇచ్చేవాళ్లు మంచివాళ్లైతే సరే. చెడ్డ వాళ్లయితేనో? అందుకే పోలీసులు స్కూలు పిల్లలను లిఫ్ట్ అడిగి రాకపోకలు చేయవద్దని గట్టిగా హెచ్చరిస్తున్నారు. అందుకే ఇక్కడున్న విషయం మీరు చదివి, మీ అమ్మానాన్నలకు, స్కూల్ టీచర్లకు కూడా చూపించండి.



లిఫ్ట్ అడిగితే వచ్చే ప్రమాదాలు

- రోడ్డు మీద అపరిచితులను లిఫ్ట్ అడగకూడదు. ఎందుకంటే వాళ్లు హెల్మెట్‌లో ఉంటారు. వెనుక కూచున్న మీకు ఇవ్వడానికి వాళ్ల దగ్గర హెల్మెట్ ఉండదు. వాళ్లు పొరపాటున యాక్సిడెంట్ చేస్తే వాళ్లకు ఏమీ కాకపోయినా మీకు దెబ్బలు తగులుతాయి.
- లిఫ్ట్ ఇచ్చే వాళ్లకు డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే ప్రమాదం. వాహనానికి ఇన్సూరెన్స్ లేకపోతే ప్రమాదం. వారు మద్యం సేవించి ఉంటే బండిని పడేసే చాన్సులే ఎక్కువ.
- లిఫ్ట్ ఇచ్చే వాళ్లు నేరస్తులైతే? మీకై మీరు ఎక్కిన బండిని వారు వేగంగా నడుపుతూ మిమ్మల్ని కిడ్నాప్ చేస్తే? ఆ ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. అప్పుడు బండి మీద నుంచి ఎలా దిగి బయటకు పడాలో మీకు తెలియదు. భయంలో బుర్ర పని చేయదు.
- లిఫ్ట్ ఇచ్చేవాళ్లు 'బ్యాడ్ టచ్' చేసే వారైతే. మీరు భయంతో వాళ్ల బ్యాడ్ టచ్‌ను స్టాప్ చేయకపోతే మరుసటి రోజు అదే సమయానికి వాళ్లు లిఫ్ట్ ఇవ్వడానికి వస్తారు. మెల్లగా మీ ఫోన్ నంబర్ తీసుకుని పరిచయం పెంచుకుంటారు. ఆ తర్వాత స్కూల్‌కి కాకుండా మరెక్కడెక్కడికో మిమ్మల్ని తీసుకెళతారు.
- ఇటీవల డ్రగ్స్ ఎక్కువయ్యాయి. పోలీసుల నిఘా ఎక్కువైంది. వాహనదారులు సేఫ్టీ కోసం మీ స్కూల్ బ్యాగ్‌లో ప్యాకెట్ ఉంచి మిమ్మల్ని ఎక్కించుకుని డ్రాప్ చేయవచ్చు. ఆ సమయంలో దొరికితే ఇంకా ప్రమాదం.

స్కూల్ పిల్లలు ఎందుకు లిఫ్ట్ అడుగుతారు

గతంలో అందరూ నడిచేవారు. ఎంత నడిస్తే అంతమంచిది. కాని తల్లిదండ్రులు ఈ మధ్య పిల్లలకు నడక అలవాటు చేయడం లేదు. స్కూల్ బ్యాగ్ ఇచ్చి ఏదో ఒకటి ఎక్కిపో అంటున్నారు. ఒకవేళ షేర్ ఆటోకు డబ్బు ఇచ్చినా కొందరు పిల్లలు 'చూశావా... బైక్ ఎక్కి ఎలా వచ్చానో' అని ఫ్రెండ్స్ ఎదుట పోజ్ కొట్టడానికి ఎక్కుతారు. కొందరు లేట్‌గా తయారై లిఫ్ట్ ఎక్కి వెళ్లొచ్చులే అనుకుంటారు. కొందరూ ఊరికే సరదాకి లిఫ్ట్ ఎక్కుతారు. కాని ఇది ప్రమాదం.

తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యాలు ఏం చేయాలి?

పోలీసులు ఇస్తున్న సూచనలు ఇవి...

- తల్లిదండ్రులు తమ పిల్లల్ని లిఫ్ట్ అడగొద్దని గట్టిగా చెప్పాలి. లిఫ్ట్ ఎక్కడం వల్ల వచ్చే ప్రమాదాలను వివరించాలి.
- టీచర్లు, ప్రిన్సిపల్ ప్రతి సందర్భంలోనూ ఈ విషయాన్ని పిల్లలకు చెబుతుండాలి. ఎవరైనా పిల్లలు లిఫ్ట్ ఎక్కి వస్తుంటే గమనించి తమకు తెలియచేయాలని కోరాలి.
- అన్నింటి కంటే ముఖ్యం... సోషల్ మీడియా ద్వారా స్కూల్ పిల్లలకు లిఫ్ట్ ఇవ్వొద్దని వాహనదారులకు తెలియచేయాలి. సిసి కెమెరాల వల్ల లిఫ్ట్ ఇచ్చే వాహనదారులు పోలీసుల నిఘాలో ఉంటారని తెలియచెప్పాలి.
- వివిధ సామాజిక సంఘాలు కూడా పిల్లలకు లిఫ్ట్ ఇవ్వడాన్ని డిస్కరేజ్ చేయమని ప్రచారం చేస్తే పిల్లలు అనివార్యంగా సురక్షిత రాకపోకలను ఎంచుకుంటారు.

రికార్డు హోల్డర్స్

కనిపెట్టాలేగాని పిల్లల్లో వేయి రకాల టాలెంట్స్ ఉంటాయి. వాటిని ప్రోత్సహిస్తే వారు వండర్‌బోయ్స్ అవుతారు. వండర్స్ సృష్టిస్తారు. ఇక్కడ ఉన్న పిల్లలు అలాంటి వారే. వారు చేసిన పని వారిని రికార్డ్ బుక్స్‌లో ఎక్కించింది. ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని మనం కూడా ఏదైనా టాలెంట్‌ని ప్రదర్శిద్దామా?

బుడుత చిరుత



ఇక్కడ కనిపిస్తున్న చిరుత పేరు శరణ్ గొరజాల. వయసు ఒక సంవత్సరం 9 నెలల 28 రోజులు (ఏప్రిల్ 30, 2024- రికార్డు సాధించే సమయానికి). ఈ బుడతడు ఏం చేశాడో తెలుసా? 'పరిగెత్తు' అనగానే పరిగెత్తాడు. 50 మీటర్ల దూరాన్ని 28 సెకన్లలో పూర్తి చేశాడు. ఇంతకు ముందు ఇదే వయసు బుడతడు ఈ దూరాన్ని 29 సెకన్లలో పూర్తి చేస్తే మనవాడు ఒక సెకను ముందే పూర్తి చేసి రికార్డు సాధించాడు.'ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించాడు. శరణ్ గొరజాలది చిత్తూరు జిల్లా. తండ్రి స్వరూప్, తల్లి ప్రియాంక. చిన్నప్పటి నుంచి బలే హుషారు. ఇంట్లో ఆడుకోమంటే పరిగెత్తడం నేర్చాడు. హాల్లో, వరండాలో, ప్లేగ్రౌండ్‌లో పరిగెత్తడమే పని. అందుకే తల్లిదండ్రులు ఎంకరేజ్ చేశారు. ఏముంది... 50 మీటర్లు లాగించేశాడు. పెద్దయ్యి 100 మీటర్ల పరుగులో రికార్డు సాధించాలని కోరుకుందాం.

మైండా? మెమొరీ కార్డా?



ఇక్కడ కనపడుతున్నాడే... ఈ గంభీర వదన మహానుభావుని పేరు గోకుల్ పోఖ్ రాజ్ పథ్. వయసు 3 సంవత్సరాల 3 నెలలు. కాని మైండు నిండా సమాచారం... ఏదడిగితే అది టక్కున సమాధానం. వీడి మెమొరీ చూసి వీళ్లమ్మ కొన్ని సంగతులు నేర్పింది. వాటిని మర్చిపోతేనా? ఎప్పుడు అడిగినా చెబుతాడు. వీడి వయసు పిల్లలు చిట్టి చిలకమ్మా... అమ్మ కొట్టిందా చెప్పమంటే మర్చిపోతారు. వీడు? శరీరంలో 33 భాగాల పేర్లు, 23 రకాల వాహనాలు, కంప్యూటర్‌లో ఉండే 19 రకాల పార్ట్‌ల పేర్లు, 12 పండుగలు, 17 పెంపుడు జంతువుల పేర్లు, 16 జలచరాల పేర్లు, 16 చారిత్రక స్థలాల పేర్లు, 8 మంచి అలవాట్లు, 6 నర్సరీ రైములు కాకుండా ఏబీసీడీలు అన్నీ వాటితో వచ్చే పదాలు చెబుతాడు. ఇంకా ఏమేమి చెప్తాడో మనకెందుకు... 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో ఇతడి పేరు రాసి చల్లగా జారుకోక.

యాప్స్ బోయ్

హరియాణలోని ఝుజ్జర్‌కు చెందిన పద్నాలుగు సంవత్సరాల కార్తికేయ జాఖర్ పన్నెండు సంవత్సరాల వయసులోనే ఎవరి గైడెన్స్ లేకుండా మూడు లెర్నింగ్ అప్లికేషన్‌లను డెవలప్ చేసి 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు సంపాదించాడు. కార్తికేయ నాన్న రైతు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఆయన మొబైల్ ఫోన్ కొనుగోలు చేశాడు. తండ్రి దగ్గర ఉన్న ఫోన్ సహాయంతో బడి పాఠాలు వినడమే కాదు టెక్నాలజీకి సంబంధించి ఎన్నో విషయాలు తెలుసుకునేవాడు కార్తికేయ.

కొత్త విషయాలు తెలుసుకోవడానికే పరిమితం కాలేదు. 'ఒకసారి ట్రై చేసి చూద్దాం' అంటూ ఏవేవో ప్రయోగాలు చేసేవాడు. అలా చేస్తూ చేస్తూ మూడు యాప్‌లను సొంతంగా డెవలప్ చేశాడు. అవి:

1.జనరల్ నాలెడ్జ్ యాప్: లుసెంట్ జీకే
2. కోడింగ్ అండ్ గ్రాఫిక్ డిజైనింగ్ యాప్: రామ్ కార్తిక్ లెర్నింగ్ సెంటర్
3. డిజిటల్ ఎడ్యుకేషన్ యాప్: శ్రీరామ్ కార్తిక్.

'కార్తికేయలో అద్భుతమైన ప్రతిభ ఉంది. ప్రభుత్వ సహకారం ఉంటే మా అబ్బాయి మరెన్నో సాధించగలడు. డిజిటల్ టెక్నాలజీకి సంబంధించి కార్తికేయ దేశానికి సేవ చేయాలని కోరుకుంటున్నాను' అంటున్నాడు కార్తికేయ తండ్రి అజిత్.



● కామెడీ క్లాస్



ఎందుకంటే

మా నాయినే!

రాజు : శ్రీను 'నిచ్చెన' పట్టుకొని స్కూల్‌కు వెళుతున్నాడు ఏమిటి?
రవి : 'హై' స్కూల్‌కు వెళుతున్నాడు లే!

చింటు : ఒక కాఫ్ సిరప్ ఇవ్వండి
మెడికల్ షాప్ వోనర్: ఇదిగో
చింటు : షుగర్ ఇవ్వడం లేదేమిటి?
వోనర్ : షుగర్ ఏమిటి బాబూ?!
చింటు : 'షుగర్ ఫ్రీ' అని దీనిపై రాసి ఉంది కదా... అందుకే అడుగుతున్నాను.
అలా జరిగిందన్నమాట!

● ప్రశ్న - జవాబు

బంగారం దగ్గర పాములు ఎందుకున్నాయి?

'తంగలాన్' సినిమాలో బంగారానికి పాములు కాపలా కాస్తున్నట్లు దర్శకుడు చూపించాడు. గుప్త నిధులు ఉన్న దగ్గర పాములు ఉంటాయని పూర్వం చందమామ కథల్లో విఠలాచార్య సినిమాల్లో చూపించేవారు. తంగలాన్‌లో బంగారం కోసం వెళ్లిన ప్రతిసారి పాములు వచ్చి కాటేస్తుంటాయి. బంగారం గనుల్లో, నిధుల దగ్గర పాములు నిజంగానే ఉంటాయా?




కొందరు శాస్త్రవేత్తలు ఏమంటారంటే హెవీ మెటల్స్ ఉన్న దగ్గర పాములు ఉంటాయి అని. బంగారం, యురేనియం, మెర్క్యురీ వంటి హెవీ మెటల్స్ ఉండే ప్రదేశాల్లో పాములు సంచరిస్తాయని వారి అధ్యయనంలో కనిపించింది. పాములు తమ శరీరంలో ఉండే పొలుసుల్లో హెవీ మెటల్స్‌ను దాస్తాయట. పాములు బయో ఇండికేటర్స్‌గా పని చేస్తాయని కూడా శాస్త్రవేత్తలు తేల్చారు.

యురేనియం దొరికే ప్రాంతాల్లో గాని బంగారం దొరికే కోలార్ వంటి ప్రాంతాల్లోగాని పాములు ఎక్కువగా సంచరిస్తుండేది అందుకే అని పర్యావరణవేత్తలు కూడా చెబుతున్నారు.

● చైల్డ్ ప్రాడజీ

సూపర్ టాలెంట్



ఫ్రెండ్స్, ఈరోజు మనం సోబోర్నో ఐజాక్ బారి గురించి తెలుసుకుందాం. ఈ పిల్లాడిది మీ వయసే. ఎంతో మంది పెద్ద వాళ్లు బారిని బాగా మెచ్చుకుంటున్నారు. ఎందుకో తెలుసా?

రషిదుల్ బారి, షాహెద బారి బంగ్లాదేశ్ నుంచి వచ్చి న్యూయార్క్‌లో స్థిరపడ్డారు. వారి అబ్బాయే సోబోర్నో ఐజాక్ బారి.

ఆరు నెలల వయసులోనే తడబడకుండా మాట్లాడేవాడు.

రెండు సంవత్సరాల వయసులోనే 'సూపర్ టాలెంట్' అనిపించుకున్నాడు.

సైన్స్, గణితంపై బారికి ఉన్న ఇష్టాన్ని గమనించిన పేరెంట్స్ క్రమం తప్పకుండా రకరకాల ఎక్సర్‌సైజ్‌లు ఇచ్చేవారు. వాటిని స్పీడ్‌గా సాల్వ్ చేసి 'శబ్బాష్' అనిపించుకునేవాడు.

బారి వీడియోలను సోషల్ మీడియాలో చూసిన వాయిస్ ఆఫ్ అమెరికా(వివోఏ) అతడి తెలివితేటలను పరీక్షించడానికి తమ కార్యాలయానికి ఆహ్వానించింది. తన తెలివితేటలతో వారిని 'వావ్' అనేలా చేశాడు.

'నాసా' కోసం వాషింగ్టన్‌డీసీకి వెళ్లిన బారి అక్కడ కొన్ని పీహెచ్‌డీ స్థాయి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. ఆ ఇంటర్వ్యూ వైరల్‌గా మారి అప్పట్లో ఇంటర్నెట్ సెన్సేషన్ అయింది.

'నాసా'కు చెందిన స్పేస్ స్టేషన్ రోబోల కోసం ప్రోగ్రామ్స్ రాసి 'అసాధారణ ప్రతిభ' అనిపించుకున్నాడు.

సోబోర్నో ప్రతిభకు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న గుర్తింపు చూసి తల్లిదండ్రులు ప్రఖ్యాత శాస్త్రవేత్త సర్ ఐజాక్ న్యూటన్ పేరులోని 'ఐజాక్'ను కుమారుడి పేరులో చేర్చారు.

అలా మన బాల మేధావి పేరు సోబోర్నో ఐజాక్ బారీగా మారింది.



గణితం, సైన్స్‌లలో అసాధారణ నైపుణ్యం ప్రదర్శిస్తున్న బారి రచయిత కూడా. ఏడు సంవత్సరాల వయసులో 70 పేజీల 'ది లవ్' అనే పుస్తకాన్ని రాశాడు. ఈ పుస్తకంలో మత సహనం, మతసామరస్యం, ప్రపంచశాంతిపై పది కథలు ఉన్నాయి.

'ఉగ్రవాదంలేని ప్రపంచం కోసం ఈ పుస్తకాన్ని రాశాను' అంటాడు బారి.

ముంబైలోని రుయా కళాశాలలో బారి విజిటింగ్ ప్రొఫెసర్.

2020లో ప్రతిష్ఠాత్మకమైన 'గ్లోబల్ చైల్డ్ ప్రాడజీ' అవార్డు అందుకున్నాడు.

తనకు ఇష్టమైన ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ చదవడం కోసం వచ్చే సంవత్సరం న్యూయార్క్ యూనివర్సిటీ(ఎన్‌వైయు)లో చేరనున్నాడు.

బ్రెయిన్ జిమ్

మన పొడుపు కథలు

1) ఉరుములు మెరుపులు లేకుండా
వానలు వరదలు లేకుండా
ఉత్తరాది చెరువు ఊరకనే నిండింది

2) ఆకు లేదు పోక లేదు నోరు ఎర్రన!
వాన లేదు వరద లేదు వరి పచ్చన!

జవాబు: 1) కొబ్బరికాయ 2) రామచిలక

మన తెలుగు

ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది.

ఈ వారం కొన్ని పదాలు...

కుడ్యం	గోడ
కుస్తుంబరి	కొత్తిమిరి
కూష్మాండము	గుమ్మడి
మెడిదము	సొండ్
మేఘనాదము	ఉరుము
మేను	శరీరము

భళిభళిరా భళి



హుండీ... తీసుకోండీ

బుజ్జి గుండెల్లో ఎంత దయ ఉంటుందంటే సముద్రం కూడా దాని ముందు చిన్నది. ఏం జరిగిందో తెలుసా? ఈ మధ్య కేరళలో వరదలొచ్చాయి కదా. చాలామంది ఇళ్లు కోల్పోయారు కదా. వారి హెల్ప్ ఎలా? అందరం డబ్బు పంపితే బాగుంటుంది. కాని చాలామంది పంపరు. అయితే తమిళనాడులోని తిరుచ్చి జిల్లాలో పి.కె.అగరం అనే ఊళ్లో ఉన్న పిల్లలు మేం సాయం చేస్తాం అని ముందుకొచ్చారు. ఇక్కడి ప్రభుత్వ ఆది ద్రావిడార్ వెల్ఫేర్ స్కూల్‌లో గత ఆరు నెలలుగా స్కూల్ హెడ్మాస్టర్ హుండీలిచ్చి రోజూ డబ్బు దాచుకోండి తర్వాత మీకు ఉపయోగపడుతుందంటే వాళ్లు రోజూ దాచుకుంటున్నారు. వారిలోని 12 మంది పిల్లలు తమ హుండీలు పగులగొట్టి ఎంత ఉంటే అంత కేరళకు పంపించాలనుకున్నారు. హెడ్మాస్టర్ గారికి చెప్పి, ఇంట్లో చెప్పి హుండీలు పగలగొడితే మొత్తం 10,669 రూపాయలు ఉన్నాయి. హెడ్మాస్టర్ గుండె పొంగింది. తల్లిదండ్రులు పిల్లల దయకు ఎంతో మెచ్చుకున్నారు. ఆ పన్నెండు మంది పిల్లల్ని తీసుకుని హెడ్మాస్టరు పోస్టాఫీసుకు వెళ్లి ఆ డబ్బును కేరళ పంపబోతే ఆ పోస్టాఫీసులో పోస్ట్‌మాస్టర్ లేచి ఆ చిన్నారులకు శాల్యూట్ చేశాడు. భలే. భళా భళే.

బిజినెస్ రీల్

ఉడాన్ స్కీము మరో పదేళ్లు పొడిగింపు!

న్యూఢిల్లీ: ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ స్కీము ఉడాన్‌ను మరో పదేళ్ల పాటు పొడిగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. అలాగే, సీప్లేన్ కార్యకలాపాల కోసం ఆపరేటర్లకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కల్పించే యోచన ఉన్నట్లు వివరించారు. 2017లో ప్రారంభమైన ఉడాన్ స్కీము రెండేళ్లలో ముగియనుండగా దాన్ని అవసరమైతే మరింత మెరుగుపర్చి, పొడిగించాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. దేశీయంగా విమానాలు, హెలికాప్టర్లు, సీప్లేన్లను డిజైన్ చేసి, తయారు చేసేలా కంపెనీలను ప్రభుత్వం ప్రోత్సహించనున్నట్లు మంత్రి చెప్పారు. సీప్లేన్ కార్యకలాపాలపై మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలు ఆసక్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. అక్టోబర్‌లో విజయవాడ నుంచి సీప్లేన్ల డెమో ఫ్లయిట్ల నిర్వహణ ఉంటుందని చెప్పారు.

లీడ్ గ్రూప్ ఆదాయం రూ. 370 కోట్లు

న్యూఢిల్లీ: స్కూల్ ఎడ్‌టెక్ సంస్థ లీడ్ గ్రూప్ గత ఆర్థిక సంవత్సరంలో రూ. 370 కోట్ల ఆదాయం ఆర్జించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 25 శాతం వృద్ధి నమోదు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎబిటాపరంగా బ్రేక్‌ఈవెన్ సాధించగలమని సంస్థ సీఈవో సుమీత్ మెహతా చెప్పారు. ప్రస్తుతం 8,000 పైచిలుకు స్కూళ్లతో కలిసి పని చేస్తున్నట్లు వివరించారు.

లివ్‌ప్యూర్‌కు రూ.233 కోట్ల నిధులు

హైదరాబాద్: డ్యూరబుల్స్ ఉత్పత్తుల తయారీ సంస్థ 'లివ్‌ప్యూర్' ఎంఅండ్‌జీ ఇన్వెస్ట్‌మెంట్స్ నుంచి రూ.208 కోట్లు, ఎంకుబేట్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ నుంచి రూ. 25 కోట్ల (మొత్తం రూ. 233 కోట్లు)పెట్టుబడులు సమీకరించినట్టు ప్రకటించింది. ఈ నిధుల దశ తమకు ఒక మైలురాయిగా నిలుస్తుందని, తదుపరి విస్తరణకు వీలు కల్పిస్తుందని లివ్‌ప్యూర్ తెలిపింది. పరిశోధన, అభివృద్ధి ద్వారా ఉత్పత్తుల అభివృద్ధికి, మరిన్ని ఉత్పత్తుల విడుదలకు ఈ నిధులు వెచ్చించనున్నట్టు పేర్కొంది. తద్వారా కస్టమర్ల అవసరాలను తీర్చే విధంగా మార్కెట్ భాగస్వామ్యాన్ని పెంచుకోనున్నట్టు ప్రకటించింది.

ఫోన్‌పే క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిజిటల్ పేమెంట్స్ దిగ్గజం ఫోన్‌పే తాజాగా క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ ప్రారంభించింది. బ్యాంకులు ఆఫర్ చేసే ప్రీ-అప్రూవ్డ్ క్రెడిట్ లైన్‌ను యూపీఐకి అనుసంధానించి కస్టమర్లు సులభంగా చెల్లింపులు జరుపవచ్చు. రుణాల విషయంలో యూపీఐపై రూపే క్రెడిట్ కార్డులు విజయవంతం అయిన తరువాత కంపెనీ నుంచి ఇది రెండవ ఉత్పాదన అని ఫోన్‌పే పేమెంట్స్ హెడ్ దీప్ అగర్వాల్ తెలిపారు. రుణ లభ్యత విషయంలో దేశంలో క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ సేవలు సంచలనం కలిగిస్తాయని అన్నారు. వినియోగదారు యూపీఐ ఖాతాకు క్రెడిట్ లైన్‌ను జోడించడం ద్వారా విభిన్న క్రెడిట్ కార్డ్‌లను వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. యూజర్లు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) యాప్ ద్వారా వర్తకులకు పేమెంట్స్ చేయవచ్చు. కస్టమర్ యూపీఐ లావాదేవీల ఆధారంగా బ్యాంకులు స్వల్పకాలిక ప్రీ-సాంక్షన్ క్రెడిట్ లైన్ ఆఫర్ చేస్తున్నాయి.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ-AUTO	10,384.45	4.74
COALINDIA	537.85	1.7
BHARTIARTL	1,510.00	1.59
TATAMOTORS	1,085.35	1.58
SUNPHARMA	1,775.00	1.39

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
LTIM	5,632.00	-1.27
WIPRO	513	-1.16
ONGC	318.6	-1.01
ASIANPAINT	3,155.00	-0.99
TITAN	3,571.00	-0.93

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	10,736
ఎన్ఎస్ఈ	1,17,927
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,96,915
ఎఫ్ఐఐ	+ 1,944
డీఐఐ	+ 2,896

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	74.40	$ 73.01
బ్రెంట్	78.64	$ 77.22

'మాల్స్' విక్రయాల్లో భారత్ టాప్

- ఎఫ్ఎంసీజీ, టెక్ డ్యూరబుల్స్‌లో రెండంకెల వృద్ధి
- ఆసియా పసిఫిక్ ప్రాంతంలో మొదటి స్థానం
- నీల్సన్ ఐక్యూ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ఆధునిక వాణిజ్య ఛానళ్ల ద్వారా విక్రయాల్లో ఆసియా పసిఫిక్ ప్రాంతంలోనే భారత్ అగ్రస్థానంలో ఉన్నట్టు నీల్సన్‌ఐక్యూ నివేదిక తెలిపింది. ఆధునిక అంగళ్లలో ఎఫ్ఎంసీజీ, టెక్నాలజీ డ్యూరబుల్స్ విక్రయాల పరంగా రెండంకెల వృద్ధి చూపిస్తున్న ఏకైక దేశం భారత్ అని.. ప్రీమియం ఉత్పత్తులకు ఆదరణ, పండుగల విక్రయాలు ఇందుకు సాయపడుతున్నట్టు పేర్కొంది. 40 శాతం ఎఫ్ఎంసీజీ అమ్మకాలు, 30 శాతం టెక్నాలజీ డ్యూరబుల్స్ విక్రయాలు ఆధునిక వాణిజ్య ఛానళ్ల ద్వారానే నమోదవుతున్నట్టు వెల్లడించింది. ఇది భారత వినియోగదారుల ప్రాధాన్యతలను తెలియజేస్తున్నట్టు నీల్సన్ ఐక్యూ నివేదిక పేర్కొంది. ఆన్‌లైన్ మార్కెట్ వేగంగా విస్తరిస్తున్నా కానీ, భారత వినియోగదారులకు ఆధునిక అంగళ్లు (సూపర్ మార్కెట్లు, హైపర్ మార్కెట్లు, డిపార్ట్‌మెంట్ స్టోర్లు) ప్రాధాన్య మార్గాలుగా ఉన్నట్టు తెలిపింది. ''ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ ఆధునిక వాణిజ్యం బలంగానే నమోదైంది. ధరల అస్థిరతలు ఉన్నప్పటికీ రెండంకెల వృద్ధి నమోదైంది. ప్రీమియం ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది''అని ఈ నివేదిక వివరించింది. ఎఫ్ఎంసీజీ, టెక్ డ్యూరబుల్స్ విక్రయాలకు పండగల సీజన్ కీలకమని పేర్కొంది. ఈ కాలంలోనే ఎఫ్ఎంసీజీ మొత్తం అమ్మకాల్లో 20 శాతం, టెక్నాలజీ డ్యూరబుల్స్ అమ్మకాల్లో 60 శాతం నమోదవుతున్నట్టు తెలిపింది. ఆహారోత్పత్తుల కంటే వీటి అమ్మకాలే ఆయా సీజన్‌లలో 1.8 రెట్లు అధికంగా ఉంటున్నట్టు పేర్కొంది. చిన్న తయారీ సంస్థల ఉత్పత్తులతోపాటు, రిటైలర్లు సొంతంగా నిర్వహించే ప్రైవేటు లేబుల్స్ రూపంలో పెద్ద కంపెనీలు సవాళ్లను ఎదుర్కొంటున్నట్టు ఈ నివేదిక ప్రస్తావించింది.

ప్రైవేటు లేబుళ్ల అమ్మకాలు

పెద్ద తయారీ సంస్థల ఉత్పత్తులతో పోల్చితే ప్రవేటు లేబుళ్ల అమ్మకాలు (రిటైల్ సంస్థల సొంత ఉత్పత్తులు) 1.5 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఇక చిన్న తయారీ సంస్థలు కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలో 70 శాతం వాటాను ఆక్రమిస్తున్నాయి''అని నీల్సన్ ఐక్యూ నివేదిక తెలిపింది. ఆధునిక చానళ్లలో సంప్రదాయంగా ఎఫ్ఎంసీజీలకు సంబంధించి పెద్ద ప్యాక్‌లకు ఆదరణ ఉంటుండగా, ఇది క్రమంగా చిన్న ప్యాక్‌ల వైపు మళ్లుతున్నట్టు వివరించింది.

రిలయన్స్ హోమ్‌పై సెబీ చర్యలకు కారణం ఏమిటి?




రిలయన్స్ హౌసింగ్ ఫైనాన్స్(ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్) నిధుల అక్రమ మళ్లింపులో అనిల్ అంబానీ ప్రధాన పాత్ర పోషించినట్లు సెబీ స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన ఆడిటింగ్ తదితరాల వివరాలను బయటపెట్టింది. వీటి ప్రకారం అప్పటి కంపెనీ బోర్డు గట్టిగా వ్యతిరేకించినప్పటికీ సంబంధిత యాజమాన్యం వీటిని పట్టించుకోలేదు. కంపెనీ విధానాలను వ్యతిరేకంగా రుణాలను విడుదల చేసింది. అసంపూర్తి డాక్యుమెంటేషన్, క్రెడిట్ పాలసీ నిబంధనల ఉల్లంఘన ద్వారా రుణ మంజూరీ జరిగింది. రుణ విడుదల అంశాలను సమీక్షిస్తూ బోర్డు ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ పెడచెవిన పెట్టారు. వెరసి సాధారణ కార్పొరేట్ రుణ విధానాలకు పాతరవేశారు. వీటన్నిటి వెనుక మాస్టర్‌మైండ్ అనిల్ అంబానీదేనని సెబీ అభిప్రాయపడింది. ఇతర వివరాలు ఇలా..

ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్ నిధుల అక్రమ మళ్లింపు జరిగినట్లు కంపెనీకి చట్టబద్ధ ఆడిటర్‌గా వ్యవహరించిన పీడబ్ల్యూసీ, ఫోరెన్సిక్ ఆడిటర్ గ్రాంట్ థార్న్‌టన్ వెల్లడించాయి. గ్రాంట్ థార్న్‌టన్‌ను రుణ దాతల కన్సార్షియంకు అధ్యక్షత వహించిన బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) నియమించింది. పీడబ్ల్యూసీ నివేదిక ప్రకారం సాధారణ కార్పొరేట్ లోన్ ప్రాడక్ట్‌లో భాగంగా విడుదల చేసిన రుణాలు ఒక్కసారిగా భారీగా పెరిగిపోయాయి. 2018 మార్చి31 కల్లా రూ. 900 కోట్ల రుణాలు విడుదలకాగా.. 2019 మార్చి31కల్లా రూ. 7,900 కోట్లకు జంప్ చేశాయి. రుణగ్రహీత సంస్థలలో నెగిటివ్ నెట్‌వర్త్, అతితక్కువ ఆదాయం, బిజినెస్ కార్యకలాపాలు, లాభార్జన లేకపోవడం తదితర పలు ప్రతికూలతలున్నాయి. ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్ నుంచి మాత్రమే రుణాలను పొందడం, రుణాలతో పోలిస్తే తక్కువ ఈక్విటీ మూలధనం, రుణాలు అందుకునే ముందుగానే ఏర్పాటుకావడం, రుణ దరఖాస్తు రోజునే రుణ మంజూరీ తదితర అక్రమాలు నెలకొన్నాయి. ఇక 2016 ఏప్రిల్ నుంచి 2019 జూన్‌వరకూ బీవోబీ చేపట్టిన ఫోరెన్సిక్ ఆడిట్ తొలి నివేదిక 2020 జనవరిలో వెలువడింది. ఈ కాలంలో కార్పొరేట్ రుణ విధానాలకింద ఆర్‌హెచ్‌ఎఫ్ఎల్ నుంచి రూ. 14,577 కోట్లకుపైగా రుణాలు విడుదలయ్యాయి. వీటిలో రూ. 12,487 కోట్లకుపైగా నిధులు సంబంధిత 47 సంస్థలకే చేరాయి. 2019 అక్టోబర్ 31కల్లా రూ. 7,984 కోట్ల రుణాలు వసూలుకావలసి ఉంటే.. దాదాపు రూ. 2,728 కోట్లు మొండిబకాయిలుగా నమోదయ్యాయి. తదుపరి నివేదికలలో గ్రూప్‌లోని పలు ఇతర కంపెనీలకు సైతం రుణాలు విడుదలైనట్లు నివేదిక పేర్కొంది.

పరస్పర సహకారం మరింతగా పెరగాలి

ఉపరాష్ట్రపతి ధన్‌కడ్



న్యూఢిల్లీ: భారత్, ఆఫ్రికా మధ్య మౌలిక సదుపాయాలు, స్పేస్, వ్యవసాయం, మైనింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాల్లో పరస్పర సహకారం మరింతగా పెరగాలని ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్ ఆకాంక్షించారు. ఇండియా-ఆఫ్రికా సదస్సులో మాట్లాడుతూ డ్యూటీ-ఫ్రీ టారిఫ్ ప్రిఫరెన్స్ (డీఎఫ్‌టీపీ) స్కీముతో ఇరు దేశాలు అభివృద్ధి చెందడానికి అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పుష్కలంగా సహజ వనరులు, ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా పెరుగుతున్న ఆర్థిక సమగ్రత తదితర అంశాల కారణంగా పెట్టుబడులకు ఆఫ్రికా ఆకర్షణీయమైన కేంద్రంగా ఉంటోందని ధన్‌కడ్ చెప్పారు. అలాగే, కొత్త తరం డిజిటల్ టెక్నాలజీలు, అంతరిక్ష రంగంలాంటి విషయాల్లో భారత్‌తో ఆఫ్రికా సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవచ్చన్నారు. సీఐఐ ఇండియా-ఆఫ్రికా బిజినెస్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ధన్‌కడ్ ఈ విషయాలు వివరించారు. 43 ఆఫ్రికా దేశాల్లో 203 ఇన్‌ఫ్రా ప్రాజెక్టులపై భారత్ 12.37 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసినట్లు చెప్పారు. 85 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యంతో ఆఫ్రికాకు భారత్ నాలుగో అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంటోందని వివరించారు. స్వచ్ఛ సాంకేతికత, వాతావరణ మార్పులను ఎదుర్కొని నిలవగలిగే సాగు విధానాలు, తీర ప్రాంత గస్తీ, కనెక్టివిటీ వంటి విభాగాల్లో భారత్, ఆఫ్రికా కలిసి పని చేయొచ్చని ధన్‌కడ్ చెప్పారు.

లిస్టెడ్ ఎస్ఎంఈల ఆడిటింగ్‌లో మరింత జాగ్రత్త వహించాలి

సీఏలకు సెబీ హోల్‌టైమ్ సభ్యుడు భాటియా సూచన



ముంబై: ఎస్ఎంఈ ఎక్స్ఛేంజీల్లో లిస్టయిన సంస్థలను ఆడిట్ చేసేటప్పుడు మరికాస్త ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని చార్టర్డ్ అకౌంటెంట్లకు (సీఏ) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ హోల్‌టైమ్ సభ్యుడు అశ్వని భాటియా సూచించారు. భవిష్యత్తులో ఇవే కంపెనీలు ప్రధాన సూచీల్లో భాగమయ్యే అవకాశాలు ఉండటమే ఇందుకు కారణమని ఆయన పేర్కొన్నారు. ఎస్ఎంఈ ప్లాట్‌ఫాం పురోగతిపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. దీని ద్వారా సంస్థలు రూ. 14,000 కోట్లు సమీకరించగా, ఇందులో రూ. 6,000 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరంలోనే సేకరించినట్లు వివరించారు. సీఏలు డాక్టర్లలాంటివారని, కంపెనీలు పద్ధతిగా పనిచేసేలా చూసేందుకు వారు ప్రాథమిక స్థాయి నియంత్రణ సంస్థలుగా వ్యవహరిస్తారని భాటియా చెప్పారు. సెబీ చేపట్టే దర్యాప్తులు ఒకోసారి పూర్తి కావడానికి ఏడాది పైగా పట్టేస్తుందని, సీఏలంతా తమ పని తాము సక్రమంగా చేస్తే ఇదంతా అవసరమే ఉండదని ఆయన పేర్కొన్నారు.

ఇళ్ల ధరల జోరులో ముంబై నంబర్ 2

- ఢిల్లీకి మూడో స్థానం
- అంతర్జాతీయ స్థాయి ర్యాంకులు
- నైట్‌ఫ్రాంక్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఇళ్ల ధరల పెరుగదలలో ముంబై రియల్టీ మార్కెట్ రెండో స్థానం నిలిచింది. ఢిల్లీ మూడో స్థానంలో ఉన్నట్టు జూన్ త్రైమాసికానికి సంబంధించిన నైట్‌ఫ్రాంక్ నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 44 ప్రముఖ నగరాల్లోని ఇళ్ల ధరల పెరుగుదల వివరాలను నైట్‌ఫ్రాంక్ విడుదల చేసింది. జూన్ త్రైమాసికంలో ఈ నగరాల్లో ఇళ్ల ధరల పెరుగుదల 2.6 శాతానికి పరిమితమైనట్టు తెలిపింది. ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో పెరుగుదల రేటు 4.1 శాతంగా ఉండడం గమనార్హం. ఇళ్ల ధరల పెరుగుదలలో మనీలా మొదటి స్థానంలో నిలిచింది. అక్కడ 26 శాతం మేర వృద్ధి నమోదైంది. ముంబైలో ఇళ్ల ధరలు 13 శాతం మేర జూన్ త్రైమాసికంలో పెరిగాయి. దీంతో ఏడాది క్రితం ఆరో ర్యాంక్‌లో ఉన్న ముంబై 2కు చేరుకుంది. ఇక ఢిల్లీలో ఇళ్ల ధరలు 10.6 శాతం పెరగడంతో, ఏడాది క్రితం ఉన్న 26వ ర్యాంక్ నుంచి మూడో స్థానానికి ఎగబాకింది. బెంగళూరులో ఇళ్ల ధరలు జూన్ క్వార్టర్‌లో వార్షికంగా 3.7 శాతం మేర పెరిగాయి. దీంతో 15వ ర్యాంక్ సొంతం చేసుకుంది.

టాప్-10లో ఇవే..

లాస్ ఏంజెలెస్‌లో 8.9 శాతం (4వ ర్యాంక్), మియామీలో 7.1 శాతం (5వ ర్యాంక్), నైరోబీలో 6.6 శాతం (ఆరో స్థానం), మ్యాడ్రిడ్‌లో 6.4 శాతం (ఏడో స్థానం), లిస్బాన్‌లో 4.7 శాతం (ఎనిమిదో స్థానం), సియోల్‌లో 4.6 శాతం (తొమ్మిదో స్థానం), శాన్ ఫ్రాన్సిస్కోలో 4.5 శాతం (10వ స్థానం) చొప్పున జూన్ త్రైమాసికంలో ఇళ్ల ధరలు పెరిగినట్టు నైట్ ఫ్రాంక్ నివేదిక వెల్లడించింది. దుబాయిలో 2020 సంవత్సరం నుంచి ఇళ్ల ధరలు 124 శాతం పెరగ్గా.. జూన్ క్వార్టర్‌లో 0.3% మేర తగ్గాయి. వియన్నాలో 3.2%, బ్యాంకాక్‌లో 3.9 శాతం చొప్పున ఇదే కాలంలో ఇళ్ల ధరలు తగ్గాయి.

డిపాజిట్లు తగ్గడం సవాలు కాదు

- రుణాల డిమాండ్‌కు సరిపడా వనరులు ఉన్నాయ్
- పెట్టుబడుల్లో కొంత వెనక్కి తీసుకుంటాం: ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ ఖరా



ముంబై: రుణాలకు ఉన్న డిమాండ్‌ను తాము అందుకోగలమని, అందుకు సరిపడా వనరులు ఉన్నాయని ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ ఖరా చెప్పారు. రుణాల వృద్ధికి సరిపడా డిపాజిట్లు బ్యాంకుల్లోకి రావడం లేదన్న ఆందోళనల నేపథ్యంలో ఖరా దీనిపై స్పష్టత ఇచ్చారు. డిపాజిట్లలో వృద్ధి తగ్గుదల తమకు సవాలు కాబోదన్నారు. ప్రభుత్వ సెక్యూరిటీల్లో అదనంగా ఉంచిన పెట్టుబడులను వెనక్కి తీసుకున్నామని, రుణాల వృద్ధికి ఈ వనరులను వినియోగిస్తామని ఖరా స్పష్టం చేశారు. బ్యాంకుల్లో రుణాల వృద్ధికి సరిపడా డిపాజిట్లు రాని పరిస్థితి రెండేళ్లుగా నెలకొంది. ఇందుకు ఎస్‌బీఐ కూడా అతీతమేమీ కాకపోవడం గమనార్హం. దీంతో డిపాజిట్లను ఆకర్షించేందుకు బ్యాంకులు నానా తంటాలు పడుతున్నాయి. డిపాజిట్లు ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా చొరవ చూపించాలంటూ ఇటీవలే కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ అన్ని ప్రభుత్వరంగ బ్యాంక్‌లకు సూచించడం ఈ పరిణామాల్లో భాగమే. అధిక రాబడులు వచ్చే సాధనాల్లోకి నిధులు మళ్లుతుండడమే బ్యాంకుల్లో డిపాజిట్ల వృద్ధి క్షీణతకు కారణమని నిపుణులు అంటున్నారు.

రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు

ప్రస్తుత పరిస్థితి ఎంత మేర ఆందోళనకరమన్న ప్రశ్నకు ఖరా స్పందిస్తూ.. ''రుణ వృద్ధికి సరిపడా సేవలు అందించే స్థితిలోనే ఉన్నాం. రుణాల డిమాండ్‌ను తీర్చగలిగినంత వరకు అది మాకు సవాలుగా పరిణమించదు''అని వివరించారు. ఎంత రేటు ఆఫర్ చేయడం ద్వారా డిపాజిట్లను ఆకర్షించొచ్చన్న ప్రశ్నకు సూటిగా కాకుండా.. తమ నిధుల సమీకరణ వ్యూహాలను ఖరా వెల్లడించారు. తమకు రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు ఉన్నాయంటూ.. స్టాట్యుటరీ లిక్విడిటీ రేషియో (ఎస్ఎల్ఆర్)లో కొంత భాగాన్ని వెనక్కి తీసుకోవడం ద్వారా రుణ డిమాండ్‌ను తీర్చగలమన్నారు. పెట్టుబడుల కంటే రుణాలపైనే ప్రస్తుతం రాబడులు ఎక్కువగా ఉన్నట్టు చెప్పారు. ఇలాంటి పరిస్థితే 2003-04 లోనూ ఉందన్నారు.

యువతకు ఫ్లిప్ కార్ట్ నైపుణ్య శిక్షణ



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వేలాది మంది యువతీ, యువకులకు ఫ్లిప్‌కార్ట్ సప్లయ్ చైన్ ఆపరేషన్స్ అకాడమీ (ఎస్‌సీఓఏ) నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనుంది. ఇందుకు గాను కేంద్ర నైపుణ్యాభివృద్ధి కల్పన శాఖతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ కామర్స్, సరఫరా వ్యవస్థ తదితర విభాగాల్లో ఉద్యోగ నైపుణ్యాలపై 'ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 కింద శిక్షణ ఇవ్వనున్నట్టు ఫ్లిప్‌కార్ట్ ప్రకటించింది. కళాకారులు, చేనేతలు, స్వయం ఉపాధి సంఘాల మహిళలు, మహిళలు, గ్రామీణ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సాధికారత దిశగా ఐదేళ్ల మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా ఫ్లిప్‌కార్ట్ ఒక కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా అవగాహన ఒప్పందంపై ఫ్లిప్‌కార్ట్ ఎస్‌సీఓఏ, నైపుణ్య శిక్షణాభివృద్ధి శాఖ అధికారులు సంతకాలు చేశారు. 250 మంది వరకు పారిశ్రామికవేత్తలు, కళాకారులు, విక్రయదారులు, చేనేత కార్మికులు, స్వయం స్వహాయక మహిళలు ఈ కార్యక్రమానికి హాజరైనట్టు ఫ్లిప్‌కార్ట్ ప్రకటించింది.

డెలివరీ పార్ట్‌నర్స్‌కు విశ్రాంతి కేంద్రాలు

ఏర్పాటు చేయనున్న అమెజాన్



న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా డెలివరీ పార్ట్‌నర్స్ కోసం విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. ప్రాజెక్ట్ ఆశ్రయ్ పేరుతో దేశవ్యాప్తంగా రాబోయే సంవత్సరాల్లో వీటిని అందుబాటులోకి తేనున్నట్టు తెలిపింది. తాగు నీరు, ఫోన్ చార్జింగ్ స్టేషన్స్, వాష్ రూమ్స్, విశ్రాంతి ప్రదేశం ఈ కేంద్రాల్లో ఉంటాయని వివరించింది. ఉద్యాన ఫౌండేషన్ సహకారంతో ప్రయోగాత్మకంగా ఢిల్లీ, ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబైలో ముందుగా ఇవి రానున్నాయి. తాము కార్యకలాపాలు సాగిస్తున్న అన్ని నగరాల్లో వీటిని ఏర్పాటు చేయాలన్నది ప్రణాళిక అని అమెజాన్ ఇండియా ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ అభినవ్ సింగ్ తెలిపారు. దేశవ్యాప్తంగా కంపెనీకి 1,800 డెలివరీ స్టేషన్స్ ఉన్నాయని చెప్పారు. ఇతర కంపెనీలకు చెందిన డెలివరీ ప్రతినిధులు సైతం ఈ కేంద్రాల్లో విశ్రాంతి తీసుకోవచ్చు. ఒకేసారి 15 మంది వరకు విశ్రాంతి పొందవచ్చు. ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు ఈ కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. ఒక్కో డెలివరీ ప్రతినిధి రోజులో 30 నిముషాలు మాత్రమే ఇక్కడ గడపవచ్చు. ప్రాజెక్ట్ ఆశ్రయ్‌లో భాగంగా ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంలో సైతం విశ్రాంతి కేంద్రాలను నెలకొల్పాలని అమెజాన్ భావిస్తోంది.

యాక్సిస్ బ్యాంక్ నుంచి నియో ఫర్ మర్చంట్స్ యాప్



ముంబై: ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ తాజాగా వ్యాపారవర్గాల కోసం నియో ఫర్ మర్చంట్స్ యాప్‌ను ఆవిష్కరించింది. వీసా, మింట్‌ఓక్ సంస్థల భాగస్వామ్యంతో దీన్ని ప్రవేశపెట్టినట్లు బ్యాంకు తెలిపింది. పేమెంట్లను స్వీకరించేందుకు, వ్యాపార విశ్లేషణకు ఉపయోగపడే లావాదేవీల నివేదికలను చూసుకునేందుకు, రిలేషన్‌షిప్ మేనేజర్‌పై ఆధారపడాల్సిన అవసరం లేకుండా సర్వీస్ రిక్వెస్ట్‌లను పంపేందుకు ఈ యాప్ సహాయకరంగా ఉంటుందని యాక్సిస్ బ్యాంకు తెలిపింది. దేశవ్యాప్తంగా చిన్న, మధ్య తరహా సంస్థలతో పటిష్టమైన సంబంధాలు ఏర్పర్చుకునేందుకు, వాటి వ్యాపార వృద్ధికి దోహదపడేందుకు ఈ యాప్ ఉపయోగపడగలదని యాక్సిస్ బ్యాంక్ ప్రెసిడెంట్ సంజీవ్ మొఘె వివరించారు. 2024 జూన్ ఆఖరు నాటికి 20.8 శాతం పీవోఎస్ టెర్మినల్ మార్కెట్ వాటాతో మర్చంట్ అక్వైరింగ్ వ్యాపార విభాగంలో తమ బ్యాంకు అతి పెద్ద సంస్థగా ఉన్నట్లు పేర్కొన్నారు.

బిర్లా ఫెర్టిలిటీ చేతికి బేబీసైన్స్ ఐవీఎఫ్ క్లినిక్స్

న్యూఢిల్లీ: బిర్లా ఫెర్టిలిటీ అండ్ ఐవీఎఫ్ (బీఎఫ్ఐ) తాజాగా 12 బేబీసైన్స్ ఐవీఎఫ్ క్లినిక్స్‌ను కొనుగోలు చేసింది. తద్వారా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు మార్కెట్లలో ప్రవేశించింది. ఈ డీల్‌తో దేశవ్యాప్తంగా బీఎఫ్ఐ నిర్వహిస్తున్న క్లినిక్స్ సంఖ్య 50కి చేరింది. దాదాపు రూ. 500 కోట్లతో తలపెట్టిన కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఈ డీల్ కుదుర్చుకున్నట్లు బీఎఫ్ఐ తెలిపింది.

మ్యాప్‌మైఇండియా ఆరోపణల్లో విశ్వసనీయత లేదు..

- లీగల్ నోటీసు పంపించినా వారు స్పందించలేదు
- ఓలా సహ-వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్





న్యూఢిల్లీ: మ్యాప్‌లను కాపీ చేశారంటూ మ్యాప్‌మైఇండియా తమపై చేస్తున్న ఆరోపణల్లో విశ్వసనీయత లేదని ఓలా సహ-వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్ వ్యాఖ్యానించారు. ఓలా ఎలక్ట్రిక్ లిస్టింగ్‌ను అడ్డం పెట్టుకుని లబ్ధి పొందేందుకే ఆ కంపెనీ తమపై మ్యాప్‌ల కాపీయింగ్ ఆరోపణలు చేసిందని ఆయన పేర్కొన్నారు. తాము లీగల్ నోటీసు పంపినా మ్యాప్‌మైఇండియా నుంచి ఎటువంటి సమాధానం రాలేదని అగర్వాల్ పేర్కొన్నారు. సొంతంగా దేశీ నావిగేషన్ మ్యాప్ తయారు చేశామంటూ ఓలా మాతృసంస్థ ఏఎన్ఐ టెక్నాలజీస్ ప్రకటించడం ఓ గిమ్మిక్కు అంటూ మ్యాప్‌మైఇండియా ఆరోపించడం వివాదానికి దారి తీసిన సంగతి తెలిసిందే. ఓలా ఎలక్ట్రిక్ ఐపీవో సంబంధ ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేయడానికి మూడు రోజుల ముందు జూలై 23న మ్యాప్‌మైఇండియా ఆ సంస్థకు నోటీసులు పంపింది. ఓలా ఎలక్ట్రిక్ ఆగస్టు 9న లిస్టయింది. ఈ నేపథ్యంలోనే అగర్వాల్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తాము చాలాకాలంగా రైడ్ షేరింగ్ వ్యాపారంలో ఉన్నందున తమ దగ్గర మ్యాపింగ్‌కి సంబంధించిన డేటా..టెక్నాలజీ బోలెడంత ఉందని, ఒక సంస్థను కూడా కొనుగోలు చేశామని అగర్వాల్ తెలిపారు. బహుశా మ్యాప్‌మైఇండియా కస్టమర్లు ఓలా మ్యాప్స్ వైపు మళ్లుతున్నారేమోనని, ఇది సమస్యగా మారడం వల్లే ఆ కంపెనీ తమపై ఆరోపణలు చేస్తోందని అగర్వాల్ పేర్కొన్నారు.

రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడులు

సిమెంట్ రంగంపై క్రిసిల్ నివేదిక





హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి భారత సిమెంట్ పరిశ్రమ 2027 మార్చి నాటికి రూ.1.25 లక్షల కోట్లు పెట్టుబడి చేయనుందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ నివేదిక తెలిపింది. ఈ కాలంలో 130 మిలియన్ టన్నుల సిమెంట్ గ్రైండింగ్ సామర్థ్యం తోడవుతోందని వెల్లడించింది. ఇది ప్రస్తుతం ఉన్న సామర్థ్యంలో 20 శాతానికి సమానం అని వివరించింది. క్రిసిల్ నివేదిక ప్రకారం.. ఆరోగ్యకర డిమాండ్ దృక్పథం, మార్కెట్ వాటా కోసం పోటీ ఈ పెట్టుబడులను నడిపిస్తాయి. తక్కువ మూలధన వ్యయాలు, బలమైన బ్యాలెన్స్ షీట్లు కంపెనీల క్రెడిట్ ప్రొఫైల్స్‌ను స్థిరంగా ఉంచుతాయి. అంచనా వేసిన పెట్టుబడులు గత మూడు ఆర్థిక సంవత్సరాలలో చేసిన క్యాపెక్స్ కంటే 1.8 రెట్లు ఉంటుంది. అయినప్పటికీ తయారీదారుల క్రెడిట్ రిస్క్ ప్రొఫైల్‌లు స్థిరంగా ఉంటాయి.

దశాబ్దంలో గరిష్టంగా..

గత మూడు ఆర్థిక సంవత్సరాలలో సిమెంట్ డిమాండ్‌లో ఆరోగ్యకరంగా 10 శాతం వార్షిక పెరుగుదల.. సామర్థ్యం జోడింపును మించిన వృద్ధిని సాధించింది. 2023-24లో వినియోగ స్థాయి ఈ దశాబ్దంలో గరిష్టంగా 70 శాతానికి చేర్చింది. ఇది సిమెంట్ తయారీదారులను 'క్యాపెక్స్ పెడల్‌ను నొక్కడానికి' ప్రేరేపించింది. 2024 మార్చి 31 నాటికి పరిశ్రమ స్థాపిత సిమెంట్ గ్రైండింగ్ సామర్థ్యంలో 80 శాతానికి పైగా కైవసం చేసుకున్న 20 సిమెంట్ తయారీ సంస్థల విశ్లేషణ ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్టు క్రిసిల్ తెలిపింది.

డిమాండ్ ఔట్‌లుక్..

సిమెంట్ పరిశ్రమ మూలధన వ్యయాలు ఇప్పటికీ తక్కువగా ఉన్నాయి. 2025-26, 2026-27 ఆర్థిక సంవత్సరాలలో 0.7-0.9 శ్రేణిలో ఉండొచ్చు. ఇది గత మూడు ఆర్థిక సంవత్సరాల మాదిరిగానే ఉంది. 2025-2029 ఆర్థిక సంవత్సరాల్లో 7 శాతం వార్షిక వృద్ధి రేటుతో సిమెంట్ డిమాండ్ ఔట్‌లుక్ ఆరోగ్యంగా ఉంది. రాబోయే మూడు ఆర్థిక సంవత్సరాల్లో క్యాపెక్స్‌లో వృద్ధి ప్రధానంగా పెరుగుతున్న డిమాండ్‌తోపాటు.. దేశవ్యాప్తంగా ఉనికిని మెరుగుపరుచుకోవాలనే సిమెంట్ తయారీదారుల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్, డిప్యూటీ చీఫ్ రేటింగ్స్ ఆఫీసర్ మనీష్ గుప్తా తెలిపారు. సిమెంట్ తయారీదారుల సంఘం (సీఎంఏ) ప్రకారం దేశంలో స్థాపిత సిమెంట్ సామర్థ్యం 670 మిలియన్ టన్నులు.

బ్రేక్ ముగిసింది... స్టీరింగ్ పిలుస్తోంది



వెర్‌స్టాపెన్

200 రెడ్‌బుల్ రేసర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (నెదర్లాండ్స్) కెరీర్‌లో ఇది 200వ రేసు. ఫార్ములావన్ చరిత్రలో 200 రేసులు పూర్తి చేసుకోనున్న 23వ డ్రైవర్‌గా వెర్‌స్టాపెన్ గుర్తింపు పొందనున్నాడు. 392 రేసులతో ఫెర్నాండో అలోన్సో అగ్రస్థానంలో ఉన్నాడు.

ఫార్ములావన్ సీజన్‌లో వరుసగా ఐదు నెలలపాటు ట్రాక్‌పై రయ్..రయ్.. రయ్ మంటూ దూసుకెళ్లిన కార్లకు గత 26 రోజులుగా విరామం లభించింది. విరామం ముగియడంతో మళ్లీ ట్రాక్‌పైకి రావడానికి కార్లు, డ్రైవర్లు సిద్ధమయ్యారు. మొత్తం 24 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 14 రేసులు ముగిశాయి. 15వ రేసుకు నెదర్లాండ్స్‌లోని జాండ్‌వర్ట్ సర్క్యూట్ ముస్తాబయింది. శుక్రవారం డ్రైవర్లందరూ ప్రాక్టీస్ చేశారు. శనివారం క్వాలిఫయింగ్ సెషన్‌ను నిర్వహిస్తారు. ఆదివారం ప్రధాన రేసు జరుగుతుంది. సీజన్‌లోని తొలి అర్ధభాగంలో డిఫెండింగ్ వరల్డ్ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఆధిపత్యం చలాయించి ఏడు రేసుల్లో గెలిచాడు. రెండో భాగంలో మిగిలిన పది రేసుల్లో ఇతర జట్ల డ్రైవర్లు గేర్ మార్చి వెర్‌స్టాపెన్ దూకుడుకు బ్రేక్‌లు వేస్తారా లేదా వేచి చూడాలి.

నేడు డచ్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ సెషన్

- సీజన్‌లో 15వ ఫార్ములావన్ రేసుకు అంతా సిద్ధం
- సొంతగడ్డపై వరుసగా నాలుగో విజయంపై వెర్‌స్టాపెన్ గురి
- ఈ సీజన్‌లోని 14 రేసుల్లో ఏడింటిలో గెలిచిన రెడ్‌బుల్ డ్రైవర్
- గత నాలుగు రేసుల్లో దక్కని విజయం
- నోరిస్, లెక్‌లెర్క్, పియాస్ట్రి నుంచి పోటీ



జాండ్‌వర్ట్ (నెదర్లాండ్స్): గత మూడేళ్లుగా సొంతగడ్డపై రెడ్‌బుల్ జట్టు డ్రైవర్, నెదర్లాండ్స్ స్టార్ మాక్స్ వెర్‌స్టాపెన్‌కు ఎదురులేదు. స్వదేశంలో 'హ్యాట్రిక్' విజయాలతో జోరు మీదున్న వెర్‌స్టాపెన్ వరుసగా నాలుగోసారి టైటిల్ సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు. 2021 సీజన్‌తో ఫార్ములావన్ క్యాలెండర్‌లో తిరిగి వచ్చిన డచ్ గ్రాండ్‌ప్రిలో ఈసారీ గెలిచి అత్యధికసార్లు ఈ రేసు నెగ్గిన జిమ్ క్లార్క్ సరసన చేరాలని వెర్‌స్టాపెన్ భావిస్తున్నాడు. జిమ్ క్లార్క్ 1963, 1964, 1965, 1967లో డచ్ గ్రాండ్‌ప్రి చాంపియన్‌గా నిలవగా.. వెర్‌స్టాపెన్ 2021 నుంచి 2023 వరకు మూడేళ్ల పాటు వరుసగా విజయాలు సాధించాడు. గత మూడు రేసుల్లోనూ పై (టాప్–3) నిలవగా... నోరిస్ ఎనిమిదిసార్లు ఆ ఘనత సాధించాడు.

'పోల్ పొజిషన్'తో ప్రధాన రేసు ప్రారంభించిన 26 ఏళ్ల వెర్‌స్టాపెన్‌కు ఇది కెరీర్‌లో 200వ రేసు కావడం విశేషం. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన 14 రేసుల్లో ఏడింటిలో నెగ్గిన వెర్‌స్టాపెన్... డ్రైవర్స్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 277 పాయింట్లతో ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. ఇటీవలి కాలంలో నిలకడైన ప్రదర్శన చేస్తున్న బ్రిటన్ డ్రైవర్ లాండో నోరిస్ (మెక్‌లారెన్) 199 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా... చార్లెస్ లెక్‌లెర్క్ (ఫెరారీ) 177 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. మెర్సిడెస్ రేసర్ లూయిస్ హామిల్టన్ 150 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నాడు. ఈ ఏడాది వెర్‌స్టాపెన్ అత్యధికంగా తొమ్మిదిసార్లు పోడియం

ట్రాక్ ఎలా ఉందంటే!

ఇసుక దిబ్బలకు ప్రసిద్ధి అయిన జాండ్‌వర్ట్‌లో ఈ రేసు జరగనుంది. సముద్ర తీరానికి అతి సమీపంలోని రిసార్ట్‌లోని అహ్లాదకర వాతావరణం అటు అభిమానులను, ఇటు రేసర్లను మరింత ఉత్సాహపరచనుంది. అనూహ్య మలుపులు, ఊహించని ఎత్తుపల్లాలతో డ్రైవర్లకు ఈ ట్రాక్ సవాలు విసరనుంది.

72 ల్యాప్‌లు..

డచ్ గ్రాండ్‌ప్రి సర్క్యూట్‌లో మొత్తం 72 ల్యాప్‌లు ఉన్నాయి. అందులో ఒక్కో ల్యాప్ 4.2 కిలోమీటర్లు కాగా... పూర్తి రేసు దూరం 307 కిలోమీటర్లు.

హామిల్టన్‌దే రికార్డు

డచ్ గ్రాండ్‌ప్రిలో అత్యంత వేగంగా ల్యాప్ పూర్తి చేసిన రికార్డు బ్రిటన్ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ పేరిట ఉంది. 2021 రేసులో భాగంగా హామిల్టన్ 1 నిమిషం 11.097 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేశాడు.

డ్రైవర్ల పాయింట్ల పట్టిక

స్థానం	డ్రైవర్	జట్టు	పాయింట్లు
1	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	277
2	నోరిస్	మెక్‌లారెన్	199
3	లెక్‌లెర్క్	ఫెరారీ	177
4	పియాస్ట్రి	మెక్‌లారెన్	167
5	సెయింజ్	ఫెరారీ	162
6	హామిల్టన్	మెర్సిడెస్	150
7	పెరెజ్	రెడ్‌బుల్	131
8	జార్జ్ రసెల్	మెర్సిడెస్	116
9	అలెన్సో	ఆస్టన్ మార్టిన్	49
10	స్ట్రోల్	ఆస్టన్ మార్టిన్	24

"సొంతగడ్డపై పోటీ పడేటప్పుడు కాస్త ఒత్తిడి ఉండటం సహజమే. గత ఏడాది ఇక్కడ పోటీ పడ్డప్పుడు పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగి విజేతగా నిలిచా. ఈ సారి ఇంకా ఎక్కువ పోటీ ఉండనుంది. మరింత మెరుగయ్యేందుకు ప్రయత్నిస్తా.

–వెర్‌స్టాపెన్, రెడ్‌బుల్ డ్రైవర్

నేటి క్వాలిఫయింగ్ సెషన్
సాయంత్రం గం. 6:30 నుంచి
ఫ్యాన్ కోడ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



గుకేశ్, ప్రజ్ఞానంద ఖాతాలో నాలుగో 'డ్రా'

సెయింట్ లూయిస్: సింక్‌ఫీల్డ్ కప్ క్లాసికల్ చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు, ప్రజ్ఞానంద 'డ్రా'ల పరంపరను కొనసాగిస్తున్నారు. వరుసగా నాలుగో గేమ్‌లోనూ ఈ ఇద్దరు స్టార్స్ ప్రత్యర్థులను నిలువరించారు. అనీశ్ గిరి (నెదర్లాండ్స్)తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 33 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించగా... ఫిరూజా అలీరెజా (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌ను గుకేశ్ 73 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్ల పాటు జరుగుతున్న ఈ టోర్నీలో నాలుగో రౌండ్ తర్వాత గుకేశ్ రెండు పాయింట్లతో మూడో ర్యాంక్‌లో నిలిచాడు. ప్రజ్ఞానంద కూడా రెండు పాయింట్లతో ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్నాడు. రెండు పాయింట్లతో ఆరుగురు ఆటగాళ్లు సంయుక్తంగా మూడో ర్యాంక్‌లో ఉండగా... మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా ప్రజ్ఞానంద ఎనిమిదో స్థానంలో నిలిచాడు. 2.5 పాయింట్లతో వెస్లీ సో (అమెరికా), అలీరెజా సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

జై షా వారసుడెవరో!

- రేసులో రాజీవ్ శుక్లా, అరుణ్ ధుమల్, ఆశిష్ షెలార్
- ఐసీసీ చైర్మన్ పదవి కోసం ప్రస్తుత బీసీసీఐ కార్యదర్శి జై షా ప్రయత్నాలు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్ పదవి రేసులో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి జై షా ఒక్కడి పేరే బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో తదుపరి భారత బోర్డులో ఆయన వారసుడు ఎవరనే చర్చ అప్పుడే మొదలైంది. ఐసీసీలో మొత్తం 16 మంది సభ్యుల్లో 15 మంది జై షాకు అనుకూలంగా ఉండటంతో చైర్మన్ పదవి ఏకగ్రీవంతో దక్కనుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. అయితే బీసీసీఐలో రెండోసారి కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన పదవీకాలం మరో ఏడాది మిగిలుంది. ఈ నేపథ్యంలో బీసీసీఐలో జై షా వారసుడెవరనే చర్చలో ప్రముఖంగా సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, సంయుక్త కార్యదర్శి ఆశిష్ షెలార్, ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమల్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ ముగ్గురిలో కీలకమైన కార్యదర్శి పదవి ఎవరిని వరిస్తుందో చూడాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు. ఎందుకంటే ప్రస్తుత ఐసీసీ చైర్మన్ గ్రెగ్ బార్‌క్లే పదవీకాలం నవంబర్ 30 వరకు ఉంది. కొత్త చైర్మన్ ఎన్నిక కోసం ఈ నెల 27తో నామినేషన్ల గడువు ముగుస్తుంది. ఎన్నికైన వ్యక్తి డిసెంబర్ 1 తర్వాతే పదవీ బాధ్యతలు చేపడతారు. దీంతో ఇంకో మూడు నెలల వరకు జై షా బీసీసీఐ పదవిని అట్టిపెట్టుకునే అవకాశముంది.



కిప్‌జెన్

'శాఫ్' టోర్నీ సెమీస్‌లో భారత్

కాఠ్మండు: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్–20 చాంపియన్‌షిప్‌లో భారత జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గ్రూప్ 'బి' లో శుక్రవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 1–0 గోల్ తేడాతో మాల్దీవులు జట్టుపై గెలిచింది. మ్యాచ్ ఆరంభం నుంచి భారత స్ట్రయికర్లు తమ దాడులకు పదును పెట్టారు. కొరౌ సింగ్, కెల్విన్ సింగ్ టోరెమ్ ప్రత్యర్థి గోల్‌పోస్ట్ లక్ష్యంగా కదంతొక్కారు. ఈ క్రమంలో కెల్విన్ కొట్టిన షాట్‌ను ఎబందస్ యేసుదాసన్ గోల్‌గా మలిచేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. తర్వాత కాసేపటికి గుర్నాజ్ సింగ్ ఇచ్చిన కార్నర్ పాస్‌ను మోనిరుల్ హెదర్ గోల్ పోస్ట్‌ను చేరలేకపోయింది. అయినా సరే భారత యువ స్ట్రయికర్లు నిరాశచెందక తమ ప్రయత్నాలను కొనసాగించారు. 18వ నిమిషంలో కొరౌ, 47వ నిమిషంలో కెల్విన్ గోల్ కోసం చేసిన ప్రయత్నాలేవీ ఫలితమివ్వలేదు. రెండో అర్ధభాగంలోను గోల్ చేయడం కష్టంగా మారింది. చివరకు ఇంజ్యూరీ టైమ్ (90+5వ నిమిషం)లో మంగ్లెంతంగ్ కిప్‌జెన్ చేసిన గోల్ భారత్‌ను గెలిపించింది. ఫినిషింగ్ లోపాలతో గోల్స్‌గా మలచలేకపోయినప్పటికీ కొరౌ సింగ్, కెల్విన్, ఎబిందస్‌లు తమ ఆటతీరుతో ఆకట్టుకున్నారు. సోమవారం జరిగే సెమీఫైనల్లో గ్రూప్ 'ఎ' రన్నరప్, డిఫెండింగ్ చాంపియన్ బంగ్లాదేశ్‌తో భారత్ తలపడుతుంది.

శ్రీలంక, న్యూజిలాండ్ తొలి టెస్టు మధ్యలో 'రెస్ట్ డే'

దుబాయ్: వచ్చేనెలలో న్యూజిలాండ్ జట్టు శ్రీలంకలో పర్యటిస్తుంది. ద్వీపదేశంలో రెండు టెస్టుల సిరీస్‌లో కివీస్ తలపడుతుంది. అయితే తొలిటెస్టు మధ్యలో 'విశ్రాంతి రోజు' ఇవ్వడంతో ఈ టెస్టు పూర్తయ్యేందుకు ఆరు రోజులు పట్టనుంది. సెప్టెంబర్ 18 నుంచి గాలేలో తొలి టెస్టు జరుగుతుంది. మూడు రోజుల తర్వాత అక్కడ అధ్యక్ష ఎన్నికలు ఉండటంతో 21వ తేదీని విశ్రాంతి రోజుగా ప్రకటించారు. ప్రస్తుతం ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో కివీస్, శ్రీలంక జట్లు వరుసగా మూడు, నాలుగో స్థానాల్లో ఉన్నాయి. అయితే క్రికెట్ చరిత్రలో ఇలా ఐదు రోజుల టెస్టు కాస్తా రెస్ట్ డేతో ఆరు రోజుల పాటు నిర్వహించడం ఇదే తొలిసారేం కాదు. లంకలోనే 2001లో జింబాబ్వేతో కొలంబో వేదికగా జరిగిన టెస్టు కూడా 'పోయా డే' (పవిత్ర పౌర్ణమి) సందర్భంగా రెస్ట్ డే ఇచ్చి నిర్వహించారు.

యూఎస్ ఓపెన్‌కు జబర్ దూరం



న్యూయార్క్: టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్ నుంచి 2022 రన్నరప్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) వైదొలిగింది. భుజం గాయం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నానని ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 17వ స్థానంలో ఉన్న జబర్ వివరించింది. 2022లో కెరీర్ బెస్ట్ ప్రపంచ రెండో ర్యాంకర్‌గా నిలిచిన జబర్ ఈ ఏడాది ఒక్క టైటిల్ కూడా గెలవలేకపోయింది. వరుసగా రెండేళ్లు (2022, 2023) వింబుల్డన్ టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించి రన్నరప్‌గా నిలిచిన జబర్ ఈ సీజన్‌లో మొత్తం 15 టోర్నీలు ఆడింది. అయితే ఆమె ఒక్క టోర్నీలోనూ సెమీఫైనల్ చేరలేకపోయింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌లో ఓడిన జబర్... ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లో, వింబుల్డన్ టోర్నీలో మూడో రౌండ్‌లో నిష్క్రమించింది. ఈనెల 26న న్యూయార్క్‌లో మొదలయ్యే యూఎస్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్‌లో కోకో గాఫ్ (అమెరికా) డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది. వరల్డ్ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), రెండో ర్యాంకర్ సబలెంకా (బెలారస్) కూడా టైటిల్ ఫేవరెట్స్‌గా ఉన్నారు.

పుణేరీ పల్టన్ పైచేయి



ఐహిక ముఖర్జీ

చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) లీగ్‌లో అహ్మదాబాద్ పైపర్స్‌పై 10–5 పాయింట్ల తేడాతో పుణేరీ పల్టన్ విజయం సాధించింది. రెండో రోజు శుక్రవారం జరిగిన ఈ పోరులో ఐహిక ముఖర్జీ ఆట హైలైట్‌గా నిలిచింది. మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో పుణేరీ ప్లేయర్ ఐహిక 11–7, 11–5, 11–6 స్కోరుతో వరల్డ్ నంబర్ 13 బెర్నాండెట్ సాక్స్‌ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో మనుష్ షా 5–11, 11–7, 11–6తో మాంటిరోపై విజయం సాధించగా... మిక్స్‌డ్ డబుల్స్‌లో మనుష్–సాక్స్ జోడీ 7–11, 11–3, 11–7తో మాంటిరో–ఐహికపై గెలుపొందింది. రెండో పురుషుల సింగిల్స్‌లో అంకుర్ భట్టాచార్య 11–8, 11–5, 11–8తో లిలియాన్ బార్డెట్‌పై, రెండో మహిళల సింగిల్స్‌లో నటాలియా బజోర్ 7–11, 11–8, 11–5తో రీత్ రిష్యాపై గెలుపొందారు.

బంగ్లాదేశ్ క్రికెటర్ షకీబ్‌పై హత్య కేసు



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్‌పై హత్య కేసు నమోదైంది. ఆ దేశంలో ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనల్లో వందల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. గద్దె దిగిన షేక్ హసీనా ప్రభుత్వంలో 37 ఏళ్ల మాజీ కెప్టెన్ ఎంపీగా ఉన్నారు. షేక్ హసీనా ప్రభుత్వం రద్దు కావడంతో అతని ఎంపీ పదవి కూడా ఊడింది. అయితే మూకదాడులు, పేట్రేగిన ఆందోళనకారుల వల్ల అమాయకులెందరో ప్రాణాలొదిలారు. ఈ నేపథ్యంలో రఫీఖుల్ ఇస్లామ్ అనే వ్యక్తి మాజీ ప్రధాని, సహచర మంత్రులు, ఎంపీలపై కేసు పెట్టారు. ఈ నెల 7న జరిగిన హింసాత్మక ఘటనలో ఇస్లామ్ కుమారుడు రుబెల్ మృతి చెందాడు. దీంతో తన కుమారుడి మరణానికి గత ప్రభుత్వానిదే బాధ్యతని ఇస్లామ్ ఢాకాలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీన్ని స్వీకరించిన పోలీసులు ప్రధాని సహా పదుల సంఖ్యలో పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఇందులో షకీబ్‌ను 28వ నిందితుడిగా చేర్చుతూ హత్య కేసు నమోదు చేశారు. నిజానికి ఈ ఆల్‌రౌండర్ ఆగస్టు 5కు ముందు, తర్వాత దేశంలో లేడు. గ్లోబల్ టి20 లీగ్ ఆడేందుకు కెనడా వెళ్లాడు. జూలై 26 నుంచి ఆగస్టు 9 వరకు జరిగిన ఆ లీగ్‌లో ఆడి... అక్కడి నుంచి నేరుగా పాకిస్తాన్‌లో టెస్టు సిరీస్ ఆడుతున్న బంగ్లాదేశ్ జట్టుతో జతకలిశాడు.

నిందితుడు సంజయ్‌ది పశుప్రవృత్తి

- ఏమాత్రం కనిపించని పశ్చాత్తాపం
- అశ్లీలచిత్రాలకు అలవాటుపడ్డాడు
- సైకో అనాలసిస్ పరీక్ష తర్వాత సీబీఐ



న్యూఢిల్లీ/ కోల్‌కతా: ట్రైనీ పీజీ డాక్టర్ హత్యాచారం కేసులో ప్రధాన నిందితుడైన సంజయ్ రాయ్ పశుప్రవృత్తిని కలిగి ఉన్నాడని సైకో అనాలసిస్ పరీక్షలో తేలింది. వైద్యురాలిపై పాశవిక రేప్, హత్యపై అతనిలో కించిత్తు కూడా పశ్చాత్తాపం లేదని, అశ్లీల చిత్రాలు విపరీతంగా చూస్తాడని సైకో అనాలసిస్‌లో తేలిందని సీబీఐ అధికారి ఒకరు వెల్లడించారు. ‹అతనిలో ఏమాత్రం పశ్చాత్తాపం లేదు. రేప్, హత్యను ప్రతి చిన్న అంశంతో సహా పూసగుచ్చినట్లు వివరించాడు. ఏమాత్రం సంకోచించలేదు› అని సీబీఐ అధికారి చెప్పారు. సంజయ్ రాయ్ మొబైల్ ఫోన్‌లో పలు అశ్లీల చిత్రాలు పోలీసులకు లభించిన విషయం తెలిసిందే. సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలు సంజయ్ రాయ్ ఘటనా స్థలి (ఆర్.జి.కర్ ఆసుపత్రిలోని మూడో అంతస్తులో ఉన్న సెమినార్ హాల్) వద్ద ఉన్నట్లు నిరూపిస్తున్నాయని సీబీఐ తెలిపింది. హత్యాచారం జరిగిన ఆగస్టు 8న అర్ధరాత్రి దాటాక సంజయ్ రాయ్ తప్పతాగి ఉత్తర కోల్‌కతాలోని వేశ్యావాటికను సందర్శించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. అక్కడ ఒక మహిళను నగ్న చిత్రాన్ని అడిగాడు.

ఆగస్టు 9న వేకువజామున 4 గంటల ప్రాంతంలో సంజయ్ రాయ్ ఆర్.జి.కర్ ఆసుపత్రిలోకి ప్రవేశిస్తున్నట్లు సీసీటీవీల్లో రికార్డైంది. జీన్స్ ప్యాంట్, టీ షర్టు ధరించిన అతని చేతిలో పోలీసు హెల్మెట్ ఉంది. రాయ్ కోల్‌కతా పోలీసు సివిల్ వాలంటీర్ అనే విషయం తెలిసిందే. రాయ్ మెడచుట్టూ బ్లూటూత్ డివైస్ సీసీటీవీ ఫుటేజీలో కనిపించింది. తర్వాత ఇదే బ్లూటూత్ డివైస్ క్రైమ్ సీన్‌లో లభించింది. దర్యాప్తులో కీలకంగా మారింది. సంజయ్‌రాయ్‌కు సంబంధించిన డీఎన్ఏ పరీక్షల ఫలితాలు ఇంకా రావాల్సి ఉంది.

సందీప్ ఘోష్‌కు లై డిటెక్టర్ టెస్టు

ఆర్.జి.కర్ ఆసుపత్రిలో మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకల కేసును కలకత్తా హైకోర్టు శుక్రవారం సీబీఐకి బదిలీ చేసింది. ఈ కేసును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి అప్పగించాలని ఆసుపత్రి మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ అక్తర్ అలీ పిటిషన్ వేయడంతో హైకోర్టు కేసును సీబీఐకి అప్పగించింది. మూడు వారాల్లో పురోగతి నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ కేసును సెప్టెంబరు 17కు వాయిదా వేసింది. మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌తో పాటు మరో ఐదుగురికి లై డిటెక్టర్ పరీక్షలు చేయడానికి స్థానిక కోర్టు సీబీఐకి అనుమతి ఇచ్చింది. అలాగే ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌పై పాలిగ్రాఫ్ పరీక్షకు ప్రత్యేక కోర్టు అనుమతి మంజూరు చేసింది. మరోవైపు బీజేపీ కార్యాకర్తలు బెంగాల్ వ్యాప్తంగా పోలీసుస్టేషన్ల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

కేజ్రీవాల్ సమక్షంలోనే కీలక నిర్ణయాలు

- ఢిల్లీ మద్యం కేసులో సుప్రీంకోర్టుకు సీబీఐ
- తదుపరి విచారణ సెప్టెంబరు 5కు వాయిదా


సాక్షి, న్యూఢిల్లీ: నూతన ఎక్సైజ్ పాలసీకి సంబంధించి కీలక నిర్ణయాలన్నీ సీఎం కేజ్రీవాల్ సమక్షంలోనే జరిగాయని సీబీఐ ఆరోపించింది. దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొంది. బెయిలుపై విడుదల అయితే సాక్ష్యాలు తారుమారు చేసి విచారణకు ఆటంకం కలిగించే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో కౌంటరు అఫిడవిట్ దాఖలు చేసింది. సీబీఐ అరెస్టును రద్దు చేయాలని, మధ్యంతర బెయిలుపై విడుదల చేయాలని, ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఆయా పిటిషన్లు శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కేజ్రీవాల్ రెండు పిటిషన్లలో ఒక దానికి కౌంటరు గురువారం రాత్రి 8 గంటలకు అందిందని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోర్టుకు తెలిపారు. మరో దాంట్లో కౌంటరు దాఖలు చేయడానికి వారం రోజుల గడువు కావాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు ధర్మాసనాన్ని కోరారు. దీంతో, తదుపరి విచారణ సెప్టెంబరు 5న చేపడతామని ధర్మాసనం విచారణ వాయిదా వేసింది.

విద్యార్థినిపై స్కూల్ బస్ డ్రైవర్ అత్యాచారం

చండీగఢ్: మార్ఫింగ్ చేసిన ఫొటోలు చూపి బెదిరించి 12వ తరగతి విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన స్కూల్ బస్సు డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన చండీగఢ్‌లో చోటుచేసుకుంది. స్కూలు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న మహ్మద్ రజాక్(26) 12వ తరగతి చదివే బాధిత బాలికను కొంతకాలం వేధింపులకు గురిచేశాడు. ఆపై ఆమెతో స్నేహం చేసేందుకు ప్రయత్నించాడు. ఆమె నిరాకరించడంతో మార్ఫింగ్ చేసిన ఫొటోలను ఆమెకు చూపాడు. మాట వినకుంటే సోషల్ మీడియాలో ఆ ఫొటోలను పెడతానంటూ బెదిరించాడు. మే, జూలై నెలల మధ్యలో ఆమె తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో మూడుసార్లు అత్యాచారం చేశాడు. బాలిక అన్యమనస్కంగా ఉండటం గమనించి, తల్లిదండ్రులు ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. ఈ మేరకు వారు పోలీసులను ఆశ్రయించారు. బుధవారం రజాక్‌ను అరెస్ట్ చేసి, పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని డీఎస్పీ జస్విందర్ సింగ్ శుక్రవారం చెప్పారు.

నేనెందుకు ఉండకూడదు?

- సీఎం రేసుపై సెల్జా



న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ సాధిస్తే హరియాణా సీఎం రేసులో తాను కూడా ఉంటానని సీనియర్ నాయకురాలు, ఎంపీ కుమారి సెల్జా స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా, సామాజికవర్గంగా ప్రజలకు ఆకాంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలు అక్టోబరు ఒకటో తేదీన జరగనున్న విషయం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల్లో సిర్సా నుంచి లోక్‌సభకు ఎన్నికైన దళిత నాయకురాలు సెల్జా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయాలనుకుంటున్నట్లు సంకేతాలిచ్చారు. రాష్ట్రంలో పనిచేయాలనేది తన అభిమతమని, ఈ విషయంలో పార్టీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. హరియాణా కాంగ్రెస్ భూపిందర్ సింగ్ హుడా, సెల్జా వర్గాలుగా చీలిపోయింది. ఇది కాంగ్రెస్ అవకాశాలను దెబ్బతీస్తోందనే వాదనను సెల్జా కొట్టిపారేశారు. ఎన్నికలు వచ్చినపుడు అందరం కలిసికట్టుగా కాంగ్రెస్ శిబిరంగా బరిలోకి దిగుతామని చెప్పారు. ‹నేను చాలా వాస్తవిక దృక్పథంతో ఉంటాను. ముక్కుసూటిగా సమాధానాలు చెబుతాను. ఏ సంస్థలో తీసుకొన్నా ఆధిపత్య పోరాటం ఉంటుంది. ఆకాంక్షలు, పార్టీ కోసం శ్రమించడం, స్థానాన్ని పదిలపర్చుకునే ప్రయత్నం.. అన్నీ ఉంటాయి. అయితే పార్టీ అభ్యర్థులను ప్రకటించే వరకే ఇవన్నీ. తర్వాత అందరూ ఒక్కటై క్షేత్రస్థాయిలోకి వెళ్లడమే› అని సెల్జా చెప్పుకొచ్చారు. ఎన్నికల తర్వాత ఇతర పార్టీలతో కూటమి కట్టే అవకాశాలపై మాట్లాడుతూ.. హరియాణాలో హంగ్ రానే రాదని, కాంగ్రెస్ అద్భుత మెజారిటీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం అవుతున్నామని, ప్రజలంతా బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు. అధికారంలో లేనపుడు సీఎం అభ్యర్థిని ప్రకటించి ఎన్నికలకు వెళ్లే సంప్రదాయం కాంగ్రెస్ పార్టీలో లేదన్నారు.

కాటేజీ పైకప్పు కూలి..ఐదుగురు మృతి

మహూ(మధ్యప్రదేశ్): రిసార్టులోని నిర్మాణంలో ఉన్న కాటేజీ పైకప్పు కూలిన ఘటనలో నలుగురు కార్మికులతోపాటు వారి కాంట్రాక్టర్ మృతి చెందారు. ఘటన మధ్యప్రదేశ్‌లోని మహూ తహశీల్ పరిధి చోరల్ గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. కాటేజీకి రెండు రోజుల క్రితమే స్లాబ్ వేశారు. అటవీప్రాంతం కావడంతోపాటు భారీ వర్షం పడుతుండటంతో కార్మికులు, వారి కాంట్రాక్టర్ ఆ స్లాబ్ కిందే నిద్రించారు. భారీ వర్షం కారణంగా బలహీనంగా ఉన్న స్లాబ్ వారిపై కూలింది.



ఆరోసారి అగ్ని శిఖలు..

ఐస్‌ల్యాండ్ దక్షిణ ప్రాంతంలోని రెక్జానెస్ దీవిలోని అగ్ని పర్వతం మరోసారి బద్దలైంది. దీంతో, ఎర్రగా చిత్రవిచిత్రంగా ఎగజిమ్ముతున్న లావా ఇది. గురువారం రాత్రి తీవ్ర భూకంపం సంభవించిన గంట తర్వాత లావా ఒక్కసారిగా పెల్లుబికింది. దాదాపు 800 ఏళ్లు నిద్రాణంగా ఉన్న ఈ అగ్ని పర్వతం మొదటిసారిగా గతేడాది డిసెంబర్‌లో బద్దలైంది. అప్పటి నుంచి తాజాగా ఆరోసారి లావా ప్రవాహం మొదలైంది. దీని ప్రభావం స్థానికంగానే ఉంటుందని అధికార యంత్రాంగం తెలిపింది. ముందు జాగ్రత్తగా స్థానిక నివాస ప్రాంతాల వారిని ఖాళీ చేయించింది. దగ్గర్లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం బ్లూ లగూన్ జియోథర్మల్ స్పాను మూసివేశారు. అయితే, లావా ప్రవాహాన్ని దగ్గర్నుంచి తిలకించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో అక్కడికి వస్తున్నారు. గతేడాది అగ్ని పర్వతం బద్దలై లావా ప్రవాహం ప్రమాదకరస్థాయిలో అక్కడికి దగ్గర్లోని గ్రిండావిక్‌లోని పలు నివాసాలను ధ్వంసం చేసింది. దీంతో, ఆ పట్టణంలోని సుమారు 4 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

వర్ణ వివక్షపై పోరాడిన నేలలో లింగ వివక్ష..!

శ్వేతజాతి పాలన అంతమైన 30 ఏళ్ల తర్వాతా ఇంటి యాజమాన్యం ఇంకా పురుషుల చేతిలోనే

- నిరాశ్రయులుగా మిగులుతున్న ఒంటరి మహిళలు, వారి పిల్లలు
- మహిళలకు ఇంటిపై హక్కు ఇవ్వని చట్టాలు.. దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న మహిళలు

వర్ణవివక్షపై పోరాడిన దక్షిణాఫ్రికా నేలపై.. లింగ వివక్ష ఇంకా వేళ్లూనుకుని ఉంది. శ్వేతజాతి పాలన అంతమైన 30 ఏళ్ల తరువాత కూడా మహిళలకు సర్వ హక్కులు రాలేదు. జాతి రక్షణ కోసం చేసిన భూ చట్టం నల్లజాతి మహిళలకు మాత్రం అభద్రతను మిగులుస్తోంది. భర్త చనిపోయిన భార్యలు, తండ్రిని కోల్పోయిన పిల్లలు తమ సొంత ఇంటినుంచే గెంటివేతకు గురవుతున్నారు. నిరాశ్రయులుగా మారుతున్నారు. దక్షిణాఫ్రికా పట్టణాల్లోని టౌన్‌షిప్‌లలో లక్షలాది నల్లజాతి కుటుంబాలు ఇదే అభద్రతలో జీవిస్తున్నాయి. – సాక్షి, నేషనల్ డెస్క్

శాశ్వతమైన వివక్ష..

జోహన్నెస్‌బర్గ్‌లోని 74 ఏళ్ల వృద్ధురాలు జొహనా మోత్లమ్మ. 1977లో ఆమెకు 27 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకుంది. సొవెటోలో ఒక చిన్న ఇంటికి మారారు. 1991లో విడాకులు తీసుకునే వరకు ఇక్కడి టౌన్‌షిప్‌లోని ఇంట్లో నివసించారు. 2000 సంవత్సరంలో ఆమె మాజీ భర్త ఆ ఇంటిని రిజిస్టర్ చేసినప్పుడు, పూర్తి యాజమాన్యం అతనికే వెళ్లింది. మూడేళ్ళ తర్వాత అతను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఇంటి యాజమాన్య హక్కుల గురించి అతడిని ఆమె ఎప్పుడూ అడగలేదు. 2013లో అతను చనిపోయిన తర్వాత అంతా మారిపోయింది. అతని రెండో భార్య ఆ ఇంటిని అమ్మేసింది. ఎందుకంటే ఇంటిలో మోత్లమ్మకు 50 శాతం హక్కున్నా... అప్‌గ్రేడ్ అయిన చట్టం విడాకుల తరువాత ఆమెకు ఆస్తి హక్కును అనుమతించలేదు. ఆస్తికి ఆమె కూడా యజమానిగా భర్త రికార్డుల్లో పేర్కొనలేదు. దీంతో ఇంటి అమ్మకాన్ని ఆమె ఆపలేకపోయింది. అప్‌గ్రేడింగ్ చట్టం మహిళల పట్ల వివక్షను శాశ్వతం చేసింది.

కోర్టుల చుట్టూ తిరిగి, విసిగి..

39 తొమ్మిదేళ్ల లెబో బలోయి కూడా దశాబ్దం కిందట తన ఇంటిని కోల్పోయింది. సొవెటోలో ప్రభుత్వం జారీ చేసిన రెండు పడక గదుల ఇల్లు ఆమె తండ్రి పేరు మీద రిజిస్టర్ అయి ఉంది. ఆ తరువాత తనకు, తన తల్లికి ఆ ఇంటి వారసత్వం వస్తుందని బలోయి ఆశించింది. అందుకే ఆమె, ఆమె భర్త పాల్ కలిసి ఇంటిని పునరుద్ధరించారు. ఇంటికి మరో రెండు గదులు అదనంగా కట్టారు. 2009లో ఆమె తల్లి చనిపోయిన తరువాత ఆ ఇంటిపై హక్కు తన సవతి తల్లి కూతురుకు వెళ్లిపోయింది. చట్టబద్ధంగా ఆ ఆస్తి ఎవరికి దక్కుతుందనే దానిపై స్పష్టత లేదు. కోర్టుకు తిరిగి తిరిగి విసిగిపోయిన ఆమె.. తన సవతి సోదరితో పోరాడటానికి బదులుగా విడిచిపెట్టాలని నిర్ణయించుకుంది. ఇప్పుడు 20 కిలోమీటర్ల (12 మైళ్ళు) దూరంలోని జొహన్నెస్‌బర్గ్ శివారు మెల్విల్లేలో నివసిస్తోంది.

మోత్లమ్మ, బలోయిలే కాదు.. సొవెటోలో లక్షలాది మంది ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇంటి గురించి కుటుంబ సభ్యులు గొడవపడానికి ఈ వ్యవస్థ కారణమైందని వారు వాపోతున్నారు. 1994లో ప్రభుత్వం భూమి హక్కుల పునరుద్ధరణ చట్టం–1994 ప్రవేశపెట్టింది. 1991 యొక్క భూ కాలపరిమితి హక్కుల చట్టంలోని నల్లజాతి దీర్ఘకాలిక లీజుదారుల ఆస్తి హక్కులను అప్ గ్రేడ్ చేసింది. చివరికి వారి ఇళ్లను సొంతం చేసుకోవడానికి అనుమతించింది. కానీ ఇందులో ఒక చిక్కుముడి ఉంది. చట్ట నిబంధనల ప్రకారం, కుటుంబ పెద్దగా పరిగణించబడే వ్యక్తి మాత్రమే ఆస్తిపై హక్కును కలిగి ఉంటాడు. అతను బతికున్న కాలంలో విల్లు రాస్తే ఆ జాబితాలో ఉన్న వారికి చెందుతుంది. పితృస్వామ్య సంప్రదాయ వారసత్వ నిబంధనల్లో పాతుకుపోయిన ఈ కొత్త చట్టం భార్యలు, సోదరీమణులు, తల్లులు, కూతుళ్లను వారసత్వానికి దూరం చేస్తోంది.

నవరణలకు సుప్రీం ఆదేశం...

ఇది మహిళలను చట్టానికి దూరంగా ఉంచడమేనని 2018లో దక్షిణాఫ్రికా సుప్రీంకోర్టు పేర్కొంది. టౌన్‌షిప్‌లో మహిళల భూ హక్కులకు సంబంధించిన ప్రత్యేక కేసుపై తీర్పు సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. లింగ, ఆస్తి వారసత్వానికి సంబంధించిన అప్ గ్రేడింగ్ చట్టంలోని సెక్షన్ 2(1) రాజ్యాంగపరంగా చెల్లదని కూడా సుప్రీంకోర్టు ప్రకటించింది. ఇది మహిళల హక్కుల ఉల్లంఘన అని పేర్కొంటూ చట్టానికి సవరణలు చేయాలని ఆదేశించింది. ప్రాపర్టీ పర్మిట్ లేదా టైటిల్ డీడ్‌లో పేర్లు లేకపోయినా బాధిత మహిళలు లేదా ఇప్పటికే ఒక ఇంట్లో నివసిస్తున్న వ్యక్తులు అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు సమర్పిస్తే హక్కులు వర్తింపజేయాలని సుప్రీంకోర్టు పార్లమెంటును ఆదేశించింది. ఫలితంగా ఈ ఏడాది మేలో దక్షిణాఫ్రికా సార్వత్రిక ఎన్నికలకు ముందు, ప్రభుత్వం భూమి హక్కుల సవరణ చట్టం–2021ను గెజిట్ చేసింది. ఇది ఎన్నికలు ముగిసిన వారం తర్వాత అమల్లోకి వచ్చింది. దీంతో ఇళ్లు కోల్పోయిన ప్రజలు ఇప్పటికీ న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు.



సొవెటో టౌన్‌షిప్

'మాకు మా చిన్ననాటి ఇల్లు కావాలి'

చర్చలతో ప్రభుత్వం, కోర్టులు చేస్తున్న జాప్యానికి ఇళ్లు కోల్పోయిన కుటుంబాలు అసహనానికి గురవుతున్నాయి. తమ ఇంటిపై యాజమాన్యం విషయాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించాలని మోత్లమ్మ కొడుకు మైమానే కోర్టును కోరుతున్నాడు. 'మా నాన్నకు అన్ని అనుమతులు ఇచ్చి, మా అమ్మను మినహాయించిన ఈ వ్యవస్థ సరైంది కాదు' అంటున్నాడు. ఇద్దరికీ సమానహక్కులుంటే ఈ సమస్య ఉండేది కాదని, తమ చిన్ననాటి ఇంటిని తిరిగి పొందాలనుకుంటున్నామని చెబుతున్నాడు.

''నాట్ ఫర్ సేల్'...

దీంతో ఇళ్ల సమస్యలతో సతమతమవుతున్న ప్రజలతో జొహన్నెస్‌బర్గ్‌లోని స్వచ్ఛంద సంస్థలు కిటకిటలాడుతున్నాయి. ఈ వివాదాలు సర్వసాధారణమయ్యాయని, మహిళలు కోర్టుల్లో దీర్ఘకాలికంగా పోరాడుతున్నారని విట్‌వాటర్స్ ర్యాండ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ హ్యూమన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ డీన్ బుసిసివే ఎన్కాలా డ్లామిని చెప్పారు. ఇలాంటి చట్టం ఒకటుందని, జీవితకాలం వారు నివసించిన ఇంటిపై హక్కు లేదని... సడన్‌గా ఇల్లు ఖాళీ చేయాల్సి వచ్చినప్పుడే మహిళలకు తెలుస్తోందని హక్కుల సంఘాలు వాపోతున్నాయి. ఈ చట్టం వల్ల మహిళలు, పిల్లలు తమ జీవితకాల భద్రతను కోల్పోయే ప్రమాదం ఉందని, నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉందని 'ఎ జెండర్డ్ అనాలిసిస్ ఆఫ్ ఫ్యామిలీ హోమ్స్ ఇన్ సౌత్ ఆఫ్రికా' అధ్యయనం వెల్లడించింది. పట్టాల సమస్యల కారణంగా 'నాట్ ఫర్ సేల్' అని రాసిన ఇళ్లు సొవెటోలో అనేకం కనిపిస్తాయి.

మోదీని పొగిడిన భార్యకు తలాక్...

భర్తపై యూపీ పోలీసులు కేసు

బహ్రెయిచ్: అయోధ్యలో అభివృద్ధికి ప్రధాని మోదీ, యూపీ సీఎం ఆదిత్యనాథ్ కారణమంటూ పొగడటమే ఆ మహిళ చేసిన నేరం. ఇందుకు ఆగ్రహిస్తూ భర్త ఆమెకు మూడుసార్లు తలాక్ చెప్పేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు భర్తతోపాటు అతడి ఏడుగురు కుటుంబసభ్యులపైనా కేసులు నమోదు చేశారు. బహ్రెయిచ్ జిల్లా మొహల్లా సరాయ్‌కి చెందిన బాధితురాలికి గతేడాది డిసెంబర్‌లో అయోధ్యకు చెందిన అర్షద్‌తో వివాహమైంది. మెట్టినింటికి వెళ్లాక అయోధ్యలో రోడ్లు, ఆ నగరం, అక్కడి వాతావరణం ఆమెకు నచ్చాయి. ఇదే విషయాన్ని భర్తకు చెప్పింది. ప్రధాని మోదీ, సీఎం యోగియే ఇందుకు కారణమని తెలిపింది. దీంతో, అర్షద్‌కు కోపం వచ్చి ఆమెను వెంటనే పుట్టింటికి పంపేశాడు. బంధువులు నచ్చజెప్పి, ఆమెను తిరిగి అయోధ్యకు తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఆమెను కొడుతూ, తిడుతూ వేధిస్తున్నాడు. ప్రధాని మోదీ, సీఎం యోగిపై దుర్భాషలాడుతున్నాడు. అత్త, మరదళ్లు, మరుదులు కలిసి ఆమెను చంపేందుకు యత్నిస్తున్నారు. అర్షద్ చివరికామెకు మూడుసార్లు తలాక్ చెప్పాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

భారత్, అమెరికా సహజ మిత్రదేశాలు

- శాంతి, సౌభాగ్యం, స్థిరత్వం నెలకొల్పగల బలమైన శక్తులు
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటన
- అమెరికాలో ప్రవాస భారతీయులతో సమావేశం



వాషింగ్టన్: భారత్, అమెరికా సహజ మిత్ర దేశాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. రెండు బలమైన భాగస్వామ్య దేశాలని ఉద్ఘాటించారు. ఇరు దేశాల మధ్య బంధం నానాటికీ బలోపేతమవుతోందని వివరించారు. ప్రపంచంలో శాంతి, సౌభాగ్యం, స్థిరత్వం నెలకొల్పగల రెండు బలమైన శక్తులు భారత్, అమెరికా అని స్పష్టంచేశారు. నాలుగు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం గురువారం అమెరికాకు చేరుకున్న రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. వారిని ఉద్దేశించి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశ కీర్తిప్రతిష్టలు ప్రపంచవ్యాప్తంగా మరింత పెరిగాయని పునరుద్ఘాటించారు. ప్రపంచ వేదికపై భారత్ గొప్ప శక్తిగా మారిందన్నారు. గతంలో భారత్ చెప్పే మాటకు పెద్దగా విలువ ఉండేది కాదని, ఇప్పుడు మన మాటను ప్రపంచం మొత్తం శ్రద్ధగా వింటోందని వివరించారు. 2014 కంటే ముందు భారతదేశ ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉండేదని, ప్రస్తుతం ప్రపంచంలో మొదటి ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగామని హర్షం వ్యక్తం చేశారు. 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించడం ఖాయమని అంతర్జాతీయ సంస్థలు చెబుతున్నాయని గుర్తుచేశారు. కోవిడ్–19 సంక్షోభాన్ని భారత్ తట్టుకొని స్థిరంగా నిలిచిందని చెప్పారు. మోదీ పాలనలో ఏకంగా 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలియజేశారు. ఇండియాలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.54 శాతానికి పడిపోయిందని, విదేశీ మారక ద్రవ్య నిల్వలు 675 బిలియన్ డాలర్లకు చేరాయని పేర్కొన్నారు. రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ లక్ష్య సాధన కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలను రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇండియా రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు కేవలం రూ.600 కోట్లు ఉండేవని, ఇప్పుడు రూ.21,000 కోట్లకు చేరాయని తెలియజేశారు. బలమైన, భద్రమైన, సౌభాగ్యవంతమైన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలన్నదే మోదీ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టంచేశారు.

రెండు కీలక ఒప్పందాలపై సంతకాలు

భారత్, అమెరికా రెండు కీలక ఒప్పందాలపై తాజాగా సంతకాలు చేశాయి. రక్షణ రంగంలో పరస్పర సహకారం కోసం రెండు దేశాలు ఈ ఒప్పందం కుదుర్చుకున్నాయి. సెక్యూరిటీ ఆఫ్ సప్లైస్ అరేంజ్‌మెంట్(ఎస్ఓఎస్ఏ), అసైన్‌మెంట్ ఆఫ్ లైజాన్ ఆఫీసర్స్ ఒప్పందాలపై భారత్, అమెరికా సంతకాలు చేసినట్లు భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి.

పాఠశాలల్లో పిల్లల భద్రతపై దృష్టి పెట్టండి

- మార్గదర్శకాలను తక్షణమే అమలు చేయండి
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: పాఠశాలల్లో పిల్లల భద్రత, రక్షణ కోసం ‹పాఠశాల భద్రత, రక్షణపై మార్గదర్శకాలను› తక్షణమే అమలు చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్ర విద్యా శాఖ కోరింది. పాఠశాల భద్రత, రక్షణ–2021 మార్గదర్శకాల అమలు తీరును తెలియచేయాలని కూడా కోరింది. ఈ మేరకు రాష్ట్రాలు, యూటీలకు విద్యాశాఖ లేఖ రాసింది. పాఠశాలలు, ఇతర విద్యా సంస్థలలో పిల్లల భద్రత, రక్షణకు కేంద్రం కట్టుబడి ఉందని తెలిపింది. పాఠశాల భద్రత, రక్షణపై కేంద్రం 2021లో విడుదల చేసిన మార్గదర్శకాలలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల భద్రత, రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యల వివరాలున్నాయి. ఫస్ట్ ఎయిడ్ వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలను కల్పించడం వంటివి ఇందులో కొన్ని. అదేవిధంగా, పిల్లల ఫిర్యాదులపై సరైన చర్యలు తీసుకోకపోవడం, వారిని బెదిరింపులకు గురిచేయడం, వారిపట్ల వివక్ష చూపడం వంటివి రుజువైతే జరిమానా విధించడంతోపాటు అవసరమైతే గుర్తింపు రద్దు చేస్తామంటూ కేంద్రం గతంలోనే పాఠశాలలను హెచ్చరించింది.

స్నాతకోత్సవాలకు భారతీయ డ్రెస్ కోడ్

- రూపొందించాలన్న కేంద్ర ఆరోగ్య శాఖ

న్యూఢిల్లీ: స్నాతకోత్సవాల సమయాల్లో విద్యార్థినీ విద్యార్థులు భారతీయత ఉట్టిపడేలా, సంబంధిత రాష్ట్రాల సంప్రదాయాలను ప్రతిబింబించే డ్రెస్‌కోడ్‌కు రూపకల్పన చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ కోరింది. మంత్రిత్వ శాఖకు చెందిన వివిధ సంస్థల్లో స్నాతకోత్సవాల వేళ ప్రస్తుతం ధరించే నల్లని డ్రెస్, క్యాప్ వలస పాలనకు చిహ్నంగా కనిపిస్తోందని పేర్కొంది. యూరప్‌లో మధ్యయుగాల నుంచి ఇదే డ్రెస్‌కోడ్ అమలవుతోందని, బ్రిటిషర్లు దీనిని మన దేశంలో ప్రవేశపెట్టారని తెలిపింది. 'ఈ నేపథ్యంలోనే ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిధిలో నడిచే ఎయిమ్స్ ఇతర వైద్య విద్యా సంస్థల్లో స్థానిక సంప్రదాయాలను ప్రతిబింబించే భారతీయ డ్రెస్‌కోడ్‌కు రూపకల్పన చేయాలని నిర్ణయించాం. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను మాకు పంపండి. వీటిని ఆరోగ్య శాఖ కార్యదర్శి పరిశీలిస్తారు' అని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

తుది దశలో కాంగ్రెస్‌తో సీట్ల పంపకం

- ఎన్సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా వెల్లడి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి వచ్చే నెలలో జరగనున్న ఎన్నికలకుగాను కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు తుది దశకు చేరుకుందని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. మెజారిటీ సీట్లపై ఏకాభిప్రాయం కుదిరిందని, కొన్ని సీట్ల విషయంలో చర్చలు కొనసాగుతున్నాయని ఆయన వివరించారు. ‹కొన్ని స్థానాల కోసం మేం గట్టిగా పట్టుబడుతున్నాం. మరికొన్ని సీట్లపై కాంగ్రెస్ నేతలు పట్టుదలతో ఉన్నారు. ఈ విషయంలో చర్చలు కొనసాగుతున్నాయి› అని ఒమర్ అబ్దుల్లా చెప్పారు. మొత్తం 90 సీట్లకు గాను చాలా వరకుకాంగ్రెస్, ఎన్సీల మధ్య అంగీకారం కుదిరిందని, త్వరలోనే వివరాలను వెల్లడిస్తామని శుక్రవారం కుల్గామ్‌లో ఆయన మీడియాకు తెలిపారు. అయితే, ఏకాభిప్రాయం కుదిరిన నియోజకవర్గాల వివరాలను వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు. ఈ నెల 27వ తేదీనాటికి మొదటి దశ పోలింగ్ అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారు.

పాక్ భూభాగంలోకి భారత ఆర్మీ డ్రోన్



న్యూఢిల్లీ: భారత్ సైన్యానికి చెందిన కీలక డ్రోన్ ఒకటి పొరపాటున పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లిపోయింది. రాజౌరీ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ వెంబడి(ఎల్‌వోసీ) పడిపోగా పాకిస్తాన్ ఆర్మీ దానిని స్వాధీనం చేసుకుంది. రోజువారీ నిఘా మిషన్‌లో భాగంగా శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో యుద్ధవ్యూహ రచనకు ఉద్దేశించిన మినీ డ్రోన్‌ను ప్రయోగించారు. అది అనుకోకుండా పాక్ భూభాగంలోకి వెళ్లిపోయినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. దీనిని, తిరిగి తెచ్చుకునేందుకు పాక్ మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్‌తో మన అధికారులు చర్చలు జరుపుతారని తెలుస్తోంది. రెండు రోజుల క్రితం కూడా సరిహద్దుల్లో ఇటువంటి ఘటనే చోటుచేసుకోవడం గమనార్హం. భారత యుద్ధ విమానాలు విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. ఓ యుద్ధ విమానంలో సాంకేతిక లోపం తలెత్తి, దానికి అమర్చిన బాంబు సరిహద్దులకు అత్యంత సమీపంలో పడి పేలిపోయింది. ఆ తీవ్రతకు భారీ గొయ్యి ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఘటనపై విచారణ జరుపుతున్నామన్నారు.



అమ్మబోతే అడవి..కొనబోతే కొరివి

ఆరుగాలం శ్రమించి సాగుచేసిన టమాటా పంట చేతికొచ్చే సమయానికి రైతు కంట కన్నీరు పెట్టిస్తోంది. మార్కెట్‌కు తరలిస్తే రవాణా చార్జీలు కూడా రావడంలేదు. కొన్ని చోట్ల వ్యాపారులు కొనేందుకు ముందుకురాకపోవడంతో రైతులు టమాటాలను రోడ్డపక్కన పారబోస్తున్నారు. మరోవైపు పట్టణాల్లో కిలో రూ.25 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. – వీరేష్, సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



శ్రావణ లక్ష్మీ ..శరణు

శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న కనకదుర్గమ్మ ఆలయంలో ఆరో అంతస్తులోని మహా మండపంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో మహిళలు భక్తిపారవశ్యంతో అమ్మవారిని నమస్కరిస్తున్న దృశ్యం. – చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



మార్కాపురం చెరువులో నైజీరియా పక్షులు

ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలోని చెరువులో గత నాలుగు రోజుల నుంచి నైజీరియా పక్షులు సందడి చేస్తున్నాయి. గతంలో కొల్లేరు, నేలపట్టు సరస్సులకే పరిమితమైన ఈ పక్షులు మొదటిసారిగా మార్కాపురం రావడంతో ప్రజలు వాటిని వింతగా చూస్తున్నారు. చెరువు కట్టపై ప్రయాణించే వారు వాహనాలు ఆపి పక్షులను చూస్తూ కాలక్షేపం చేస్తున్నారు. – మార్కాపురం

వందేభారత్‌లో తనిఖీలు చేపట్టిన సీనియర్ డీసీఎం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్ సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు శుక్రవారం వందే భారత్ రైలులో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (20707)లో విజయవాడ నుంచి సామర్లకోట వరకు కమర్షియల్ అధికారులతో కలసి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆన్‌బోర్డు క్యాటరింగ్ సేవల నాణ్యత, పరిమాణాన్ని తనిఖీ చేశారు. ప్రయాణికులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తు వారికి సంతృప్తికర స్థాయిలో సేవలు అందించాల్సిందిగా క్యాటరింగ్ సిబ్బందికి సూచించారు. అనంతరం సామర్లకోట రైల్వే స్టేషన్‌లో పార్శిల్, బుకింగ్ కార్యాలయం, వెయిటింగ్ హాల్స్, క్యాటరింగ్ స్టాల్స్‌ను తనిఖీ చేశారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

హోం మంత్రి అనిత



బీచ్‌రోడ్డు: అత్యధిక శాతం వృద్ధి ఉండే వ్యాపారాలను ఎంచుకోవటం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విశాఖలోని ఓ హోటల్లో సీఐఐ ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలకు ఉన్న సవాళ్లను అధిగమించి, వ్యవస్థాపకులుగా అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

బాధితులందరికీ న్యాయం జరిగేలా చూశా..

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్



సాక్షి, అమరావతి: తన మూడేళ్ల పదవీ కాలంలో షెడ్యూల్డ్ కులాల ప్రజలకు అండగా నిలవడం సంతృప్తినిచ్చిందని, బాధితులందరికీ న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా పనిచేశానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మూరుమూడి విక్టర్ ప్రసాద్ వెల్లడించారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ 4వ అంతస్తులో ఎస్సీ కమిషన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

శాస్త్రీయ విజ్ఞానమే మానవ ప్రగతికి సోపానం

అంతర్జాతీయ సదస్సులో శాస్త్రవేత్తలు

మండపేట: ఆధునిక కాలంలో శాస్త్రీయ విజ్ఞానమే మానవ ప్రగతికి సోపానమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మండపేటలో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. స్మార్ట్ మెటీరియల్స్ అండ్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్ 2024 పేరుతో నిర్వహించిన ఈ సదస్సులో పలు శాస్త్రీయ అంశాలను చర్చించారు. శాస్త్రవేత్తలు భార్గవ్, హేమలత తదితరులు పలు అంశాలను వివరించారు. సదస్సుకు హాజరైన విద్యార్థులకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే రామచంద్ర, నన్నయ యూనివర్సిటీ ఫిజిక్స్ హెడ్ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నడిబొడ్డులో నిర్మించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి జరిగితే సీఎం చంద్రబాబు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ విమర్శించారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలోనే అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహం విజయవాడలోనే ఉందన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై కొన్ని అసాంఘిక శక్తులు దాడి చేశాయన్నారు. దాడి జరిగి రోజులు గడుస్తున్నా ముఖ్యమంత్రి, డీజీపీ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో టీడీపీ నేతల బరితెగింపు

- రూ.కోటికి పైగా విలువైన ప్రభుత్వ స్థలం దురాక్రమణ
- జేసీబీతో అంగన్‌వాడీ భవనం కూల్చివేత
- అడ్డరోడ్లను ఆక్రమించుకుని అమ్ముకుంటున్న తెలుగు తమ్ముళ్లు

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా



కూల్చకముందు అంగన్‌వాడీ భవనం



రామలక్ష్మీ కొట్టాలలో అంగన్‌వాడీ భవనం కూల్చి కబ్జా చేసిన స్థలం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : టీడీపీ అధికారంలోకి వచ్చాక 'తమ్ముళ్ల' దురాక్రమణలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ఒకరు వాగులూ వంకలు మింగితే.. మరొకరు చెరువును కొల్లగొడుతున్నారు. ఇంకొకరు ప్రభుత్వ, పోరంబోకు, గ్రామనెత్తం.. ఇలా స్థలం ఏదైనా ఖాళీగా కనిపిస్తే చాలు దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. తమ్ముళ్ల ఆగడాలకు అధికారులు ×పచ్చ× జెండా ఊపుతూ రిజిస్ట్రేషన్‌కు అనువుగా మారుస్తుండటంతో అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. వీరికి అధికార పార్టీ ప్రజాప్రతినిధి అండగా ఉండడంతో యంత్రాంగం అడ్డుకట్ట వేయలేక పోతోంది. ఆళ్లగడ్డలోని ఓ అంగన్‌వాడీ భవనానిది ఇప్పుడు ఇదే పరిస్థితి. వివరాలు ఏమిటంటే..

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని రామలక్ష్మీ కొట్టాల కాలనీలో సుమారు పాతికేళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రం కోసమని అప్పటి పంచాయతీ కార్యాలయం 6 సెంట్ల స్థలాన్ని కేటాయించింది. అందులో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రానికి భవనం నిర్మించి ఇచ్చింది. కాలక్రమేణా భవనం పాతపడటంతో ఈ కేంద్రాన్ని అద్దె భవనంలోకి మార్చారు. అప్పట్లో గ్రామ శివారులో ఉన్న ఈ స్థలం ఇప్పుడు మంచి ధర పలుకుతోంది. ప్రస్తుతం ఇక్కడ సెంటు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉండడంతో ఈ స్థలంపై ఓ టీడీపీ నేత కన్నుపడింది. అంతే.. జేసీబీతో ఆ భవనాన్ని కూల్చి దాని ఆనవాళ్లు లేకుండా చదును చేసేశాడు. అందరూ అంగన్‌వాడీ కేంద్రాన్ని మళ్లీ నిర్మిస్తున్నారని భావించారు. కానీ, అసలు విషయం తెలుసుకుని సంబంధిత శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారు పట్టించుకోలేదు. దీంతో స్థలం అభివృద్ధి పనులను టీడీపీ నేత వేగవంతం చేశాడు.

ఐదు నెలల క్రితం నాడు-నేడుకు ఎంపిక

ఐదు నెలల క్రితం గత ప్రభుత్వం అక్కడ కొత్త భవనం నిర్మించాలని నిధులు విడుదల చేసింది. విశాలమైన స్థలం ఉండటంతో నాడు–నేడు కింద మోడల్ అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని తీర్మానించారు. అధికారులు పరిశీలించడంతో చుట్టుపక్కల కాలనీల వారు సంబరపడ్డారు. అయితే, ఇంతలో ప్రభుత్వం మారడంతో విలువైన స్థలం కబ్జాకు గురైంది., భవనం కూలిపోయింది. మాకు సంబంధం లేదంటే మాకు సంబంధంలేదని ఆయా శాఖలు తప్పించుకుంటున్నాయి.

అడ్డదారులనూ ఆక్రమించేశారు..

ఇదిలా ఉంటే.. సుమారు 30 ఏళ్ల క్రితం ఏర్పడ్డ ఈ కాలనీలో ప్రధాన రోడ్లకు సమాంతరంగా అడ్డదారులు ఏర్పాటుచేశారు. ఈ దారులపైనా కన్నేసిన తమ్ముళ్లు ఖాళీగా ఉన్న స్థలాలతోపాటు అడ్డరోడ్లను ఆక్రమించుకుని అమ్మేసుకుంటున్నారు. దీంతో ఒక వీధిలో నుంచి మరో వీధిలోకి పోవాలంటే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

ఎవరో అంగన్‌వాడీ భవనం కూల్చి స్థలం ఆక్రమించుకుంటున్నారనే విషయం తెలిసింది. ఈ విషయం వెంటనే పీడీ మేడంకు తెలియబరిచా. ఆమె స్థలాన్ని ఆక్రమించుకుంటున్న వారితో మాట్లాడారు. అక్కడ అపరిశుభ్రంగా ఉంటే క్లీన్ చేశామని చెప్పారంట. – తేజేశ్వరి, సీడీపీఓ

మీ ఆస్తిని మీరు కాపాడుకోవాలి..

అంగన్‌వాడీ భవనం కూల్చి స్థలాన్ని ఆక్రమించుకున్నారని అక్కడి సిబ్బంది వచ్చి చెప్పారు. అది మీ స్థలం, అందులో భవనం కూడా ఉంది.. దాన్ని మీరు కాపాడుకోవాలి అని చెప్పా. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారిస్తామని చెప్పా. అయినా వారు ఇంతవరకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు కూడా చేయలేదు. – రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్

సీజీహెచ్‌ఎస్ పర్యవేక్షణకు ప్రత్యేక అడిషనల్ డైరెక్టర్‌ను నియమించండి

డైరెక్టర్ జనరల్ రోలోసింగ్‌కు తిరుపతి ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తి



ఢిల్లీలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ రోలోసింగ్‌తో భేటీ అయిన తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : ఆంధ్రప్రదేశ్ వెల్‌నెస్ సెంటర్ల పర్యవేక్షణ, పరిపాలన, కార్యకలాపాల కోసం రాష్ట్రానికి ప్రత్యేక అడిషనల్ డైరెక్టర్‌ని నియమించాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ రోలోసింగ్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రాల పునర్విభజన తర్వాత కూడా వెల్‌నెస్ సెంటర్లను తెలంగాణ రాష్ట్రానికి చెందిన సీజీహెచ్‌ఎస్ హైదరాబాద్ అడిషనల్ డైరెక్టర్ నియంత్రణ, పర్యవేక్షణలోనే ఉన్నాయని ఆమెకి వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటికే అయిదు నగరాలలో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్లు ఉన్నాయని, కొత్తగా తిరుపతి నగరంలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కానుందని ఆమెకి దృష్టికి తీసుకెళ్లారు. వెల్‌నెస్ సెంటర్లలో మొత్తం 23,326 మంది కార్డ్ హోల్డర్లు ఉన్నారని, 56,951 లబ్ధిదారులుగా నమోదు చేసుకున్నారని, పదవీ విరమణ కారణంగా లబ్ధిదారుల సంఖ్య మరింత పెరుగుతుందని ఆమెకు వివరించారు. శస్త్ర చికిత్సలు, ప్రత్యేక చికిత్స, బిల్లుల రీయింబర్స్‌మెంట్, మందుల జారీకి సంబంధించిన అన్ని అనుమతులు సీజీహెచ్‌ఎస్ హైదరాబాద్ అడిషనల్ డైరెక్టర్ పరిధిలోని అంశాలు కావడం ఆంధ్రప్రదేశ్ వెల్‌నెస్ సెంటర్లకు హైదరాబాద్ నగరం దూరంగా ఉండటంతో పలు రకాల అనుమతులు, మందులు మొదలైన వాటిని పొందడంలో జాప్యానికి కారణమవుతోందని వివరించారు. దీనిపై స్పందించిన డైరెక్టర్ జనరల్ రోలోసింగ్ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆలయ భూములూ కబ్జా

రేపల్లెలో మంత్రి అనగాని అనుచరుల అరాచకం



నగరం మండలం సిరిపూడి అమ్మవారు దేవస్థానం భూములు

- నగరం మండలం సిరిపూడి దేవస్థానం పరిధిలో భూములు
- గతేడాది పలువురికి లీజుకిచ్చిన దేవదాయ శాఖ
- అధికారం రాగానే ఆ భూములను లాక్కున్న టీడీపీ నేతలు
- లీజు గడువు మరో రెండేళ్లున్నా దౌర్జన్యంగా ఆక్రమణ
- వారికి వత్తాసు పలుకుతున్న దేవదాయ శాఖ అధికారులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అధికారమే అండగా టీడీపీ నేత, మంత్రి అనగాని సత్యప్రసాద్ అనుచరులు రెచ్చిపోతున్నారు. లీజుకిచ్చిన దేవాలయ భూములను సైతం ఇష్టానుసారంగా ఆక్రమించేస్తున్నారు. మరో రెండేళ్లు గడువున్నా కూడా లెక్కచేయకుండా కౌలుదారుల నుంచి దౌర్జన్యంగా భూములను లాగేసుకుంటున్నారు. వివరాలు.. బాపట్ల జిల్లా నగరం మండలం సిరిపూడికి చెందిన మేడిబోయిన సురేశ్‌రెడ్డి.. ఇదే గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సిరిపూడి అమ్మవారి దేవస్థానానికి చెందిన 12.01 ఎకరాల భూములను వేలంలో పాల్గొని కౌలుకు తీసుకున్నాడు. ఇందుకు గాను ఏడాదికి రూ.2.67 లక్షల కౌలు చెల్లిస్తున్నాడు. రూ.6 లక్షలకు పైగా ఖర్చు చేసి బోర్లు వేయించి, విద్యుత్ ఏర్పాటు చేసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. దేవదాయ శాఖ నిబంధనల ప్రకారం మూడేళ్లకొకసారి మాత్రమే వేలం ద్వారా భూములను కౌలుకు ఇస్తారు. సురేశ్‌రెడ్డికి గతేడాది జూన్ 26న భూములను కౌలుకు కేటాయించగా.. లీజు గడువు మరో రెండేళ్లు ఉంది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి అనగాని సత్యప్రసాద్ అనుచరులు.. సురేశ్‌రెడ్డి కౌలు భూములను దౌర్జన్యంగా ఆక్రమించారు. వారికి దేవదాయ శాఖ అధికారులు వత్తాసు పలికారు. దీంతో సురేశ్‌రెడ్డి గత నెలలో హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం సురేశ్‌రెడ్డికి అనుకూలంగా ×స్టే× ఇచ్చింది. అయినా టీడీపీ నేతలు ఖాతరు చేయకుండా ఆ భూముల్లో సాగుకు సిద్ధమయ్యారు. ఇలాగే సిరిపూడి అమ్మవారి దేవస్థానానికి చెందిన మరో ఏడు ఎకరాలను సైతం కౌలుదారుల నుంచి టీడీపీ నేతలు లాగేసుకున్నారు. న్యాయం చేయాల్సిన దేవదాయ శాఖ అధికారులు టీడీపీ నేతలకు వత్తాసు పలుకుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



సురేష్‌రెడ్డి, కౌలుదారు

మంత్రి ఒత్తిడితో చెన్నకేశవస్వామి భూములూ అప్పగింత!

చెరుకుపల్లి మండలంలో ఉన్న చెన్నకేశవస్వామి దేవస్థానం భూములు నగరం మండలంలో ఉన్నాయి. అందులోని 33 ఎకరాల భూములను సైతం మంత్రి అనగాని ఒత్తిడితో అధికారులు టీడీపీ నేతలకు అప్పగించినట్లు సమాచారం. వాస్తవానికి దేవస్థానం భూములకు వేలం నిర్వహించి.. ఎవరు ఎక్కువ మొత్తం చెల్లిస్తామంటే వారికే కౌలుకు ఇస్తారు. మూడేళ్లకు ఒకసారే ఈ వేలం నిర్వహిస్తారు. కానీ దేవదాయ శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఏడాదికే కౌలుదారులను తప్పించి.. టీడీపీ నేతలకు భూములు అప్పగించినట్లు తెలిసింది. ఇందుకోసం తప్పుడు రికార్డులు సృష్టించినట్లు సమాచారం. టీడీపీ నేతలు, అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కౌలుదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆర్టీసీ హౌస్‌లో టంగుటూరికి ఘన నివాళులు

సాక్షి, అమరావతి: విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసిన ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మిన్) కేఎస్ బ్రహ్మానందరెడ్డి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ..నాలుగేళ్లుగా ఆర్టీసీ హౌస్‌లో మహనీయుల వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. డిప్యూటీ సీపీఎం జయశంకర్, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు చంద్రశేఖర్, జీవీ రవివర్మ, సుధాకర్, తదితరులు మాట్లాడారు.

ఎన్నారైల లేఅవుట్లో టీడీపీ నేతల విధ్వంసకాండ


- ముగ్గురు ఎన్నారైల ఆస్తిని ఆక్రమించుకునేందుకు యత్నం
- నకిలీ డాక్యుమెంట్లతో ఆ ఆస్తి తమదంటూ దౌర్జన్యం
- ఎన్నారైలకు అనుకూలంగా కోర్టు తీర్పు
- కోర్టు తీర్పును జీర్ణించుకోలేక లేఅవుట్‌లో విధ్వంసం



లేఅవుట్‌లోని రోడ్డును జేసీబీతో తవ్వుతున్న టీడీపీ నేత అనుచరులు

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి టీడీపీ నేతల అరాచకాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. సామాన్యులపై జులుం ప్రదర్శిస్తూ ఆక్రమణలు, కబ్జాలకు పాల్పడుతున్నారు. తాజాగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ముగ్గురు ఎన్నారైలకు చెందిన ఆస్తిని ఆక్రమించుకునేందుకు యత్నించారు. కోర్టు ఎన్నారైలకు అనుకూలంగా తీర్పు నివ్వడంతో జీర్ణించుకోలేక రూరల్ మండలం టీడీపీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి అనుచరులు బాధితురాలిని బెదిరించారు. అంతటితో ఆగకుండా శుక్రవారం లేఅవుట్‌లో విధ్వంసానికి పాల్పడ్డారు. దీనిపై ఎన్నారైల బంధువు మనుబోలు విజయలక్ష్మి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయలక్ష్మి వెల్లడించిన వివరాల ప్రకారం... యూకేలో ఉంటున్న ముగ్గురు అన్నదమ్ములు ఉచ్చూరు అశోక్‌రెడ్డి, సాధనరెడ్డి, అనిల్ ప్రేమ్‌రెడ్డికి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని నవలాకుల తోటలో ఏడెకరాల భూమి ఉంది. వారు ఆ భూమిలో 89 ప్లాట్లతో లేఅవుట్ వేశారు. 48 ప్లాట్లను విక్రయించగా, 13 ప్లాట్లలో ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. 2020లో రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి, మసూద్ అనే వ్యక్తులు అశోక్‌రెడ్డి తల్లి ఉచ్చూరు కృపామయిరెడ్డి ఈ స్థలాన్ని తమకు రాసిచ్చారంటూ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తోంది. అశోక్‌రెడ్డి అత్త మనుబోలు విజయలక్ష్మి కోర్టు కేసుల వ్యవహారాలు చూసుకుంటున్నారు. కోర్టు అశోక్‌రెడ్డి తదితరులకు అనుకూలంగా ఈ నెల 2న తీర్పు ఇచ్చింది. దీనిని ఓర్వలేని టీడీపీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి తన అనుచరులైన రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రామిరెడ్డి రమేష్‌రెడ్డి, మసూద్‌లతో శుక్రవారం దౌర్జన్యానికి దిగారు. 100 మందితో లేఅవుట్లోకి ప్రవేశించి వీరంగం సృష్టించారు. నిర్మాణంలో ఉన్న రెండు ప్రహరీలను జేసీబీలతో కూల్చివేశారు. లేఅవుట్లోకి వెళ్లే మార్గంలో ఆరడుగులు గుంత తవ్వారు. ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్‌ను తొలగించి పక్కకు తోసేశారు. ప్లాట్ల కొనుగోలుదారులను భయభ్రాంతులకు గురిచేశారు. దీనిపై రూరల్ పోలీసులకు బాధితురాలు విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు.

ఎన్నారై ఆస్తులకు రక్షణేదీ?



ఎన్నారైల ఆస్తులకు రక్షణ లేదు. లేఅవుట్లో విధ్వంసం సృష్టించారు. స్థలాల యజమానులను భయభ్రాంతులకు గురిచేశారు. కూల్చివేతలకు పాల్పడ్డారు. పోలీసులు న్యాయం చేసి రక్షణ కల్పించాలి. మా వద్ద అన్ని పత్రాలు, కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ, ఇలా వ్యవహరించడం అన్యాయం. – మనుబోలు విజయలక్ష్మి

క్లుప్తంగా...

ఆ రెండు జిల్లాలకు వైద్య కళాశాలల అవసరం ఉంది

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

సాక్షి, పార్వతీపురం మన్యం: పార్వతీపురం మన్యం, ఏఎస్ఆర్ జిల్లాలకు వైద్య కళాశాలల అవసరం ఉందని, విద్యార్థులకు మెరుగైన వైద్య విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఆయన శుక్రవారం పర్యటించి జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశారు. వార్డులను సందర్శించారు. అక్కడున్న వైద్య, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించాల్సి ఉన్న 12 వైద్య కళాశాలల మీద ఇటీవలే సీఎం సమీక్షించారని చెప్పారు.నాలుగేళ్లుగా పునాదులు, గోడల స్థాయిలో ఉన్న బోధనాస్పత్రులను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. పార్వతీపురంలో వైద్య కళాశాల మూడో ఫేజ్‌లో ఉందని, దీనిని పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజనులను, ఆదివాసీలను కుటుంబ సభ్యులుగా భావించి సేవలందించాలని వైద్యాధికారులకు సూచించారు. అసెంబ్లీలో ప్రస్తావనకు వస్తున్న సమస్యల్లో 25 శాతం వైద్యానికి సంబంధించినవే ఉంటున్నాయని, ఆస్పత్రుల్లో సమస్యలను వైద్యాధికారులు చెప్పారని..ప్రాధాన్యత ప్రకారం పరిష్కరిస్తామని చెప్పారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ హరికిరణ్, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు సృష్టించాలి

సమగ్ర శిక్షా ఏఎస్పీడీ శ్రీనివాసులు రెడ్డి

సాక్షి, అమరావతి: విద్యార్థులు వైజ్ఞానిక ప్రయోగాలపై దృష్టి సారించి కొత్త ఆవిష్కరణలను సృష్టించాలని సమగ్ర శిక్షా ఏఎస్పీడీ కేవీ శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ నగరశివారులోని ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ స్పేస్ డే సందర్భంగా 'అంతరిక్ష యానంలో భారతదేశ పురోగతి'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎస్పీడీ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్టెమ్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ద్వారా సైన్స్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. విజ్ఞాన ప్రయోగాల్లో భారత్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనా ఉందన్నారు. బెల్ మాజీ జనరల్ మేనేజర్ డీకేఆర్కే వరప్రసాద్ మాట్లాడుతూ..యువత స్పేస్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్టీల్‌ప్లాంట్ అధికారులకు షోకాజ్ నోటీసులు

సాక్షి, విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్ అధికారులు పలువురికి యాజమాన్యం శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. స్టీల్‌ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో కాంట్రాక్ట్ పనులను ఆయా విభాగాలకు చెందిన వివిధ స్థాయిల అధికారులు పర్యవేక్షిస్తూ ఇంజినీర్ ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తుంటారు. వారు కాంట్రాక్ట్ పనుల నిర్వహణతో పాటు అటెండెన్స్, బిల్లింగ్ పనులు చూస్తుంటారు. కాంట్రాక్ట్ కార్మికులకు కూడా బయోమెట్రిక్ అమలు చేయడంతో వారి అటెండెన్స్ బయోమెట్రిక్ ఆధారంగా సర్టిఫై చేయాల్సి ఉంది. ఈ విషయంలోనే యాజమాన్యం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తుంది. కాంట్రాక్ట్ కార్మికుల బిల్లింగ్‌లో అధికారులు నిర్లక్ష్యం, పక్షపాతంగా వ్యవహరించారంటూ నోటీసులో పేర్కొన్నారు. ఈ విధంగా ప్లాంట్ మొత్తం సుమారు 250 మంది ఉన్నట్లు సమాచారం. నోటీసులను హెచ్ఆర్ అధికారులు ఆయా విభాగాధిపతులకు అందించాశారు. ఈ విషయం స్టీల్‌ప్లాంట్ అధికారుల్లో కలకలం రేపింది.

హరిత వనాలు.. పాణ్యం నర్సరీలు

బాటసారులను ఆకట్టుకుంటున్న మొక్కలు



జిల్లాలోనే నర్సీలకు పాణ్యం పెట్టింది పేరు. ఇక్కడ దాదాపు 100 ఎకరాలపైగా 600 రకాల మొక్కలను నర్సరీ యజమానులు పెంచుతున్నారు. ఇక్కడ లభించే మామిడి మొక్కలకు భలే డిమాండ్ ఉంది. రైతులే స్వతహాగా మామిడి మొక్కలను తల్లి చెట్టుకు అంటు కట్టడంతో ఆరోగ్యకరంగా పెరగడంతోపాటు తెగుళ్లను తట్టుకునే శక్తి ఎక్కువగా ఉంటోంది. ఇతర జిల్లాల నుంచి కూడా రైతులు మొక్కల కోసం ఆరు నెలల ముందుగానే ఆర్డర్ చేసి కొనుగోలు చేస్తున్నారంటే వీటికి ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతోంది. ఇక అలంకార, ఆకర్షణీయ మొక్కలు కూడా ఎక్కువే. హైవే పక్కనే నర్సరీలు ఉండటంతో బాటసారులను, వాహనదారులను రకరకాల పూల మొక్కలు ఆకర్షిస్తున్నాయి. వాహనాలను కాసేపు ఆపి నర్సరీల్లో పేద తీరి మొక్కలు కొనుగోలు చేసి వెళ్తూ ఉంటారని నిర్వాహకులు చెబుతున్నారు.

పాణ్యం



బబ్బరి పనాసా
ఈ మొక్కకు కాసే కాయలు బత్తాయి పండు కంటే లావు ఉంటాయి. ఒక్కొక్కటి కనీసం కిలోన్నర బరువు ఉంటాయి. కాయ రుచి ఒగరుగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఎంతో మంచిది.

ఫామ్ సిటీ
పింక్ కలర్‌లో పూలు ఎంత అందంగా అనిపిస్తున్నాయి కదూ.. కానీ అవి పూలు కాదు. ఆకులే. ఫామ్‌సిటీ అనే ఈ మొక్కకు కొన్ని ఆకులు గ్రీన్ కలర్‌లో ఉండగా, మరికొన్ని పింక్ కలర్‌లో కనులకు ఇంపుగా కనిపిస్తున్నాయి. వీటిని ఎక్కువ మంది అలంకరణకు తీసుకెళ్తుంటారని నిర్వాహకులు తెలిపారు.

బొగంబిలియా
ఈ చెట్టు రంగులు రంగుల్లో ఉంటుంది. 6–7 అడుగుల వరకు పెరుగుతుంది. దీని విలువ అక్షరాల రూ.23 వేలు. సాధారణంగా గ్రామాల్లో కాగితాల పూలు అంటారు. ఇదే కోవకు చెందిన ఈ మొక్క పుట్టుకతోనే డిజైన్‌లతో పెరుగుతుంది.

ట్యాక్టిస్
ఈ మొక్కలు అతి చిన్నవిగా కుండీలోనే బతుకుతాయి. తెల్లటి రంగులో ఉంటాయి. ఈ ట్యాక్టిస్ మొక్కలు ఇంట్లో అలంకరణకు ఎంతో బాగుంటాయి.

ఇన్సులిన్ మొక్క
పేరులోనే ఇన్సులిన్ ఉంది. షుగర్ ఉన్న వారు ఈ మొక్క ఆకులు, మరిఒక ఆకు మొక్కను కలిపి తీసుకుంటే ఎంతటి షుగర్ అయినా నియంత్రణలోకి వస్తుంది.

స్టార్‌ఫ్రూట్స్
ఈ పండ్లు తీపి, వగరు, పులుపు ఉంటాయి. షుగర్, గ్యాస్ట్రబుల్ ఉన్న వాళ్లకు స్టార్‌ఫ్రూట్స్ చాలా మంచిది. ఇవి అరుదుగా లభిస్తాయి.

అన్ని రకాల మొక్కలున్నాయి
"మా వద్ద అన్ని రకాల మొక్కలున్నాయి. రూ.20 నుంచి రూ.8 వేల విలువ చేసే మొక్కలున్నాయి. ప్రజలు ఎక్కువగా ఇళ్లకు అందాన్నిచ్చే మొక్కలను ఇష్టపడుతన్నారు. ఇక మామిడి మొక్కలు కావాలనుకునే రైతులు ముందుగానే ఆర్డర్ ఇస్తుంటారు. ఇన్ని మొక్కలు కావాలంటే అన్ని మొక్కలు అంటుకట్టి అందిస్తాం."
– నడిపెన్న, నర్సరీ యజమాని


అరెలియన్ బాల్
ఈ మొక్కలకు పూలు, కాయలు కాయవు. కేవలం ఆకులు మాత్రమే ఉంటాయి. ఈ ఆకులే పూలలాగా ఉంటాయి. ఈ మొక్కలు కూడా అంత ఎత్తు ఏమీ పెరగవు. అతి చిన్నవిగా ఉంటాయి.

సిరులు నాచు

సముద్రాల్లో పెరిగే కొన్ని రకాల నాచుల్లో బలవర్థక పోషకాలు

- దేశంలో 24,252 హెక్టార్లలో సీ వీడ్ సాగుకు అవకాశాలు
- ప్రస్తుతం సీ వీడ్ మార్కెట్ విలువ రూ.82,170 కోట్లు
- వ్యవసాయ పంటగా గుర్తించి రుణాల మంజూరుతో మేలు
- దేశంలో సీ వీడ్ ప్రోత్సాహకంపై నీతి ఆయోగ్ నివేదిక

"సముద్రాల్లో పెరిగే కొన్ని రకాల నాచుల్లో బలవర్థకమైన పోషకాలు ఉన్నాయి. వీటిని తినడం ద్వారా దేశం ప్రధానంగా ఎదుర్కొంటున్న పౌష్టికాహార లోపాన్ని తగ్గించవచ్చు. ఆహారంగానే కాకుండా కొన్ని రకాల ఔషధాలు, సౌందర్య ఉత్పత్తులు, పలు రకాల మైనింగ్ పరిశ్రమల్లో వినియోగిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా సముద్రపు నాచుకు భారీగా డిమాండ్ ఉండటంతో విదేశీయ మారక నిల్వలు పెంచుకోవచ్చు. ఈ పంటను సాగు చేయడం ద్వారా రైతులు అధిక లాభాలు ఆర్జిస్తారు" అని నీతిఆయోగ్ స్పష్టం చేసింది. ఇందుకు ప్రభుత్వం కొన్ని ప్రోత్సాహకాలతో ప్రణాళికను ప్రకటించాలని సూచించింది. స్ట్రాటజీ ఫర్ ది డెవలప్‌మెంట్ సీ వీడ్ వేల్యూ చైన్ పేరిట ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. - సాక్షి, అమరావతి



తగ్గనున్న కార్బన్ డై ఆక్సైడ్

సముద్రంలో ఒక హెక్టారు సీవీడ్ సాగు ద్వారా ఏడాదికి తగ్గే కార్బన్ డై ఆక్సైడ్	చెరువుల్లో సీవీడ్ సాగు ద్వారా ఏడాదికి తగ్గే కార్బన్ డై ఆక్సైడ్
57.64 టన్నులు	12.38 టన్నులు

సీ వీడ్ సాగుకు రాష్ట్రంలో అనుకూల జిల్లాలు
విశాఖపట్నం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, కృష్ణా, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు

సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ గణాంకాల ప్రకారం..

- **1,332** (హెక్టార్లు) రాష్ట్రంలో సీవీడ్ సాగుకు అనుకూలమైన భూమి
- **37** రాష్ట్రంలో సీవీడ్ సాగుకు అనుకూల ప్రాంతాలు
- **24,251.90** (హెక్టార్లు) దేశంలో తూర్పు, పశ్చిమ తీర ప్రాంతాల్లో సీవీడ్ సాగుకు అనుకూలమైన భూమి
- **333** దేశంలో తూర్పు, పశ్చిమ తీర ప్రాంతాల్లో సీవీడ్ సాగుకు అనుకూల ప్రాంతాలు
- **రూ.13.28** లక్షలు ఒక హెక్టారులో సీవీడ్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా ఏటా వచ్చే ఆదాయం
- **రూ.5,000 కోట్లు** నీతిఆయోగ్ లెక్కల ప్రకారం దేశ వ్యాప్తంగా సీవీడ్ సాగు ద్వారా ఏటా పొందగల ఆదాయం

ప్రణాళికతో మెరుగైన ఫలితాలు

2021లో ప్రపంచవ్యాప్తంగా సీ వీడ్ మార్కెట్ రూ.82,170 కోట్లుగా ఉంటే అందులో ఎగుమతుల విలువ రూ.21,995 కోట్లుగా ఉంది. కానీ ప్రస్తుతం మన దేశంలో ప్రపంచ సీ వీడ్ ఉత్పత్తిలో ఒక శాతం లోపు 33,345 టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. ప్రభుత్వం ఒక చక్కటి ప్రణాళికతో ముందుకు రావడం ద్వారా సీవీడ్ ఉత్పత్తిని గణనీయంగా పెంచవచ్చని సూచించింది.

నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి

సీ వీడ్ సాగుపై 1961లో రూపొందించిన వ్యాపార నియమాలను సవరించడంతో పాటు ఫిషరీస్, పశుసంవర్ధశాఖ, ఎంపెడా తదితర భాగస్వామ్యంతో ఒక నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నీతి ఆయోగ్ కేంద్రానికి సూచించింది. అంతేకాదు సీ వీడ్ సాగును ప్రాధాన్యత రంగం కింద ఆర్‌బీఐ గుర్తించి రుణాలను మంజూరు చేయడంతో పాటు కేంద్ర కిసాన్ క్రెడిట్ కార్డులను జారీ చేయాలని కోరింది. సీ వీడ్ సాగు వ్యయంతో కూడుకున్నది కావడంతో స్వయం సహాయక సంఘాలు, రైతు సంఘాల నేతృత్వంలో సాగును చేపట్టే విధంగా ప్రోత్సహించాలని సూచించింది. ఈ సాగు, మార్కెటింగ్‌కు అవసరమైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు దీనికి సంబంధించిన నైపుణ్య శిక్షణ, పరిశోధనలను అందుబాటులోకి తీసుకు రావాల్సి ఆవశ్యకతను తెలియజేసింది.



సిరుల తల్లీ.. శిరసా నమామి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మహిళలు సామూహిక వరలక్ష్మీవ్రతాలను ఆచరించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. గురువారం అర్ధరాత్రి వరకు 63,202 మంది స్వామిని దర్శించుకున్నారు. 34,057 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.4.37 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

30, 31 తేదీల్లో రాగి రేకుల వేలం

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లోని హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కాపర్ – 2, సిల్వర్ కోటెడ్ రాగి రేకులను ఈనెల 30, 31వ తేదీల్లో టెండర్ కమ్ వేలం (ఆఫ్ లైన్) వేయనున్నట్లు టీటీడీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 30న కాపర్ -2 (3000 కేజీలు)-15 లాట్లు, ఈనెల 31వ తేదీన సిల్వర్ కోటెడ్ రాగి రేకులు (2,400 కేజీలు)-12 లాట్లు వేలానికి ఉంచినట్టు పేర్కొన్నారు. వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయంలో కాని, 0877-2264429లో కానీ, టీటీడీ వెబ్ సైట్ www. tirumala.org లో సంప్రదించాలని కోరారు.

28న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని ఈ నెల 28వ తేదీ బుధవారం లెక్కించనున్నట్లు ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఆలయంలోని ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద హుండీల లెక్కింపు గురుదక్షిణామూర్తి సన్నిధిలో లెక్కించనున్నటు తెలిపారు.

మోపిదేవిలో అన్నదానం

మోపిదేవి: కృష్ణా జిల్లా మోపిదేవి వల్లీదేవసేన సమేత సబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో ప్రతి రోజూ రెండు పూటల నిత్యాన్నదానం నిర్వహిస్తూ ఆలయ అధికారులు భక్తుల ప్రశంసలు అందుకుంటున్నారు. విశాలమైన అన్నదాన ప్రాంగణం రూ. 40 లక్షలతో ఏర్పాటు చేశారు. స్వామివారి నిత్యాన్నదానానికి భక్తులు తమ వంతు సాయంగా విరాళాలు ఇవ్వడం ప్రారంభించారు.

అమ్మవారి ఆలయాల్లో శ్రావణ శోభ

ద్వారకాతిరుమల: శ్రావణమాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని ఏలూరు జిల్లాలోని అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కళకళలాడాయి. ద్వారకాతిరుమల క్షేత్రదేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం మహిళా భక్తులతో కిటకిటలాడింది.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం ఆలయం వద్ద 700 మంది మహిళల చేత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు.

రత్నగిరిపై పెళ్లి సందడి

అన్నవరం: అన్నవరం సత్యదేవుని ఆలయం శుక్రవారం వేలాదిగా తరలివచ్చిన నవ దంపతులు, వివాహ బృందాలు, భక్తులతో కిక్కిరిసిపోయింది. గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున ముహూర్తాలలో రత్నగిరిపై సుమారు 200 వివాహాలు జరిగాయి. వందల సంఖ్యలో నవ దంపతులు సత్యదేవుని వ్రతాలాచరించారు. సుమారు 40 వేల మంది భక్తులు శుక్రవారం స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు.



ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

కాకినాడ సిటీ: ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని కాకినాడ జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినిల్ అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన భారతి, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జగన్నాథపురం బీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలపై అవగాహన కల్పించారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

మండపేట: అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం మారేడుబాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. స్మార్ట్ మెటీరియల్స్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్ అనే అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. విద్యార్థులు నైపుణ్యం పెంచుకుని కొత్త పరిశోధనలకు శ్రీకారం చుట్టాలని దక్షిణ కొరియా ప్రొఫెసర్ కె.నవీన్‌కుమార్ సూచించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ కోర్సు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటి రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న స్కిల్ హబ్ సెంటర్‌లో స్కిల్ కోర్సును త్వరలో ప్రారంభించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా అసిస్టెంట్ టెక్నీషియన్ కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సులో ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 90009 57055నంబరు ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

28న ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

తిరుపతి అర్బన్: ఈనెల 28న తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని ఎస్‌వీఎస్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో బ్లూస్టార్‌క్లై మేటిక్ ఇండియా లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆర్.లోకనాథం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఐటీఐ, డిప్లమా, బీటెక్ ఉత్తీర్ణత సాధించిన 18–25ఏళ్ల వయస్సు ఉన్న యువతి,యువకులు అప్రెంటిషిప్ ఉద్యోగాలకు అర్హులుగా పేర్కొన్నారు.

ఏయూలో జాబ్ మేళా

ఎంవీపీకాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో, నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) ఆధ్వర్యంలో శనివారం (24.08.24) జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఫ్లిప్‌కార్ట్, పేటీఎం, ఏయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు, అపోలో పార్మసీస్ లిమిటెడ్‌లలో ఉద్యోగాల భర్తీ కోసం ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఏయూలోని సెంటర్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ఈ జాబ్ మేళా ప్రారంభం కానుంది.

ఈ-రిసోర్సెస్‌ను సద్వినియోగం చేసుకోండి

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ గ్రంథాలయంలోని ఈ-రిసోర్సెస్‌ను విద్యార్థులు, పరిశోధకులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు సూచించారు. ఏయూ హెచ్ఆర్‌డీసీ కేంద్రంలో శుక్రవారం కె.నింబస్ డిజిటల్ లైబ్రరీపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ఏయూలో జాతీయ అంతరిక్ష దినోత్సవం

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చంద్రయాన్-3 మిషన్ విజయవంతమై ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

విజ్ఞాన్ వర్సిటీకి 'అబెట్' అక్రిడిటేషన్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి ప్రతిష్టాత్మక యూఎస్‌ఏ బేస్డ్ అబెట్ (అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ)అక్రిడిటేషన్ లభించిందని వైస్ చాన్సలర్ కల్నల్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు



పుడమి పరవశిం‘చేను’

ఒకవైపు నిండుకుండలాంటి చెరువు.. మరోవైపు పచ్చని తివాచీ పరిచినట్టు ఆయకట్టు సాగు.. వాన దేవుని కరుణతో జలవనరులు జలకళ సంతరించుకున్నాయి. రైతులు పంటలు పండిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా.. పంట చేతికి రావాలని కోరుకుంటున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణ శివారులో చెరువు ఆయకట్టు కనువిందు చేస్తోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

రాజరికం నుంచి జనతా సర్కార్

- స్వాతంత్ర్యానికి ముందు ప్రిన్సిలీ స్టేట్‌గా బస్తర్
- భారత్‌లో విలీనానికి రాజు ప్రవీర్‌చంద్ర అంగీకారం
- అనతి కాలంలోనే రాజు, ప్రభుత్వాల మధ్య ఘర్షణ
- ప్రజాపోరాటాల కారణంగా రాజు శైలిపై ప్రభుత్వాల ఆగ్రహం
- బస్తర్ ప్యాలెస్‌పై ఏకపక్షంగా సైన్యం కాల్పులు.. అమరుడైన ప్రవీర్‌చంద్ర భంజ్‌దేవ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఐదు వందలకు పైగా స్వతంత్ర రాజ్యాలు ప్రిన్సిలీ స్టేట్స్ పేరుతో ఉన్నాయి. వీటిని దేశంలో విలీనం చేయడానికి అప్పటి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రయత్నించారు. ఈమేరకు నాగ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి బస్తర్ మహారాజుగా ప్రవీర్‌చంద్ర భంజ్‌దేవ్ హాజరై విలీన ఒప్పందంపై సంతకం చేశారు. దీంతో దేశంలో 13వ పెద్దరాజ్యంగా ఉన్న బస్తర్ స్టేట్ భారత్‌లో 1948 జనవరి 1న విలీనమైంది.

ప్రవీర్‌సేన పేరుతో పోటీ

ఓ వైపు మహారాజుగా కొనసాగుతూనే మరోవైపు 1957లో కాంగ్రెస్ పార్టీ తరఫున జగదల్‌పూర్ స్థానం నుంచి ప్రవీర్‌చంద్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అయితే మహారాజుగా తనకు దక్కాల్సిన హక్కుల విషయంలో భారత ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేక ఇరు పక్షాల మధ్య అనుమాన బీజాలు మొలకెత్తాయి. మరోవైపు బ్రిటీష్ కాలం నుంచి ఉన్న బైలడిల్లా గనులపై పట్టు కోసం కేంద్రం తన ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీంతో ఇటు కేంద్రం, అటు బస్తర్ మహారాజు మధ్య అంతరం పెరుగుతూ వచ్చింది. ఏజెన్సీ ప్రాంతాల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలు పక్కాగా అమలు చేయాలని మహారాజు ప్రవీర్‌చంద్ర గళం విప్పడం మొదలెట్టారు. ఆ తర్వాత అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా ప్రవీర్‌సేన పేరు మీద అభ్యర్థులను బరిలో నిలబెట్టి 11 మంది ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సవాల్ విసిరారు. ఆ ఎన్నికల్లో బస్తర్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కలేదు.

మహారాజు హత్య

మహారాజునైన తన హక్కులకే దిక్కు లేనప్పుడు ఇక ఆదివాసీల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందనే భావనతో ధిక్కార స్వరాన్ని రాజా ప్రవీర్‌చంద్ర మరింతగా పెంచారు. ఈ క్రమంలో ప్యాలెస్‌లో మద్దతుదారులతో ఆందోళన చేస్తున్న ప్రవీర్‌చంద్రను పోలీసు దళాలు చుట్టుముట్టాయి. ఆందోళనకారుల్లో కొందరిని విచారణ పేరుతో పోలీసులు తీసుకెళ్లారు. దీంతో కోపంతో ఊగిపోయిన ఆదివాసీలు బాణం, బల్లెం చేతబట్టి పోలీసులపైకి దాడికి సిద్ధమయ్యారు. ఆదివాసీ సైన్యంతో రాజు తమపై దాడికి దిగారని, ఫలితంగా ఆత్మరక్షణ కోసం తాము కాల్పులు జరిపామంటూ పోలీసులు చెప్పారు. 1966 మార్చి 25న జరిగిన ఈ కాల్పుల్లో మహారాజు ప్రవీర్ చంద్ర చనిపోయారు. ఈ ఘటనతో సుమారు 650 ఏళ్లుగా సాగుతున్న రాజరిక పాలన స్థానంలో ప్రజాస్వామ్య ప్రభుత్వ పాలన బస్తర్‌లో మొదలైంది.



కేంద్రంపై పోరాటం

రాజా ప్రవీర్‌చంద్ర లెవీ విధానాన్ని వ్యతిరేకిస్తూ చిత్రకూట్ జలపాతం దగ్గరున్న లోహండిగూడా దగ్గర వేలాది మందితో బహిరంగసభ నిర్వహించారు. ఆ తర్వాత రైళ్లలో న్యూఢిల్లీ వరకు పెద్ద సంఖ్యలో ఆదివాసీలను తీసుకెళ్లి పార్లమెంట్ ముందు భారీ నిరసన వ్యక్తం చేశారు. దీంతో బస్తర్‌లో అశాంతికి కారణం అవుతున్నాడనే నెపంతో ప్రవీర్‌చంద్రను అరెస్ట్ చేసి నర్సింగాపూర్ జైల్లో బంధించారు. మహారాజుపై దేశద్రోహి అనే ముద్రను వేసి జైలులో పెట్టడంతో బస్తర్ అట్టుడికిపోయింది. ప్రజాగ్రహం అంతకంతకూ పెరుగుతుండటంతో రాజును విడుదల చేసిన ప్రభుత్వం ఆయనకు ఉన్న హోదాలను రద్దు చేసింది. దీంతో వివాదం మరింత ముదిరింది.



హత్యకు గురైన నాటి బస్తర్ మహారాజు ప్రవీర్‌చంద్ర భంజ్‌దేవ్

నక్సల్బరీ

బస్తర్ మహారాజు ప్రవీర్‌చంద్ర మహారాజ హత్య జరిగిన మరుసటి ఏడాదే బెంగాల్‌లో చారుమజుందార్ ఆధ్వర్యంలో 1967లో నక్సల్బరీ పోరాటం మొదలైంది. వర్గశత్రువు రక్తంలో చేతులు ముంచనిదే విప్లవం రాదంటూ ఆయుధాలు ఎక్కుపెట్టిన చారుమజుందార్ భావావేశం అనతికాలంలోనే ఆంధ్రప్రదేశ్‌ను చుట్టుముట్టింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎర్రజెండాలు రెపరెపలాడాయి. ఇక్కడి పల్లెల్లో విప్లవాగ్నులు రగిలించిన నక్సలైట్లు, గతంలో అన్నమదేవుడు నడిచిన పాతదారిలోనే వరంగల్ మీదుగా గోదావరి దాటి బస్తర్ అడవుల్లోకి 1980వ దశకంలో వెళ్లారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వ పాలనలో అధికారుల దాష్టీకాలతో విసిగిపోయిన ఆదివాసీలకు విప్లవ భావాలు కొత్త దారిని చూపాయి. ఫలితంగా పదిహేనేళ్లు గడిచే సరికి అక్కడ నక్సలైట్లకు కంచుకోటగా మారింది. జనతా సర్కార్ పేరుతో సమాంతర ప్రభుత్వాన్ని నడిపే స్థాయికి మావోయిస్టులు చేరుకున్నారు. దీనికి ప్రతిగా అప్పుడు ఆపరేషన్ గ్రీన్‌హంట్ ఇప్పుడు కగార్ (ఫైనల్ మిషన్)కు చేరుకుంది. ఇరువర్గాల మధ్య పోరులో బస్తర్ అడవుల్లో రక్తం ఏరులై పారుతోంది. ఇప్పటి వరకు అన్ని వైపుల నుంచి ఏడువేల ఐదు వందల మంది చనిపోయారు.

పాలన గాలికొదిలిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అగమ్యగోచర పాలన నడుస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను, పాలనను పూర్తిగా గాలికొదిలేసిందని బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ సోలంకి శ్రీనివాస్ విమర్శించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ తరహాలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నడుస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మేలు జరుగుతుందని ఆశ పెట్టుకున్న ప్రజలకు మొండిచెయ్యే మిగిలిందన్నారు. ఇచ్చిన హామీలు అమలుపరచకుండా తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు.. కొత్తగా విగ్రహాల సంస్కృతిని తెరపైకి కాంగ్రెస్ తీసుకొచ్చిందని మండిపడ్డారు.

పంచాయతీలను విభజించండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలను నాలుగు గ్రేడ్‌లు (1,2,3,4)గా విభజించాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ (టీపీఎస్‌ఏ) విజ్ఞప్తి చేసింది. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్)కు రెండేళ్ల ప్రొబేషన్ ప్రకటిస్తూ.. మిగతా కాలాన్ని సర్వీసుగా పరిగణనలోకి తీసుకోవాలని సంఘం అధ్యక్షుడు పి.మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈ.శ్రీనివాస్, కోశాధికారి పందిరి ఒక ప్రకటనలో కోరారు. అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేస్తూ ప్రస్తుతం పనిచేస్తున్న ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా గుర్తించాలని విన్నవించారు.

రిజర్వ్ పరికరాలు లేక

భారీ మూల్యం!

- బీటీపీఎస్ యూనిట్–1లో గత జూన్ 29 నుంచి నిలిచిపోయిన విద్యుదుత్పత్తి
- జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ రిజర్వులో లేకపోవడంతో ఇప్పటికీ జరగని పునరుద్ధరణ
- నాలుగు యూనిట్ల విద్యుత్ కేంద్రాల్లో రిజర్వ్ పరికరాలు తప్పనిసరి
- భద్రాద్రి వ్యయం భారీగా పెరగడంతో కొనుగోలు చేయని వైనం

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (బీటీపీఎస్)లో అత్యవసర సమయాల్లో వినియోగానికి అవసరమైన కీలక పరికరాలను కొనుగోలు చేసి రిజర్వ్‌లో పెట్టకపోవడంతో భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాధారణంగా నాలుగు, ఆపై సంఖ్యలో యూనిట్లు (ప్లాంట్లు) ఉన్న ప్రతి థర్మల్ విద్యుత్ కేంద్రంలో అత్యవసర వినియోగం కోసం జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్ రోటర్, జనరేటర్ స్టేటర్ అనే మూడు కీలక పరికరాలను స్పేర్ పార్ట్స్‌గా కొనుగోలు చేసి రిజర్వ్‌లో ఉంచుతారు. దీనివల్ల ఆయా పరికరాలు చెడిపోతే మరమ్మతుల నిర్వహణ/ కొత్త పరికరాల కొనుగోలుకు నెలల సమయం పట్టకుండా రిజర్వ్ పరికరాలతో తక్షణమే విద్యుదుత్పత్తిని పునరుద్ధరించడానికి అవకాశం ఉంటుంది. రిజర్వ్‌లో లేనిపక్షంలో కొత్త పరికరాల కోసం ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఆర్డర్‌కి సంబంధించిన టెక్నికల్ స్పెసిఫికేషన్‌ను రూపొందించడం, అనుమతులు తీసుకుని టెండర్లు పిలవడం, ఆర్డర్ ఇచ్చి తయారు చేయించడం, అనంతరం విద్యుత్ కేంద్రానికి తరలించి బిగించడం, టెస్టింగ్ చేయడం, కమిషనింగ్ చేయడం కోసం నెలల నుంచి ఏడాది వరకు సమయం పడుతుందని అధికారులు అంటున్నారు. భారీ పరిమాణంలో ఉండే ఈ పరికరాలను తయారీదారుల నుంచి విద్యుత్ కేంద్రానికి తరలించడానికే మూడు నెలల వరకు సమయం పడుతుందని పేర్కొంటున్నారు.

ప్రతిరోజూ రూ.2.78 కోట్ల ఆదాయ నష్టం

బీటీపీఎస్‌లో ఒక్కొక్కటి 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఉన్నా, తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) కీలక పరికరాలను సమీకరించి రిజర్వ్‌లో పెట్టలేదు. జూన్ 29న బీటీపీఎస్‌లోని యూనిట్–1కి సంబంధించిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి విద్యుదుత్పత్తి నిలిచిపోగా, రిజర్వ్ పరికరం లేకపోవడంతో ఇప్పటివరకు పునరుద్ధరణ జరగలేదు. దీంతో జెన్‌కో ప్రతిరోజూ రూ.2.78 కోట్ల ఆదాయాన్ని నష్టపోతోందని అధికారులు అంటున్నారు. దామరచర్లలో నిర్మిస్తున్న 4 వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో సైతం అత్యవసర వినియోగం కోసం జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్ స్టేటర్, జనరేటర్ రోటర్లను కొనుగోలు చేసి రిజర్వ్‌గా ఉంచారు. అయితే బీటీపీఎస్ నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోవడంతో రిజర్వ్ పరికరాలు కొనుగోలు చేయలేదని చెబుతున్నారు.



దగ్ధమైన భద్రాద్రి విద్యుత్ కేంద్రంలోని యూనిట్-1కి సంబంధించిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్

జీటీ మరమ్మతులకు టెండర్

దగ్ధమైన 320 ఎంవీఏ (మెగా వోల్ట్స్ యాంపియర్స్) జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ (జీటీ)కు మరమ్మతులు సాధ్యం కాదని తయారీదారు బీహెచ్ఈఎల్ స్పష్టం చేసినా, రూ.8.83 కోట్ల అంచనాలతో మరమ్మతులు నిర్వహించేందుకు ఇటీవల జెన్‌కో టెండర్లను ఆహ్వానించింది. తొలిసారి టెండర్లకు స్పందన రాకపోవడంతో రెండోసారి టెండర్లను పిలిచింది. అభిరామి ఇంజనీర్స్ అనే సంస్థ ఒక్కటే బిడ్డు వేసినట్టు తెలిసింది. బీహెచ్ఈఎల్ మరమ్మతులు చేసేందుకు అంగీకరించకపోవడంతో ఈ సంస్థతో ముందుగానే అవగాహన ఏర్పరుచుకుని టెండర్లు పిలిచినట్టు చర్చ జరుగుతోంది.

కొత్త జనరేటర్ కొనుగోలుకు అనుమతి

రిజర్వ్ జీటీ లేక తీవ్ర నష్టం జరగడంతో జెన్‌కో యాజమాన్యం కళ్లు తెరిచింది. పాత జీటీకి మరమ్మతుల ప్రక్రియ కొనసాగిస్తూనే కొత్త జీటీ కొనుగోలు చేసేందుకు ఇటీవలి బోర్డు సమావేశంలో అనుమతి ఇచ్చింది. త్వరలో టెండర్లు పిలిచే అవకాశం ఉంది. దేశంలో బీటీపీఎస్‌తో పాటు రతన్ ఇండియా పవర్ స్టేషన్‌లో మాత్రమే 270 మెగావాట్ల యూనిట్లు ఉన్నాయి. అందువల్ల వీటి విడిభాగాలు, పరికరాలు రెడీమేడ్‌గా లభించవు. ఆర్డర్ ఇచ్చి తయారు చేయించుకోవాల్సి ఉంటుంది. జెన్‌కో ఇప్పుడు కొత్త జీటీ కోసం ఆర్డర్ ఇచ్చినా, అది తయారై విద్యుత్ కేంద్రానికి చేరుకునే సరికి ఆరు నెలలైనా పడుతుందని అంచనా వేస్తున్నారు.

ఎన్నికలయ్యే వరకు

వాళ్లనే కొనసాగిస్తారా?

- ఈ నెలాఖరులో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల పదవీకాలం పూర్తి
- వచ్చే నెల 8న ఎస్ఈసీ పదవీకాలం ముగింపు
- కొత్త వాళ్లు వస్తే స్థానిక ఎన్నికలు మరింత జాప్యం?



వకుళాభరణం



పార్థసారథి

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశం తెర మీదకు వచ్చిన నేపథ్యంలో.. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) కొనసాగింపు, కొత్తగా బీసీ కమిషన్‌చైర్మన్, సభ్యుల నియామకం చర్చనీయాంశమవుతున్నాయి. ఈ నెలాఖరుతో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, సభ్యుల పదవీకాలం ముగియనుంది. వచ్చేనెల 8వ తేదీతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా సి.పార్థసారథి పదవీకాలం పూర్తి కానుంది. ప్రాథమిక షెడ్యూల్ మేరకు ముందుగా గ్రామ పంచాయతీ, ఆ తర్వాత మండల, జిల్లా పరిషత్, వచ్చే ఏడాది ప్రథమార్థంలో నిర్వహించనున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల సంఘం, బీసీ కమిషన్‌లదే కీలకపాత్ర అన్న విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం, ఉపకులాలకు రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీనిచ్చింది. అయితే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు (ఎస్సీ,ఎస్టీ, బీసీ కలిపి) 50 శాతం మించరాదంటూ సుప్రీంకోర్టు తీర్పు ఉండడంతో... బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన ఎలా సాధ్యమనే మీమాంస ఇప్పటికే అధికారులను వెంటాడుతోంది.

వాళ్లనే కొనసాగిస్తారా?

ఈ పరిస్థితుల్లో... స్థానికసంస్థల ఎన్నికలపై పూర్తి అవగాహన కలిగి, వీటి నిర్వహణకు సంబంధించి ఇప్పటికే అధికభాగం కసరత్తు పూర్తి చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్, బీసీ కమిషన్ చైర్మన్‌లను కనీసం ఆరు నెలల నుంచి ఏడాది పాటు కొనసాగిస్తారన్న చర్చ అధికార, రాజకీయవర్గాల్లో సాగుతోంది. ఒకవేళ ఈ రెండు పదవుల్లో కొత్తవారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయిస్తే.. మళ్లీ కసరత్తు మొదటికొచ్చి కొత్త వాళ్లకు అవగాహన వచ్చేసరికి.. ఈ ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వచ్చే నెలల తుది ఓటర్ల జాబితా ప్రకటన

ఎస్ఈసీ ఇప్పటికే పంచాయతీ ఓటర్ల ముసాయిదాను సెప్టెంబర్ 6న వార్డుల, వారీగా ప్రచురించి గ్రామపంచాయతీల్లో ప్రచురించాలని ఆదేశించింది. అదే నెల 21న వార్డులు, పంచాయతీల వారీగా తుది ఓటర్ల జాబితాను గ్రామపంచాయతీలు, మండలపరిషత్‌లలో ప్రచురించాలని స్పష్టం చేసింది. మరోవైపు పది ఉమ్మడి జిల్లాల్లో వేర్వేరుగా, ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో అఖిలపక్ష భేటీ నిర్వహించి రిజర్వేషన్లపై ప్రస్తుతమున్న పరిస్థితిని వివరించి అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకుని ప్రభుత్వం ముందుకెళ్లాలని భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక కులగణనకే మొగ్గు చూపాలని ప్రభుత్వం నిర్ణయించే పక్షంలో అందుకు చేపట్టాల్సిన ప్రక్రియపై బీసీ కమిషన్ ఇప్పటికే సూచనలు అందజేసినట్టు తెలుస్తోంది.

పీఎంకేఎస్‌వై అమలుకు సాంకేతిక కమిటీ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై)లోని ‘హర్ ఖేత్‌కో పానీ’ కార్యక్రమం కింద రాష్ట్రంలో ఉపరితల చిన్న నీటిపారుదల పథకాల అమలు కోసం రాష్ట్ర స్థాయిలో సాంకేతిక సలహా కమిటీ(టీఏసీ) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కమిటీ చైర్మన్‌గా ఈఎన్‌సీ(జనరల్), కన్వీనర్‌గా మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్, సభ్యులుగా హైడ్రాలజీ, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్‌ల సీఈలు, భూగర్భ జలశాఖ డైరెక్టర్, కేంద్ర జలసంఘం సీఈను నియమించారు. ఈ పథకం కింద నిర్మించే ప్రాజెక్టులకు 60% నిధులను కేంద్రం, 40% నిధులను రాష్ట్రం భరించనుంది.

టీఎఫ్‌డీసీఎల్‌కు బీడీ ఆకుల క్రయవిక్రయాల బాధ్యత

సాక్షి, హైదరాబాద్ : వచ్చే ఏడాది బీడీ ఆకుల వ్యాపారానికి సంబంధించి తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్‌ను (టీఎఫ్‌డీసీఎల్) ప్రభుత్వ ఏజెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బీడీ ఆకుల (అబ్నాస్ లీవ్స్) కొనుగోలు, అమ్మకాలకు టీఎఫ్‌డీసీఎల్ టెండర్లను ఆహ్వానించడంతో పాటు, 2025 సంవత్సరంలో బీడీ ఆకుల పథకాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

దీనికి సంబంధించి పీసీసీఎఫ్ సమర్పించిన ప్రతిపాదన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్‌నదీమ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

నిత్యావసరాలకు

ఆన్‘లైన్’ కడుతున్నారు

86 శాతం మంది నాణ్యమైన వస్తువులకే ప్రాధాన్యం

- నెలకోసారి కాకుండా అవసరమున్నప్పుడల్లా కొనుగోళ్లు
- 2023లో 23 శాతం కాగా.. 2024లో 57 శాతం
- నిత్యావసరాల అమ్మకాల్లో అమెజాన్ ఫ్రెష్, బిగ్‌బాస్కెట్, జెప్టో ముందంజ
- లోకల్ సర్కిల్స్ అధ్యయనంలో పలు అంశాలు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తాము చెల్లించే డబ్బుకు పూర్తి విలువతో పాటు కొనుగోలు చేసే వస్తువుల్లో నాణ్యతే గీటురాయిగా ఆన్‌లైన్ కొనుగోలుదారులు పరిగణిస్తున్నారు. దేశంలో ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా నిత్యావసరాలను కొనుగోలు చేసేవారిలో 86 శాతం నాణ్యతతో కూడిన వస్తువులకే అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగానే ఆన్‌లైన్‌లో ఆయా సంస్థలు, వేదికలు (ప్లాట్‌ఫామ్స్‌ను) ఎంచుకుంటున్నారు. దేశవ్యాప్తంగా 227 జిల్లాల్లో 70 వేల మంది నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ‘లోకల్ సర్కిల్స్’నిర్వహించిన అధ్యయనంలో పలు అంశాలు వెల్లడయ్యాయి. ఇందులో భాగంగా గతంలోని కస్టమర్ల అలవాట్లతో పోల్చితే కొన్నింటిలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నట్లుగా గుర్తించారు. గతం నుంచి భారతీయులకు నెలవారీగా ఆయా వస్తువులు, నిత్యావసరాలను కొనుగోలు చేసే అలవాటు ఉండగా ఆన్‌లైన్ కొనుగోళ్లలో మార్పులు వచ్చినట్లుగా చెబుతున్నారు. ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారానే నెలకు ఒక్కసారే కాకుండా, తమకు అవసరమున్నప్పుడల్లా వీలైనన్ని ఎక్కువ సార్లు నిత్యావసరాలను కొనుగోలు చేస్తున్నట్లు స్పష్టమైంది. 2023లో ఇలా అవసరానికి తగ్గట్లుగా కొనుగోలు చేస్తున్న వారు 23 శాతం కాగా.. 2024లో వీరి సంఖ్య 57 శాతానికి పెరిగినట్లు తెలుస్తోంది. డెలివరీ టైమ్ 24 గంటల్లోపు కోరుకుంటున్నవారు 67 శాతం ఉండగా, అరగంటలోనే ఈ వస్తువులు కావాలని కోరుకుంటున్నవారు 17 శాతం ఉన్నట్లుగా వెల్లడైంది. ఆన్‌లైన్ గ్రాసరీ సెక్టార్‌లో కస్టమర్ సపోర్ట్ విధానాన్ని కూడా వినియోగదారులు పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నట్లుగా తేలింది. నిత్యావసరాల అమ్మకాల్లో అమెజాన్ ఫ్రెష్, బిగ్‌బాస్కెట్, జెప్టో, బ్లింకిట్, ఇన్‌స్టామార్ట్ వంటివి పుంజుకోవడంతో పాటు వీలైనంత త్వరితంగా ఆయా వస్తువులను కస్టమర్లకు చేర్చే విషయంలో పోటీ పడుతున్నట్లు లోకల్ సర్కిల్స్ వెల్లడించింది. ఆన్‌లైన్ నిత్యావసర వస్తువుల మార్కెట్ విస్తరిస్తున్న క్రమంలో టైర్-3, టైర్-4 నగరాల్లో నాణ్యత, విలువ, డెలివరీ స్పీడ్ వంటి వాటి విషయంలో కొంత ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా వేగంగా తాము కోరుకుంటున్న నాణ్యతతో కూడిన వస్తువులను ఇంటిగుమ్మం వద్దకు తెప్పించుకోవడం, నాణ్యతా ప్రమాణాలను సరిచూసుకోవం వంటి వాటితో వినియోగదారుల మారుతున్న ప్రాధాన్యాలు స్పష్టమవుతున్నాయని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. అయితే పండ్లు, కూరగాయల వంటి వాటి విషయంలో కృత్రిమ మేధతో (ఏఐ) కూడిన క్వాలిటీ చెక్‌లకు అవకాశమున్నా.. వేగంగా అమ్ముడయ్యే వినిమయ వస్తువులు (ఎఫ్‌ఎంసీజీ)ల విషయంలో నాణ్యతను సరిచూసుకోవడం అనేది సవాళ్లతో కూడుకున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాజ్యాంగ రచనకు అనుసరించిన పద్ధతి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత రాజ్యాంగ రచన - రాజ్యాంగ పరిషత్తు

రాజ్యాంగ అమలు తేది

జనవరి 26ను రాజ్యాంగ అమలు తేదీగా నిర్ణయించడానికి చారిత్రక నేపథ్యం ఉంది. నెహ్రూ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ 'లాహోర్ సమావేశం'(1929 డిసెంబర్ 31) జనవరి 26ను పూర్ణ స్వరాజ్య దినోత్సవంగా ప్రకటించింది. ఆ సంఘటనకు గుర్తుగా జనవరి 26ను రాజ్యాంగ అమలు తేదీగా నిర్ణయించారు.

రాజ్యాంగ పరిషత్తు ఇతర విధులు

భారత రాజ్యాంగ పరిషత్తు రాజ్యాంగ రచనతోపాటు కొన్ని సాధారణ చట్టాలను కూడా రూపొందించి ఆమోదించింది. అందులోని ముఖ్యాంశాలు.

- 1947 జూలై 22న జాతీయ జెండాను ఆమోదించింది.
- రాజ్యాంగ పరిషత్తు కేంద్ర శాసనసభగా కూడా పనిచేసింది. స్వతంత్ర శాసనసభగా 1947 నవంబర్ 17న సమావేశమై మొదటి స్పీకర్‌గా జి.వి.మౌలాంకర్‌ను ఎన్నుకుంది.
- భారత రాజ్యాంగ పరిషత్తు చిహ్నంగా ఏనుగును గుర్తించింది.
- దేవనాగరి లిపిలో ఉన్న హిందీని కేంద్ర ప్రభుత్వ భాషగా 1949 సెప్టెంబర్ 14న ఆమోదించింది.
- కామన్‌వెల్త్‌లో భారత సభ్యత్వాన్ని 1949 మే నెలలో ధ్రువీకరించింది.
- తొలి రాష్ట్రపతిగా రాజేంద్రప్రసాద్‌ను 1950 జనవరి 24న ఎన్నుకుంది (అప్పటి వరకు ఎన్నికైన పార్లమెంటు ఏర్పడలేదు కాబట్టి).
- 1950 జనవరి 24న జాతీయ గీతాన్ని, జాతీయ గేయాన్ని ఆమోదించింది.

రాజ్యాంగ రచనకు అనుసరించిన పద్ధతి

రాజ్యాంగ రచనలో పరిషత్తు ఏ అంశాన్నీ ఓటింగ్ ద్వారా ఆమోదించలేదు. ప్రతి ప్రతిపాదనను, సమస్యను సుదీర్ఘంగా చర్చించి సర్దుబాటు, సమన్వయం లేదా ఏకాభిప్రాయ సాధన ద్వారా పరిష్కరించిందని ప్రఖ్యాత రాజ్యాంగ నిపుణులు 'గ్రాన్‌విలె ఆస్టిన్' పేర్కొన్నారు.

సబ్ కమిటీలు

కమిటీ పేరు	చైర్మన్
ప్రాథమిక హక్కుల ఉప కమిటీ	జె.బి. కృపలాని
మైనారిటీల సబ్ కమిటీ	హెచ్.సి.ముఖర్జీ
ఈశాన్య రాష్ట్రాల హక్కుల కమిటీ	గోపినాథ్ బోర్డోలాయ్
ప్రత్యేక ప్రాంతాల కమిటీ	ఎ.వి.టక్కర్

సమ్మతి పద్ధతి (Consensus)

ఒక సమస్య లేదా ప్రతిపాదన వచ్చినప్పుడు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, చర్చల ద్వారా దాదాపు అందరు సభ్యులు ఒప్పుకునేలా చేసే పద్ధతి. ఈ పద్ధతి ద్వారా సమాఖ్య వ్యవస్థ, ప్రాంతాల ప్రత్యేకత, భాషకు సంబంధించిన అంశాలను పరిష్కరించారు.

సమన్వయ పద్ధతి (Accommodation)

ఒక సమస్యపై మధ్యే మార్గాన్ని సాధించడం. పరస్పర వ్యతిరేక వాదనలు ఉన్నప్పుడు సుదీర్ఘంగా చర్చించి గుణ దోషాలపై వివేచనతో, తర్కబద్ధంగా ఒక అభిప్రాయానికి రావడం. భారత రాజ్యాంగంలోని చాలా అంశాలను ఈ పద్ధతి ద్వారానే అంగీకరించారు.

రాజ్యాంగం - ముఖ్య ఆధారాలు

భారత రాజ్యాంగ రచనపై ఆనాటి ప్రపంచ రాజ్యాంగాల ప్రభావం గణనీయంగా ఉంది. వివిధ దేశాల్లోని రాజ్యాంగాల్లో ఉన్న ఉత్తమ లక్షణాలను స్వల్ప మార్పులతో రాజ్యాంగంలో పొందుపరిచారు. అందుకే భారత రాజ్యాంగాన్ని 'అతుకుల బొంత' అంటారు. మన రాజ్యాంగానికి అత్యంత ముఖ్యమైన ఆధారం భారత ప్రభుత్వ చట్టం-1935. అందుకే రాజ్యాంగాన్ని '1935 చట్టానికి నకలు'గా అభివర్ణిస్తారు.

భారత రాజ్యాంగంలో మౌలికాంశాలు

భారత రాజ్యాంగంలో కింది లక్షణాలను స్వతహాగా ఏర్పాటు చేసుకున్నాం.

- రాష్ట్రపతిని ఎన్నుకునే నియోజక గణం
- పంచాయతీరాజ్ వ్యవస్థ
- అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక హక్కులు.
- రక్షిత వివక్షత
- ఆర్థిక సంఘం, కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, భాషా సంఘాలకు సంబంధించిన ప్రత్యేకాంశాలు.
- ఏకీకృత సమగ్ర న్యాయ వ్యవస్థ
- అఖిల భారత సర్వీసులు
- ఏక పౌరసత్వం

రాజ్యాంగ పరిషత్తు - అదనపు, విశిష్ట సమాచారం

- రాజ్యాంగ పరిషత్తు రచనకు అయిన ఖర్చు - రూ. 64 లక్షలు.
- భారత రాజ్యాంగానికి ఆధార రాజ్యాంగాల సంఖ్య - 60
- రాజ్యాంగ పరిషత్తులో నామినేటెడ్ సభ్యుల సంఖ్య - 15. ముఖ్య నామినేటెడ్ సభ్యులు.. సర్వేపల్లి రాధాకృష్ణన్, కె.టి.షా
- రాజ్యాంగ పరిషత్తులో సభ్యులు కానివారు - బి.యన్.రావు, ఎస్.వరదాచారియర్, హెచ్.వి.కామత్.
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత అని అభివర్ణించింది- అనంత శయనం అయ్యంగార్

ముఖ్య ప్రపంచ రాజ్యాంగాల రచనా కాలం - తులనాత్మక పరిశీలన

దేశం	ప్రకరణల సంఖ్య	రచనకు పట్టిన కాల వ్యవధి
అమెరికా	7	నాలుగు నెలల కంటే తక్కువ కాలం
కెనడా	147	2 సంవత్సరాల 6 నెలలు
ఆస్ట్రేలియా	126	9 సంవత్సరాలు
దక్షిణాఫ్రికా	153	1 సంవత్సరం
భారతదేశం	395	2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు

రాజ్యాంగ పరిషత్ సమావేశాలు

సమావేశాలు	కాలం	పని విధానం - దశలు
మొదటి సమావేశం	1946 డిసెంబర్ 09-23	I. ఈ దశలో రాజ్యాంగ రచన విధుల్ని నిర్వర్తించింది.
రెండో సమావేశం	1947 జనవరి 20-25	
మూడో సమావేశం	1947 ఏప్రిల్ 28-మే 02	
నాలుగో సమావేశం	1947 జూలై 14-31	
అయిదో సమావేశం	1947 ఆగస్టు 14-30	
ఆరో సమావేశం	1948 జనవరి 27	
ఏడో సమావేశం	1948 నవంబర్ 4 నుంచి 1949 జనవరి 08	II. రాజ్యాంగ రచన విధులతో పాటు తాత్కాలిక పార్లమెంటు విధులను కూడా నిర్వర్తించింది.
ఎనిమిదో సమావేశం	1949 మే 16 - జూన్ 16	
తొమ్మిదో సమావేశం	1949 జూలై 30 - సెప్టెంబర్ 18	
పదో సమావేశం	1949 అక్టోబర్ 6-17	
పదకొండో సమావేశం	1949 నవంబర్ 14-26	III. 1949 నుంచి 1952 వరకు కేవలం తాత్కాలిక పార్లమెంటు విధులను మాత్రమే నిర్వర్తించింది.

- బి.ఆర్.అంబేద్కర్‌ను 'నైపుణ్యం ఉన్న పైలెట్'గా పేర్కొంది- డాక్టర్ రాజేంద్రప్రసాద్
- డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, గోపాలస్వామి అయ్యంగార్, అల్లాడి క్రిష్ణస్వామి అయ్యర్, బి.ఎన్.రావును 'పెట్టీ ఫోరం' అంటారు.
- డాక్టర్ బి.ఎన్.రావును 'రాజ్యాంగ పరిషత్తుకు స్నేహితుడు, మార్గదర్శి, తత్వవేత్త'గా పేర్కొంటారు.
- రాజ్యాంగ పరిషత్తులో ఎక్కువ సవరణలు ప్రతిపాదించింది -హెచ్.వి.కామత్.
- రాజ్యాంగ పరిషత్తుకు కార్యదర్శిగా వ్యవహరించింది - హెచ్.బి.అయ్యంగార్
- రాజ్యాంగ పరిషత్తులో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా తరపున ప్రాతినిధ్యం వహించినవారు - సోమనాథ్ లహరి
- రాజ్యాంగ విధులను నిర్వర్తించే సమయంలో మాత్రమే డాక్టర్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షులుగా వ్యవహరించారు.
- రాజ్యాంగ పరిషత్తు తాత్కాలిక పార్లమెంటుగా శాసన విధులు నిర్వహించినప్పుడు జి.వి.మౌలాంకర్ స్పీకర్‌గా వ్యవహరించారు. అనంత శయనం అయ్యంగార్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు.
- రాజ్యాంగ పరిషత్తును ఉద్దేశించి చివరిగా బ్రిటిష్ గవర్నర్ జనరల్ మౌంట్‌బాటన్ మాట్లాడారు.
- రాజ్యాంగ రచన కాలీగ్రాఫర్ - ప్రేమ్ బెహారి నారాయిణ్ రైజ్దా. రాజ్యాంగానికి, ప్రవేశికకు ఆర్ట్ వర్క్ చేసింది - నందన్ లాల్ బోస్.
- హన్సా మెహతా భారత జాతీయ పతాకాన్ని రాజ్యాంగ పరిషత్తులో సమర్పించారు.
- మౌలిక రాజ్యాంగ ప్రతిని పార్లమెంట్ గ్రంథాలయంలో భద్రపరిచారు. మౌలిక రాజ్యాంగంలో 230 పేజీలు ఉన్నాయి.

రాజ్యాంగ పరిషత్తు నిర్మాణం పనితీరుపై విమర్శ

- రాజ్యాంగ పరిషత్తు సార్వభౌమ సంస్థ కాదు. ప్రజలకు నేరుగా ప్రాతినిధ్యం వహించలేదు. కేవలం 28 శాతం జనాభాకు మాత్రమే ప్రాతినిధ్యం లభించింది.
- ప్రజలు తమను తాము వ్యక్తీకరించుకోవడానికి అవసరమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అవరోధం కల్పించింది.
- స్వదేశీ సంస్థానాల ప్రతినిధులు నామినేషన్ పద్ధతి ద్వారా సభ్యత్వం పొందడం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం.
- రాజ్యాంగ పద్ధతిలో ఒక వర్గం (హిందువులు) ఆధిపత్యం ఉండేదని పాశ్చాత్య రచయితల అభిప్రాయం.

ఆధారం	గ్రహించిన అంశాలు
1935 చట్టం	కేంద్ర, రాష్ట్రాలతో సమాఖ్య వ్యవస్థ, ఫెడరల్ కోర్టు, రాష్ట్రపతి పాలన (ఆర్టికల్ 356), గవర్నర్ పదవి, విచక్షణాధికారాలు, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, ఇతర పరిపాలన అంశాలు.
బ్రిటిష్	పార్లమెంటు/కేబినెట్ తరహా పాలనా పద్ధతి, ద్విసభా పద్ధతి, సమన్యాయ
రాజ్యాంగం	పాలన, శాసన నిర్మాణ ప్రక్రియ, శాసన సభ్యుల స్వాధికారాలు, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్, అటార్నీ జనరల్ మొదలైన పదవులు, రిట్లు జారీచేసే విధానం.
అమెరికా	ప్రాథమిక హక్కులు, న్యాయసమీక్ష, స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న న్యాయశాఖ,
రాజ్యాంగం	ఉప రాష్ట్రపతి రాజ్యసభకు చైర్మన్‌గా వ్యవహరించడం, రాష్ట్రపతిని తొలగించే మహాభియోగ తీర్మానం, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్రాలు ఆమోదం తెలపడం.
కెనడా	బలమైన కేంద్ర ప్రభుత్వం, గవర్నర్ నియామక పద్ధతి. రాజ్యాంగం అవశిష్ట అధికారాలను కేంద్రానికి ఇవ్వడం, ఆర్టికల్ 143 ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరడం.
ఐర్లాండ్	ఆదేశిక సుత్రాలు, రాష్ట్రపతిని ఎన్నుకునే నైష్పత్తిక ప్రాతినిధ్యం, ఓటు
రాజ్యాంగం	బదిలీ పద్ధతి, రాజ్యసభకు విశిష్ట సభ్యుల నియామకం.
వైమార్	జాతీయ అత్యవసర పరిస్థితి, ప్రాథమిక హక్కులను రద్దుచేసే అధికారం రిపబ్లిక్(జర్మనీ) మొదలైనవి. (వైమార్ అనేది జర్మనీ దేశ రాజ్యాంగ పరిషత్తు సమావేశమైన నగరం).
ఆస్ట్రేలియా	ఉమ్మడి జాబితా, పార్లమెంటు ఉభయసభల సంయుక్త సమావేశం (బిల్లు ఆమోదం విషయంలో వివాదం తలెత్తితే), వాణిజ్య, వ్యాపార లావాదేవీలు, అంతర్రాష్ట వ్యాపారం.
దక్షిణాఫ్రికా	రాజ్యాంగ సవరణ విధానం, రాజ్యసభ సభ్యుల ఎన్నిక పద్ధతి.
ఫ్రాన్స్	గణతంత్ర విధానం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, తాత్కాలిక సభాధ్యక్షుల నియామకం.
రష్యా	ప్రాథమిక విధులు, దీర్ఘకాలిక ప్రణాళిక, సామ్యవాద సూత్రాలు.
జపాన్	నిబంధన 21లో పేర్కొన్న చట్టం నిర్దేశించిన పద్ధతి.
స్విట్జర్లాండ్	ప్రధాని, మంత్రిమండలి మధ్య సమష్టి బాధ్యత.

ఉద్యోగాలు

ఏపీఈపీడీసీఎల్, విశాఖపట్నంలో మేనేజర్/ఐటీ ఉద్యోగాలు

విశాఖపట్నంలోని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్), కార్పొరేట్ ఆఫీస్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన మేనేజర్/ఐటీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- **పోస్టుల వివరాలు:** మేనేజర్-ఐటీ/డేటా అనాలసిస్-01, మేనేజర్-ఐటీ/డేటా సెంటర్ అడ్మినిస్ట్రేటర్-01, మేనేజర్-ఐటీ/సైబర్ సెక్యూరిటీ-01, మేనేజర్-ఐటీ/ఎస్ఏపీ-01, మేనేజర్-ఐటీ/మొబైల్ అప్లికేషన్స్-01.
- **వయసు:** నోటిఫికేషన్ తేదీ నాటికి 50 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** వాక్ఇన్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 28.08.2024
- **ఇంటర్వ్యూ వేదిక:** చీఫ్ జనరల్ మేనేజర్/హెచ్ఆర్‌డీ, ఏపీఈపీడీసీఎల్, కార్పొరేట్ కార్యాలయం, సీతమ్మధార, విశాఖపట్నం-530013.
- **వెబ్‌సైట్:** https://apeasternpower.com

పీజీడీఏవీ కాలేజ్, న్యూఢిల్లీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని పన్నాలాల్ గిరిధర్‌లాల్ దయానంద్ ఆంగ్లో-వేద కాలేజ్(పీజీడీఏవీ) అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
- **విభాగాలు:** ఆర్ట్స్, కామర్స్, లా, సోషల్ సైన్సెస్, లైబ్రరీ సైన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ, పీజీ, నెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం:

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.08.2024.
- **వెబ్‌సైట్:** www.pgdavcollege.edu.in

'అనాటమీ ఆఫ్ ప్లాంట్స్' గ్రంథ రచయిత?



టెట్/డీఎస్సీ

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. జంతు రాజ్యంలో మొదటి త్రిస్తరిత జీవులు ఏ వర్గానికి చెందినవి?
1) అనెలిడ 2) మొలస్కా
3) ప్లాటీహెల్మింథిస్ 4) ఆర్థ్రోపొడ

2. జంతు రాజ్యంలో మొదటి నిజ శరీర కుహర జీవులు ఏవి?
1) ప్లాటీహెల్మింథిస్ 2) నెమటోడ
3) అనెలిడ 4) పొరిఫెర

3. ద్విపార్శ్వ సౌష్టవం మొదటిసారిగా ఏ వర్గపు జీవుల్లో కనిపించింది?
1) గుండ్రటి పురుగులు
2) బద్దె పురుగులు 3) వానపాములు
4) కీటకాలు

4. నాలుగు రాజ్యాల వర్గీకరణను ప్రతిపాదించిన శాస్త్రవేత్త ఎవరు?
1) హెకెల్ 2) విట్టేకర్
3) కోప్‌లాండ్ 4) లిన్నియస్

5. కింది వాటిలో విట్టేకర్ వర్గీకరణలో ఉండి, కోప్‌లాండ్ వర్గీకరణలో లేని రాజ్యం ఏది?
1) ప్రొటిస్టా 2) ఎనిమేలియా
3) ఫంజి 4) మొనీరా

6. కింది వాటిలో హెకెల్ తన వర్గీకరణలో లిన్నియస్ ప్రతిపాదించిన రెండు రాజ్యాలకు దేన్ని కలిపాడు?
1) ఫంజి 2) మొనీరా
3) ప్రొటిస్టా 4) ప్లాంటే

7. 'ద్వినామీకరణం'లో మొదటి పదం దేన్ని సూచిస్తుంది?
1) ప్రజాతి 2) జాతి
3) ఉపజాతి 4) కుటుంబం

8. 'జాతి' అనే పదాన్ని తొలిసారిగా వర్ణించిన శాస్త్రవేత్త ఎవరు?
1) లిన్నియస్ 2) హెకెల్
3) జాన్‌రే 4) హుకర్

9. పరాశరుడు భూచర మొక్కలను ఏ లక్షణం ఆధారంగా వర్గీకరించాడు?
1) ఆయుర్వేద గుణం 2) పుష్ప లక్షణం
3) ఆవాసం 4) ఏదీకాదు

10. వర్గీకరణ అంతస్తులో పెద్దది ఏది?
1) రాజ్యం 2) వర్గం
3) కుటుంబం 4) రంగం

11. కింది వాటిలో ఏ రాజ్యానికి చెందిన జీవులు అతి పురాతనమైనవి?
1) ప్రొటిస్టా 2) ఫంజి
3) మొనీరా 4) ప్లాంటే

12. ఏక కణ నిజకేంద్రక జీవుల రాజ్యం ఏది?
1) ప్రొటిస్టా 2) మొనీరా
3) మెటాఫైటా 4) మెటాజోవా

13. ఏక కణ కేంద్రక పూర్వ జీవుల రాజ్యం ఏది?
1) మొనీరా 2) ప్రొటిస్టా
3) ఫంజి 4) ఎనిమేలియా

14. ఫంజి రాజ్యానికి సంబంధించి కింది వాటిలో సరికాని వాక్యం ఏది?
1) అన్నీ బహుకణ జీవులు
2) ఎక్కువ బహుకణ జీవులు, కొన్ని ఏకకణ జీవులు
3) ఎక్కువ శాతం సిద్ధబీజాలను ఉత్పత్తి చేస్తాయి
4) పైవన్నీ సరైనవే

15. జంతు రాజ్యంలో మొదటిసారిగా సంవృత రక్త ప్రసరణ వ్యవస్థ ఏ జీవుల్లో కనిపించింది?
1) మొలస్కా 2) ఆర్థ్రోపొడ
3) అనెలిడ 4) పొరిఫెరా

16. వివృత రక్త ప్రసరణ మొదటిసారిగా ఏ జీవుల్లో కనిపించింది?
1) ఇఖైనోడర్మట 2) మొలస్కా
3) అనెలిడ 4) ఆర్థ్రోపొడ

17. కింది వాటిలో ఏ జీవుల్లో మొదటిసారిగా తల, వక్షం, ఉదరం అనే భాగాలు కనిపించాయి?
1) అనెలిడ 2) మొలస్కా
3) ఆర్థ్రోపొడ 4) ఇఖైనోడర్మట

18. కింది వాటిలో ఏ వర్గం జీవులు మంచినీటిలో, భూమి మీద నివసించలేవు?
1) అనెలిడ 2) ఇఖైనోడర్మట
3) మొలస్కా 4) ఆర్థ్రోపొడ

19. నవీన జీవుల కంటే పురాతనమైన జీవులు..?
1) సరళమైనవి 2) సంక్లిష్టమైనవి
3) చెప్పలేం 4) అభివృద్ధి చెందినవి

20. 'ద్వినామీకరణం'ను ఏ సంవత్సరంలో ప్రతిపాదించారు?
1) 1856 2) 1758
3) 1859 4) 1885

21. పట్టుపరుగు గుడ్లను సూక్ష్మజీవులు పాడుచేస్తాయని కనుగొని, వాటిని నిర్మూలించే పద్ధతిని కూడా కనిపెట్టిన శాస్త్రవేత్త?
(ఈ ఇ 2004)
1) లూయిస్ పాశ్చర్
2) ఆంటోనీ వాన్ లివెన్ హుక్
3) ఆచార్య మహేశ్వరి
4) టి.ఎస్. వెంకట్రామన్

22. 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ షుగర్‌కేన్ రీసెర్చ్' అనే సంస్థ ఏ నగరంలో ఉంది?
(ఈ ఇ2004)
1) నాగ్‌పూర్ 2) పుణె
3) లక్నో 4) కటక్

23. పిండోత్పత్తి శాస్త్రానికి నాంది పలికిన శాస్త్రవేత్త?
1) అరిస్టాటిల్ 2) లూయిస్ పాశ్చర్
3) విలియమ్ హార్వే
4) ఆంటోనీ వాన్ లివెన్ హుక్

24. భూమి మీద ఉన్న మొక్కలు, జంతువుల విస్తరణను తెలిపే జీవశాస్త్ర శాఖ ఏది?
1) జంతు భౌగోళిక శాస్త్రం
2) జంతు భూ విజ్ఞాన శాస్త్రం
3) ఆర్నిథాలజీ 4) ఫైకాలజీ

25. 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ ఫైకాలజీ' అని ఎవరిని పేర్కొంటారు?
1) వెంకట్రామన్ 2) స్వామినాథన్
3) అయ్యంగార్ 4) బీర్బల్ సహానీ

26. కింది వాటిలో పెంటా వాలెంట్ వ్యాక్సిన్ ఏ వ్యాధి నివారణకు తోడ్పడదు?
1) ధనుర్వాతం 2) హెపటైటిస్
3) కోరింత దగ్గు 4) టైఫాయిడ్

27. MMR (Measles, Mumps, and Rubella) వ్యాక్సిన్ ఏ వ్యాధి నివారణకు ఉపయోగిస్తారు?
1) బాక్టీరియల్ 2) వైరల్
3) 1, 2 4) ఫంగల్

28. విద్యార్థి.. జీవశాస్త్రం చదవడం ద్వారా దోమల వల్ల ఏయే వ్యాధులు వ్యాపిస్తాయని తెలుసుకున్నాడు?
ఎ) మలేరియా బి) బోదకాలు
సి) డెంగ్యూ డి) మెదడువాపు
1) ఎ, బి 2) ఎ, సి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

29. పాశ్చరైజేషన్ ప్రక్రియ వల్ల సూక్ష్మజీవులు ఏ పరిస్థితుల్లో మనుగడ సాగించలేవని విద్యార్థి అర్థం చేసుకుంటాడు?
1) అతి శీతల 2) అతి ఉష్ణ
3) సాధారణ 4) 1, 2

30. మార్షల్, వారెన్ కింది వాటిలో దేనిపై పరిశోధనలు జరిపారు?
1) కలరా బాక్టీరియా 2) క్షయ బాక్టీరియా
3) అల్సర్ బాక్టీరియా 4) ప్లేగు బాక్టీరియా

31. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ నోబెల్ బహుమతిని కింది వారిలో ఎవరితో కలిసి పంచుకున్నారు?
1) విల్కిన్‌సన్, మేయర్
2) ఫ్లోరి, చైన్ 3) హర్వే, ఫలాడే
4) మాల్పిజీ, హార్వే

32. నెఫ్రాన్ నిర్మాణాన్ని అంతర్నిర్మాణ శాస్త్రంలో చదివితే, మూత్రం ఏర్పడే విధానాన్ని గురించి ఏ శాస్త్రంలో చదవాలి?
1) సూక్ష్మ అంతర్నిర్మాణ శాస్త్రం
2) శరీర ధర్మ శాస్త్రం
3) అణుజీవ శాస్త్రం
4) జీవరసాయన శాస్త్రం

33. కింది వాటిలో లక్నోలో ఉన్న జాతీయ పరిశోధనా సంస్థలు ఏవి?
1) NBRI(National Botanical Research Institute), IARI(Indian Agricultural Research Institute)
2) CICR(Central Institute for Cotton Research), CRRI(Central Rice Research Institute)
3) NBRI, IISR(Indian Institute of Sugarcane Research)
4) IARI, IISR

34. కింది వాటిలో హైదరాబాద్‌లో ఉన్న జాతీయ పరిశోధనా సంస్థలు ఏవి?
ఎ) NIN(National Institute of Nutrition)
బి) NIO(National Institute of Oceanography)
సి) ICRISAT(International Crops Research Institute for the Semi-Arid Tropics)
డి) NIV(National Institute of Virology)
1) ఎ, డి 2) బి, సి
3) బి, డి 4) ఎ, సి

35. కింది వాటిలో ద్వినామీకరణంలో దేన్ని తిరిగి ఉపయోగించవచ్చు?
1) కుటుంబం 2) ప్రజాతి
3) జాతి 4) తరగతి

36. కింది వాటిలో 'జాతి'కి సంబంధించి సరికాని వాక్యం ఏది?
1) అంతర ప్రజననం జరుపుకొనే జీవుల సమూహం
2) గతిశీలమైంది 3) స్థిరమైంది
4) ఒకే కేంద్రక నిర్మాణాన్ని కలిగి ఉండే జీవుల సమూహం

37. జతపరచండి.
శాస్త్రవేత్త
a) ఎడ్వర్డ్ జెన్నర్ b) లూయిస్ పాశ్చర్
c) ఎల్లాప్రగడ సుబ్బారావు
d) జోనస్ సాల్క్
ఆవిష్కరణ
i) టెట్రాసైక్లిన్ ii) రేబిస్ వ్యాక్సిన్
iii) పోలియో వ్యాక్సిన్
iv) మశూచి వ్యాక్సిన్
1) a-ii, b-iii, c-iv, d-i
2) a-iv, b-ii, c-i, d-iii
3) a-iv, b-iii, c-i, d-ii
4) a-iii, b-ii, c-i, d-iv

38. కేంద్రకాన్ని 'సైటో బ్లాస్ట్' అంటారని ఊహించిన వారెవరు?
1) రాబర్ట్ బ్రౌన్ 2) ష్లీడన్
3) గాల్జీ 4) అరిస్టాటిల్

39. 'అనాటమీ ఆఫ్ ప్లాంట్స్' గ్రంథ రచయిత?
1) నెమేమియా గ్రూ
2) రాబర్ట్ బ్రౌన్ 3) ష్వాన్
4) స్టీఫెన్ హేల్స్

40. జతపరచండి.
శాస్త్రవేత్త
a) సర్ రొనాల్డ్ రాస్
b) వాట్సన్, క్రిక్
c) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
d) హరగోవింద్ ఖొరానా
నోబెల్ బహుమతి పొందిన సంవత్సరం
i) 1902 ii) 1968
iii) 1945 iv) 1962
1) a-i, b-iv c-iii, d-ii
2) a-iv, b-ii, c-i, d-iii
3) a-iv, b-iii, c-i, d-ii
4) a-iii, b-ii, c-i, d-iv

41. జతపరచండి.
శాస్త్రవేత్త
a) డార్విన్
b) చార్లెస్ లయెల్ c) మాల్థస్
d) రుడాల్ఫ్ విర్చోవ్
గ్రంథం
i) అమ్నిస్ సెల్యూలా డే సెల్యులే
ii) ఆరిజిన్ ఆఫ్ స్పీసిస్
iii) ప్రిన్సిపుల్స్ ఆఫ్ జియాలజీ
iv) ఆన్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పాపులేషన్
1) a-i, b-iv c-iii, d-ii
2) a-iv, b-ii, c-i, d-iii
3) a-ii, b-iii, c-iv, d-i
4) a-iii, b-ii, c-i, d-iv

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 3	5) 3
6) 3	7) 1	8) 3	9) 2	10) 4
11) 3	12) 1	13) 1	14) 1	15) 3
16) 4	17) 3	18) 2	19) 1	20) 2
21) 1	22) 3	23) 1	24) 1	25) 3
26) 4	27) 3	28) 4	29) 4	30) 3
31) 2	32) 2	33) 3	34) 4	35) 3
36) 3	37) 2	38) 2	39) 1	40) 1
41) 3				

'వినరా భారత వీరకుమార విజయం మనదేరా..'

గ్రూప్-1,
గ్రూప్-2 పరీక్షల
ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మాదిరి ప్రశ్నలు

1. రూమ్‌టెక్ మఠం ఏ రాష్ట్రంలో ఉంది?
 1) గుజరాత్ 2) రాజస్థాన్
 3) కర్ణాటక 4) సిక్కిం
2. కింది వాటిలో సరైన జత ఏది?
 1) కితాబ్ ఉల్ హింద్ - అల్‌బెరూనీ
 2) ప్రతాపరుద్ర చరిత్ర - ఏకామ్రనాథుడు
 3) అక్బర్ నామా- అబుల్ ఫజల్
 4) పైవన్నీ సరైనవే
3. క్రీ.శ. 1523లో సెయింట్ థామస్ బాసిల్కా చర్చిని ఎక్కడ నిర్మించారు?
 1) కటక్ 2) భువనేశ్వర్
 3) చెన్నై 4) కొట్టాయం
4. మత చర్చల కోసం అక్బర్ నిర్మించిన నిర్మాణం ఏది?
 1) బులందర్వాజా 2) అలైదర్వాజా
 3) ఇబాదత్‌ఖానా 4) పంచమహల్
5. 'హౌజ్-ఇ-సుల్తానీ' అనే జలాశయాన్ని నిర్మించిందెవరు?
 1) ఇల్-టుట్-మిష్
 2) అల్లావుద్దీన్ ఖిల్జీ
 3) మహ్మద్ బిన్ తుగ్లక్
 4) ఫిరోజ్ షా తుగ్లక్
6. కింది వారిలో బౌద్ధమత అధ్యయనం కోసం భారత్‌కు వచ్చిన తొలి వ్యక్తి ఎవరు?
 1) హుయాన్‌త్సాంగ్
 2) ఆల్బెరునీ
 3) ఫాహియాన్ 4) ఇత్సింగ్
7. అమీన్‌పీర్ దర్గా ఏ జిల్లాలో ఉంది?
 1) ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు 2) అనంతపురం
 3) వై.ఎస్.ఆర్. కడప 4) కర్నూలు
8. కింది వాటిలో సరైన జత ఏది?
 1) అజ్మీర్ - రాజస్థాన్
 2) ద్వారకా - గుజరాత్
 3) గుడియం గుహ- తమిళనాడు
 4) పైవన్నీ సరైనవే
9. గజనీ మహమ్మద్‌కు సమకాలీనుడైన చోళ రాజు ఎవరు?
 1) మొదటి రాజరాజ చోళుడు
 2) విజయాలయుడు
 3) మొదటి పరాంతకుడు
 4) కుళుత్తోంగ చోళుడు
10. కింది వాటిలో సరైన జత ఏది?
 1) స్వయంభూ ఆలయం - ఓరుగల్లు
 2) ఖువ్వత్ - అల్ - ఇస్లాం మసీదు - ఢిల్లీ
 3) హర్మిందర్ సాహెబ్ - అమృత్‌సర్
 4) పైవన్నీ సరైనవే
11. మీరాబాయి గురువు ఎవరు?
 1) తుకారం 2) దాదు దయాళ్
 3) రవిదాసు 4) శంకరదేవుడు
12. శ్రీకృష్ణదేవరాయల గౌరవార్థం దక్షిణాదిలో నిర్మించిన ఎత్తయిన ఆలయ ముఖద్వారాలను ఏమంటారు?
 1) రంగ మండపం
 2) చైత్యాలయం 3) కృష్ణగోపురం
 4) రాయగోపురం
13. తెలుగులో తొలి మూకీ చిత్రం ఏది?
 1) మాలపిల్ల 2) రైతుబిడ్డ
 3) భీష్మప్రతిజ్ఞ 4) భక్తప్రహ్లాద
14. ఇ. కృష్ణయ్యర్ ఏ నాట్యంలో ప్రసిద్ధి చెందారు?
 1) కూచిపూడి 2) భరతనాట్యం
 3) ఒడిస్సీ 4) కథక్
15. 'పాకిస్తాన్ లేదా పాక్‌స్తాన్ అనే పద వివరణ ప్రకారం ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలి' అని మొదటగా పేర్కొన్నది ఎవరు?
 1) మహ్మద్ ఇక్బాల్
 2) మహ్మద్ అలీ జిన్నా
 3) రహ్మత్ అలీ చౌదరి
 4) మౌలానా అబుల్ కలాం ఆజాద్
16. షేక్ బందగీ సాహసాలను వివరించే బుర్రకథ ఏది?
 1) కాటమరాజు కథ 2) మా భూమి
 3) బొబ్బిలి యుద్ధం 4) తెలంగాణ
17. 1937లో భారత్‌లో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నికలు జరిగినప్పుడు ముస్లింలీగ్ ఎన్ని స్థానాలను గెలుచుకుంది?
 1) 102 2) 152
 3) 190 4) 197
18. 1946లో 'నౌకాదళ కేంద్రీయ సమ్మె సంఘం' ఎవరి నాయకత్వంలో ఏర్పడింది?
 1) చంద్రశేఖర్ ఆజాద్
 2) మౌలానా ఆజాద్
 3) సుభాష్ చంద్రబోస్
 4) ఎం.ఎస్. ఖాన్
19. భూభ్రమణం, గ్రహణాల గురించి వివరించిన భారతీయ మేధావి ఎవరు?
 1) చరకుడు 2) ఆర్యభట్ట
 3) ఏకామ్రనాథుడు
 4) సుశ్రుతుడు
20. కింది వాటిలో సరైంది ఏది?
 1) అరిగె రామస్వామి - అచల సిద్ధాంతం
 2) గాంధీ సినిమా - రిచర్డ్ ఆటన్‌బరో
 3) జగన్ మిత్రమండలి - భాగ్యరెడ్డివర్మ
 4) పైవన్నీ సరైనవే
21. 'వినరా భారత వీరకుమార విజయం మనదేరా' అనే పల్లవి ఏ కళారూపానికి చెందింది?
 1) హరికథ 2) బుర్రకథ
 3) యక్షగానం 4) ఒగ్గుకథ
22. కింది వాటిలో సుంకర సత్యనారాయణ రచన ఏది?
 1) నైజాం విప్లవం 2) కష్టజీవి
 3) తెలంగాణ వీరయోధులు
 4) ఖాసీం రజ్వీ
23. ప్రేమికుడి ప్రేమను పొందే అంశంతో మహిళలు చేసే బృంద నాట్యం ఏది?
 1) గుస్సాడి 2) థింసా
 3) కురవంజి 4) చుట్టుకాముడు
24. కింది వారిలో భరతనాట్యానికి చెందని వారెవరు?
 1) బెంగళూరు నాగరత్నమ్మ
 2) జోనా గంగూలీ
 3) రుక్మిణీదేవి 4) బాలసరస్వతి
25. కింది వారిలో కిన్నెర వాయిద్యాన్ని వాయించడంలో ప్రసిద్ధి పొందిన వారెవరు?
 1) తిరునగరి రామాంజనేయులు
 2) ఎస్.కె. చౌదరి
 3) మొగులయ్య
 4) ఆదూరి అయోధ్యరామ
26. కింది వాటిలో నృత్యానికి సంబంధించిన పదం ఏది?
 1) పెంట 2) బ్యాలే
 3) గెయిటీ 4) హతా
27. భరతనాట్యం దేని నుంచి ఆవిర్భవించింది?
 1) సదిర్ నాట్యం 2) పేరిణి నృత్యం
 3) మణిపురి నాట్యం
 4) మోహినీఆట్టం
28. వీరశైవ ఉద్యమ నేపథ్యంలో ఏర్పడిన కళారూపం ఏది?
 1) హరికథ 2) చుట్టుకాముడు
 3) తోలుబొమ్మలాట 4) బుర్రకథ
29. 1800లో థామస్ మన్రో దత్తమండలాల ప్రధాన కలెక్టర్‌గా వెళ్లేసరికి ఆ ప్రాంతంలో ఎంతమంది పాలెగార్లు ఉన్నారు?
 1) 6 2) 8 3) 10 4) 12
30. 'సర్ఫ్-ఎ-ఖాస్' అంటే?
 1) బ్రిటిష్ వారు నిజాంకు చెల్లించే పన్ను
 2) నిజాం మత సంస్థలకు దానం చేసిన భూమి
 3) నిజాం సొంత భూమి
 4) నిజాం విధించిన రహదారి పన్ను
31. 1916లో అతివాదులు, మితవాదులు ఎక్కడ ఒక్కటయ్యారు?
 1) కాన్పూర్ 2) అలహాబాద్
 3) లక్నో 4) అహ్మదాబాద్
32. 'ప్రార్థన, గౌరవభంగ దినం'గా నిర్వహించాలని గాంధీజీ ఏ తేదీని ప్రతిపాదించారు?
 1) 1919 ఏప్రిల్ 6
 2) 1922 ఫిబ్రవరి 5
 3) 1920 ఫిబ్రవరి 5
 4) 1942 ఆగస్టు 9



33. కింది వాటిలో గుజరాత్ రాష్ట్రానికి చెందని అంశం ఏది?
 1) దండి ఉప్పుసత్యాగ్రహం
 2) చంపారన్ సత్యాగ్రహం
 3) నర్మదా బచావో ఆందోళన
 4) బార్డోలీ సత్యాగ్రహం
34. కింది వాటిలో క్రీ.శ. 1893లో జరగని సంఘటన ఏది?
 1) తిలక్‌చే గణపతి ఉత్సవాలు ప్రారంభం
 2) స్వామి వివేకానంద చికాగో సర్వమత మహాసభలకు వెళ్లారు
 3) రామకృష్ణ మఠాన్ని బేలూరులో స్థాపించారు
 4) గాంధీజీ దక్షిణాఫ్రికా వెళ్లారు
35. క్రీ.శ.1942-1944 మధ్య బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతీయులు సమాంతర ప్రభుత్వాన్ని ఎక్కడ ఏర్పాటు చేశారు?
 1) నాగ్‌పూర్ 2) చీరాల-పేరాల
 3) జైపూర్ 4) మిద్నాపూర్
36. నేతాజీ బోస్ విమాన దుర్ఘటనలో ఏ తేదీన అదృశ్యమయ్యారు?
 1) 1945 జనవరి 16
 2) 1945 సెప్టెంబర్ 23
 3) 1945 ఆగస్టు 23
 4) 1945 డిసెంబర్ 17
37. హైదరాబాద్‌లో ఆర్య సమాజ్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
 1) 1892 2) 1894
 3) 1896 4) 1898
38. కింది వాటిలో సరైంది ఏది?
 1) మహ్మదన్ ఆంగ్లో ఓరియెంటల్ కళాశాల - సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్
 2) సత్యార్థ ప్రకాశిక గ్రంథం - స్వామి దయానంద సరస్వతి
 3) ఇండిపెండెంట్ లేబర్ పార్టీ - డా.బి.ఆర్. అంబేడ్కర్
 4) పైవన్నీ సరైనవే
39. ఆర్య సామాజికులు స్థాపించిన కాంగ్రి విశ్వవిద్యాలయం ఎక్కడ ఉండేది?
 1) ఉడిపి 2) హరిద్వార్
 3) బొంబాయి 4) శ్రీనగర్
40. హైదరాబాద్ స్టేట్ బ్యాంక్‌ను ఎప్పుడు స్థాపించారు?
 1) 1921 2) 1931 3) 1941 4) 1947
41. 1940 అక్టోబర్ 27న మరణించిన ప్రముఖుడు ఎవరు?
 1) హెచ్.ఎం. రెడ్డి 2) కొమరం భీం
 3) రఘుపతి వెంకయ్య
 4) అల్లూరి సీతారామరాజు
42. భారతదేశ మొదటి క్రికెట్ క్లబ్‌ను బొంబాయిలో ఎప్పుడు స్థాపించారు?
 1) 1848 2) 1858
 3) 1868 4) 1878
43. కింది వాటిలో సరైన జత ఏది?
 1) నసీరుద్దీన్‌షా - సినీ, నాటక రంగం
 2) అన్నాపావ్‌లోవా - నృత్య రంగం
 3) జి. సుబ్రమణ్య అయ్యర్ - పత్రికారంగం
 4) పైవన్నీ సరైనవే
44. 1931లో విడుదలైన తెలుగు తొలి టాకీ చిత్రం ఏది?
 1) రైతుబిడ్డ 2) మాలపిల్ల
 3) భీష్మప్రతిజ్ఞ 4) భక్త ప్రహ్లాద
45. కింది సంఘటనలకు సంబంధించి సరైన జత ఏది?
 1) 1829 - సతి ఆచారం అధికారికంగా నిలిపివేశారు
 2) 1927-డా.బి.ఆర్. అంబేడ్కర్ దళితుల కోసం ఉద్యమం ప్రారంభించారు
 3) 1855 - వితంతువుల పునర్వివాహ చట్టం చేశారు
 4) పైవన్నీ సరైనవే
46. కింది వాటిలో జ్యోతిబా పూలేకు సంబంధించనిది ఏది?
 1) సత్యశోధక్ సమాజ్ స్థాపన
 2) శారదాసదన్ స్థాపన
 3) గులాంగిరి రచన
 4) అంటరాని కులాలకు చెందిన బాలికల పాఠశాలను పూనాలో స్థాపించారు

సమాధానాలు

1) 4;	2) 4;	3) 3;	4) 3;
5) 1;	6) 3;	7) 3;	8) 4;
9) 1;	10) 4;	11) 3;	12) 4;
13) 3;	14) 2;	15) 3;	16) 4;
17) 1;	18) 4;	19) 2;	20) 4;
21) 2;	22) 2;	23) 3;	24) 2;
25) 3;	26) 2;	27) 1;	28) 4;
29) 2;	30) 3;	31) 3;	32) 1;
33) 2;	34) 3;	35) 4;	36) 3;
37) 1;	38) 4;	39) 2;	40) 3;
41) 2;	42) 1;	43) 4;	44) 4;
45) 4;	46) 2.		

అడ్మిషన్స్


నిమ్స్ హైదరాబాద్‌లో ఎంహెచ్‌ఎం కోర్సులో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్).. 2024 సంవత్సరానికి సంబంధించి మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్‌ఎం) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం సీట్ల సంఖ్య: 20.
కోర్సు వ్యవధి: రెండేళ్లు(ఆరు నెలల ఇంటర్న్‌షిప్).
అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 31.2.2024 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
ముఖ్య సమాచారం:
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 19.08.2024.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.09.2024.
దరఖాస్తు హార్డ్‌కాపీ సమర్పణకు చివరితేది: 05.09.2024.
హాల్‌టిక్కెట్ల జారీ తేది: 03.10.2024.
ప్రవేశ పరీక్ష తేది: 09.10.2024.
ఫలితాల వెల్లడి తేది: 10.10.2024.
వెబ్‌సైట్: https://www.nims.edu.in

నిమ్స్ హైదరాబాద్‌లో పీజీడీఎన్ఎంటీలో ప్రవేశాలు

హైదరాబాద్ పంజాగుట్టలోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ డిప్లొమా ఇన్ న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం సీట్ల సంఖ్య: 08.
కోర్సు వ్యవధి: రెండేళ్లు.
అర్హత: బీఎస్సీ(ఏదైనా సైన్స్ సబ్జెక్టులు/లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 31.12.2024 నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక విధానం: ప్రవేశపరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
ముఖ్య సమాచారం:
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 19.08.2024.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.09.2024.
దరఖాస్తు హార్డ్‌కాపీ సమర్పణకు చివరితేది: 05.09.2024.
హాల్ టిక్కెట్ల జారీ తేది: 18.10.2024.
ప్రవేశ పరీక్ష తేది: 23.10.2024.
ఫలితాల వెల్లడి తేది: 25.10.2024.
తరగతుల ప్రారంభం: 11.11.2024.
వెబ్‌సైట్: https://www.nims.edu.in

The burning tires in the junkyard..



Model Questions

Directions (Q. No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The cricket match this weekend (1)/ promises to attract (2)/ an even greater amount of people (3)/ than attended the last one. (4)/ No error (5)
2. Many of the thousands of students (1)/ currently enrolled in night courses (2)/ hope for the exchanging of their drab jobs (3)/ for new careers that are challenging. (4)/ No error (5)
3. The criminals abscond easily (1)/ with stolen goods (2)/ while the police failed (3)/ to show up. (4)/ No error (5)
4. The jury found (1)/ the defendant addled (2)/ at the end of the prosecution (3)/ attorney's questions. (4)/ No error (5)
5. The Ambani's attendance (1)/ at every game of IPL proves (2)/ that they were (3)/ true aficionados of cricket. (4)/ No error (5)

Directions (Q. No. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Stephen Hawking was____ in his field; no other contemporary scientist commands the same respect.
 1) disparaged 2) ignominious
 3) obsolete 4) anachronistic
 5) preeminent
7. The model paraded in front of the celebrities with ____; it was impossible to tell that this was her ____.
 1) trepidation, normal gait
 2) consternation , real persona
 3) panache, first assignment
 4) concern, façade
 5) anxiety, portico
8. It sounds ____that if a low carbohydrate diet can prevent a second heart attack from occurring, it should also be able to ____the first occurrence.
 1) Realistic, disintegrate
 2) Logical, allay
 3) Fascinating, foment
 4) Reasonable, augment
 5) Rational, alienate
9. The ultimate objective of the Environmental Protection Agency is to gain ____with the nation's environmental laws.
 1) compliance 2) advocate
 3) policy 4) confidence
 5) control
10. Teaching is a very___career, but unfortunately it is not very ____.
 1) sacred, joyous
 2) pious, generous
 3) rewarding, lucrative
 4) enjoyable, disciplined
 5) pleasurable, bounty

Directions (Q. No.11-15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. Do you for today's meeting have agenda?
 1) Do you have for today's meeting agenda?
 2) For today's meeting have agenda do you?
 3) Do you today's meeting have for agenda?
 4) Do you have agenda for today's meeting?
 5) No correction required
12. The crowd became restive when the minister fail to appear by 10 p.m.
 1) failing to appear on 10 p.m
 2) failure to appear at 10 p.m
 3) fail to appear for 10 p.m
 4) failed to appear by 10 p.m
 5) No correction required
13. The local authorities issues an approval to close the street for the celebration of holi.
 1) issued an approval
 2) issued the approval
 3) issuing an approval
 4) issues approval
 5) No correction required
14. The burning tires in the junkyard gave away an unpleasant odour.
 1) gave way 2) gave off
 3) gave out 4) gave in
 5) No correction required
15. Shakuntala Devi's abstruse calculations can be understood by only a few people.
 1) understand to only a few people
 2) understood by only few people
 3) understandable by only a few people
 4) understood by few people only
 5) No correction required

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) She must choose clothes that are less liable to wear and tear and affected by heat, dust and sweat.
B) Saris and suits with fancy dupattas should be avoided in such cases.
C) Fashion is dictated by necessities.
D) A woman whose job demands that she do more legwork
E) For example, a reporter, a salesgirl, a social worker cannot dress herself in fine fabrics or in delicate attire.
F) So it is imperative that a working woman be comfortable.

16. What is the SECOND sentence after rearrangement?
 1) A 2) B 3) C 4) D 5) F
17. What is the THIRD sentence after rearrangement?
 1) A 2) B 3) C 4) D 5) E
18. What is the FOURTH sentence after rearrangement?
 1) A 2) B 3) C 4) E 5) F
19. What is the FIFTH sentence after rearrangement?
 1) A 2) B 3) C 4) D 5) F
20. What is the LAST sentence after rearrangement?
 1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. No. 21-23): In each of the following sentences there is a blank space followed by four options 1), 2) 3) and 4). You have to determine which of these words fits well in all, if none of these words fits well, mark your answer 5) i.e. none of these.

21. i) Professional studies have become the ____ of the rich.
 ii) He has a definite ____ over all his rivals.
 iii) Every citizen has the ____ to speak, travel and live as he pleases.
 1) Advantage 2) privilege
 3) right
 4) concession
 5) none of these
22. i) People sensed ____ .
 ii) A bad___case had come in __ a person with a smashed arm.
 iii) The dogs were the first to recognize the signs of oncoming ____ .
 1) Tragedy 2) disaster
 3) calamity 4) accident
 5) none of these
23. i) The men there have fought ____ and emotional withdrawal, and were more capable of helping him.
 ii) It is hard to survive this feeling of ___ .
 iii) But ____ does occasionally inflict all the adults.
 1) Dejection 2) lonely
 3) depression 4) trouble
 5) none of these

Directions (Q. No. 24-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Maulana Azad was a magnificent person. A rebel ____ (24) his childhood, he was exiled when he was sixteen. As an orator in Urdu, he was peerless. Gandhiji and Pandit Nehru ____ (25) him for his learning and patriotism. He was president___ (26) the Indian National Congress in, as early as, 1923. He ____ (27) a tremendous influence on Pandit Nehru during his political career. At the ____ (28) of the Congress Working Committee he dominated on most occasions. He was an expert ____ (29) handling difficult situations. He was absent from some meeting of the cabinet but hardly ____ (30) missed a meeting of the Congress Working Committee if his health permitted.

24. 1) by 2) from 3) in
 4) during 5) at
25. 1) called 2) told
 3) rebuked 4) respected
 5) asked
26. 1) in 2) for 3) off
 4) of 5) from
27. 1) utilized 2) visualized
 3) exercised 4) asked
 5) showed
28. 1) meetings 2) duration
 3) session 4) gathering
 5) assembly
29. 1) at 2) in 3) on
 4) for5) from
30. 1) never 2) can 3) ever
 4) had 5) always

Directions (Q. No. 31-35): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

31. Not many people (1)/ agree with the government's (2)/ prediction that the economy (3)/ will improve. (4)/ No error (5)
32. In principle there is (1)/ nothing that a human can do (2)/ that a machine might not be (3)/ unable to do one day. (4)/ No error (5)
33. The government insists that (1)/ 'prison works' and plans to introduce (2)/a tougher sentencing policy (3)/ for people convicted in violent crimes. (4)/ No error (5)
34. They judged that the time (1)/ was right for the proposal (2)/ of new term (3)/ for the trade agreement. (4) No error (5)
35. The lawyer claimed (1)/ his client was provoked (2)/ into acts of violence (3)/ from the defendant. (4)/ No error (5)

KEY

1) 4	2) 3	3) 1	4) 3	5) 3
6) 5	7) 3	8) 2	9) 1	10) 3
11) 4	12) 4	13) 1	14) 2	15) 5
16) 5	17) 4	18) 4	19) 1	20) 2
21) 2	22) 2	23) 3	24) 4	25) 4
26) 4	27) 3	28) 1	29) 1	30) 3
31) 5	32) 4	33) 4	34) 3	35) 4